# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 10 సంచిక : 2 హైదరాబాద్ 127 ఫిబ్రవరి 2012 పేజీలు : 68 రు. 15

* ఇవాళ్టి అవసరం గ్రామాల అధ్యయనం
* కవ్వాల్ అభయారణ్యం ఎవరి కోసం?
* కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం
* ఎవరికీ పట్టని మన్యం దైన్యం
* మర్లపాడు తిరుగుబాటు
* కల్తీ సారా మరణాల వ్యవస్థ
* మాంద్యం వైపు యూరప్ ఆర్థిక వ్యవస్థ

*Wish you all*
*a*
*Happy New Year*
*and*
*Pongal*

*2012*

**TRIDENT CONTROLS PVT. LTD.**
5E, First Floor, Rani Jhansi Road
Jhandewalan Extension
New Delhi - 110 055

127

# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

ఫిబ్రవరి 2012
సంపుటి : 10
సంచిక : 2

వ్యవస్థాపక సంపాదకులు : **వి. హనుమంతరావు**
సంపాదకులు : **ఎన్. వేణుగోపాల్**
సహాయ సంపాదకులు : **డి.వి.రామకృష్ణారావు**
కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్ : **వై. రామచంద్రం**
ఆఫీస్ అసిస్టెంట్ : **ఎస్. వెంకటేష్**

## లోపలి పేజీల్లో...

| | | | |
|---|---|---|---|
| ❖ పాఠకుల వీక్షణం | | | 4 |
| ❖ సంపాదకీయం | ❖ సిబిఐ దాడుల్లో వెలికివస్తున్న నిజాలు | | 5 |
| ❖ సంపాదకీయ వ్యాఖ్యలు | ❖ 'సర్వరోగ నివారిణి' లోక్‌పాల్‌కు సర్వత్రా వంచన ❖ ఉపఖండంలో సైనిక శక్తుల ఆధిక్యత | | 6 |
| ❖ కొత్త పుస్తకాలు / సి.డి.లు | | | 7 |
| ❖ ఈ నేల | | | 8 |
| ❖ కత్తిరింపులు | | | 10 |
| ❖ పరిశోధన | గ్రామాల అధ్యయనం ఎందుకు? | - ఎన్. వేణుగోపాల్ | 11 |
| ❖ ప్రాంతీయం | కవ్వాల్ అభయారణ్యం ఎవరి కోసం? | - ఆనంద్ | 16 |
| ❖ ప్రాంతీయం | కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం - నడుస్తున్న చరిత్ర | - పి. కృష్ణారావు | 19 |
| ❖ ప్రాంతీయం | కల్తీ సారా మరణాలకు బాధ్యులెవరు? | - చిమ్మె జాన్ బర్నబాస్ | 20 |
| ❖ అంతర్దేశీయం | మాంద్యం వైపు యూరప్ యూరప్ ఆర్థిక వ్యవస్థ | - ఎ. నర్సింహారెడ్డి | 22 |
| ❖ ప్రాంతీయం | ప్రజల ఆరోగ్యాన్ని బలిగొంటున్న పోర్టు కాలుష్యం | - పి.వి. రమణ | 26 |
| ❖ విధానవిమర్శ | విద్యుచ్ఛక్తి - వెలుతురు నుంచి చీకట్లోకి | - వి. హనుమంతరావు | 30 |
| ❖ విధానవిమర్శ | బాధితులపైనే నింద మోపుతున్న డి.జి.పి. | - వర్ష గండికోట | 32 |
| ❖ విధానవిమర్శ | పని, విద్యా ప్రణాళిక పత్రం లోపభూయిష్టం | - కె. లక్ష్మినారాయణ | 33 |
| ❖ విధానవిమర్శ | ఖనిజ తవ్వకాలపై మర్లబడిన మర్లపాడు | - చిట్టిపాటి వెంకటేశ్వర్లు | 36 |
| ❖ పునరుక్తి | ఆరు సూత్రాల ప్రణాళికను పాతి పెట్టాలి | - కొండపల్లి సీతారామయ్య | 38 |
| ❖ సామాజికాంశం | ఎవరికీ పట్టని మన్యం దైన్యం | - ఎం. నాగమణి | 41 |
| ❖ సామాజికాంశం | స్వయం ప్రతిపత్తి మండలి - ఆదివాసుల అభివృద్ధి | - మైపతి అరుణ్‌కుమార్ | 43 |
| ❖ విధానవిమర్శ | ఈ వినాశన అభివృద్ధి ఎవరి కోసం? | - మాడావి భాస్కర్ రావు | 46 |
| ❖ పరిశీలన | ఆదివాసీ మహిళల సాధికారత | - గుగులోతు జాంబు, సాదు రాజేష్ | 48 |
| ❖ ప్రాంతీయం | తెలంగాణ - ఓ మరణక్షేత్రం! | - జి. లచ్చయ్య | 51 |
| ❖ చర్చ | భాషా రాష్ట్రాలపై అంబేద్కర్ | - ఎం. కృష్ణ ఆదిత్య | 54 |
| ❖ చరిత్ర | ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన - 11 | - ఎస్. సరళా వందనం | 56 |
| ❖ శాస్త్రవిజ్ఞానం | అణు విద్యుత్తు | - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్ | 59 |
| ❖ వర్తమానం | ఆలోచనల గూటికి పుల్లా పుడకా | | 62 |
| ❖ ఇరుగు పొరుగు | | | 64 |
| ❖ అసహజ మరణాలు | | - వై. రామచంద్రం, రాంకి | 66 |

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
**డక్కన్ ప్రెస్ /**
**చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
**ఆనంద్ ఏజన్సీస్**
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

**'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా**

**వీక్షణం**
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

**వీక్షణం చందా వివరాలు**

| | సంస్థలకు / లైబ్రరీలకు | వ్యక్తులకు | విద్యార్థులకు |
|---|---|---|---|
| విడి ప్రతి | రు. 15 | రు. 15 | రు. 15 |
| సంవత్సరం | రు. 180 | రు. 150 | రు. 120 |
| మూడు సంవత్సరాలు | రు. 500 | రు. 400 | రు. 350 |
| ఐదు సంవత్సరాలు | రు. 800 | రు. 650 | - |
| పది సంవత్సరాలు | రు. 1500 | రు. 1300 | - |

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

**మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ కృతజ్ఞతలు**

**వీక్షణం ఆర్థిక స్థితి గురించి విజ్ఞప్తికి ప్రతిస్పందనగా జనవరి 2012లో అందిన విరాళాలు, సహాయాలు**

అమరుడు గంజి రామారావు (ఆం.ప్ర. రైతు కూలీ సంఘం అధ్యక్షుడు) సంస్మరణలో రు. 5000; వకుళాభరణం వంశీచరణ్, హైదరాబాద్ రు. 20,000; ఎ. హరినాథ్ బాబు, షికాగో రు. 5,000; ఎన్. వెంకటేశ్వర్లు, సెయింట్ చార్లెస్ రు. 10,000; జి. ఉమా మహేశ్వర్, హైదరాబాద్ (కర్నూల్ జిల్లాలోని 59 ప్రభుత్వ గ్రంథాలయాలకు సంవత్సర చందాగా) రు. 9000

వీక్షణం నవంబర్ 2011 సంచికలో సంపాదకీయం 'మేధావులకు సకల జనుల సమ్మె పాఠాలు' కు స్పందనగా – రాయలసీమ ప్రజల వల్ల తెలంగాణకు జరిగిన నష్టం ఏమిటి? అలాగే రాయలసీమకు ప్రభుత్వాలేవైనా చేసిన మేలు ఏమిటి? రాజధాని అందరిదీ అన్న విషయం సంపాదకీయంలో మరిచారు. హైదరాబాద్ రాజధాని కావడం వల్ల మేము తెలంగాణ ప్రాంతంతో సంబంధాలు పెట్టుకోవాల్సి వచ్చింది. అలాగే విద్యా, వైద్యం, పరిశ్రమలు హైదరాబాద్‌లో నెలకొనడం వల్ల అక్కడికి రావాల్సి వచ్చింది. వాస్తవానికి రాయలసీమ ప్రజలకు బెంగళూరు, మద్రాస్‌తో నేటికీ మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకు కారణం అవి మాకు సమీపంలో ఉన్నాయి. రాయలసీమ వెనుకబాటు గురించి మీరు ఏమంటారో చెబితే బాగుంటుంది. మొత్తంగా మానవాళికి న్యాయం జరగాలని కోరే మేధావులు, పత్రికాధిపతులు, పోరాట యోధులకు వర్గం, ప్రాంతం, కులం, మతం లాంటివి ఉండవు. అందువలన రాయలసీమ బాగుకోసం కూడా సూచనలు చేస్తే బాగుంటుంది. అలాగే అదే సంచికలో పి. వరలక్ష్మి వ్యాసం 'మరో జాదుగూడ కానున్న కడప' లో వాస్తవాలకు భిన్నమైన విషయాలు చెప్పారు. నేటి యుగంలో విద్యుత్ వినియోగం అధికమైంది. విద్యుత్ లేకపోతే మనిషి జీవించడం కష్టం. ఇప్పుడు జల విద్యుత్, థర్మల్ విద్యుత్‌లపై మనం ఆధారపడుతున్నాం. వర్షాలు తగ్గిపోవడం, బొగ్గు నిలువలు తరిగిపోవడంతో ముందు ముందు విద్యుత్ సమస్య తీవ్రం కావచ్చు. ఇందుకు ప్రత్యామ్నాయంగా అణు విద్యుత్ తప్పనిసరి. పర్యావరణం, భూగర్భ జలాలు కలుషితం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ఆ ప్రాంతంలో చెట్ల పెంపకం జరిగేలా చూడాలి. అంతేగాని, అణు విద్యుత్‌ను అణు బాంబుతో పోల్చి ప్రజలను భయాందోళనకు గురి చేయకూడదు. విద్యుత్ అవసరాలు తీరడానికి ప్రత్యామ్నాయాలు వరలక్ష్మి గారే చెప్పాలి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరుగుతోంది. ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం జాదుగూడలోని పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు వేరు. యూరేనియం గనుల నుండి ప్రమాదాలను తగ్గించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలి. రాయలసీమ చాలా వెనకబడి ఉంది. ఇక్కడ పరిశ్రమలు లేవు, నీటి వనరులు లేవు. ఇక ప్రజల బతుకులు ఎలా సాగుతాయో వరలక్ష్మి తెలపలేదు. వెనుకబడిన అనంతపురం జిల్లా సరిహద్దుల్లో యూరేనియం కేంద్రం ఏర్పాటు కానున్నది. పరిశ్రమల స్థాపన వలన ప్రజలకు మేలు జరుగుతుంది. ఇటీవల కాలంలో ఎక్కడ పరిశ్రమలు స్థాపించినా, అక్కడ రకరకాల సంఘాలు వెలసి ప్రజల్లో లేనిపోని భయాలు రేకెత్తిస్తున్నాయి. పరిశ్రమలు లేకపోతే విదేశీయులపై ఆధారపడాలి. లేకపోతే బతుకుకోసం విదేశాలకు వెళ్లాలి. పరిశ్రమల స్థాపన వ్యవసాయ యోగ్యం కాని భూములలో చేపట్టాలి. పరిశ్రమల పరిసర ప్రాంతాలలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు లేక ప్రజలు వలస వెళ్తున్నారు. అందుకే పారిశ్రామిక అభివృద్ధి జరగాలి.

**– ఎం. సూర్యనారాయణ రెడ్డి**

*పులివెందుల, కడప*

వీక్షణం జనవరి 2012 సంచికలో ఎడ్ల పోచయ్య, దుప్పల రవికుమార్‌ల వ్యాసాలు చాలా గొప్పగా ఉన్నాయి. పాలకవర్గ భావజాల ప్రసార సాధనాలు మనల్ని ఘటనల చుట్టూ తిప్పుతూ, ఆ ఘటనల వెనక ఉన్న క్రమాన్ని గ్రహించకుండా ఎలా చేయగలుగుతాయో పోచయ్య చక్కగా వివరించారు. ఈ సత్యం నిరంతరం మన కళ్లముందు కనపడుతూనే ఉంది. ఉద్యమాల్లో పనిచేసే సీనియర్‌లలో కూడా ఈ ధోరణి కొనసాగుతోందంటే పాలకవర్గ భావజాల శక్తి అర్థమవుతుంది. ప్రజల కదలికలు ఎన్ని రకాలుగా ఉంటున్నాయో వివరిస్తూ, వాటిని ఐక్యం చేయాల్సిన అవసరం గురించి బాగా చెప్పారు. పాలకవర్గాలు ఎప్పుడూ ఉపయోగించే సామ, దాన, బేధ, దండోపాయ పద్ధతులే కాకుండా మరో మూడు మాయ, ఉపేక్ష, ఇంద్రజాల పద్ధతుల గురించి వివరించడం చాలా ఉపయోగపడుతుంది. ప్రజల ఆందోళనలు తిరుగుబాటు స్థాయికి ఎదగకుండా చూడడానికి నేటి పాలకులు ఎక్కువగా ఈ పద్ధతుల్నే ఉపయోగిస్తున్నారు. కళింగాంధ్ర వెనకబాటుతనానికి కారణాలు రవికుమార్ చక్కగా వివరించారు. భారతదేశ చరిత్రలోనే మహా సంగ్రామంగా పేరు గాంచిన కళింగయుద్ధం ఓడి గెలిచిందనే చారిత్రక సత్యాన్ని తెలపడం బాగుంది. రెండు జిల్లాల భాష మొత్తం తెలుగు భాష కానట్లే, ఒక కులం సంస్కరణోద్యమం మొత్తం తెలుగు జాతి సంస్కరణోద్యమం కాదనడంలో అద్భుతమైన విశ్లేషణ కనపడుతుంది. కళింగసీమ భౌతిక సంపద గురించి వివరాలు చెప్పిన పద్ధతి బాగుంది. గత చరిత్రను పునరావిష్కరించారు. వర్తమాన చరిత్రను మదింపు వేయడమనే చారిత్రక కర్తవ్యాన్ని అందరూ స్వీకరించాలి. ఈ రెండు వ్యాసాలూ లోతైన అవగాహనతో సులువుగా అర్థమయేటట్లు ఉన్నాయి. వ్యాసాలు రాస్తే ఇలా రాయాలి అనేటట్లు ఉన్నాయి. రచయితలిద్దరికీ కృతజ్ఞతలు.

**– పి.వి. రమణ**

*విశాఖపట్నం*

వీక్షణం పత్రికతో సమాజంలో నిజం అనేదానిని తెలుసుకొని, పెట్టుబడిదారీ పత్రికల డొల్లతనాన్ని ఎండగడుతున్నాం. ప్రజల దగ్గరకు వెళ్లి అతి సూక్ష్మంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల మీద వీక్షణం పత్రికకు రాస్తున్న రచయిత లందరికీ మా కృతజ్ఞతలు. ఈ పత్రికను ముంబాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేసి చందాలు కట్టించే ప్రయత్నం చేస్తున్నాం. సామ్రాజ్యవాద అమెరికా లిబియా, ఇరాక్, ఇరాన్ ఇంకా ఇతర అనేక దేశాల మీద జరుపుతున్న దాడులను కండ్లకు కట్టినట్టు

*(మిగతా 61వ పేజీలో..)*

సవరణలు : జనవరి 2012 సంచికలో పి.వి. రమణ వ్యాసం 'జీవించే హక్కును హరిస్తున్న కూడంకుళం'లో అచ్చు తప్పులు చోటు చేసుకున్నాయి. 'తిరునవ్వేవి'ని 'తిరునల్వేలి'గా సరిచూసుకోగలరు. అలాగే 35వ పేజీ ఎడమవైపు కాలం మొదటి పేరా 7వ లైన్‌లో '48' రియాక్టర్లకు బదులు '4' రియాక్టర్లుగా సరిచూసుకోగలరు. 35వ పేజీలోనే కుడివైపు కాలమ్ నాల్గవ పేరా 3వ లైన్‌లో '21 నవంబర్ 2010'ని '21 సెప్టెంబర్ 2011'గా సరిచూసుకోగలరు. 37వ పేజీలో ఎడమ కాలం మొదటి పేరా నాల్గవ లైన్‌లో 'ఎందుకు ఆశ్చర్యం' బదులు 'ఎవరికీ ఆశ్చర్యం'గా సరిచూసుకోగలరు. అదే పేరా పదవ లైన్‌లో 'ప్రమాదముంది' బదులుగా 'ప్రమాదమేమీ లేదు'గా సరిచూసుకోగలరు. రెండవ పేరా నాల్గవ లైన్‌లో 'కార్యక్రమాలు'కు బదులుగా 'కార్యకర్తలు'గా సరిచూసుకోగలరు. ఆరవ లైన్‌లో 'తీవ్రమైన ఐలాండ్'కు బదులుగా 'త్రీమైల్ ఐలాండ్'గా, ఏడవ లైన్‌లో 'అణువిద్యుత్ ప్లాంట్ జరగడంతో' బదులుగా 'అణువిద్యుత్ ప్లాంట్ లో ప్రమాదం జరగడంతో'గా సరి చూసుకోగలరు. ఎడమవైపు కాలమ్‌లో నాల్గవ పేరా పదకొండవ లైన్‌లో 'ఒలిచి'కి బదులుగా 'బలిచ్చి'గా సరిచూసుకోగలరు. నాల్గవ పేరా ఆఖరు నుంచి రెండవ లైన్‌లో 'నిర్మించిన'కు బదులుగా 'నిర్మాణం ఎటువంటి పరిస్థితిలోనూ ఆగబోదన్న'గా సరిచూసుకోగలరు. ఐదవ పేరా ఐదవ లైన్‌లో 'అడిగే హక్కు మాకు లేదు?'కు బదులుగా 'అడిగే హక్కు మాకు లేదా?'గా సరిచూసుకోగలరు.

జనవరి 2012 సంచికలో అచ్చయిన ఎన్. వేణుగోపాల్ వ్యాసం 'విప్లవ విస్తృతికి చిహ్నం – కిషన్‌జీ'లో పేజీ 20లో సభల జాబితాలో సింగరేణి కార్మిక సమాఖ్య 1982 జూన్ గోదావరిఖని, పేజీ 21లో పుస్తకాల జాబితాలో సింగరేణి బొగ్గు గనుల్లో రగిలిన పోరాటాలు వర్ధిల్లాలి – 1982 కలుపుకోవాలి.

ఈ అచ్చు తప్పులకు చింతిస్తున్నాం. – సం.

# సిబిఐ దాడుల్లో వెలికివస్తున్న నిజాలు

"ఆవులూ ఆవులూ పోట్లాడితే లేగదూడల కాళ్లు విరిగినట్టు" అని సామెత. దాన్ని ఇప్పుడు దొంగలు దొంగలు పోట్లాడుకుంటుంటే ప్రజలకు నిజాలు తెలిసినట్టు అని మార్చుకోవాలి. రాష్ట్రంలో పాలకవర్గ ముఠాల మధ్య సాగుతున్న పోట్లాటలో ప్రజలకు తెలియవలసిన, ప్రజలనుంచి ఇన్నాళ్లూ దాచిన మహా రహస్యాలెన్నో బయటపడుతున్నాయి. మామూలుగా ప్రజలకు తెలియడానికి అవకాశం లేని నిజాలు కుప్పలు కుప్పలుగా తన్నుకుని వస్తున్నాయి. ఒకే వర్గానికి చెందిన ముఠాలే అధికారం కోసం, అధికారం ద్వారా నెరవేర్చుకోగలిగిన రాజకీయార్థిక ప్రయోజనాల కోసం కుమ్ములాడుకుంటున్నాయి. తమ వర్గ ప్రయోజనాల కోసం దాచి ఉంచుకోవలసిన రహస్యాలను కూడ ఆ కుమ్ములాటలో బయట పెట్టుకుంటున్నాయి. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనే ముగ్గురు ముఠానాయకులు ఇవాళ అధికారం కోసం పడుతున్న తాపత్రయంలో, ఘర్షణలో పాలకవర్గ ముఠాలు ప్రజల ఆస్తులను ఎలా దురాక్రమిస్తాయో, దుర్వినియోగం చేస్తాయో, ప్రజల సంపదలను పంచుకోవడంలో, దోపిడీ చేయడంలో దేశదేశాల పాలక, సంపన్న ముఠాలు ఎన్నెన్ని అక్రమాలకు పాల్పడతాయో పూసగుచ్చినట్టు తెలియజేస్తున్నారు. ఈ పాలకవర్గాలకు, ముఖ్యంగా అధికారంలో ఉన్న పాలకవర్గ ముఠాకు అడుగులకు మడుగులొత్తుతూ, వారి సొంత పరిశోధనా సంస్థగా పనిచేసే సిబిఐ ఇవాళ ప్రత్యర్థి ముఠా మీద ఒత్తిడిని ప్రదర్శిస్తున్నది. అందరూ దొంగలే గనుక ఎవరు అధికారంలో ఉంటే వారు సిబిఐని వాడుకుని ప్రత్యర్థి ముఠా చిట్టాలు బయటికి లాగవచ్చు. అందరి ఇళ్లలోనూ అస్థిపంజరాలూ ఆస్తి గుట్టుమట్లూ లెక్కలేనన్ని ఉన్నాయి. కావలసింది తవ్వితీసే సంకల్పమూ, తవ్వితీసే శక్తులూ మాత్రమే. భారత పాలక వర్గాలు కేంద్ర ప్రభుత్వంలోనైనా, రాష్ట్రాల ప్రభుత్వాలలోనైనా, ఏ చిన్నపాటి అధికారం ఉన్నచోటనయినా దశాబ్దాలుగా సాగించినది దోపిడీ పీడనలే. ప్రజల సంపదలను, శ్రమను కొల్లగొట్టకుండా ఆధిపత్యవర్గాలకు ఆస్తులు సమకూరే అవకాశమే లేదు. అలా అడ్డగోలుగా బందిపోట్లు సాగిస్తూపోతే అది చివరికి ప్రజల ఆగ్రహానికి, తిరుగుబాట్లకు దారితీస్తుందని, కనుక దోపిడీ పరిమితుల లోపల జరగాలని అనేక చట్టాలు, రాజ్యాంగ ఆదర్శాలు, సంక్షేమ రాజ్య భావనలు, ప్రజాస్వామిక ప్రవచనాలు ఎన్నెన్నో వచ్చాయి. ప్రపంచీకరణ విధానాలు మొదలైన తర్వాత ఆ నామమాత్రపు మేలిముసుగులను కూడ వదిలేసి పాలకవర్గాల దోపిడీ ఇష్టారాజ్యంగా, అరాచకంగా, విశృంఖలంగా సాగడం మొదలయింది. గడిచిన అరవై సంవత్సరాల దోపిడీ సంగతి అలా ఉంచినా, ఈ ఇరవై సంవత్సరాల ప్రపంచీకరణ నీడలో సాగిన దోపిడీ లెక్కవేస్తే రెండు వందల సంవత్సరాలలో బ్రిటిష్ పాలకులు దోచుకు పోయిన దానికన్న మించి పోతుంది. అపారమైన వనరులు, సంపదలు ఉన్న ఆంధ్రప్రదేశ్ సహజంగానే ఈ దోపిడీకి రంగస్థలమయింది. ప్రపంచీకరణ విధానాల అమలులో మొనగాడుగా ప్రపంచబ్యాంకు చేత ప్రశంసలు అందుకున్న చంద్రబాబు నాయుడు తొమ్మిది సంవత్సరాల పాలన, ఆ పాలనను విమర్శించి, ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తల ఒగ్గబోనని ప్రకటించి, ఎన్నికలలో గెలిచి, అక్షరాలా గత పాలన దోపిడీని అనుకరించడం మాత్రమే కాదు, రెండాకులు ఎక్కువ చదివిన వై ఎస్ రాజశేఖర రెడ్డి ఐదు సంవత్సరాల పాలన, ఆ రెండు ప్రభుత్వాల విధానాలను కొనసాగించిన రోశయ్య ఏడాదిన్నర పాలన, ఆ విధానాల అమలులో మరింత ముందుకు పోవడానికి పోటీ పడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి పాలన – మొత్తంగా చెప్పాలంటే గత పదిహేడు సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన ప్రతి పాలనా నిర్ణయమూ, రాజకీయార్థిక విధానమూ అవినీతికి ఆలవాలమే. ఏ ప్రభుత్వ ఉత్తర్వు తవ్వితీసినా అది ఎవరో ఒక ఆశ్రితుడికి, ఆశ్రిత కుటుంబానికి, దేశదేశాల సంపన్నులకు, బడా వ్యాపార సంస్థలకు, బహుళజాతిసంస్థలకు మేలు చేయడానికి వచ్చిందే. వారికి భూములు, ఖనిజ వనరులు, జల వనరులు, సముద్ర తీరాలు, అటవీ వనరులు, మౌలిక సాధనా సంపత్తి వినియోగంలో రాయితీలు, చట్టపరమైన నిబంధనల మినహాయింపులు ఇవ్వడానికే ఈ రెండు దశాబ్దాల ప్రభుత్వాలన్నీ పనిచేశాయి. ఒక చంద్రబాబు నాయుడు రస్ అల్ ఖైమాకూ, ఎమార్‌కూ, అంబానీలకూ, బిల్లీ రావుకూ, ఎల్ అండ్ టికీ, సత్యం కంప్యూటర్స్‌కూ అటువంటి వందలాది సంస్థలకూ ఏమి కట్టబెట్టాడన్నది అంత ముఖ్యం కాదు. ఒక రాజశేఖర రెడ్డి మళ్లీ అదే రస్ అల్ ఖైమాకూ, ఎమార్‌కూ, హిందుజాలకూ, అంబానీలకూ, జిఎంఆర్‌కూ, అదనంగా ఆయన కొడుకు సొంత ఖజానాకూ ఏమి కట్టబెట్టాడన్నదీ కేవలం వివరాల కోసం మాత్రమే. అటువంటి దోపిడీ విధానాల, నిర్ణయాల వివరాలు ఈ పదిహేడు సంవత్సరాలలో రోజుకొకటి దొరుకుతాయి. ఈ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వనరులను సంపన్నులకూ ఆశ్రితులకూ దోచిపెట్టడంలో ఓవర్ టైం పనిచేసింది. అతి కొద్ది మంది మినహా ఐ ఎఎస్, ఐపిఎస్ అధికారులందరికీ ఈ అవినీతిలో భాగమో, ఆమోదమో, సమాచారమో ఉంది. ఇవాళ గాలి జనార్దన రెడ్డి, కోనేరు ప్రసాద్, శ్రీలక్ష్మి, విజయసాయిరెడ్డి, సునీల్ రెడ్డి వంటి ఆయా నేరాల భాగస్వాములు చెప్పగలిగేది సముద్రంలో నీటిబొట్టు మాత్రమే. సిబిఐకి, న్యాయ వ్యవస్థకు, ఉన్న లోకాయుక్తకు, వస్తే గిస్తే లోక్‌పాల్‌కు, ఈ వ్యవస్థలో భాగమైన ఏ సంస్థకైనా సరే ఈ మహా మహా అవినీతి కుంభకోణాలను పూర్తిగా తవ్వి తీసి అక్రమార్జనాపరుల ఆస్తులను జప్తు చేసి ప్రజలకు తిరిగి స్వాధీనం చేసే శక్తి, కోరిక ఉన్నాయా? జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ అవకాశాలను అడ్డుకోవడానికి ఇవాళ సిబిఐ చేత క్రియాశీలంగా పని చేయిస్తుండవచ్చు, రేపు ఆయన రాజీకి వస్తే ఈ విచారణంతా సమసిపోయి, ఏమీ జరగలేదని తూచ్ అనిపించవచ్చు. "మీ సంగతి తెలుసు" అని బెదిరించడానికి చంద్రబాబు కాలపు అవినీతి ఉదంతాల చిట్టా అప్పుడప్పుడు బుట్టలోంచి తీసి చూపి మళ్లీ బుట్టలో పెట్టేయవచ్చు. నిజంగా ఈ రాష్ట్ర ప్రజల సంపద దోపిడీ ఎలా జరిగిందో ప్రజల తరఫున, ప్రజల కోసం, సంపూర్ణమైన ప్రజా నిబద్ధతతో బయటపడే రోజు ఎప్పటికి వస్తుంది? వీ

# ‘సర్వరోగ నివారిణి’ లోక్‌పాల్‌కు సర్వత్రా వంచన

సమర్థకులూ, వ్యతిరేకులూ, సమర్థకులుగానూ, వ్యతిరేకులుగానూ నటిస్తున్నవారూ అందరూ కలిసి మూడు రోజుల పాటు చర్చించి లోక్‌పాల్ బిల్లు చట్టం కాకుండా చూడడంలో తమ తమ పాత్రలను విజయవంతంగా పోషించారు. లోక్‌పాల్ మీద అన్నా హజారే బృందం సృష్టించి, పెంచి పోషించిన, ఈ దేశపు మధ్య తరగతిని సంపూర్ణంగా భ్రమల్లో ముంచగలిగిన ఆకాంక్ష చప్పున చల్లారిపోయి ఇప్పుడు వివాదంగా మాత్రం మిగిలింది. అసలు ఈ దారి ప్రారంభమే ఈ గమ్యానికి చేరే దిశగా మొదలయింది. లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పరచడమే, అసలు ముందు లోక్‌పాల్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టంగా తయారుచేయడమే ఈ దేశంలో సాగుతున్న అవినీతికి, సకల అనర్థాలకు సర్వరోగ నివారిణి అన్నట్టుగా ప్రచారం సాగింది. మౌలిక సమస్యల మీది నుంచి దృష్టి మళ్లించడానికి, లేవనెత్తిన ఒక్క సమస్యకైనా నిజమైన పరిష్కారం వైపు దృష్టి పోకుండా, చట్టం తయారీకి మాత్రమే కుదించడానికి అన్నా హజారే, ఆయనను నడిపిస్తున్న కార్పొరేట్, బ్యూరాక్రటిక్ శక్తులు పకడ్బందీ వ్యూహం తయారు చేశాయి. ఒక నిజమైన ప్రజాసమస్య మీద ఉద్యమంలో పాల్గొనే అవకాశం, అదీ ఎటువంటి నిర్బంధమూ లేని, టివిల్లో, పత్రికల్లో ప్రధాన స్థానం ఆక్రమించగల, ఆకర్షణీయమైన ఉద్యమం మధ్యతరగతి విద్యావంతులకు దొరికింది. ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం నిర్మాణమైన పద్ధతి గాని, దాని పోరాటరూపాలు గాని, దానిలో పాల్గొన్నవారిలో అత్యధికుల స్వభావంగాని ఆ ఉద్యమాన్ని ఈ గమ్యానికి చేర్చక తప్పదు. ఇప్పుడు అన్ని రాజకీయపక్షాలూ తనను మోసం చేశాయని అన్నా హజారే వాపోతున్నారు. నిజంగానే పార్లమెంటరీ రాజకీయ పక్షాలలో ఏ ఒక్కదానికీ తమ అక్రమాలను విచారించే అధికారం ఉన్న లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పడాలని లేదు. బలమైన వ్యవస్థ సంగతి అలా ఉంచి, బలహీనమైనదైనా అసలంటూ ఆ వ్యవస్థే ఏర్పడాలని లేదు. ఇటువంటి ఎన్నో వ్యవస్థలు తమను ఏమీ చేయలేకపోయాయని, కఠినమైన చట్ట నిబంధనలన్నీ కాగితపు పులులుగా మారిపోయాయని వారికి తెలుసు. అయినా, రాజకీయ పక్షాలకు లోక్‌పాల్ ను ఆమోదించాలని లేదు. ‘ఏమో ఎప్పుడైనా అధికారపక్షం ప్రతిపక్షాల మీద ఆయుధంగా వాడుకోవచ్చు, ఎప్పుడైనా ఒక నిజాయితీ పరుడైన అధికారి వాస్తవాలు బయటపెట్టి వార్తల్లో సంచలనమైనా సృష్టించవచ్చు. ఆ తలనొప్పి అంతా ఎందుకు, అసలంటూ వ్యవస్థ ఎందుకు’ అని అన్ని రాజకీయపక్షాలూ భావిస్తున్నాయి. అందువల్లనే లోక్‌పాల్ బిల్లు ఆమోదం పొందకుండా చూడడంలో ఏదో ఒక రూపంలో అన్ని రాజకీయపక్షాలూ మూకుమ్మడి కుట్ర చేశాయి. స్వయంగా అన్నా హజారే తన బహిరంగలేఖలో చెప్పినట్టు ఈ తిలా పాపంలో కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ, బహుజన సమాజ్ పార్టీ, సమాజ్ వాది పార్టీ అందరికీ తలా పిడికెడు భాగస్వామ్యం ఉంది. ఈ ఉదంతమైనా మన పార్లమెంటరీ రాజకీయపక్షాల దోపిడీ స్వభావం గురించి, వంచనాశిల్పం గురించి ప్రజల కళ్లు తెరిపించాలి. పాలకులు ఏదో చట్టానికి భయపడో, హృదయ పరివర్తన తోనో తమ స్వభావం మార్చుకోరు. అసలు సంగతి వారిని కూలదోసి, నిజమైన ప్రజల ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పరచడమే. లోక్‌పాల్ ప్రహసనం ఆ విషయాన్నే రుజువు చేస్తోంది. వీ

# ఉపఖండంలో సైనిక శక్తుల ఆధిక్యత

భారత ఉపఖండంలో మూడు ప్రధాన దేశాలలో (పాకిస్తాన్, బంగ్లాదేశ్, భారత్) ప్రభుత్వ సైనిక బలగాలలో సంచలనాల సూచికలు కనబడుతున్నాయి. ఇప్పటికే శ్రీలంకలో సైనిక పాలనతో సమానమైన నియంతృత్వ పాలన నడుస్తున్న సమయంలో, నేపాల్‌లో ఇంకా స్థిరమైన ప్రభుత్వం ఏర్పడని స్థితిలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి సైనిక కుట్రలకు నిలయమైన దేశాలలో మాత్రమే కాక, భారత్‌లో కూడ సైనిక సంచలనాలు ప్రమాద సూచనలు ఇస్తున్నాయి. సైన్యం ఎప్పుడైనా రాజకీయాధికారానికి లోబడి ఉండవలసిందే, ఆ రాజకీయాధికారం ప్రజల సార్వభౌమాధికారాన్ని గుర్తించి, వారి ప్రతినిధిగా రాజ్యం చేయవలసిందే తప్ప అటు సైనికాధికారానికి గాని, ఇటు రాజకీయాధికారానికి గాని ఇష్టారాజ్యపు సర్వంసహాధికారం లేదు. పాకిస్తాన్ లో గత అరవై ఐదు సంవత్సరాలలో అనేక సైనిక కుట్రల ప్రయత్నాలు జరిగాయి. మూడుసార్లు ఆ కుట్రలు విజయవంతమై, ముప్పై నాలుగు సంవత్సరాల సైనిక పాలన సాగింది. అందువల్ల పౌర రాజకీయాధికారాన్ని ఎదిరించే, సాధ్యమైతే తోసివేసే సైనిక వైఖరి అక్కడ సర్వ సాధారణమే. తాజా ఉదాహరణలో దేశాధ్యక్ష, ప్రధాన మంత్రులను ప్రధాన సైనికాధికారులు బహిరంగంగా, న్యాయస్థానంలో ఎదిరిస్తున్నారు. దేశంలో సైనిక కుట్ర జరిగే అవకాశం ఉన్నదనీ, అందువల్ల అమెరికా జోక్యం చేసుకుని ఆ కుట్రను నివారించాలనీ గత సంవత్సరం ఒక పాకిస్తాన్ పౌర అధికారి అమెరికన్ ప్రభుత్వానికి రాసిన లేఖ బయటపడడంతో ఈ వివాదం ప్రారంభమయింది. ఈ లేఖను విచారిస్తున్న సుప్రీంకోర్టు ముందు ప్రభుత్వ అనుమతి లేకుండానే సైనిక ప్రధానాధికారి అష్ఫఖ్ పర్వేజ్ కయాని, గూఢచార సంస్థ ఐఎస్ఐ అధిపతి అహ్మద్ షుజా పాషా వాంగ్మూలాలు ఇచ్చారు. అలా వారు చట్ట నిబంధనలు అతిక్రమించడానికి సహకరించినందుకు ప్రధాని యూసుఫ్ రజా గిలానీ రక్షణ శాఖ కార్యదర్శిని పదవి నుంచి తొలగించారు. అప్పటికే అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మీద అవినీతి ఆరోపణలు కూడ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వానికీ సైనికాధికారవర్గానికీ ఘర్షణ ముదిరి బహిరంగంగా ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకునే స్థితి వచ్చింది. ఏ రోజయినా మరొక సైనిక కుట్ర జరగవచ్చునే అనుమానాలు వ్యాపిస్తున్నాయి. మరొకపక్క, రెండు సైనిక కుట్రలకూ, పందొమ్మిది సైనిక కుట్రల ప్రయత్నాలకూ వేదిక అయిన బంగ్లాదేశ్ లో ప్రధానమంత్రి షేక్ హసీనా పాలనను కూలదోయడానికి దేశ విదేశాలలోని మత ఛాందస వాదుల ప్రోద్బలంతో ఒక సైనిక కుట్ర జరిగిందనీ, దాన్ని గుర్తించి విఫలం చేశామనీ ప్రభుత్వం ప్రకటించింది. సరిగ్గా ఇదే సమయానికి ఎన్నడూ పెద్ద ఎత్తున సైనిక కుట్రలు జరగని భారత దేశంలో ప్రధాన సైనికాధికారి వికె సింగ్ పుట్టిన తేదీ తప్పుగా వేసి, ఒక సంవత్సరం ఎక్కువగా ఉద్యోగంలో కొనసాగ దలచుకున్నారనే వివాదం సుప్రీంకోర్టుకు కూడ చేరి చిలికి చిలికి గాలివాన అవుతోంది. ఈ వ్యక్తిగత వివాదంలో పదవీ విరమణ పొందిన, పదవిలో ఉన్న ఇతర సైనికాధికారులు జోక్యం చేసుకోవడం ఇక్కడ కూడ సైనికాధికారులు రాజకీయాధికారాన్ని ఎదిరించగలరనే సూచనలు ఇస్తున్నాయి. సైన్యాన్ని ప్రజల మీదికి యుద్ధానికి దింపడానికి ప్రయత్నిస్తున్న పాలకులకు ఇది మరొక ప్రమాద సూచన కావచ్చు. సైన్యం తమ ప్రయోజనాల కొరకు కాక, ప్రజా ప్రయోజనాల కొరకు రాజకీయాధికారం మీద తిరగబడే రోజు వస్తే ఎంత బాగుండును! వీ







- **'మో' నిషాదం** – 186 పేజీలు, 1/8 డెమీ, రు : 100, ప్రతులకు : విరి వాల్యూమ్స్, 32–13–53/7బి, జర్నలిస్ట్స్ కాలనీ, విజయవాడ – 10; సెల్ : 9346736726; నవోదయ పబ్లిషర్స్, విజయవాడ; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు; ***ebook:www.kinige.com***
- **సాహు జీవితం రచనలు పరిశీలన** – వి.రాజేశ్వర శర్మ, ఎం.ఎ., ఎం.ఒ.ఎల్., ఎం.ఫిల్., పిఎచ్.డి. – విశాల సాహిత్య అకాడమి, 134 పేజీలు, 1/8 డెమీ, రు : 90, ప్రతులకు : విశాల సాహిత్య అకాడమి, 2–2–186/53/5, రామకృష్ణానగర్, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013. సెల్ : 09391036987
- **పొద్దున్నే వచ్చిన వాన** – కవిత్వం – గోపిని కరుణాకర్, పాలపిట్ట బుక్స్ – 74 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. సెల్ : 9848787284, palapittabooks@gmail.com
- **మనుషులు చేసిన దేవుళ్లు** – కొడవటిగంటి రోహిణీప్రసాద్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 196 పేజీలు, 1/8 డెమీ, రు : 100
- **రూపం – సారం – సాహిత్యంపై బాలగోపాల్** – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 339 పేజీలు, 1/8 డెమీ, రు : 150

పై రెండు ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067. ఫోన్ : 23521849, www.hyderabadbooktrust.blogspot.com

- **నిగ్రాని** – మినీ కవితలు – మెట్టు మురళీధర్ – చెలిమి ప్రచురణలు – 41 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : ఎం. మురళీధర్, ఇ.నెం. 2–8–400, రాఘవేంద్రనగర్, హన్మకొండ, వరంగల్ – 506 370, సెల్ : 99499 38833; ఎం. రవీందర్, ఇ.నెం. 1–386/3, చాణక్యపురి, భీమారం (పో), హన్మకొండ, వరంగల్ – 506 015, సెల్ : 99087 63566
- **అడవిలో వెన్నెల** – (గిరిజన పోరాట కథలు) సమగ్ర పరిశీలన – జరుపుల రమేష్ – విశాల సాహిత్య అకాడమి, 117 పేజీలు, 1/8 డెమీ, రు : 70, ప్రతులకు : జరుపుల రమేష్, రీసెర్చ్ స్కాలర్, ఎం.ఎచ్.–ఇ, ఎన్.ఆర్.ఎస్. హాస్టల్, రూమ్ నెం. ఎల్ 102, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ – 500 046. సెల్: 09618944654, ramesh.jarupula@gmail.com, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ బ్రాంచీలు; విశాల సాహిత్య అకాడమి, 403, శ్రీలక్ష్మి రెసిడెన్సీ, 2–2–647/90, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాద్ – 500 013. సెల్ : 09391036987
- **మనిషి స్వభావం, తను (ఆత్మభావం)** – హారోల్డ్ ఎచ్. టిటస్, తెలుగు అనువాదం : ఆర్వియార్ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ – 20 పేజీలు, 1/8 డెమీ, రు : 10
- **గతితర్కం గురించి.. మార్క్స్** – డేవిడ్ మాక్‌లెల్లన్, తెలుగు అనువాదం : ఇంగువ మల్లికార్జునశర్మ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ – 16 పేజీలు, 1/8 డెమీ, రు : 8

పై రెండు ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, ఇ.నెం. 5–85/4బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002, సెల్ : 9848877596; విశాలాంధ్ర బుక్ హౌస్; ప్రజాశక్తి బుక్ హౌస్; మైత్రి; దిశ; సహచర; నవయుగ; మణి బుక్‌స్టాల్స్

- **వ్యాపారం గుప్పెట్లో విద్య** – ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిల భారత విద్యా హక్కుల వేదిక – 106 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : డా. కె. లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, 306, ప్లెజెంట్ అపార్ట్‌మెంట్స్, బజార్‌ఘాట్, హైదరాబాద్–500004; సెల్ : 9440980396, 040 – 23305266







## సామల సదాశివకు కేంద్ర సాహిత్య పురస్కారం

కేంద్ర సాహిత్య అకాడమి 2011 సంవత్సరానికి గాను పురస్కారాలను 21 డిసెంబర్‌న ప్రకటించింది. 22 భాషలకు చెందిన 22 మంది సాహితీవేత్తలను వివిధ విభాగాల్లో ఈ అవార్డుకు ఎంపిక చేసింది. జాబితాలో కవితల విభాగంలో ఎనిమిది పుస్తకాలు, ఏడు నవలలు, మూడు వ్యాసాలు, ఒక కథానిక, ఒక చారిత్రక కథనం, ఒక జీవిత కథ, ఒక నాటికా ఉన్నాయి. రాష్ట్రం నుంచి తెలుగులో సామల సదాశివ రాసిన 'స్వరలయలు' వ్యాసం అవార్డుకు ఎంపికయింది. ఆయన తెలంగాణ ప్రాంతంలోని ఆదిలాబాద్ జిల్లా దహెగాం మండలం తెనుగుపల్లిలో 11 మే 1928లో పుట్టారు.

## మహారథి కన్నుమూత

సినీ రచయిత, కవి మహారథి డిసెంబర్ 22న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కృష్ణా తాలూకా పమమర్రు గ్రామంలో 20 ఏప్రిల్ 1930న పుట్టారు. సినిమాలకు మాటల రచయితగా ఆయన ప్రస్థానం ఎన్.టి.ఆర్. 'బందుపోటు' చిత్రంతో మొదలై, కృష్ణ 'శాంతి సందేశం'తో ముగిసింది. ఆయన ఇంకా పలు రచనలు చేశారు.

## క్రాప్ హాలిడే ఒక హెచ్చరిక

అన్ని ప్రాంతాలలో సమానంగా శాశ్వత హరిత విప్లవం వచ్చినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ అన్నారు. ఇందుకు రైతులు, విధాన నిర్ణేతలు, రాజకీయ నాయకులు సంయుక్తంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 23న విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో డా. పిన్నమనేని, శ్రీమతి సీతాదేవి ఫౌండేషన్ 21వ అవార్డును ఆయన అందుకున్నారు.

## అడుగంటుతున్న భూగర్భ జలం

గత ఏడాది నవంబర్ 30 నాటికి భూ ఉపరితలం నుంచి సగటున 5.97 మీటర్ల లోతున నీరు ఉండేది. ఇప్పుడది 8.5 మీటర్లకు పడిపోయింది. అంటే 2.53 మీటర్ల మేర జలమట్టం పడిపోయిందన్నమాట. ప్రాంతాల వారీగా చూస్తే కోస్తాంధ్రలో 2.53 మీటర్లు, రాయలసీమలో 2.42 మీటర్లు, తెలంగాణలో సగటున 2.53 మీటర్లు మేరకు భూగర్భ జలమట్టం పడిపోయింది.

## పటోళ్ల గోవర్దన్ రెడ్డి హత్య

విప్లవ దేశ భక్త పులులు (ఆర్.పి.టి.) వ్యవస్థాపకుడు, పరిటాల రవి హత్య కేసులో 15వ నిందితుడు పటోళ్ల గోవర్దన్ రెడ్డి 27 డిసెంబర్ 2011న మధ్యాహ్నం హైదరాబాద్‌లో హత్యకు గురయ్యారు. అనుచరుడితో ఉన్న డబ్బు వివాదం ఈ హత్యకు దారి తీసినట్లు, దీని వెనుక నయీం ముఠా హస్తం కూడా ఉన్నట్లు కథనాలు వెలువడ్డాయి.

## అణచివేత చట్టాల రద్దుకు ఉద్యమించాలి

భారత శిక్షాస్మృతిలోని ఉరిశిక్షతో సహా రాజద్రోహ నేర చట్టం, పి.డి. యాక్ట్, ఉపా చట్టం ఇంకా అలాంటి బ్రిటిష్ కాలం నాటి క్రూర చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే హక్కుల నేత కె.జి. కన్నబిరాన్‌కు నిజమైన నివాళి అని ఆయన సంస్మరణ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 30 డిసెంబర్ 2011న కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సి.ఆర్.పి.పి.) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కన్నబిరాన్ సంస్మరణ సభ జరిగింది. సభకు బల్లా రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా, వక్తలుగా చుక్కా రామయ్య, వరవరరావు, ఎస్. శేషయ్య, బొజ్జా తారకం పాల్గొన్నారు.

## రాజ్యాంగ ద్రోహం

తెలంగాణ ప్రకటన చేసి మళ్లీ ఏకాభిప్రాయం అని, సంప్రదింపులు అని పేర్కొంటూ ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవడం రాజ్యాంగ ద్రోహమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో ఏకాభిప్రాయం, సంప్రదింపులు అనే పదాలు లేనే లేవని సుదర్శన్‌రెడ్డి అన్నారు. 1 జనవరి 2012న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ అధికారులు, ఉద్యోగుల సంఘం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ డైరీని ఆవిష్కరించారు. ఈ సభలో తెలంగాణకు చెందిన పలువురు మేధావులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## క్షమాభిక్ష పెట్టండి

సత్ప్రవర్తన ఆధారంగా రాజకీయ, జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కల్పించాలని చర్లపల్లి జైల్లో ఏడేళ్లకు పైగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏటా అక్టోబర్ 2న ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న తమకు నిరాశే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాటికి సగం శిక్షాకాలం పూర్తి చేసుకున్న జీవితేతర ఖైదీలను విడుదల చేయాలని మావోయిస్టు, జనశక్తి ఖైదీలతో పాటు 13 మంది జనవరి 4న ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

## శ్రీలక్ష్మి అరెస్ట్

అక్రమ మైనింగ్ కేసులో నాలుగో నిందితురాలుగా ఉన్న ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ శ్రీలక్ష్మి జనవరి 6న సిబిఐ ప్రత్యేక కోర్టులో లొంగిపోయారు. హైకోర్టు రద్దు చేసిన బెయిల్‌ను సుప్రీంకోర్టు ద్వారా తిరిగి తెచ్చుకొనేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 1 డిసెంబర్ 2011న తొలిసారి ఈ కేసులో అరెస్ట్ అయిన శ్రీలక్ష్మి డిసెంబర్ 2న బెయిల్ తెచ్చుకున్నారు.

## వీరమాచినేని మధుసూదన్‌రావు మృతి

దర్శక నిర్మాత వీరమాచినేని మధుసూదన్‌రావు (88) జనవరి 11న అనారోగ్యంతో మరణించారు. ఆయన 1923లో కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో పుట్టారు. ప్రముఖ దర్శకుడు కె.ఎస్. ప్రకాశ్‌రావు వద్ద శిష్యరికం చేసి 1959లో తొలిసారిగా 'సతీ తులసి' చిత్రానికి దర్శకత్వం వహించారు. తెలుగులో మొత్తం 72 సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన వద్ద పనిచేసిన 57 మంది అసిస్టెంట్ డైరెక్టర్లలో చాలామంది ఆ తర్వాతి కాలంలో ప్రముఖ దర్శకులుగా ఎదిగారు.

## విరియాల కన్నుమూత

విరియాల లక్ష్మీపతి (69) జనవరి 18 రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన కవి డా. ఎ. సోమసుందర్ రచనలకు ప్రభావితులై తన రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. తన కలాన్ని నిరంతరం దోపిడీవాదంపై ఎక్కుపెట్టారు. మార్క్సు సిద్ధాంతాలను అవగతం చేసుకున్న ఆయన అనేక వాస్తవ సంఘటనలను నాటకీయకరణ చేశారు. ఆయన వందలాది రచనలు చేశారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగానూ, విశాఖ నగర అధ్యక్షునిగానూ ఆయన పనిచేశారు.

## గాలి జనార్దన్‌రెడ్డి దోపిడీ

గాలి జనార్దన్‌రెడ్డి ముఠా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దులను చెరిపేసి, దేశ సరిహద్దులు దాటించిన ఇనుప ఖనిజం విలువ రు. 4310 కోట్లు. ఇది కూడా కేవలం మూడేళ్లలోనే (2007-10). వీ

## మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు

ఉత్పత్తిలో, ప్రత్యుత్పత్తిలో రాజకీయార్థిక, సామాజిక రంగాలన్నింటిలో ప్రముఖ పాత్రను వహిస్తూ, పురుషులతో సమానంగానూ, పురుషుల కన్న ఎక్కువగానూ అన్ని శ్రమలలో భాగం అవుతున్న మహిళలు అంతటా వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటున్నారు. ప్రపంచీకరణ క్రమంలో అన్ని రంగాల లోనూ తమ సృజనా శక్తిని ధారపోస్తున్న మహిళలకు రక్షణ కరువవుతోంది. అంతటా అభద్రతే ఎదురవుతోంది. ఎక్కువ మంది మహిళలు అసంఘటిత రంగంలో పనిచేస్తూ ఎటువంటి కనీస హక్కులకూ అవకాశం లేకుండా మగ్గి పోతున్నారు. తీవ్ర హింసకూ, అణచివేతలకూ బలవుతున్నారు. సామాజిక ఉత్పత్తిలో అత్యధిక శ్రమను చేసే మహిళలకు ఆస్తి హక్కుగా ప్రకృతి వనరులు, పరిశ్రమలలో వాటా 2 శాతంగానే ఉంది. ముక్కుపచ్చలారని పసిపాపల నుంచి ముసలి వాళ్ల వరకు మహిళలు అత్యాచారాలకు, హత్యలకు గురవుతున్నారు. ఇంటా, బయటా, పనిస్థలాలలో కావలసినవారూ, బయటివారూ అనే తేడా లేకుండా హింసకు, అత్యాచారాలకు గురవుతున్నారు. రాష్ట్ర డిజిపి దినేష్‌రెడ్డి మహిళలపై జరిగిన నేరాలపై పోలీసు శాఖ వార్షిక నివేదికను 30 డిసెంబర్ 2011న విడుదల చేశారు. ఆ నేరాల జాబితాను పరిశీలిస్తే 2011 నవంబర్ (2010 నవంబర్‌తో పోలిస్తే) నాటికి హత్యలు 2,522 (2,267); అల్లర్లు 1,793 (1,713); అత్యాచారాలు 1,291 (1,228); దోపిడీలు, బందిపోట్లు 638 (597); మహిళలపై నేరాలు 22,034 (20,187); మహిళల వేధింపులు 10,018 (9,720); ఎస్.సి., ఎస్.టి.లపై అట్రాసిటీ 2,415 (2,405); ఆర్థిక నేరాలు 8,299 (8,222); సైబర్ 53 (29); మాదక ద్రవ్యాలు 357 (309)గా ఉన్నాయి. అంతకు ముందు ఏడాదితో పోల్చి చూస్తే అన్నిట్లో మహిళలపై నేరాలు పెరిగిపోయాయి. ఆ వివరాలు వెల్లడిస్తూ డిజిపి మహిళలపై బాధ్యతా రహితమైన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. రోజురోజుకూ ఉపాధి, సంక్షేమ రంగాల నుంచి ప్రభుత్వం వైదొలిగిపోతున్న క్రమంలో మహిళలు మరింత ప్రత్యక్షంగా కుటుంబ బరువు బాధ్యతలు మోస్తున్నారు. మద్యం, మాదక ద్రవ్యాలు, అశ్లీల సంస్కృతి అంతటా విస్తరించి మహిళలపై హింసకు ఆజ్యం పోస్తోంది. ఆకాశంలో సగం, పోరాటంలో సగం అంటూ మహిళలు ఈ దుర్మార్గాలను ప్రతిఘటిస్తున్నారు. మహిళలు భూస్వామ్య, సామ్రాజ్యవాద పీడనలతోపాటు పురుషస్వామ్య, పురుష అహంకార ఆధిపత్యం, అణచివేతలకు గురవుతున్నారు. వీటికి తోడు ఆర్థిక అసమానతలు, కుల, మతపరమైన వివక్షలూ మహిళలపై అదనంగా పనిచేస్తున్నాయి.

## బాక్సైట్ తవ్వకాలు జరపొద్దు

విశాఖపట్నంలో చేపట్టనున్న బాక్సైట్ తవ్వకాలను అక్కడి ఆదివాసులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మావోయిస్టులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకపక్క ప్రజల నిరసనలు కొనసాగుతున్నా, ప్రభుత్వం చాపకింద నీరులా బాక్సైట్ మైనింగ్ కోసం భూసేకరణ చేస్తోంది. ఆ క్రమంలోనే 20 డిసెంబర్ 2011న కేంద్ర సాధికారక కమిటీ చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. విశాఖ మన్యంలోని చింతపల్లి, జెర్రెల, గుర్తేడు, అనంతగిరి ప్రాంతాలలో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం ఎనిమిది వేల హెక్టార్లలో ఏడు వందల మెట్రిక్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. (దేశంలోని బాక్సైట్ నిక్షేపాల్లో 30 శాతం). ప్రభుత్వం అన్‌రాక్, జిందాల్‌లతో బాక్సైట్ తవ్వకాలకు ఒప్పందాలు కుదుర్చుకుంది. జెర్రెల ప్రాంతంలోని బాక్సైట్ నిల్వలను అన్‌రాక్ అల్యుమినా కంపెనీ తవ్వుకునేలా, అరకు ప్రాంత బాక్సైట్ నిల్వలను జిందాల్ కంపెనీ తవ్వుకునేలా ఒప్పందాలు జరిగాయి. ఈ కంపెనీలు తవ్వకాలు చేపడితే మూడు మండలాలలోని 14 గ్రామ పంచాయితీలలో 274 గూడేలలో నలభై ఐదు వేల మంది ఆదివాసులు మనుగడ కోల్పోతారు. రైతులు నిర్వాసితులు అవుతారు. బాక్సైట్ శుద్ధి కర్మాగారం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అరుదైన జీవజాలం అంతరించి పోతుంది. డిసెంబర్ 20 నుంచి మూడు రోజుల పాటు అభిప్రాయ సేకరణకు కేంద్ర సాధికారక కమిటీ రావడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అయింది. డిసెంబర్ 20, 21 తేదీలలో 48 గంటల పాటు మన్యం బంద్‌కు వివిధ పార్టీలు, ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చాయి. కమిటీ సభ్యులు బస చేసిన హోటల్ వద్ద నిరసన ప్రదర్శనలు చేశారు. నిరసనకారులను పోలీసులు నిర్బంధించారు. ఈ క్రమంలో కమిటీ తన మన్యం పర్యటనను రద్దు చేసుకుంది. డిసెంబర్ 21న కమిటీ సభ్యులు ఏరియల్ సర్వే చేపట్టారు. మూడోరోజు అంటే డిసెంబర్ 22న జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు బాక్సైట్ తవ్వకాలపై ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దని, అసలు ప్రజాభిప్రాయ సేకరణే చేపట్టవద్దని డిమాండ్ చేశాయి. ఇంత జరిగినా కమిటీ అధ్యక్షుడు డా. జె.సి. కాలా విలేకరులతో మాట్లాడుతూ తవ్వకాలను అందరు వ్యతిరేకించడం లేదని అన్నారు. ఏ పరిశ్రమలవల్ల అయినా కాలుష్యం ఉంటుందని అన్నారు. విశాఖపట్నం బాక్సైట్ మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలోని ఖనిజ సంపదను, అటవీ సంపదను బహుళజాతి సంస్థలకు అందివ్వడంలో భాగంగా పాలకులు తెస్తున్న 'అభివృద్ధి'ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి 'అభివృద్ధి' పథకాల వలన దేశవ్యాప్తంగా రెండు కోట్లకు పైగా ఆదివాసులు నిర్వాసితులయ్యారు.

## ఆస్తులు - అధికారం - అక్రమాలు

అధికారానికి, ఆస్తికి ఉన్న సంబంధం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అక్రమ ఆస్తుల విషయంలో ప్రజలకు మరింత స్పష్టంగా తెలిసివస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు అన్ని చట్టాలను అతిక్రమించి ఆస్తులను కూడబెట్టడం, కూడబెట్టిన ఆస్తుల పరిరక్షణకు నమ్మకస్తులైన మనుషులను వివిధ పదవుల్లో కూర్చోబెట్టడం, బినామీ పేర్లపై కాగితాలు సృష్టించుకోవడం, ఇలా మొత్తంగా ఒక యంత్రాంగమే దీనికోసం పనిచేస్తోంది. అందుకే మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, ప్రజా ప్రతినిధులుగా, పార్టీలుగా ఎవరు అధికారం చేపట్టినా వారికి అనుకూల వర్గాన్ని కావల్సిన కీలక పదవుల్లోకి తెచ్చి కూర్చోబెడతారు. అధికారానికి, ఆస్తికి ఊడిగం చేయడానికి అపార మేధా శక్తి కలిగిన ఐ.ఎ.ఎస్. అధికార వ్యవస్థ ఉండనే ఉంది. ఇక్కడ కాస్త విడమర్చి మాట్లాడుకుంటే ఈ దేశంలో, రాష్ట్రంలో సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే వారు ఏళ్ల తరబడి కఠోర పరిశ్రమ చేసి, మళ్లీ మళ్లీ పరీక్షలు రాసి ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్.లు అవుతారు. అయితే ఈ చదువుకున్న చదువును, విచక్షణను ప్రజలకోసం, ప్రజానుకూలంగా, ప్రజల వైపు నుంచి, ప్రజోపయోగంగా కాకుండా ప్రజా వ్యతిరేకంగానే ఉపయోగిస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చిపోయే 'ప్రజా ప్రతినిధుల'కు ఊడిగం చేయడంలో తమ తెలివి తేటలను ఖర్చు చేస్తున్నారు. అన్ని మార్గాల ద్వారా ఆస్తిని సంపాదించడం, అన్ని పద్ధతుల్లోనూ ఆ ఆస్తిని కాపాడుకోవడంగా రాజ్యం, రాజ్య వ్యవస్థ నడుస్తున్నాయి. ఆ క్రమంలోనే వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, గాలి జనార్దన రెడ్డి, సత్యం రాజులు, కోనేరు ప్రసాదులు, విజయసాయి రెడ్డి, శ్రీలక్ష్మిల కథలు పాలకుల వైరుధ్యాలలో భాగంగా బయటపడు తున్నాయి. (స్థలాభావం వల్ల అక్రమార్కుల పేర్ల జాబితా అంతా ఇక్కడ రాయలేకపోతున్నందుకు మన్నించాలి). (వి) నాయకులంతా దొరికితే దొంగలు, దొరక్కపోతే దొరలు అన్న చందంగా చలామణీ అవుతున్నారు. అధికారంతో సహా ప్రపంచంలో సమస్తాన్ని 'తన' డబ్బుతో కొనగలననుకున్న వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆస్తులపై దాడులతో ఎదుర్కొంటోంది. జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన వ్యక్తిగత ఆడిటర్ విజయసాయి రెడ్డి అపార మేధస్సు సి.బి.ఐ. పరిశోధనలో బయటపడుతోంది. ఇంత పరిశోధన జరిగాక, ఇన్ని విషయాలు బయటపడ్డాక ఆ ఆస్తులను జప్తు చేసుకొని ప్రజలకు మేలు చేసే ఉపాయం ఏమైనా ఉందా అనేది పెద్ద ప్రశ్నే.

**సంకలనం : డి.వి. రామకృష్ణారావు**

'తిరుగుబాటు మనిషి బ్రతుకు
బ్రతుకనదగ బ్రతుకు
బ్రతకదలచినట్టి మనిషి బ్రతుకు
తిరుగుబాటు'

అన్యాయాన్నెదిరించడం
నా జన్మహక్కు-నా విధి
'అన్యాయాన్నెదిరిస్తే
నాగొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నాగొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు'

**- కాళోజి**

*(నా గొడవ-కాళోజీ కవితల సంపూర్ణ సంకలనం-కాళోజీ ఫౌండేషన్ వరంగల్లు/హైదరాబాద్-ముద్రణ : సెప్టెంబర్ 2001*

'ఒక వ్యక్తికి చరిత్ర ఉంది. ఒక వంశానికి చరిత్ర ఉంది. ఒక జాతికి చరిత్ర ఉంది. ఒక దేశానికి చరిత్ర ఉంది-ప్రపంచ చరిత్ర లేదూ! ఒక్క మనిషికేకాదు, ఈ విశ్వ ప్రపంచంలో ప్రతి వస్తువుకూ, ప్రతి విషయానికీ చరిత్ర ఉంది. వృద్ధి పొందే ప్రతి వస్తువుకూ మార్పు పొందే ప్రతి వస్తువుకూ చరిత్ర ఉంది. ఏమాత్రమూ మార్పులేక, ఏ మాత్రమూ వృద్ధిలేక కుళ్లి మృతప్రాయమైన దానికి మాత్రమే చరిత్ర లేదు. ఈ పద్ధతిని చూస్తే ఈ విశ్వ ప్రపంచంలో చరిత్రలేని వస్తువేమున్నది? చరిత్ర రాయికున్నది, రప్పకున్నది. రాతికి సంబంధించిన చరిత్ర 'జియాలజీ' (భూగర్భ శాస్త్రం)గా పరిణమించింది; రప్పకున్న చరిత్ర 'బోటనీ' (వృక్షశాస్త్రం)గా వికసించింది. రాయిరప్పలకు సంబంధించిన తత్పరిశోధనమే కాకుండా వాటి చరిత్ర వర్ణనము కూడా ఆ శాస్త్రములలో ఒక అంతర్భాగమే. ప్రతి వస్తువుకు చరిత్ర ఉన్నప్పుడు ప్రపంచానికంతకూ, అన్ని విషయాలలోనూ అధిరాజయిన మనుషునికి చరిత్ర ఉండడంలో ఆశ్చర్యమేమిటి?'

'మనిషి అతి తక్కువ స్థితిలో నుంచి అతి ఎక్కువ స్థితిలోకి, అతి హీన స్థితి నుంచి అతి గొప్ప స్థితిలోకి పడుతూ లేస్తూ ఎట్లా ఎక్కి వస్తున్నాడో చరిత్ర చెపుతుంది. మనిషి ప్రయత్నానికి మించిన ప్రయత్నం లేదు; మనిషి చరిత్రకు మించిన గ్రంథమే లేదు. చరిత్ర మనిషి సాగిపోవలసిన సరళమయిన మార్గాన్ని చూపుతుంది; చరిత్ర అభివృద్ధి పంథాను నిరూపిస్తుంది. చరిత్ర బుద్ధి వివేకములకు పదును పెడుతుంది. చరిత్ర విచారణ శక్తినెక్కువ చేస్తుంది. చరిత్ర ఆలోచనకు విషయం చూపుతుంది. చరిత్ర ఆయా కష్టనికృష్ట పరిస్థితులలో మనిషి ఇదివరకు ప్రవర్తించిన విధము తెలిపి సలహా ఇస్తుంది. చరిత్ర జాతికి కొత్త శక్తి ఇస్తుంది. చరిత్ర మనిషి సంకల్ప బలాన్నీ, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. చరిత్ర మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని వృద్ధినొందిస్తుంది. అన్నిటినీ మించి చరిత్ర మనిషికి ఆశ పోస్తుంది. ఆశమీదే మనిషి బ్రతకడం. చరిత్ర చేయలేనిదేది? చేయనిదేది?'

**- మల్లంపల్లి సోమశేఖర శర్మ**

*(వీణ-1936, 'చరిత్ర అంటే....!' వ్యాసం నుంచి, 'చారిత్రక వ్యాసమంజరి' - సంపాదకుడు - మోదుగుల రవికృష్ణ - మిత్రమండలి ప్రచురణలు-ముద్రణ జూలై 2011)*

'తాము అధికారంలోకి రావాలంటే ప్రజాస్వామ్యం, ఎన్నికలు ఉండితీరాలి. ఎన్నికల్లో తాము గెలవాలంటే ఓట్లు వెయ్యడానికి జనం కావాలి. వారిని మభ్యపెట్టాలంటే సోషలిజం కావాలి అనాలి. శ్రామిక వర్గం కోసం మేడే సందేశాలు ఇవ్వాలి. కమ్యూనిస్టుల కోసం రెడ్ శాల్యూట్‌లు చెప్పాలి. అదే సమయంలో కాల్పుల ద్వారా, అరెస్టుల ద్వారా, కుట్ర కేసుల ద్వారా, ఎన్‌కౌంటర్ల ద్వారా, పోలీసు క్యాంపుల ద్వారా జనాన్ని అదుపు చేయాలి. జనం ఉండాలి. వారు తమకు ఓట్లు వెయ్యాలి. పన్నులు కట్టాలి. పత్రికలు ఉండాలి, అవి తమ కీర్తిని గానం చేయాలి. సూర్యుడూ, చంద్రుడూ ఉండాలి. వారిద్దరు తమ ఇంటిలోని వాళ్ల అవసరాలకి ఉపయోగపడాలి. తాము దొంగతనానికి బయలు దేరినపుడు చంద్రుడు దాక్కోవాలి. తాము రంకుతనానికి బయలు దేరినపుడు సూర్యుడు సడన్‌గా ఆరిపోయి, తమకు చలివేసినపుడు వెచ్చగా వెలగాలి. అంతే దొరవారికి కావాల్సినది.

పత్రికలన్నా, ప్రజలన్నా అందరికంటే పోలీసులకు కాస్తా ఎక్కువ కోపం. ఎందుకు అని కొందరు అమాయకంగా అడగొచ్చు. కన్నపు దొంగలకి పోలీసులంటే ఎందుకు భయమో, ప్రజలన్నా, పత్రికలన్నా పోలీసులకు అందుకే భయం. ఆ భయం నుంచే ద్వేషం.'

**- కె.ఎస్.వై. పతంజలి**

*(04-05-1985)*

*(పంచదార పత్రికలుండాలి-పతంజలి భాష్యం- పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

ఇప్పుడు తిరిగి పద్ధతిని పరామర్శిద్దాం. చరిత్ర అనేది మహారాజుల మహా సంగ్రామాల పట్టిక కాదు. ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల క్రమానుగత పరిణామాల వివరణ అని అర్థం చేసుకున్న తరువాత ఈ పరిణామాల ముద్రలను అన్వేషించే పద్ధతి కావాలి. సాహిత్యా ఆధారాలనూ పురావస్తు ఆధారాలనూ రాజవంశాల అనుక్రమణిక కోసం కాక గతకాలపు సామాజిక పరిణామాల ఛాయల కోసం అధ్యయనం చేయాలి. అయితే ఈ రెండు సంప్రదాయిక ఆధారాలూ అసంతృప్తికరంగా ఉన్నంత మాత్రాన ఇబ్బంది లేదు. ఎందుకంటే గతకాలపు పరిణామాలను అన్వేషించడానికి గతకాలపు సాహిత్యం, పనిముట్లు తదితర వస్తువులు దొరకక పోయినా, ఆ పరిణామాలు ఇప్పటికీ నిలిచేలాగ వదిలిపోయిన సామాజిక అవశేషాలు దొరుకుతాయి - వెతికే ఓపిక ఉంటే. మన దేశం గతాన్ని అసాధారణంగా మిగుల్చుకున్నది కావడం ప్రజలకు శాపం అయితే చరిత్రకారుడికి వరం. నాలుగు సహస్రాబ్దాల చరిత్రలో అన్ని దశలూ ఆ దశలలోని సంఘర్షణలూ తమ ఛాయలను సమాజం మీద వదిలి వెళ్లాయి. అవి మన చుట్టూ ఉన్నాయి. వాటిని గుర్తించి విశ్లేషించాలి. జె.డి. బెర్నాల్ అన్నట్టు 'కోశాంబి దృష్టిలో చరిత్ర గతంలోనే కాదు, వర్తమానంలోనూ ఉంది.'

**ప్రాచీన భారతదేశ చరిత్ర - డి.డి. కోశాంబి పరిచయం**

**కె. బాలగోపాల్**

*(హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ)*

*అస్తిత్వం, ఆలోచనలలో, పదార్థ చైతన్యాలలో ఏది ప్రాథమికమైనది? దేనిపైన ఏది ఆధారపడి ఉంది? దేని నుండి ఏది పుడుతున్నది? 'ఈ ప్రశ్నకు తత్వవేత్తలు ఇచ్చిన సమాధానాలననుసరించి, తత్వవేత్తలు రెండు శిబిరాలుగా చీలిపోయారు. ప్రకృతికంటే భావం ప్రాథమికమని భావించినవారు, అనగా చిట్టచివరకు ఏదో ఒక రూపంలో ప్రపంచం ఏదో ఒక బాహ్య శక్తిచే సృష్టించబడ్డది అని భావించేవారు, బావవాద శిబిరంలో చేరారు. వీరు కాక ఇతరులు ప్రకృతిని ప్రాథమికంగా భావించినవారు, భౌతికవాదానికి చెందిన వివిధ ధోరణులకు చెంది ఉన్నారు.'*

*(ఎంగెల్స్, లుడ్విగ్ ఫ్యూయర్‌బా; పే 19) మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక పరిచయం-న్యూవిస్టాస్ పబ్లికేషన్స్*

*మారుతున్న పరిస్థితులలో గ్రామాల ప్రాధాన్యతనూ, గ్రామీణ ప్రజల అవసరాలనూ, గ్రామీణ ప్రాంతాల వనరుల స్థితినీ సవ్యంగా మదింపు చేయడానికి గ్రామాల అధ్యయనం ఎలా ఉపకరిస్తుందో వివరిస్తున్నారు* **ఎన్. వేణుగోపాల్**

# గ్రామాల అధ్యయనం ఎందుకు?

ఇవాళ భారత సమాజ స్థితి అస్తవ్యస్తంగా ఉన్నది. అత్యధిక సంఖ్యాక ప్రజల జీవనం ఉండవలసినట్టుగా లేదు. కోట్లాది ప్రజలకు కనీస అవసరాలు తీరడం లేదు. విజ్ఞాన, వినోద అవసరాలు ఎంతో కొంత తీరినట్టు కనబడుతున్నా ఆరోగ్యకరమైన పద్ధతిలో తీరడం లేదు. విజ్ఞానం, వినోదం పేరిట వికృతమైన, అసహజమైన, సమాజ వ్యతిరేకమైన భావజాల అంశాలు మనసుల్లో రుద్దబడుతున్నాయి. అసంఖ్యాక ప్రజానీకానికి మానవ సహజమైన గౌరవం దక్కడం లేదు. రాజ్యాంగ ఆదర్శాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక పాలన, లౌకికత్వం అరకొరగా అమలవుతున్నాయి. చాల సందర్భాల్లో అమలు కావడమే లేదు. ఇటువంటి విషయాలు తెలియని వారూ చర్చించని వారూ ఎవరూ లేరు. ఈ రుగ్మతలు తొలగిపోయి, సమాజం మారాలనే అభిప్రాయాన్ని వ్యక్తపరచే వాళ్ల సంఖ్యకు కూడ కొదవలేదు. ఆ మార్పు స్వరూప స్వభావాలు ఏమిటనే విషయంలో ఎవరి దృక్పథం వాళ్లకు ఉండవచ్చు. ఎవరికి సరైనదనిపించిన మార్గాన్ని వారు అనుసరిస్తుండవచ్చు. కాని సామాజిక మార్పును సాధించాలంటే ముందు ఆ సమాజం ఎలా ఉన్నదో అర్థం కావాలి. స్థితిని సరిగా అర్థం చేసుకోకపోతే దాన్ని మార్చడమూ సాధ్యం కాదు. జరిగిపోతున్న మార్పులను సరిగా అర్థం చేసుకోకపోతే వాటి దిశను మార్చడమూ సాధ్యం కాదు. భారత సమాజాన్ని ప్రజానుకూల దృక్పథంతో మార్చాలంటే దాన్ని ముందు సరిగా అర్థం చేసుకోవాలి.

నిజానికి భారత సమాజం అని సాధారణంగా పిలుస్తున్నది ఏకశిలా సదృశమైన ముద్ద కాదు. ఉత్తర కొసనుంచి దక్షిణ కొసకు మూడు వేల రెండు వందల కిలోమీటర్లు, పడమటి కొస నుంచి తూర్పు కొసకు మూడు వేల కిలోమీటర్లు విస్తరించిన ఈ సువిశాల భారత దేశంలో, 'భారత సమాజం'గా చెప్పుకుంటున్న దానిలో భౌగోళిక అర్థంలోనూ, సాంస్కృతిక అర్థంలోనూ అనేక సమాజాలు ఉన్నాయి. ఆయా సమాజాల మధ్య ఉన్న వైరుధ్యాలు, ఆయా సమాజాల లోపలనే ఉన్న వైరుధ్యాలు ప్రతిరోజూ బయటపడుతూ, ఇదంతా ఒకటే సమాజమనే భావనను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. ఇంత వైశాల్యం నుంచి ఏదో ఒక సమాజపు ముక్కను తీసుకుని, మళ్లీ అందులోంచి ఒక గ్రామాన్నో, పట్టణాలనో, కొన్ని గ్రామాలనో, పట్టణాలనో అధ్యయనం చేసి భారత సమాజం గురించి నిర్ధారణలకు రావడం కుదరదు.

అనేక చారిత్రక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలలో ఆయా సమాజాలన్నీ వాటికవిగా ఎదుగుతూ వచ్చాయి. ఒకదానితో ఒకటి సంబంధం లోకి వచ్చి ఐక్యత, ఘర్షణలతో, పరస్పర చర్య ప్రతిచర్యలకు లోనై, ఆదాన ప్రదానాలతో అభివృద్ధి చెందాయి. కొన్ని సమాజాలు కలిసిపోయాయి, మరికొన్ని విడివిడిగానే ఉండి పోయాయి. అప్పటివరకూ కలిసి ఉన్న కొన్ని సమాజాలలో కొత్త వైరుధ్యాలు బయటపడ్డాయి. అంతకు ముందు హిందూ పురాణ గాథలలోనూ, కేవలం సిద్ధాంత రీత్యానూ ఉండిన భారత సమాజ భావన బ్రిటిష్ పాలనతో, ఏకీకృత మార్కెట్ రూపొందడంతో స్థిరపడింది. అప్పటికీ స్వదేశీ సంస్థానాలు ఈ భారత సమాజంలో భాగం కాలేదు. అధికార మార్పిడి తర్వాతనే, ఉమ్మడి రాజకీయ, చట్టపరమైన నిర్మాణాలు రూపొందడంతోనే భారత సమాజం ఇవాళ ఉన్న రూపంలోకి వచ్చింది. అయినా ఇప్పటికీ భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాలు, వైరుధ్యాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ వైవిధ్యాలు, వైరుధ్యాలు వ్యక్తమయ్యే ప్రధాన రంగస్థలం గ్రామీణ ప్రాంతాలే. అందువల్ల సమాజాన్ని – అది భారత సమాజం అనుకున్నా, విడివిడిగా జాతి, భాషా, మత, కుల, పాలనా విభాగ ప్రాతిపదికల సమాజాలు అనుకున్నా – అర్థం చేసుకోవాలంటే తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాలలోకి వెళ్లవలసిందే. అలా సాగే విడివిడి అధ్యయనాలను ఎన్నిటినో సమన్వయం చేయాలి. వాటి మధ్య దేశవ్యాపిత సాధారణ స్వభావం ఉన్నదా అని అన్వేషించాలి. అలాగే పట్టణ ప్రాంతాలనూ అధ్యయనం చేయాలి. వాటి స్వభావాన్నీ గుర్తించాలి. అలా బయటపడిన అనేక స్వభావాల మధ్య ఒక ప్రబల, ప్రధాన స్వభావం ఉన్నదని, లేదా కొన్ని ప్రధాన స్వభావాలు ఉన్నాయని గుర్తించగలిగితేనే భారత సమాజ స్వభావం గురించి నిర్ధారించడం సాధ్యమవుతుంది.

ఈ భారత సమాజ స్వభావం అనే దానిలో గ్రామీణ ప్రాంతాల స్వభావం కీలకమైనది. ఈ దేశంలో గ్రామాలు వేల సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్నాయి. అనేక మార్పులకు తట్టుకుంటూ, వాటిలో కొన్ని మార్పులను సంలీనం చేసుకుంటూ గ్రామాలు నిలిచి ఉన్నాయి. దేశంలో అత్యధిక జనాభాకు ఆశ్రయమిస్తూ, దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను పరిరక్షిస్తూ ఉన్నవి గ్రామాలే. అందువల్ల మన సమాజంలో గ్రామాల అధ్యయనం చాల ముఖ్యమైనది, అవసరమైనది. మొత్తంగా భారత సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే ప్రధానంగా అట్టడుగున మౌలిక ప్రాతిపదికగా ఉన్న గ్రామాలను విస్తృతంగా, నిశితంగా అధ్యయనం చేయకతప్పదు.

కేవలం వైవిధ్యాలను, వైరుధ్యాలను అర్థం చేసుకోవడానికి మాత్రమే గాక, అశేష జన బాహుళ్యం గ్రామాలలోనే నివసిస్తున్నందువల్ల కూడ గ్రామాల అధ్యయనం తప్పనిసరి అవుతుంది. 'భారతదేశం

గ్రామాల్లో నివసిస్తుంది' అని గాంధీ అన్నాడని చాల మంది చదివో, వినో ఉంటారు. ఆయన పట్టణాలతో పోలుస్తూ మరీ ఆ మాట అన్నాడు. ఆయన 1931 నవంబర్‌లో లండన్‌లో ఒక సమావేశంలో మాట్లాడుతూ చాల స్పష్టంగా 'భారతదేశం గ్రామాల్లో ఉంది, బొంబాయి, కలకత్తా, మద్రాసులలో కాదు' అన్నాడు. అటువంటి అభిప్రాయాన్నే అంతకు ముందూ ఆ తర్వాతా కూడ ప్రకటించాడు. ఎనిమిది దశాబ్దాలు గడిచిన తర్వాత కూడ, చాల ఎక్కువ పట్టణీకరణ జరిగిందని అనిపిస్తున్న తర్వాత కూడ 'భారతదేశం గ్రామాల్లో నివసిస్తుంది' అనే మాటకు కాలం చెల్లలేదు. అది ఆలంకారికమైన మాట అయిపోలేదు. అది ఇంకా అక్షరాలా వాస్తవంగానే ఉంది. ఇప్పటికీ దేశంలో 6,40,867 గ్రామాలు ఉన్నాయి. ఇవాళ్టికీ, 2011 జనగణన ప్రకారం కూడ, దేశ జనాభాలో 68.84 శాతం గ్రామాల్లో నివసిస్తున్నారు. ఇదే గణాంకాల ప్రకారం పట్టణ జనాభా 31.16 శాతంగా ఉన్నది. అది పది సంవత్సరాలకు ముందు ఉన్న 27.82 శాతం నుంచి 3.34 శాతం పెరిగింది. అంటే గ్రామీణ జనాభా ఆ మేరకు తగ్గింది. అయితే ఈ శాతాలను పక్కనపెట్టి మొత్తం జనాభా చూస్తే ఇవాళ్టికీ 37 కోట్ల మంది ప్రజలు పట్టణాల్లో ఉండగా, 84 కోట్ల మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు.

ఇక రాష్ట్ర గణాంకాలు పరిశీలిస్తే, 2001లో 27.30 శాతంగా ఉన్న పట్టణ జనాభా, 2011లో 33.49 శాతానికి పెరిగింది. అంటే గ్రామీణ జనాభా 72.70 శాతం ఉన్నదల్లా 66.51 శాతానికి తగ్గింది. అంటే రాష్ట్రంలో పట్టణ జనాభా దేశ సగటు కన్న ఎక్కువగా 6.19 శాతం పెరిగింది. ఆమేరకు గ్రామీణ జనాభా తగ్గింది. పట్టణాల సంఖ్య 210 నుంచి 353 కు పెరిగింది. ఇందులో సాధారణ పట్టణాలు 117 నుంచి 125కు పెరగగా, జనగణనలో పట్టణాలుగా గుర్తింపు పొందేవి 93 నుంచి 228కి పెరిగాయి. అలాగే గ్రామాల సంఖ్య 2001లో 28,123 ఉన్నదల్లా, 2011లో 27,800 అయింది.

ఈ అంకెలు చూసి పట్టణాలు పెరుగుతున్నాయనీ, గ్రామాలు తరిగిపోతున్నాయనీ నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంకెలతో సంబంధం లేకపోయినా గ్రామాలను చిన్నచూపు చూడడం విద్యావంతులలో పెరిగిపోతోంది, గ్రామాల ప్రాధాన్యత తగ్గిపోతోందని, గ్రామాలను పట్టించుకోనక్కరలేదని కొందరు మేధావులు వాదిస్తున్నారు. గ్రామాలను తప్పనిసరి అయి పట్టించుకున్నా ఆయా శక్తులు తమ అవసరాలకోసం మాత్రమే పట్టించుకుంటున్నాయని, కాని గ్రామాల పరిశీలనకు సామాజిక ప్రాముఖ్యత లేదని వాదనలు వినబడుతూనే ఉన్నాయి.

అందుకే ఈ పట్టణీకరణ – గ్రామాల పతనం అంకెలను కొంచెం జాగ్రత్తగా పరిశీలించాలి. పది సంవత్సరాల ముందు జరిగిన 2001 జనగణనలో రాష్ట్రంలో 6507 పట్టణాలున్నాయనీ, 2011 జనగణన నాటికి అవి 7935 కు పెరిగాయనీ, అంటే పది సంవత్సరాలలో 2,774 పట్టణాలు పెరిగాయనీ 2011 జనగణన నివేదికలు చెపుతున్నాయి. కాని పట్టణం నిర్వచనాన్ని ఎప్పటికప్పుడు మారుస్తూ రావడం వల్ల ప్రతి జనగణన జరిగినప్పుడు అంతకుముందు పట్టణాలుగా ఉన్నవాటిలో కొన్నిటిని పట్టణాలు కాదనడమూ, కొన్ని కొత్త ప్రాంతాలను పట్టణాలుగా గుర్తించడమూ జరుగుతోంది. మామూలుగా పట్టణాలుగా గుర్తించే వాటిని చట్టబద్ధ పట్టణాలు అనీ, తన నిర్వచనం ప్రకారం పట్టణాలుగా గుర్తించే వాటిని 'సెన్సస్ పట్టణాలు' అనీ జనగణనలో పరిగణిస్తారు. ప్రస్తుత నిర్వచనం ప్రకారం 'సెన్సస్ పట్టణం' అంటే ఐదువేలకన్న ఎక్కువ జనాభా, 75 శాతం పురుష శ్రామిక జనాభా వ్యవసాయేతర కార్యకలాపాల్లో ఉండడం, జనసాంద్రత కి.మీ.కు 400 కన్న ఎక్కువ ఉండడం. కాని ఈ లక్షణాలు పెద్ద గ్రామాలకూ, పాలనా కేంద్రాలకూ, యాత్రాస్థలాలకూ కూడ ఉంటాయి.

అందువల్ల గ్రామీణ ప్రాంతాలు పెరిగాయన్నా, తగ్గాయన్నా ఆ నిర్ధారణను యథాతథంగా విశ్వసించనక్కరలేదు. అంతేకాదు, ఒకవేళ పట్టణ జనాభా ఎక్కువగా నమోదయిందన్నా, ఆ జనాభా స్వభావం ఏమిటో కూడ చూడవలసి ఉంటుంది. ఆ 'పట్టణ జనాభా' పూర్తిగా గ్రామాలతో సంబంధాలు తెంచుకున్నారా, గ్రామాలకు మళ్లీ తిరిగివెళ్లే ఆలోచన లేకుండా వచ్చారా, చదువు, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం తదితర కారణాలతోనో, ఏ కారణమూ లేకుండానో పట్టణ పౌరులుగా ఉంటూ, గ్రామంలో తమ సంబంధాలు, ఆస్తులు, ప్రయోజనాలు యథావిధిగా ఉంచుకున్నారా వంటి అంశాలు తేల్చవలసే ఉంటుంది. మన పట్టణాలలో అతి తక్కువ మాత్రమే పారిశ్రామిక పట్టణాలు గనుక, మిగిలినవన్నీ కూడళ్లు, మతధార్మిక కేంద్రాలు, పాలనా కేంద్రాలు అయినందువల్ల పట్టణాలుగా మారినవే గనుక 'పట్టణ జనాభా' కూడ నిజంగా పట్టణీకరణ చెందిన జనాభానా, పట్నవాసం గడుపుతున్న పల్లెటూరి వారా కూడ ఆలోచించవలసి ఉంటుంది.

అంటే ప్రతి జనగణనలోనూ పట్టణీకరణ శాతం, పట్టణ జనాభా శాతం పెరిగిపోతున్నట్టు కనబడుతున్నప్పటికీ ఆ రూపం వెనుక సారాంశంలో మారీ మారని గ్రామాలే ఉన్నాయి. అట్లని గ్రామాలు మారడం లేదని కాదు. తప్పనిసరిగా, సహజంగా, అనివార్యంగా మారుతున్నాయి. ఆ మార్పులు గ్రామీణ ప్రజల జీవితంలో చెప్పుకోదగిన పద్ధతిలో కనబడుతున్నాయి. అయితే ప్రతి మార్పూ మౌలిక మార్పు కాదు. ప్రతి రూపంలో మార్పూ సారంలో మార్పు కాదు. ఆ మార్పుల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి, అవి రూపంలో మార్పులు మాత్రమేనా, సారంలో ఏమయినా మార్పులు వస్తున్నాయా, మౌలిక మార్పులు వస్తున్నాయా అర్థం చేసుకోవడానికి కూడ తప్పనిసరిగా గ్రామాలను అధ్యయనం చేయాలి.

ఇక ఆర్థికవ్యవస్థ పరంగా చూస్తే గ్రామాలే ఇవాళ్టికీ దేశానికి జీవగర్ర. జాతీయాదాయంలో ప్రాథమిక రంగం (వ్యవసాయం, పశు సంపద, గనులు, అటవీ వనరులు, మత్స్య సంపద) వాటా 27 శాతం మాత్రమేననీ, ఈ ప్రాథమిక రంగం ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నది గనుక దేశ సంపదకు గ్రామీణ రంగం అందజేస్తున్నది తక్కువ అని చాలమంది ఆర్థికవేత్తలు ఒక వాదన చేస్తూ ఉంటారు. ఇక్కడ గుర్తించవలసిన మూడు అంశాలు ఉన్నాయి.

ఒకటి, ఈ గ్రామీణ రంగ ఆస్తులకు, ఉత్పత్తులకు, వాటాకు ధరల నిర్ణయంలో దారుణమైన అన్యాయం జరుగుతున్నది గనుక వాటి విలువ తక్కువగా కనబడుతున్నది. గ్రామీణ, ప్రాథమిక రంగ, వ్యవసాయ రంగ ఉత్పత్తులకు న్యాయమైన ధరలు లెక్కిస్తే తప్పనిసరిగా జాతీయాదాయంలో వాటి వాటా పెరిగిపోతుంది.

రెండు, గ్రామీణ ఉత్పత్తుల విలువను కేవలం ధరలతో, ద్రవ్యమానంతో మాత్రమే కొలవడం సరైనది కాదు. గ్రామీణ ఉత్పత్తులు లేకపోతే సామాజిక మనుగడే సాధ్యం కాదు. సాపేక్షికంగా జీవనానికి అంతగా అవసరంలేని పారిశ్రామిక, సేవారంగ ఉత్పత్తులకు విలువ

కట్టే ప్రమాణాలతోనే, జీవనానికి అత్యవసరమైన గ్రామీణ ప్రాథమిక రంగ ఉత్పత్తులకు విలువ కట్టగూడదు. ఉదాహరణకు గ్రామీణ రంగంలో ఉత్పత్తి అయ్యే వరి, పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి అయ్యే కారు, సేవారంగంలోని ఉత్పత్తి అనడానికి కూడ వీలులేని సెల్ ఫోన్ టాక్ టైం మూడిటినీ జాతీయోత్పత్తిలో భాగంగా సమానంగా చూడడం ఉచితం కాదు. ఈ మూడిటికీ విలువ కట్టడానికి ఒకే పద్ధతి ఉపయోగిస్తే ఆహారం ఎంత అవసరమో, కారూ, టాక్ టైమూ అంతే అవసరమని అనుకోవలసి వస్తుంది. మనిషి ప్రాణం నిలిపి ఉంచుకోవడానికి అవసరమైనవి, మనిషి జీవన సౌకర్యానికి అవసరమైనవి, విలాసానికి దగ్గరగా, అవసరం కాకపోయినా అలవాటైనవి అనే విభజన పాటించకుండా అన్నిటికీ ఒకే ప్రమాణాలు ఉపయోగించడం వల్ల ప్రాథమిక రంగం, గ్రామీణ రంగం అత్యవసరమైన ఆహారపదార్థాలు, వస్తువులు ఉత్పత్తి చేస్తూ, ముడిసరుకులు అందిస్తూ కూడ తక్కువ స్థాయిలో మిగిలిపోతోంది.

మూడు, ప్రభుత్వం, పాలకవర్గ మేధావులు చెప్పే లెక్కలను అంగీకరించి జాతీయాదాయంలో గ్రామీణ వాటా 27 శాతం మాత్రమే ఉన్నదనుకున్నా, జాతీయ వ్యయంలో గ్రామీణ ప్రాంతాలకు తిరిగి అందుతున్నది ఆ 27 శాతం కాదు గదా, కేవలం 5 శాతం మాత్రమే. ఉత్పత్తి కారకాలన్నీ తమ తమ దోహదాన్ని బట్టి ఉత్పత్తి ఫలాన్ని పంచుకోవాలనే సహజ న్యాయ సూత్రాన్ని పాటించినా గ్రామీణ ప్రాంతాలకు అన్యాయమే జరుగుతోంది.

ఈ అసమతౌల్యాన్ని, అన్యాయాన్ని నిర్ధారించడానికి కూడ గ్రామీణ అధ్యయనాలు అవసరం. ఒక గ్రామంలో ఉత్పత్తి అవుతున్నవేమిటి, ఆ ఉత్పత్తికి న్యాయంగా రావలసిన ఫలితం ఏమిటి, గ్రామానికి తిరిగి అందుతున్న ఫలం ఎంత వంటి ప్రశ్నలకు జవాబులు గ్రామీణ అధ్యయనాల ద్వారా వెలికితీయవలసిందే. గ్రామం మొత్తంగా తాను బయటికి ఇస్తున్నదెంత, పొందుతున్నదెంత లెక్కలు తేల్చాలి. ఇస్తున్నదాంట్లో గ్రామంలోని ఏయే వర్గాలు ఎంత ఇస్తున్నాయో, పొందినదానిలో ఏయే వర్గాలు ఎంత పొందుతున్నాయో కూడ లెక్కకట్టాలి.

ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం జాతీయ ఉత్పత్తిని గ్రామ స్థాయికి విభజించి చూడడం మాత్రమే కాదు, అసలు దేశ వనరులు, ముఖ్యంగా సహజ వనరులన్నీ, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని గుర్తించాలి. భూమి, నీరు, అడవి, ఖనిజాలు దేశం మొత్తానికీ చెందినవే కావచ్చుగాని, మొట్టమొదట అవి ఆయా గ్రామాలలో ఉన్నవి. ఆ గ్రామాలకే చెందినవి. ఆ గ్రామీణుల దగ్గరి నుంచి, వారి అవసరాలు తీర్చకుండా వాటిని దొంగలించగూడదు. ఆ వనరులను ఎలా ఉపయోగించాలనే నిర్ణయాధికారం ఆ గ్రామస్తులకే, ఆ వనరులమీద శ్రమ చేస్తున్నవారికే ఉండాలి. ఈ వనరుల అధ్యయనం కోసం, గ్రామ సంపదను తేల్చిచెప్పడం కోసం, ఆ గ్రామ సంపదను ఆ గ్రామంలోనే వినియోగిస్తే, గ్రామం ఎలా పురోగమిస్తుందో తెలపడం కోసం, ఆ వనరులను విదేశాలకో, సుదూర పారిశ్రామిక అవసరాల కోసమో తరలించకుండా, ఎలా గ్రామీణ చిన్న పరిశ్రమలు స్థాపించి, స్థానిక ఉపాధి అవకాశాలు పెంచవచ్చునో తేల్చడం కోసం కూడ గ్రామీణ అధ్యయనాలు అవసరం.

నేలల స్వభావాన్ని, నీటి లభ్యతను, స్థానిక అవసరాలను, స్థానిక ప్రజా సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టించుకోకుండా దేశం మొత్తానికీ, రాష్ట్రం మొత్తానికీ, జిల్లా మొత్తానికీ ఒకటే వ్యవసాయ విధానాన్ని ప్రకటించడం ప్రస్తుతం జరుగుతోంది. విశాలమైన మార్కెట్ దృష్టితో బహుళ జాతి సంస్థలు ఆదేశించిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనే వ్యవసాయం తయారవుతోంది. బహుళజాతిసంస్థల, బడా వ్యాపారుల, భూస్వాముల అనుకూల విధానాలే దేశంలో ఎటువంటి నీటిపారుదల సౌకర్యాలు ఉండాలో, ఎటువంటి పంటలు వేయాలో, ఎటువంటి మార్కెట్ సౌకర్యాలు కల్పించాలో నిర్ణయిస్తున్నాయి. ఇందుకు బదులుగా గ్రామంలోని భూముల స్వభావం ఏమిటి, నీటి వసతి ఏమిటి, గ్రామ ప్రజల అవసరాలు ఏమిటి అనే వాస్తవిక అధ్యయనం మీద ఆధారపడే వ్యవసాయం అమలు చేయడానికి కూడ గ్రామీణ అధ్యయనాలు కావాలి.

గ్రామీణ ప్రజలకు తప్పనిసరిగా పారిశ్రామిక ఉత్పత్తులు కావాలి. ఆ పారిశ్రామిక సరుకులలో ఏవి తప్పనిసరి అవసరాలు, వేటిని వదులుకున్నా జీవనం కొనసాగుతుంది అనే సమీక్ష వేరే చర్చ. కాని ఇవాళ ఉన్న స్థితిలో టూత్ బ్రష్షులు, టూత్ పేస్టులు, టీ పొడి, కాఫీ పొడి, వంటి సబ్బులు, బట్టల సబ్బులు, చక్కెర, ఉప్పు, బట్టలు, స్టీలు, ప్లాస్టిక్ పాత్రలు, మంచాలు, ఫాన్లు, రేడియోలు, టెలివిజన్లు, పెన్నులు, పుస్తకాలు, సైకిళ్లు, మోటర్ సైకిళ్లు, కార్లు, ట్రాక్టర్లు, కొడవళ్లు, గొడ్డళ్లు వంటి వందలాది పారిశ్రామిక ఉత్పత్తులైన సరుకులు కావాలి. దేశంలో ఈ గ్రామీణ మార్కెట్ చాల పెద్దది. మార్కెట్ పరిశోధకులు దీన్ని 72 కోట్ల నుంచి 79 కోట్ల వినియోగదారుల మార్కెట్ అంటున్నారు. జనాభా రీత్యా చూస్తే అది అమెరికా మార్కెట్ తో రెట్టింపు, యూరప్ లోని పదహారు దేశాల మార్కెట్ తో నాలుగు రెట్లు. విలువ రీత్యా తేడా ఉండవచ్చు గాని అది కనీస అంచనాలలో పది లక్షల కోట్ల రూపాయల నుంచి గరిష్ఠ అంచనాలలో ఇరవై ఒక్క లక్షల ఇరవై ఐదు వేల కోట్ల రూపాయల మార్కెట్. ఇందులో ఇరవై శాతం లాభం వేసుకున్నా ఉత్పత్తిదారులకు, వ్యాపారులకు ఇంతకు మించిన బంగారు బాతు మరొకటి ఉండదు.

ఈ గ్రామీణ, స్థానిక మార్కెట్ ఇంత లాభసాటిది గనుకనే బహుళజాతిసంస్థలు భారత గ్రామీణ మార్కెట్ మీద కన్నువేసి ఉన్నాయి. ఈ మార్కెట్ ను బహుళజాతి సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేస్తూనే ఉన్నాయి. గడిచిన రెండు దశాబ్దాల ప్రపంచీకరణ క్రమంలో మన గ్రామీణ ప్రాంతాలలోకి బహుళజాతి సంస్థల సరుకుల చొరబాటు ఎంతగా పెరిగిపోయిందో, ప్రతి గ్రామం నుంచీ బహుళ జాతి సంస్థలు ఎంత సంపదను కొల్లగొట్టుకు పోతున్నాయో లెక్కలు తీయడానికి కూడ గ్రామీణ అధ్యయనాలు జరపాలి. స్వతంత్ర, స్వావలంబన విధానాలు అమలు చేస్తే, బహుళజాతి సంస్థల దోపిడీని అరికట్టి, ఆ స్థానంలో స్థానిక, స్వదేశీ, ప్రభుత్వ రంగ పారిశ్రామిక ఉత్పత్తులు అందించగలిగితే దేశీయ పారిశ్రామికీకరణ ఎంత సుస్థిరంగా ఉండగలదో చూపడానికి కూడ గ్రామీణ మార్కెట్ అధ్యయనాలు కావాలి.

ఇక రాజకీయ ప్రాధాన్యత దృష్ట్యా చూసినా గ్రామీణ ప్రాంతాలు అతి కీలకమైనవి. ఎన్నికల రాజకీయాలలోనైనా, ఎన్నికలకు బైటి రాజకీయాలలోనైనా ఇవాళ్టికీ గ్రామాలే ప్రధానంగా ఉన్నాయి. రాజకీయాలంటే ప్రజా జీవిత సమస్యలకు సృజనాత్మకమైన, ఆచరణ సాధ్యమైన, ఉమ్మడి పరిష్కారాలను కనిపెట్టే ప్రయత్నం అని నిర్వచించుకుంటే, అత్యధిక ప్రజానీకం ఉన్న గ్రామాలే రాజకీయాలకు ఆయువుపట్టు

అవుతాయి. గ్రామీణ ప్రాంత ప్రజల రాజకీయ వైఖరులు ఎలా నిర్ణయమవుతున్నాయో, వాటిని రూపొందిస్తున్న శక్తులు, ప్రయోజనాలు ఏమిటో తేల్చుకోకుండా రాజకీయాలలో జోక్యం చేసుకోవడం, రాజకీయా లు నడపడం, రాజకీయాలను మార్చడం సాధ్యం కాదు. ఆ శక్తులను, ప్రయోజనాలను గుర్తించడానికి గ్రామీణ అధ్యయనాలు తప్పనిసరి. గ్రామంలో తరతరాలుగా కొనసాగుతున్న రాజకీయ వ్యవస్థలు ఏమిటో, ఆ రాజకీయ వ్యవస్థలను తొలగించి వచ్చిన రాజకీయపార్టీలు, ఎన్నికలు, పంచాయత్ రాజ్, మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు వంటి నిర్మాణాలు గ్రామాలకు ఏం చేశాయో పరిశీలించాలి. పాలక సంస్థలు గ్రామీణ రాజకీయాలను తమకు అనువుగా మలచుకోవడంలో ఎటువంటి రాజనీతిని అవలంబించాయో తెలుసుకోవాలి. ప్రజలను నమ్మించగలిగిన ప్రజావ్యతిరేక ఎత్తుగడలే రాజకీయాలుగా ఎలా చలామణీ కాగలుగుతున్నాయో వివరంగా అర్థం కావాలంటే గ్రామీణ అధ్యయనాలు జరపాలి. ప్రజానుకూల, ప్రత్యామ్నాయ రాజకీయాలు ప్రజలలో ఎందుకు బలంగా వేళ్లూను కోవడం లేదో, వాటిని ఏ అవరోధాలు ఆపుతున్నాయో తెలియాలంటే గ్రామీణ అధ్యయనాలు కావాలి.

గ్రామాలలో సామాజిక నిర్మాణ ప్రాధాన్యతను చూస్తే గ్రామీణ అధ్యయనాల ఆవశ్యకత ఎంత ఎక్కువగా ఉందో అర్థమవుతుంది. మన సామాజిక వ్యవస్థకు పునాది అయిన కుల వ్యవస్థ, అంతరాల దొంతరలు గ్రామీణ ప్రాంతాల లోనే అతి ఎక్కువగా కనబడతాయి. పట్టణాలలో కూడ కుల ప్రభావం ఉన్నప్పటికీ దాని మీద ముసుగులు కప్పబడి ఉంటాయి. కాని కులం గ్రామీణ ప్రాంతాలలో నగ్నంగా, బహిరంగంగా ఉంటుంది. గ్రామంలో ప్రతి మనిషికీ గుర్తింపు కులం ద్వారానే ఉంటుంది. ఆ కులాల మధ్య అసమానతలలో, అస్పృశ్యత పాటింపులో కొంత మార్పు, కొన్ని తేడాలు కనబడవచ్చు గాని కులంతో ప్రమేయం లేని గ్రామం ఉండదు. ఆస్తి యాజమాన్యంలో, శ్రమ భాగస్వామ్యంలో కులం ప్రాధాన్యత కాస్త తగ్గినట్టు కనబడవచ్చుగాని గ్రామంలో పాటించే సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, చివరికి 'ప్రజాస్వామిక' ఎన్నికల రాజకీయాలు అన్నీ కూడ కులం ఆధారంగానే సాగుతున్నాయి. అయితే ఈ సాధారణ సూత్రీకరణలు యథాతథంగా ప్రతి గ్రామానికీ వర్తించవు. భారత సమాజం ఎంత సంక్లిష్టమైనదంటే ప్రతి సూత్రీకరణకూ మినహాయింపులు ఉంటాయి, భిన్నమైన దృష్టాంతాలు ఉంటాయి. ఆ మినహాయింపులనూ, భిన్నమైన సూచికలనూ అర్థం చేసుకోవాలంటే కూడ గ్రామీణ అధ్యయనాలు తప్పనిసరి. ఒక మనిషి వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ కులం పాత్ర, సామాజిక నిర్మాణాల పాత్ర ఎంతగా ఉంటున్నదో, అది ఆ మనిషి గుర్తింపుకు, శ్రమకు, ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, అవగాహనకు, చైతన్యానికి, సంఘీభావానికి, సంఘటిత ఆచరణకు ఎంత మేరకు దోహదం చేస్తున్నదో, ఎంతమేరకు అడ్డగిస్తున్నదో విడివిడిగా అధ్యయనం చేస్తేగాని మన సమాజంలోని మనుషులను చైతన్యానికి, ఆచరణకు పురిగొల్పుతున్నవేవో, అడ్డుకుంటున్నవేవో అర్థం కాదు.

ఇక గ్రామాలే ఇవాళ్టికీ మన సాంస్కృతిక జీవనానికి పాదుగా ఉన్నాయి. సామ్రాజ్యవాద సాంస్కృతిక రూపాల దాడి ఎంతగా సాగుతున్నా, అంటుకట్టిన, వక్రీకరణకు గురైన సినిమా రంగం సంస్కృతికి ఎన్ని తప్పుడు అర్థాలు ఇస్తున్నా, ఇవాళ్టికీ మన సమాజ సాంస్కృతిక రూపాలు గ్రామాలలోనే నిలిచి ఉన్నాయి. అయితే ఆ గ్రామీణ సంస్కృతిలో కూడ భూస్వామ్య, మత, కుల అంతరాల, పితృస్వామిక, ప్రజావ్యతిరేక అంశాలు ఉండవచ్చు. కాని మన నేల మీది శ్రమజీవుల వ్యవసాయ పనులతో పాటు పుట్టిన పాటల వంటి స్వల్పకాలిక సాంస్కృతిక కళారూపాలు, వ్యవసాయ పనులు లేని వేసవి సమయాల తీరికవేళలలో మన శ్రామికులు రూపొందించిన దీర్ఘకాలిక కళారూపాలు,ప్రతి కులానికీ ఆశ్రిత కులంగా ఉండి విలువైన సాంస్కృతిక రూపాల ఉత్పత్తినీ, ప్రదర్శననూ నిర్వహించిన సమూహాలు, మన ప్రజల సహజీవనంలో వికసించిన మానవసంబంధాల సంస్కృతి – ఇదంతా ఎన్ని మార్పులతోనైనా, ఎన్ని వక్రీకరణలతోనైనా ఇంకా నిలిచి ఉన్నది మన గ్రామాలలోనే. మన ప్రజల చరిత్ర, వారసత్వాన్నీ వివరించే ఈ సంస్కృతి అధ్యయనం కోసం కూడ గ్రామాల అధ్యయనం తప్పనిసరి.

నిజానికి ఇప్పటివరకూ జరిగిన గ్రామీణ అధ్యయనాలన్నీ ఈ అవసరాలలో ఏదో ఒక అవసరాన్నో, లేక కొన్ని అవసరాలనో తీర్చడానికి జరిగాయి. ఈ అధ్యయనాలన్నిటినీ క్రోడీకరిస్తే, సామాజిక అవగాహన కోసం అధ్యయనాలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తించడం కోసం అధ్యయనాలు, పాలనా అవసరాల కోసం అధ్యయనాలు, ఆర్థిక అవసరాల కోసం అధ్యయనాలు, సామాజిక మార్పుకోసం అధ్యయనాలు అని చెప్పవచ్చు. ఈ అధ్యయనాలను జరిపిన వారి ఆధారంగా క్రోడీకరించాలంటే మూడు రకాలుగా చెప్పాలి:

ఒకవైపు సామాజిక శాస్త్రవేత్తలు తమ విద్యాపరమైన పరిశోధనలో భాగంగా చేసిన అధ్యయనాలు. వీటిలో కొన్ని తమను తాము తటస్థమైనవిగా చెప్పుకుంటాయి గాని సామాజిక పరిశోధనలో తటస్థత సాధ్యం కాదు. నిర్ధారణలు ఏవయినా, వీలయినంతవరకు దృగ్గోచరాంశా లను తటస్థంగా నమోదు చేయాలనే లక్ష్యాన్ని చాల పరిశోధనలు పెట్టుకున్నాయి గాని అసలు గ్రామాన్ని దర్శించడమే పరిశీలకుడి దృక్పథం నుంచి జరుగుతుంది. ఏది ఏమైనా, ఆయా దృక్పథాలను, నిర్ధారణలను ఆమోదించినా, ఆమోదించలేకపోయినా, ఇటువంటి అధ్యయనాలు ఆయా ప్రత్యేక గ్రామాల గురించి అవసరమైన, ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తాయి. ఇవి ప్రధానంగా సామాజిక అవగాహన కోసం, సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తించడం కోసం జరిగే అధ్యయనాలు.

మరొకవైపు బ్రిటిష్ వలస పాలనా కాలం నాటి నుంచి ఇవాళ్టివరకూ పాలకులు తమ పాలితుల గురించి అర్థం చేసుకోవడానికి జరిపిన గ్రామీణ అధ్యయనాలు. ఇవి నేరుగా పాలనాధికారులుగా పనిచేసినవారయినా చేశారు, లేదా, సామాజిక శాస్త్రవేత్తల సహాయంతోనైనా సాగించారు. ఇవి గ్రామాల గురించిన సమాచారాన్ని వీలయినంత నిష్పాక్షిక దృష్టితో అందించడానికి ప్రయత్నిస్తాయి గాని, ఈ అధ్యయనాల దృష్టి అంతా పాలకులకు పాలన గురించిన సలహాలు, సూచనలు అందించడమే. బహుళజాతి సరుకుల వ్యాపార సంస్థలు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు తయారుచేసే, అమ్మే వ్యాపార సంస్థలు జరిపే గ్రామీణ అధ్యయనాలను కూడ ఇందులోనే భాగం చేయవచ్చు. ఇవి ప్రధానంగా పాలనా అవసరాల కోసం, ఆర్థిక అవసరాల కోసం జరిగే అధ్యయనాలు.

ఇంకొకవైపు వేర్వేరు రాజకీయ, తాత్విక దృక్పథం గల సంస్థలు, సామాజిక మార్పు లక్ష్యంగా గల సంస్థలు, తమ తమ రాజకీయ, తాత్విక ఆచరణలోకి గ్రామీణ ప్రజలను సంఘటితం చేయదలచిన

సంస్థలు జరిపిన గ్రామీణ అధ్యయనాలు. ఇందులో ఇరవయోశతాబ్ది తొలి అర్ధ భాగంలో గాంధేయ వాదులు, ఆ కాలంలోనూ, ఆ తర్వాతా కూడ కమ్యూనిస్టులు, నక్సలైట్లు, పర్యావరణ వాదులు వంటి అన్ని దృక్పథాలు గలవారు ఉన్నారు. ఇవి ప్రధానంగా సామాజిక మార్పు కోసం జరిగే అధ్యయనాలు.

ఈ వ్యాసం ప్రారంభంలో చెప్పినట్టు ఇవాళ సమాజం మారవలసిన అవసరం ఉన్నదని గుర్తించి ఆ సామాజిక మార్పు ఎలా సాధించాలో, ఆ మార్గం ఎక్కడ తొట్రు పడుతున్నదో నిర్ధారించడానికి గ్రామీణ అధ్యయనాలు కావాలి. ఇవాళ తప్పనిసరిగా, అనివార్యంగా జరగవలసిన సామాజిక మార్పుకు చోదకశక్తులేవో, ఆ మార్పు కృషిలో కలిసి వచ్చే శక్తులేవో గుర్తించడానికి, సామాజిక మార్పు అవసరాన్ని అట్టడుగు స్థాయి నుంచి రాజ్యాధికార స్థాయి దాకా వివరించి, విశ్లేషించడానికి గ్రామీణ అధ్యయనాలు కావాలి.

చైనా సమాజంలో విప్లవ కృషికి ముందూ, విప్లవ కృషి సాగుతుండగానూ, విప్లవానంతరమూ కూడ గ్రామీణ ప్రాంతాల అధ్యయనానికి చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రత్యేకించి మావో సే టుంగ్ చాల ప్రాధాన్యత ఇచ్చారు. తొలిరోజుల్లోనే 1926లో రాసిన 'చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ', 1927లో రాసిన 'హునాన్ రైతాంగ ఉద్యమ పరిశోధనా నివేదిక' ల నుంచి, 1941లో రాసిన 'గ్రామీణ సర్వే లకు ముందుమాట, వెనుకమాట'ల నుంచి, విప్లవానంతరం 1955లో 'సోషలిస్ట్ అప్ సర్జ్ ఇన్ చైనాస్ కంట్రీసైడ' ముందుమాట వరకూ, సాంస్కృతిక విప్లవకాలంలో గ్రామీణ కమ్యూన్ల పరిశీలన వరకూ మావో సే టుంగ్ గ్రామీణ అధ్యయనాల అవసరాన్ని ఎంతగానో నొక్కి చెప్పారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమ, విప్లవోద్యమ సంప్రదాయంలో కూడ గ్రామీణ అధ్యయనాలు ఎన్నో జరిగాయి. గ్రామీణ ప్రాంతాలలో వర్గ విశ్లేషణ సవ్యంగా జరిపితేనే, గ్రామీణ ప్రాంతాలలో మిత్రులనూ శత్రువులనూ స్పష్టంగా విభజించి చూడగలిగితేనే, భారత సమాజ స్వభావం సవ్యంగా అర్థం చేసుకుని, ఆ సమాజాన్ని మార్చడానికి తగిన వ్యూహాన్నీ ఎత్తుగడలనూ రచించుకుంటేనే తమ కార్యక్రమం విజయవంతమవుతుందనీ, ఆ పనికి గ్రామీణ అధ్యయనాలు అవసరమనీ విప్లవకారులు ఎన్నడూ మరచిపోలేదు.

ఒక్కమాటలో చెప్పాలంటే సామాజిక మార్పును ఆశించే, ఆ మార్పు కృషికి నాయకత్వం వహించే శక్తులకు సమాజ స్వభావాన్నీ, ఆ స్వభావంలో వస్తున్న మార్పులనూ అర్థం చేసుకోవడానికీ, సామాజిక మార్పుకు క్రియాశీలంగా సృజనాత్మకంగా నాయకత్వం వహించడానికీ గ్రామీణ అధ్యయనాలు అత్యవసరం.

*(రచయిత వీక్షణం సంపాదకులు)* వీ

## వీక్షణం రచయితలకు సూచనలు

తొమ్మిది సంవత్సరాలలో, నూట ఇరవై ఆరు సంచికలలో వీక్షణం రెండు వేల పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- ❖ రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (ఐదు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పెజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణం కు సరిగ్గా సరిపోతుంది.
- ❖ చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్ లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్ మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- ❖ రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- ❖ రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- ❖ వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- ❖ మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- ❖ దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- ❖ రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

*పులుల కోసం ఏర్పాటు చేయనున్న అభయారణ్యం వల్ల నలభై గ్రామాల ప్రజలు నిర్వాసితులు అవుతారనీ, ఇది ప్రజల కోసం కాదనీ అంటున్నారు* **ఆనంద్**

# కవ్వాల్ అభయారణ్యం ఎవరి కోసం?

ఆదివాసులకు అడవితో విడదీయరాని బంధం ఎన్నో రోజులది. వీరి చరిత్ర చాలా పురాతనమైనది. వీరిని మూలవాసులు అని కూడా అంటారు. కొండల్లో నివసించడం మూలంగా గిరిజనులు అని కూడా అంటారు. అనాదిగా వారికి అన్యాయం జరుగుతూనే ఉన్నది. అయినా అడవినే నమ్ముకున్నారు. వీరు చావు అయినా, బతుకు అయినా అక్కడే జీవించడం నేర్చుకున్నారు. వీరు అడవితో 'తల్లి పిల్లల అనుబంధం' ఉంది. వీరు సంచార జీవితాల నుండి బయటపడి, వ్యవసాయం వైపు మళ్లి పోడు వ్యవసాయం ప్రారంభించి, ప్రస్తుతం స్థిర వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. బ్రిటిష్ వారు ఈ దేశాన్ని పాలించిన రోజుల్లో దేశ సంపదతో పాటు అడవి సంపదను దోచుకోవడమే లక్ష్యంగా వన చట్టం (ఫారెస్ట్ ఆక్ట్) తెచ్చారు. ఈ చట్టం తర్వాత ఆదివాసులను అడవి నుండి గెంటి వేయాలని నానా కుట్రలు చేస్తున్నారు. అయినా వారు అడవిని వదలలేదు. ఈ అడవి మీద హక్కు కోసం, భూమి కోసం జరిగిన ఆదివాసుల పోరాటాల ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. బిర్సా ముండా తిరుగుబాటు, సంతాల్ తిరుగుబాటు, మన్యంలో పితూరి తిరుగుబాట్లు, బస్తర్‌లో భూంకాల్ తిరుగుబాట్లు, మాండ్లాలో రాణి దుర్గావతి తిరుగుబాట్లు, ఆదిలాబాద్ జిల్లాలో రాంజీ గోండు పోరాటం, 1945లో కొమురం భీం పోరాటం, జోడన్ ఘాట్ కేంద్రంగా చారిత్రక తిరుగుబాట్లు జరిగాయి. అయితే చెలరేగిన ప్రతి తిరుగుబాటును పాలకవర్గాలు అణచివేశాయి. మళ్లీ మళ్లీ అవి చెలరేగుతూనే ఉన్నాయి.

ఆంగ్లేయుల నుండి ఈ దేశం విముక్తి అయి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా భూమి కోసం పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. అయితే వీరి పెనుగులాటా దేనికోసం? 'బుక్కెడు బువ్వ కోసం'. బువ్వ కావాలి, భూమి కావాలి. అంటే అడవిపైనే ఆధారపడాలి. అందుకని అధిక శాతం ఆదివాసులు అడవి ప్రాంతాలకే పరిమితం అయినారు.

ప్రభుత్వం కల్పించిన కొన్ని సంస్కరణల ఫలితంగా కొంతమంది బయటి ప్రపంచం గురించి తెలుసుకున్నారు. అయినా అధికంగా అడవిలోనే జీవనం గడుపుతున్నారు. ఒక్కప్పుడు అడవి నరకాలి అంటె గజ్జుమనేవారు. కాని పోరాటాల ఫలితం అడవి నరికి భూములు సాగు చేసుకోగలిగారు. (అక్కడక్కడ అడవి నరకే వారిపై కేసులు పెడుతూనే ఉన్నారు.) వీరి దురదృష్టం ఏమిటంటే సాధారణ జీవితం నుండి స్థిర జీవితాలు ఏర్పాటు చేసుకొనే క్రమంలో షావుకార్ల, ఫారెస్ట్, ప్రభుత్వాధికారుల దోపిడీ కింద నలిగి, బతుకుపోరాటం నేర్చుకొని, సభ్య సమాజంలో పోటీ పడాలని పాట్లు పడుతున్న తరుణంలో ఇలాంటి అడ్డంకులు రావడం పరిపాటి అయింది. అడవి లోంచి గెంటి వేయడం కోసం గతంలో కన్న ఒక అడుగు ముందుకు వేసి ఇప్పుడు దేశ అభివృద్ధి స్థానిక ప్రజలకు (ఆదివాసులకు) కాక గుత్తేదార్లు, బడా పెట్టుబడిదార్లకు, పాలకులకు మాత్రమే ఉపయోగపడుతోంది. ఖనిజ సంపద, గనుల తవ్వకాల పేరుతో బహుళజాతీయ కంపెనీలు (ఎం.ఎన్.సి.), ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్.ఇ.జెడ్.), భారీ నీటి ప్రాజెక్టుల పేరుతో అభయారణ్యాలు, బఫర్‌జోన్స్, టైగర్ ప్రాజెక్టుల పేరుతో దేశవ్యాప్తంగా ఒక్కొక్కసారి వందలాది గ్రామాల ప్రజలను కూడా గెంటి వేయడానికి ప్రణాళికలను రూపొందించారు. అంటే ఆ ప్రాంతాలను నిర్మానుష్యం (నో మ్యాన్ ల్యాండ్) చేసి ఇష్టారాజ్యంగా దోపిడీ చేయడమే దీని లక్ష్యం.

అక్కడి నుండి ప్రజలను నిర్వాసితులయ్యే వరకు 'అర చేతిలో స్వర్గం' చూపించి లేదా సామ, దాన, భేధ, దండోపాయాలు ఉపయోగించి తరలిస్తున్నారు. ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం వీరికి కల్పిస్తాం అన్న ప్రత్యామ్నాయ వైకల్పిక అన్న సౌకర్యాలు ఎక్కడా కల్పించలేదు సరికదా, మౌలిక సదుపాయాలూ సమకూర్చలేదు. ఉన్నత వర్గం వారి వినోదం కోసం పేదవారి బతుకులనే చీకటి మయం చేస్తోంది ప్రభుత్వం.

ఆదిలాబాద్ జిల్లా అడవుల జిల్లాయే. కాని, ఆదివాసులతో నిండిన జిల్లా అనేది వాస్తవం. ఇక్కడి అడవిలో జంతువులు పక్షులతో పాటు మనుషులు కలిసి జీవిస్తున్నాయి. అయితే మనుషులు మాత్రం నిరంతరం బతుకు పోరాటం చేస్తున్నారు. జల్, జంగల్, జమీన్ (నీరు, వనం, భూమి) తో పాటు విముక్తి కోసం పోరాటం అనివార్యమంటున్నారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీం పోరాట చరిత్రను ఆదివాసులకు తెలియకూడదనే ఉద్దేశ్యంతో ఎక్కడ కూడా లిఖితంగా ఉంచలేదు. అయితే చరిత్ర తెలిసిన కొంతమంది పాతతరం వారితో తెలుసుకొని కవులు అతి కష్టం మీద ముందుకు తెచ్చారు. అయినా ఇలాంటి పోరాటాలతో ప్రభుత్వం గుణపాఠాలు తీసుకొని వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయింది. అయితే ఈ పోరాట ఫలితం కొన్ని ప్రత్యేక చట్టాలు 1/70 ఆక్ట్, 5వ షెడ్యూల్ తదితరాలు వచ్చాయి. వీటిలో గల లొసుగులను ఆధారం చేసుకొని అడవులను కొల్లగొడుతూనే ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థికంగా, రాజకీయంగా జరగాల్సినంత అభివృద్ధి జరగడంలేదు. కాని కొంతమంది నాయకులకు ఓట్లు సంపాదించుకొనే మార్గం సుగమం అయింది. 1980 ఏప్రిల్‌లో

జరిగిన ఇంద్రవెల్లి భూ పోరాటంలో కొంతమంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయినాక ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తెచ్చింది. అయితే వీరి జీవితాలలో పూర్తి మార్పు లేదు. నేటికీ ఆదివాసులు ఏజెన్సీలో వెనుకబడిన ప్రాంతాల్లో, విష జ్వరాలు, డెంగ్యూ, కలరా, ఆకలి వంటి కారణాలతో మృత్యువాత పడుతూనే ఉన్నారు. జిల్లాలోని ఈ ప్రాంతంలో సేద్యపు నీటి సౌకర్యాలు లేక, వర్షాధార పంటల పైనే ఆధారం అధికం కావున, అతివృష్టి, అనావృష్టిలతో కరువు కరాళనృత్యం చేసినప్పుడల్లా గ్రామాలకు గ్రామాలే పట్టణాల వైపు పరుగులు తీస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకాలు కూడా సరిగ్గా అమలు కావడం లేదు. జలయజ్ఞం పేరుతో పెద్ద – పెద్ద ప్రాజెక్టులు కట్టినా అవి ఎవరికీ ఉపయోగపడడంలేదు.

సాధారణంగా ఖనిజ, వన, సంపదలు పెద్ద మొత్తంలో ఆదివాసులు నివసిస్తున్న ప్రాంతంలోనే ఉన్నాయి. అలాంటి ప్రాంతాలను గుర్తించి వారిని ఖాళీ చేయించే క్రమంలో కొంతమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎరవేసి లేదా తరిమి వేయడం పరిపాటి అయింది. దీంతో అభివృద్ధి నోచుకోక బతుకు జీవుడా అంటూ 'అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని' మరెక్కడికో వెళ్లి అక్కడ కూడా ఇదే విధంగా జీవితం గడుపుతున్నారు.

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పని అడవి సంపదను (కలప, అక్కడ జీవించే జంతువులను) రక్షించడం. కాని ఆదిలాబాద్‌లోని ఏ ఫారెస్ట్ డివిజన్‌లో చూసినా కలప దొంగతనం విపరీతంగా కొనసాగుతోంది. అక్కడక్కడ సి.సి. కెమరాలు ఏర్పాటు చేసినా, వన సురక్ష సమితులు ఉన్నప్పటికీ కూడా కొంతమంది 'అధికారులు స్వార్థశక్తులతో కుమ్మక్కై కలప స్మగ్లింగ్' చేస్తున్నారు. అది మూడు పువ్వులూ, ఆరు కాయలుగా పల్లవిస్తున్నది. అడవి రక్షణ కోసం అడవిలో తిరగడం కాకుండా కొంతమంది ఇచ్చే సమాచారంతో అక్కడక్కడ పట్టుకొని కేసులు పెట్టడం చేస్తున్నారు. లేదా అక్కడ కూడా డబ్బులు గుంజడం ఖాయం. అడవిలోని జంతువులు తరిగి పోతున్నాయని సంరక్షణ కోసం పార్కులు అవసరమని అంటున్నారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం ఫారెస్ట్ డివిజన్‌లోని కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేశారు. దేశంలో 41వ టైగర్ పార్క్‌గా ఏర్పడబోతోంది. అధికారుల కథనం ప్రకారం ఇది గోదావరి పరీవాహక ప్రాంతం. దీని భూగర్భ జలాలు పెంపొందుతాయి. ఎకో టూరిజంతో దేశంలో టైగర్ రిజర్వులకు ప్రాముఖ్యత ఏర్పడుతుంది అని అంటున్నారు. 2007లో దీని ప్రణాళికలు తయారుచేసి కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి పంపగా దానిని ఆమోదించడంతో, గత జూన్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ నాదెండ్ల భాస్కరరావు అధ్యక్షతన శాసనసభ కమిటీని ఏర్పర్చగా వీరి బృందం కవ్వాల్ అడవి ప్రాంతంలోని కొన్ని గ్రామాలను సందర్శించ వెళ్లింది. అప్పుడు పత్రికలు కూడా ఈ విషయాన్ని నక్సలైట్ ప్రాంతంలో పర్యటించినట్లు కూడా రాశాయి. అప్పటి నుండి ఈ పని వాస్తవంగా మొదలైంది. అక్టోబర్ రెండవ వారంలో దీనికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు ముమ్మరం చేశారు. గోండిలో కవ్వాల్ అంటే నవ్వడం. అందుకే నవ్వేటి వీరి బతుకుల్లో నిప్పులు కురిపించడానికే ఈ టైగర్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. కవ్వాల్ అభయారణ్యం పదకొండు వందల చదరపు కిలోమీటర్లు ఉంటుంది. అయితే టైగర్ పార్క్ కోసం 49 వేల హెక్టార్ల భూమి తీస్తున్నారు. తాళ్లపేట, జన్నారం, ఇందనపెల్లి, బీర్సాయిపేట, పెంబి, కడెం మండలంలోని నలభై గ్రామాలకు ముప్పు ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దీనికోసం నలభై ఐదు కోట్ల రూపాయలు విడుదల చేసింది. 2013 వరకు పూర్తి చేసుకొని 2014 కల్లా పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి.

**కోర్ ఏరియా :** వాస్తవంగా టైగర్ జోన్ సరిహద్దు ఏరియా కోసం 89,223 హెక్టార్లు ఉంటుంది. పులులు ఇదే ఏరియాలో తిరుగుతాయి. ప్రస్తుతం జన్నారం మండలంలోని డొంగపల్లి, మైసంపేట్, అల్లినగర్, మల్యాల గ్రామాలను వెంటనే ఎత్తివేస్తే పులులు స్వేచ్ఛగా తిరుగుతాయి. తర్వాత అవి ఎలా అలవాటు పడితే అలా ఆ ఏరియాను విస్తరిస్తారు. ఈ ఏరియా ఐదు మండలాలలోని నలభై గ్రామాలలో ఉంది. జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి, కలమాడుగు, కవ్వాల్, కొత్తపల్లి, నార్లపూర్, చింతగూడ, జమ్ములదార, కిష్టాపూర్. అలాగే సిర్పూర్ 'యు' మండలంలోని మామిడిపల్లి; ఖానాపూర్ మండలంలోని దొందరి, ఇస్లాంపూర్, ఇటిక్యాల్, రాగి దుబ్బనాల, తాటిగూడ, యాపల్‌గూడ; కడెం మండలంలోని గండిగోపాల్‌పూర్, మైసపేట, రోపూర్, దోస్తనగర్, ఇస్లాంపూర్, కల్లెద, అల్లంపల్లి, ధర్మాజీపేట, గంగపూర్, లక్ష్మీపూర్, పాండ్యపూర్, మున్యాల్; ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి, బీర్సాయిపేట తదతర గ్రామాలు ఈ కోర్ ఏరియాలోకి వస్తాయి. పైన చెప్పబడిన గ్రామాలను కూడా ఖాళీ చేయించడం ఖాయం.

అయితే ఇవి టైగర్ జోన్ పరిధిలోని గ్రామాలు. అలాగే ఈ పరిధిని ఆనుకొని పది కిలోమీటర్ల విస్తీర్ణంతో బఫర్‌జోన్ ఏరియాను ఏర్పాటు చేస్తున్నారు. ఇది టైగర్ పార్క్‌కు బాహ్య ఏరియాగా పనిచేస్తుంది. దీనికోసం 1,11,968 హెక్టార్లు అడవిలోకి వస్తుంది. ఈ ఏరియాలో 12 మండలాల్లోని దాదాపు 50కి పైగా గ్రామాలు చేరుతాయి.

**బఫర్ ఏరియా**

1) ఖానాపూర్ మండలంలోని సత్తెన్‌పల్లి, మాదపల్లి, ముత్యంపేట, నాగ్‌పూర్, సోనూర్‌పేట, పెంబి, పోచంపల్లి, పస్పుల, రాయదరి; 2) కడెం మండలంలోని ఆకండపేట, దస్తూరాబాద్, పెద్దూర్; 3) దండెపల్లి మండలంలోని దమ్మన్నపేట, లింగపూర్, మాకులపేట, పాత మామిడిపల్లి, దండెపల్లి, తానిమెడుదు, చింతపల్లి, తాళ్లపెట్టి; 4) ఆసిఫాబాద్ మండలంలోని బాలనగర్, చింతగూడ, ధనోరా, వైగాం, కోడనమోబాద్; 5) తిర్యాణి మండలంలోని మోగా, భీంపెల్లి, చింతలమద్రి, గిన్నెధరి; 6) నేరడికొండ మండలంలోని గెల్దారి, కుంటాల, పోచరా; 7) ఇచ్చోడ మండలంలోని గెర్జిం, మదపూర్, సిరిచెల్మ, శ్రీకొండ, తలమెుద్రి, వాయిపేట; 8) ఇంద్రవెల్లి మండలంలోని వాయిపేట, పోచంపల్లి; 9) ఉట్నూరు మండలంలోని శ్యాంపూర్, గన్‌పూర్, హన్నపూర్; 10) సిర్పూర్ 'యు' మండలంలోని నెత్నూర్, చిన్న కోపనూర్, రాఘవ్‌పూర్; 11) జైనూర్ మండలంలోని రాసిమెట్ట గ్రామం, అల్లో; 12) కేరమెరి మండలంలోని గుండాల, కెరమెరి. ఈ గ్రామాలన్నీ బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి.

అయితే ఈ బఫర్‌జోన్‌లోని గ్రామ ప్రజలకు అడవిని

ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అంటే వంట చెరుకు, ఇప్ప పువ్వు, ఇప్ప పరకా లాంటివి తీసుకోవచ్చు.

పునరావాసం కింద నిర్వాసిత కుటుంబాలకు పది లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇస్తారని ప్రభుత్వం చెబుతున్నా, దాని ప్రకారం వీరికి కొత్తగా భూములు ఇచ్చి ప్రస్తుతం ఉన్నంత భూమి లాంటిది ఇవ్వరు. అదే ఇందిరమ్మ ఇల్లు ఇస్తారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని (తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, కరెంటు లాంటివి) చెబుతున్నారు. ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేని గ్రామాలు స్వాతంత్ర్య భారతంలో ఎన్నో ఉన్నాయి. వాటి సరసన ఇవి చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. వీటికి కల్పించే ఉద్యోగాల మాటలు దేవుడెరుగు. ఈ రోజుల్లో పది లక్షలు ఎటూ సరిపోవు.

ఇప్పటికీ కొన్ని గ్రామాలలో సర్వే చేపట్టినవారు గ్రామంలో గల ఇళ్లు వారికి గల భూముల వివరాలు స్వీకరించడం జరిగింది. అందులో అల్లినగర్, దొంగపల్లి, మైసంపేట్, మల్యాలల్లో సర్వే చేసినట్లు అధికారులు ఒప్పుకున్నారు. కొంతమందిని అధికారులు లొంగదీసుకొని ఇక్కడ సౌకర్యాలు లేనందున వేరే చోటికి పంపాలని చెప్పి పంపించారు. (భయంతో అయినా కావచ్చు, లేదా వారిని ప్రలోభ పెట్టి అయినా అయి ఉంటుంది.) సమస్త గ్రామ ప్రజలకు ఇక్కడి ఆస్తి - పాస్తులు వదిలి పోవడం ఇష్టం లేదు. ఎలాగైనా వీరి తంటా వదిలించుకోవాలని ప్రజల్లో భయాందోళన రేపుతూ అడవిలో ప్రాణాలు తీసే పులులు వదిలినాం, బుసలు కొట్టే విషసర్పములను వేల సంఖ్యలో వదిలినాం, ప్రాణ నష్టం వాటిల్లితే మా బాధ్యత కాదంటూ అటవి శాఖవారు దుష్ప్రచారం చేస్తున్నారు.

వాస్తవానికి వీరి పునరావాసం కోసం వందల కోట్లకు పైనే ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం రు. 66 కోట్లు ప్రకటించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇది ఎలా సాధ్యం? ఇలా పార్కులు ఏర్పాటు చేసిన చోటా కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే వదిలి వేసిన దాఖలాలు లేకపోలేదు. ఇదే ఆదిలాబాద్ జిల్లాలో దోర్లి సమీపంలో ఓపెన్‌కాస్ట్ కోసం కొన్ని గ్రామాలను తరలించారు. అందులో దంతన్‌పల్లి, గోండర్ గోంది, బోరిగాం, గోవారి గూడెం, ఆరె గూడలను ఖాళీ చేయించారు. ప్రకటించిన ప్యాకేజి సక్రమంగా అమలు చేయనేలేదు మరి. ఉదాహరణకు చూస్తే నలభై సంవత్సరాల క్రితం బీర్సాయిపేట్ గ్రామ పంచాయితిలో గల ధర్మజిపేట్ గ్రామం ఏర్పడింది. ఫారెస్ట్ వారు 2003లో ఆ గ్రామాన్ని ఎత్తివేయాలని భయపెట్టారు. వెళ్లకపోవడంతో గ్రామానికి నిప్పుపెట్టారు. ఆ గ్రామం ప్రజలు చేసేది లేక ఐ.టి.డి.ఎ. అధికారులను ఆశ్రయించగా వారిని కెరమెరి, నార్నూర్ మండలాలకు తరలించాలని చూశారు. వీరు ఒప్పుకోకపోవడంతో అలాగే ఉంచారు.

ఒక అధికారి మాటల్లో చెప్పాలంటే ఈ టైగర్ జోన్‌కు మూడు పులులను తీసుకురావడానికి రెండున్నర కోట్లు ఖర్చు అవుతోందట! వీరికి మనిషి విలువ అసలు లేదు. మైసంపేట్ ప్రాంతంలో పులివాతకు గురై చనిపోయిన బాలికకు రెండున్నర లక్షలు నష్టపరిహారం ఇస్తాం అని ప్రకటించారు.

అడవిలో పులులకు కూడా భయపడని వీరు ఖాకీ బట్టల్లో వచ్చే ఫారెస్ట్ వారికి భయపడ్డారు. ప్రస్తుతం అలా లేకున్నా ప్రభుత్వ అధికారులకు భయపడడం లేదు. ఇక్కడొక గమ్మత్తు ఏమిటి అంటే, ఆదివాసులకు ఒక నమ్మకం ఉంది. వీరి ఆరాధ్య దేవతల్లో ఒక్కటి అయిన జంగుబాయి (దేవత) వాహనం పులి. కావునా అవి వారికి నష్టం చేయదని నమ్మకం. ప్రతి సంవత్సరం 'అకిడి' అనే పూజరోజు పులి బొమ్మను పెట్టి పూజిస్తారు. అడవిలో పశువుల కాపరులకు పులి కనిపిస్తే ఆకలి అయితే ఒక్కటి తినిపో కాని మాకు నష్టం చేయకు అని ప్రాధేయపడడం చేస్తారు. అలా అడవికే రారాజులైన వీరు, అడవి పులులకు భయపడని గిరిపుత్రులు ఇప్పుడు పులుల కోసం ఏర్పాటు చేస్తున్న 'టైగర్ జోన్' పేరు వింటేనే భయపడుతున్నారు.

ప్రస్తుతం నలభై గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలతో, విజ్ఞాపన పత్రాలతో ఆందోళన చేస్తున్నారు. 'మేం ఎక్కడికి వెళ్లం. మాకు ఈ పార్క్ వద్దు. చావు అయిన, రేవు అయిన ఇక్కడే తేల్చుకుంటాం' అంటున్నారు. 'అవసరమైతే మరో ఇంద్రవెల్లి సృష్టిస్తాం' అంటున్నారు.

కవ్వాల్‌లో ఏర్పాటు చేసే టైగర్‌జోన్‌ను ఎన్నో గిరిజన, ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం దీనిని వెనక్కి తీసుకోకపోతే ఇది ఏ వైపు దారితీస్తుందో? అయితే కొందరు చెబుతున్నట్లు అడవి అభివృద్ధి, అడవి పెంపకాలు అవసరం కాని, మనుషులకన్న అడవి జంతువులకే ప్రాధాన్యత ఇవ్వడం అభివృద్ధి నిరోధకమే అవుతుంది.

*(రచయిత సామాజిక ఉద్యమకార్యకర్త)*

***పత్రికలు వ్యక్తి ప్రతీకలను తయారు చేయడంలో ఎంత శక్తిమంతమైనవంటే, అవి ఒక నేరస్తుడిని బాధితుడిలా చూపించగలవు. ఈ పత్రికలు బాధ్యతారహితమైన పత్రికలు. మీరు జాగ్రత్తగా లేనట్టయితే, అణచివేతకు గురవుతున్న వాళ్లను ద్వేషించేలా, అణచివేతను అమలు చేస్తున్న వాళ్లను ప్రేమించేలా వార్తా పత్రికలు మిమ్మల్ని మార్చేస్తాయి.***

***నాకు సత్యం కావాలి. ఎవరు చెప్పినా సరే. నాకు న్యాయం కావాలి. దాన్ని ఎవరు కోరుకున్నా, ఎవరు వ్యతిరేకించినా సరే. నేను మొట్టమొదట, అన్నిటికన్న మిన్నగా మనిషిని. అందువల్ల మానవజాతికి మొత్తంగా మేలు చేసేదేదయినా, చేసేవారెవరయినా నేను వారి పక్షమే***

*- మాల్కొమ్ ఎక్స్ (1925-1965), అమెరికా నల్లజాతి ఉద్యమకారుడు*

*అణు విద్యుత్ దుష్పరిణామాలపై మనకు అదుపు లేదనీ, పర్యావరణానికీ, మానవ మనుగడకూ ప్రమాదకారిగా పరిణమించనున్న అణు విద్యుత్‌కు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలనీ అంటున్నారు* **పి. కృష్ణారావు**

# కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం - నడుస్తున్న చరిత్ర

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడ ప్రాంతంలో అణు విద్యుత్ పార్క్ ప్రాజెక్ట్‌ను నిర్మించాలనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1991 నుంచి ప్రయత్నిస్తున్నాయి. 1991లో సర్వేలు, ఉపగ్రహ సర్వేలు జరిపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకోగానీ అప్పుడు అణు విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని తాత్కాలికంగా విరమించుకొన్నాయి. 1991లో కూడా ఈ విషయం తెలిసి ప్రజలు, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. మళ్లీ రెండు దశాబ్దాల తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణు విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం ముమ్మర ప్రయత్నాలు, సర్వేలు చేస్తున్నాయి. 1991 తరహాలోనే మళ్లీ నిరసనలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం 27 డిసెంబర్ 2011న జి.ఒ.270ను విడుదల చేస్తూ, మొదటి విడతగా 775 ఎకరాల భూసేకరణకి తెర తీసింది. నిజానికి 1991 నాటి ప్రాజెక్ట్ అంచనాల ప్రకారంగా వెయ్యి హెక్టార్ల భూమిని రైతులు, మత్స్యకారుల నుంచి సేకరించాలనీ, 1300 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మించాలనీ ప్రభుత్వం ఉద్దేశం. ఇందుకుగాను ఒక లక్ష కోట్ల రూపాయల వ్యయ అంచనాలు వేశారు. కానీ ప్రస్తుత జి.ఒ.270 విడుదల తరువాత అటు ప్రభుత్వం నుంచి వస్తున్న సమాచారం మేరకు, వివిధ దినపత్రికల్లో వస్తున్న వార్తలను బట్టి చూస్తే ప్లాంట్ సామర్థ్యం ఆరు వేల మెగావాట్లు గాను, ఒక లక్షా 70 వేల కోట్ల రూపాయల వ్యయంతో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలను బట్టి ఈ కేంద్రంలో ఆణురియాక్టర్ల పని సామర్థ్యంతో మొత్తం మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో రెండు రియాక్టర్లు ఉంటాయి. 2 x ESBWR టైపులో 2014 నాటికి నిర్మాణం పూర్తి కావాలన్నది వీరి ఉద్దేశం.

ఈ కేంద్రం పరిధిలోనికి కొవ్వాడ ప్రాంతంలోని మొత్తం ఏడు గ్రామాలు వస్తున్నాయి. అవి 1) జీరు కొవ్వాడ, 2) చిన్న కొవ్వాడ, 3) పెద్ద కొవ్వాడ, 4) కోటపాలెం, 5) రామచంద్రాపురం, 6) గూడెం, 7) టెక్కలి గ్రామాలు. ఇందులో ఐదు గ్రామాలు పూర్తిగా కనుమరుగు అయిపోతాయి. ఇవి 1) చిన్న కొవ్వాడ, 2) పెద్ద కొవ్వాడ, 3) గూడెం, 4) రామచంద్రాపురం, 5) టెక్కలి గ్రామాలు. వీటిని ఎక్స్‌క్లూజివ్ జోన్‌లుగా ప్రకటించారు. ఈ ఐదు గ్రామాలలో 560 ఎకరాల భూమి, 3504 మంది జనాభా ఉన్నది. జి.ఒ. 270ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడానికి ఆరు నెలలు ముందు నుంచే చాప కింద నీరులా ప్రభుత్వ యంత్రాంగం సర్వేలు, నిర్మాణ ఏర్పాట్లకి కావలసిన పనులను చేస్తూనే ఉన్నది. అప్పటి నుంచి ఈ ప్రాంత ప్రజలు, ప్రజా సంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజలు అణు విద్యుత్ కేంద్ర వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసుకొని గ్రామ గ్రామాన పాదయాత్రలు, నిరసన సభలు ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్యపరచడం జరుగుతోంది. ఈ అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు వలన పర్యావరణానికి, ముఖ్యంగా మత్స్య సంపదకి జరగబోయే నష్టాలను వివరించారు. ఒకవేళ అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు జరిగితే పైన పేర్కొన్న ఏడు గ్రామాలతో పాటుగా రణస్థలం మండలంలోని, ఈ మండలానికి ఆనుకొని ఉన్న ఎచ్చెర్ల, లావేరు మండలాలకు చెందిన మొత్తం ముప్పై గ్రామాల ప్రజలు నిర్వాసితులు అవుతారు. పదహారు కిలోమీటర్ల పరిధిలో న్యూక్లియర్ పవర్‌జోన్ లోనికి వస్తారు. అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం తరువాత కొవ్వాడ కేంద్రంగా భూకంపాలు, సునామీ లాంటివి వచ్చే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ శాస్త్ర సాంకేతిక నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అణు విద్యుత్ కేంద్రంలో జపాన్‌లోని ఫుకుషిమా లాంటి రియాక్టర్ల ప్రమాదం జరిగితే ప్రాణనష్టం, పర్యావరణ నష్టం చెప్ప లేనంతగా ఉంటుందని చెబుతున్నారు. అదే జరిగితే కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం పట్టణం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా పాలకపక్ష అధికార్లు, ఎం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు, మంత్రులు ఏదో ఒకటి చేసి అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభావిత ప్రాంతాలకు సమాచార హక్కు చట్టం - 2005, సెక్షన్ - 4 ప్రకారం సరైన సమాచారం అందివ్వడం లేదు. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు లేకుండా భూసేకరణ జరుపకూడదని చట్టాలు చెబుతున్నా జి.ఒ. 270ని జారీ చేశారు. పేదల భూములు సేకరించేటప్పుడు ప్రజాభిప్రాయం, వారి ఆమోదం తప్పనిసరి అని సుప్రీంకోర్టు అనేక పర్యాయాలు వివిధ కేసులలో వ్యాఖ్యానాలు చేసింది. ఇన్ని చట్టాలు, తీర్పులు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా, కేవలం అమెరికన్ బహుళజాతి సంస్థలకు మేలు చేకూర్చే విధానాలను అవలంబించడం వల్లనే ఎలాగైనా కొవ్వాడ ప్రాంతంలో అణు విద్యుత్ కేంద్రం నిర్మించాలనే పట్టుదలతో ఉన్నది. బలవంతపు భూసేకరణకి పూనుకుంటున్నది. ఇందులో భాగంగానే స్థానిక ఎచ్చెర్ల ఎం.ఎల్.ఎ.,

*మద్యం వ్యాపారంలో ప్రజా ప్రతినిధులకూ, మంత్రులకూ భాగస్వామ్యం ఉందనీ, మరిన్ని మైలవరాలు పునరావృతం కాకుండా ఉద్యమించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందనీ అంటున్నారు* **చిమ్మె జాన్ బర్నబాస్**

# కల్తీ సారా మరణాలకు బాధ్యులెవరు?

కృష్ణా జిల్లా మైలవరం నియోజకవర్గ పరిధిలోని కొల్లిమెర తాండాలో కల్తీ సారా సేవించి, మృతిచెందిన దాదాపు ఇరవై మంది పేద, గిరిజన, దళిత, బహుజన ప్రాణాలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించవా? లేదా ఆ అక్రమ 'మద్యం పారుదల' వ్యాపారానికి తామే బాధ్యులమన్నట్లు వారు వ్యవహరిస్తున్న తీరు ప్రజలందరికీ అర్థమవుతున్నది. ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ ఒకటీ, రెండూ జరుగుతున్నా, సామూహికంగా ఇంత పెద్దఎత్తున చనిపోవడం, రాష్ట్ర చరిత్రలో మరువలేనిది. ఇంటి యజమానో, యజమానురాలో లేదా చేతికొచ్చిన కొడుకో, ఆ ఇంటిలో చనిపోతే, ఆ కుటుంబ భారాన్ని మోసే దిక్కు, దివాణం లేకుండా, ఆ ఇరవై కుటుంబాలు వీథిన పడ్డాయి.

ఇటీవల ఒక మాజీ మంత్రి కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయినపుడు అది వారి తప్పిదం కాదన్నట్లు కేవలం భగవంతుడు వారిని తీసుకొని పోయాడని, ఈ రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలందరూ, దాదాపు అన్ని పార్టీల వారూ వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అసలు ఇరవై లక్షల రూపాయల కారు (అధునాతనమైన విదేశీ కారు) ఒక ఇంజనీరింగ్ విద్యార్థికి ఎందుకిచ్చారు అని ఎవరూ ఆ కుటుంబాన్ని ప్రశ్నించలేదు? ఎందుకంటే, చనిపోయిన వారి హోదా, కుటుంబ నేపథ్యం, సామాజిక వర్గం (రెడ్డి) అడ్డం వస్తాయి వారికి. కానీ ఈ 'మైలవరం' సంఘటనలో చనిపోయినవారు నిరుపేద, గిరిజన, దళిత, బహుజన కూలీలు కావడంతో, వారిని ప్రభుత్వం ఓదార్చడానికి ఇష్టపడట్లేదు. ఇది 65 సంవత్సరాల భారత స్వాతంత్ర్య ప్రజాస్వామ్యపు విలువల హక్కుల పరిస్థితిని తెలియజేస్తుంది. భారత రాజ్యాంగం అంతిమ లక్ష్యం, ప్రజాస్వామ్యం అత్యున్నత దశ సంక్షేమ రాజ్యం. కానీ ఈ దేశంలో ఎవరి సంక్షేమానికి? ఎవరి సొత్తు?గా భావిస్తున్నారు - పాలకులు పూర్తిగా స్వార్థంతో, 24 గంటలూ వ్యాపార దృక్పథంతో వారి రాజకీయ భవిష్యత్తు కోసం తప్ప, ఏమీ ఆలోచించడం లేదు.

ఇది ప్రభుత్వం బాధ్యత కాదా? ఈ ప్రభుత్వానికి నైతిక, సామాజిక బాధ్యత లేదా? కేవలం ఈ దుర్ఘటనకు బాధ్యులైన సి.ఐ., ఎస్.ఐ., కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేస్తే సరిపోతుందా? అసలు ఈ అక్రమ సారా ప్రవాహానికి బాధ్యులెవరు? ప్రొహిబిషన్ - ఎక్సైజ్ శాఖ మామూళ్లు/ సిండికేట్లలో వారి వాటా ఎంత? రాష్ట్రంలో ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఎ.సి.బి.) దాడుల్లో దొరికిన, బయటపడిన వాస్తవాలను ఎలా కప్పిపుచ్చుకున్నారు? ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీతి నిరోధక శాఖను ఎందుకు దాచిపెడుతున్నారు? ఈ రాష్ట్ర పి.సి.సి. అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణకు ఎన్ని జిల్లాల్లో మద్యం వ్యాపారంతో సంబంధాలున్నాయి? దాదాపు ఆరు జిల్లాల్లో మద్యం సిండికేట్లలో బొత్సా సత్యనారాయణ సోదరులు భాగస్వాములై, మద్యం వ్యాపారం చేస్తూ, అక్రమాలను ప్రోత్సహిస్తూ, ప్రొహిబిషన్ - ఎక్సైజ్‌ను పూర్తిగా తమ గుప్పిట్లో పెట్టుకొని, మద్యం వ్యాపారాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తూ, కోట్లాది రూపాయలు అక్రమంగా ధనార్జన చేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్కరూ - ఇద్దరూ తప్ప, దాదాపు అందరికీ ప్రత్యక్షంగా మద్యం వ్యాపారంతో సంబంధాలున్నాయి. మరో మంత్రి డి.కె. అరుణ భర్త భరత సింహారెడ్డి ఇలాంటి మద్యం సిండికేట్ల వ్యాపారంతో సంబంధాలున్న వ్యక్తే. అయితే ప్రస్తుత సమస్య, ఇరవై మంది పేద

---

బొబ్బిలి నియోజకవర్గ ఎం.పి.లు కలిసి రణస్థలం మండలంలోని గ్రామ, మండల స్థాయి నాయకులతో మంతనాలు జరిపి, ఒక సెక్షన్ ప్రజలను తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేశారు. వీరితో (సుమారు రెండు వందల మంది) డిసెంబర్ 11న ఒక ప్రకటన ఇప్పించారు. అదీ వారు అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకి అనుకూలం అని చెబుతూనే, ఒక ప్యాకేజీని డిమాండ్ చేశారు. ఒక ఎకరం భూమికి ముప్పై లక్షలు నష్టపరిహారం, ప్రతీ కుటుంబానికి ఒక ఇల్లు, ఐదు లక్షల నగదు, పిల్లల చదువుకి అయ్యే ఖర్చులు ప్రభుత్వం భరించి, వారికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రకటన వచ్చి నేటికి నెల రోజులు పైబడినప్పటికీ ఇటు అధికార్లుగానీ, అటు ఎం.ఎల్.ఎ., ఎం.పి.లుగానీ కిమ్మనడం లేదు. నాయకుల నిజస్వరూపం తెలియని ప్రజలు వారి మాటలు నమ్మి అణు విద్యుత్ కేంద్ర ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటన చేసినప్పటికీ, అమాయకంగా వారి జీవన భద్రత కోసం చేసిన డిమాండ్లు అందరి కళ్లు తెరిపించినట్లయింది. కావున ప్రజల ప్రాణాలకు, జీవన భద్రతకు హామీలేని, పర్యావరణ విధ్వంసానికి కారణభూతమైన కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటును మనం అందరం వ్యతిరేకించవలసిన సామాజిక బాధ్యత ఉన్నది. జిల్లా ప్రజలు ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులను నిలదీయవలసిన అవసరం గుర్తించాలి. ప్రజలు, ప్రజా సంఘాలు బలమైన సంఘటిత ఉద్యమాల ద్వారా కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని అడ్డుకుంటారని, సోంపేట, కాకరాపల్లి ప్రజలు చూపిన పోరాట మార్గాన్ని చేపడతారని ఆశిద్దాం.

*(రచయిత డి.టి.ఎఫ్. శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి)* వీ

ప్రజలు కల్తీ మద్యం సేవించి చనిపోతే, ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రమూ సంబంధం లేనట్లు వ్యవహరిస్తోంది. ఇది దివాళాకోరు రాజకీయం. దాదాపు 48 గంటలు దాటిన తర్వాత మంత్రి సంఘటనా స్థలానికి వచ్చారు – అది కూడా బాధిత కుటుంబాలను ఆసుపత్రులలో పరామర్శించారు. ఈ దుర్ఘటనకు బాధ్యత ఆ జిల్లాకు చెందిన మంత్రి (పార్థసారథి), ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖా మంత్రి (మోపిదేవి వెంకటరమణ)ది కాదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇదే దుర్ఘటనలో ముఖ్యమంత్రి బంధువులో, లేదా మంత్రుల బంధువులో లేదా వివిధ శాఖలలోని అత్యున్నతస్థాయి ఉద్యోగులో (ఎ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్) చనిపోతే ప్రభుత్వ స్పందన వేరే విధంగా ఉండేది. ఎందుకీ వివక్షత? ఈ దేశంలో పేద ప్రజల మాన – ప్రాణాలకు రక్షణ లేదా? ఈ ప్రభుత్వాలకు బాధ్యత లేదా? కేవలం ఓట్లేయించుకొని, గెలిచి, గద్దెనెక్కి, వారిపై పెత్తనం చెలాయించడం తప్ప, మాకేదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ధోరణిని ప్రజలు ప్రశ్నించాలి? ప్రతిఘటించాలి – ఈ దుర్మార్గాన్ని ఎండగట్టాలి. పాలకుల దమననీతిని నిర్మూలించేందుకు సంఘటితం కావాలి. ఇది అత్యవసరంగా ప్రజలందరూ ఆలోచించాల్సిన సమయం. అత్యవసరంగా చేపట్టవలసిన ఉద్యమం.

ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం నివసిస్తున్నామా? లేదా రాజరిక వ్యవస్థలో నివసిస్తున్నామా? అన్నది ప్రశ్న. అధికారులు తమ మామూళ్లు తమకు నెల వారిగా వస్తే చాలన్నట్లు వ్యవహరిస్తున్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి కమిషనర్ – మంత్రుల స్థాయి వరకు నెలవారీ మద్యం వ్యాపారంలో వాటాలు ముట్టుతూ ఉన్నాయి కాబట్టి వారికి అవసరం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో ముఖ్యమంత్రి వాటా ఎంత? ముఖ్యమంత్రి సోదరులకు కూడా మద్యం వ్యాపారంతో సంబంధాలున్నాయి.

ప్రజలు చనిపోతే కేవలం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, 'రాజీవ్ యువ కిరణాల' ద్వారా కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామంటే సరిపోతుందా? ఇది న్యాయమా? ఆ కుటుంబాలు వీధిన పడడానికి బాధ్యులైన అధికారుల నందరినీ శిక్షించాలి. అందరిపై 'హత్యా నేరం' (ఐ.పి.సి. సెక్షన్ 302) కింద కేసు నమోదు చేయాలి. కృష్ణా జిల్లా ప్రొహిబిషన్ – ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కూడా బాధ్యత వహించాలి. మొదట ఆయన వాటా ఎంతో తేల్చాలి? సంఘటనకు ఆయన బాధ్యత లేదా? ఇంతవరకూ ఆయనను ఎందుకు సస్పెండ్ చేయలేదు? ఉద్యోగ రీత్యా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? పక్క జిల్లాకే చెందిన మంత్రి మోపిదేవి వెంకటరమణ వాటా ఎంత? మద్యం సిండికేట్లు అవినీతి బాగోతాన్ని బయట పెట్టాలి. ఈ మొత్తం సంఘటనపై ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణ (బహిరంగ న్యాయ విచారణ)కు ఆదేశించాలి. ఇది ప్రప్రథమంగా చేయాల్సిన పని. బజారున పడ్డ ఆ కుటుంబాలను ఆదుకోవాలి. ప్రజల భావ దారిద్ర్యాన్ని, బలహీనతను, అమాయకత్వాన్ని, విద్యలేనితనాన్ని – మూర్ఖత్వాన్ని ఆసరా చేసుకొని ఈ ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోంది.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అవినీతి బాగోతాలను బహిర్గతం చేయాలి

1) పూర్తిగా అవినీతి, అక్రమాలకు ఆలవాలమైన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు నిలయమైన, ప్రజల హక్కులను బహిరంగంగా కాలరాస్తున్న ప్రొహిబిషన్ – ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళణ చేయాలి!

2) ప్రజలను మద్యం తీసుకోకుండా, తీర్చిదిద్దాల్సిన పాలకులు, ప్రజలను మద్యం మత్తులో ముంచడం రాజ్యాంగ వ్యతిరేకం. ఆ విధంగా ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులను కాలరాసినట్లే. కాబట్టి ఈ ప్రభుత్వానికి ప్రజలను శాసించే, పాలించే హక్కు లేదు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ లక్ష్యం కూడా ప్రజలను మద్యానికి బానిసలుగా కాకుండా చూడాల్సిన, పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. ఆ బాధ్యతలను పూర్తిగా తుంగలో తొక్కి, ఆ శాఖను కేవలం – అధికారంలో ఉన్న వారికీ, మామూళ్లు ఇచ్చేవారికి బానిసలుగా మార్చింది ప్రభుత్వం. కాబట్టి మొట్టమొదట, ఆ శాఖను పూర్తిగా నిర్మూలించి– అవినీతి నిరోధక శాఖ లేక ఇన్‌కమ్‌టాక్స్, సి.బి.ఐ. (రాష్ట్రవిభాగం) శాఖలకు అప్పజెప్పాలి.

3) ఇటీవల అవినీతి నిరోధక శాఖ దాడుల్లో బహిర్గతమైన మద్యం మామూళ్ల బాగోతాన్ని బహిరంగపరచాలి. దాదాపు అన్ని రాజకీయ పార్టీలకూ, కొన్ని పత్రికల జిల్లా స్థాయి కరస్పాండెంట్లకూ భాగస్వామ్య మున్న వైనాన్ని బయటపెట్టి, ప్రభుత్వపరంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకొన్నారో వెల్లడించాలి. జరిగిన బాగోతాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగపరచకపోతే, చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడు. లేదా ప్రజా ద్రోహానికి పాల్పడినట్లవుతుంది.

4) కల్తీసారా సేవిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో తయారవుతున్న మద్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మొదట వీరిని ప్రోత్సహిస్తున్న అధికార పార్టీ నాయకులకు మద్దతిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధీనంలోకి మార్చివేయాలి.

5) ఎం.ఎల్.ఎ., ఎం.పి., మంత్రులు, వారి బంధువుల పేర్ల మీద ఉన్న అన్ని మద్యం దుకాణాల్లో జరుగుతున్న వ్యాపార లావాదేవీలపై సి.బి.ఐ. విచారణ జరిపించాలి. 'మాఫియాలు'గా మారిన నాయకులను పి.డి. చట్టం కింద అరెస్ట్ చేయాలి.

6) ప్రజల మేధస్సును తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడవలసిన ప్రభుత్వం విస్మరించింది. ప్రజలకు, రాజ్యాంగం ఇచ్చిన పౌర, ప్రాథమిక హక్కులను పూర్తిగా కాలరాస్తూ, కేవలం ధనార్జనే ధ్యేయంగా, లక్ష్యంగా జీవిస్తున్న అధికార యంత్రాంగాన్ని ప్రజలు వ్యతిరేకించాలి, ప్రశ్నించాలి, ప్రతిఘటించాలి. మన ప్రాణాలను మనమే రక్షించే విధంగా, మన హక్కులను మనమే రక్షించుకునే విధంగా, పౌరహక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువలను కాపాడుకునే విధంగా ఈ పాలకులపై నిరంతరం పోరాటం చేయాలి. మన హక్కులను మనమే రక్షించుకోవాలి. లేకుంటే భవిష్యత్తు పూర్తిగా అంధకారమై పోతోంది. విలువలు పూర్తిగా అంతరించి పోతున్నాయి. ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం మరింత పోరాటం చేయాలి. ఆ పోరాటం ఈ భ్రష్టు పట్టిన వ్యవస్థను ప్రక్షాళన చేసేదిగా ఉండాలి. ఈ పాలకులను బెంబేలెత్తించేదిగా ఉండాలి. ఈ పాలకుల, అధికార, భూస్వామ్య, దురహంకారానికి వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేసినపుడే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. ఈ కర్తవ్యాన్ని విద్యావంతులుగా, ప్రజాసంఘాలుగా మనమంతా చేపట్టాలి. ప్రజలను తీర్చిదిద్దాలి. ప్రజాస్వామిక విలువలనూ, వ్యవస్థనూ, నిరంతరం పోరాటాలతోనే పరిరక్షించుకుందాం. అంతిమ విజయం ప్రజలదే.

*(రచయిత న్యాయవాది,*

*ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు)* వీ

*పెట్టుబడిదారి విధాన వైఫల్యాలకూ, పాలకుల తలకిందుల విధానాలకూఫలితమే ఐరోపా దేశాలలోని ఆర్థిక సంక్షోభాలు అని అంటున్నారు* **ఎ. నర్సింహారెడ్డి**

# మాంద్యం వైపు యూరప్ ఆర్థిక వ్యవస్థ

అమెరికాలో 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం యూరప్‌ను తాకింది. ఈ సంక్షోభ కారుమేఘాలు ఎంత భయం కొల్పుతున్నాయంటే 1930 నాటి ఆర్థిక మాంద్యంగా పరిణమించవచ్చునన్న లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ సంక్షోభం ప్రపంచమంతటినీ ముంచెత్తకుండా ఉండాలంటే అమెరికాతో సహా యూరప్ దేశాలు తక్షణం తమ ఆర్థిక సమస్యలను కొలిక్కి తీసుకురావాలి. కానీ, ఎలా కొలిక్కి తీసుకురావాలో ఆదేశాలలోని ఉద్దండులైన ఆర్థిక నిపుణులకు అంతు చిక్కడం లేదు. నిజానికి నేడు ద్రవ్య సంక్షోభంగా, రుణ సంక్షోభంగా ప్రత్యక్షమైన సంక్షోభానికి మూలమూ, పరిష్కారమూ కూడా ఉత్పత్తిరంగంలోనే ఉన్నాయి. వాల్‌స్ట్రీట్ ఉద్యమకారులు అంటున్నట్టుగా ప్రపంచాన్ని శాసిస్తున్నది కార్పోరేట్ బ్యాంకులు, ద్రవ్యసంస్థలే. అవే ప్రజా సంక్షేమానికి అడ్డంకిగా ఉన్నాయి. అవే దేశాధినేతలను శాసిస్తున్నాయి. 1980ల నుంచి అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రజల పొదుపునే కాదు భవిష్యత్తు ఆదాయాలను కూడా ఖర్చు పెట్టించేశాయి. అప్పులపాలు చేశాయి. ఉపాధి లేకుండా చేశాయి. మొత్తంగా సామాన్య ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయి.

ప్రపంచ నేతల్లో ఏ ఒక్కరూ ఈ సంక్షోభానికి సరైన పరిష్కారం చూపడం లేదు. పరిష్కారం తెలియక కాదు, పరిష్కరించడానికి సిద్ధంగాలేరు. కనుక గత నాలుగేళ్లుగా సంక్షోభానికి కారణమైన ద్రవ్య సంస్థలను కాపాడడానికే ప్రభుత్వాలు బెయిల్ అవుట్ రూపంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాయి. పెద్ద మొత్తాలలో ప్రభుత్వాలు అప్పులు చేశాయి. సంక్షోభంలో చిక్కుకున్న దేశాలు రుణభారాన్ని తగ్గించలేక పోయాయని, వృద్ధి బలహీనంగా ఉందని, ఐ.ఎం.ఎఫ్. గత సెప్టెంబర్‌లో విడుదల చేసిన తన గ్లోబల్ ఫైనాన్షియల్ స్టెబిలిటి రిపోర్టు'లో పేర్కొంది. అయితే ప్రభుత్వాలు ఇలా అప్పుల పాలు కావడం అదే సమయంలో ప్రజా జీవితాలు ఛిద్రమవడం ఎలా సాధ్యమైందో మాత్రం ఐఎంఎఫ్ చెప్పడానికి సిద్ధంగాలేదు. ఐరోపా ఆర్థిక వ్యవస్థ చాలా దుర్భర స్థితిలో ఉందని యూరోపియన్ యూనియన్ సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడు మారియో డ్రగీ తెలిపారు. దీని నుంచి బయటపడేందుకుగాను ప్రభుత్వాధినేతలు అభివృద్ధి లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. ద్రవ్య నియంత్రిత ఒప్పందం పరిధికి లోబడి ఆర్థిక వ్యవస్థలను గాడిన పెట్టేందుకు సెంట్రల్ బ్యాంకు చేయగలిగినదంతా చేస్తోందని పేర్కొన్నారు. అయితే, అభివృద్ధి అంటే ఏమిటో మాత్రం వివరించలేదు.

1980వ దశకం ఆరంభంలో 'వృద్ధికి ప్రోత్సాహం' పేరిట సంపన్నులపై పన్నుల భారం తగ్గించే చర్యలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుండే ప్రభుత్వ ఆదాయాలకు గండిపడటం ప్రారంభమైంది. మరోవంక ఉద్యోగులు, కార్మికుల సంఘటిత శక్తిని బలహీనం చేసి, వేతనాలను కుదించే చర్యలు చేపట్టాయి. తద్వారా వ్యయాలు తగ్గి పెట్టుబడికి ప్రోత్సాహం లభిస్తుందని బుకాయించాయి. కానీ, ప్రజల ఆదాయాలు తగ్గి, కొనుగోలు శక్తి పడిపోతే వస్తువుల డిమాండు పడిపోయి ఉత్పత్తి, వృద్ధి క్షీణిస్తాయన్న హెచ్చరికలను బేఖాతరు చేశాయి. ప్రజల ఆదాయాలతో పాటు ప్రభుత్వ రాబడి క్షీణించింది. ప్రభుత్వ వ్యయాల్లో కోతలు (పొదుపు చర్యలు) ప్రారంభమయ్యాయి. అక్కడ పేదల సంక్షేమ వ్యయాన్ని ఆయా ప్రభుత్వాలు తగ్గించి వేశాయి. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయానికి కూడా కత్తెర వేశాయి. దానితో ఆయా దేశాలలో నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోయి ప్రజా తిరుగుబాట్లు పెల్లుబుకుతున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్ దేశాల మధ్య పెరిగిన ఐకమత్యం ప్రాతిపదికగా 27 దేశాల 'యూరోపియన్ యూనియన్' ఏర్పడింది. 1992లో యూరప్‌లోని 17 దేశాలు 'యూరో'ను ఉమ్మడి కరెన్సీగా ఏర్పాటు చేసుకొని జాతీయ, అంతర్జాతీయ లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. కొన్ని యూరోపియన్ దేశాలు 'యూరోపియన్ యూనియన్'లో భాగస్వాములైనప్పటికి 'యూరో' కరెన్సీ కాకుండా తమ స్వంత కరెన్సీనే కొనసాగిస్తున్నాయి. బ్రిటన్ ఈయూలో పూర్తి సభ్యదేశం కాదు. దాని కరెన్సీని అది విడిగా ఉంచుకుంది. 'యూరోజోన్' దేశాల్లో గ్రీస్, స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్, రొమేనియా తదితర దేశాలు ఇటీవల కొన్నేళ్లుగా రుణాల్లో కూరుకుపోతూ తాజాగా రుణ సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఇప్పుడు ఏ దేశం గతి ఏమవుతుందో తెలియని పరిస్థితి. బ్యాంకులు, ఇన్వెస్టర్లు గుడ్లుతేలవేసి చూస్తున్నారు. యూరోజోన్ విచ్ఛిన్నమై పోవచ్చునన్న సంకేతాలు వస్తున్నాయి.

యూరోను, యూరోజోన్, ఇయుల ఐక్యతనూ నిలబెట్టాలని ఇసిబి, ఐఎంఎఫ్‌లు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం 2011, అక్టోబర్ 26–28 తేదీల మధ్య సమావేశాలు జరిపి సంక్షుభిత దేశాలకు భారీ ఎత్తున బెయిలవుట్ ప్యాకేజీలు ప్రకటించాయి. తాజాగా 2011, డిసెంబర్ 8, 9 తేదీల్లో బ్రస్సెల్స్‌లో సమావేశమై భవిష్యత్తులో యూరోజోన్ దేశాలు దెబ్బతినకుండా చూసేందుకు, యూరో విలువ కాపాడేందుకు ఒక ఒప్పందానికి వచ్చాయి. అయినా, 17 దేశాల ఉమ్మడి కరెన్సీగా యూరో మనుగడ సాధించగలదా అని అనేక సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజానికి మొదటి నుంచీ యూరో ఉమ్మడి కరెన్సీగా

నిలువడం కష్టమనీ, ఏ దేశానికాదేశం సొంత కరెన్సీ కలిగి ఉండాలనే పలువురు ఆర్థిక వేత్తలు చెబుతూ వస్తున్నారు. తాజా సంక్షోభం ఈ సందేహాల్ని బలపరుస్తోంది. ఎందుకంటే మార్కెట్ స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు యూరోపియన్ యూనియన్ సమ్మిట్ సమావేశాలలో తీసుకుంటున్న నిర్ణయాలను ఇంకా అమలు జరపాల్సి ఉంది. అలాగే యూరోపియన్ బ్యాంకులు అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఇంకా రూపొందాల్సి ఉంది. జర్మనీతో సహా యూరోజోన్ దేశాలు అంతర్జాతీయ రుణ సంస్థల నిఘా కింద ఉంటున్న పరిస్థితుల్లో, డౌన్ గ్రేడ్ చెందే పరిస్థితుల్లో సావరిన్ రుణ సంక్షోభాన్ని అధిగమించగలిగే విశ్వసనీయ చర్యలు కొరవడుతున్న పరిస్థితుల్లో, దశాబ్ద కాలంగా ఉంటున్న 'యూరో' కరెన్సీ విచ్ఛిన్నమయ్యే అవకాశాలను, ఆర్థిక విశ్లేషకులు తోసిపుచ్చడం లేదు. అది ప్రపంచాన్ని 2008లో అమెరికాలో లెహ్మాన్ బ్రదర్స్ కుప్పకూలిన దరిమిలా ఏర్పడిన పరిస్థితులకు తిరిగి నెట్టవచ్చునన్న అభిప్రాయం ఇప్పటికీ వ్యక్తమవుతోంది.

గత నవంబర్ 3, 4 తేదీలలో ఫ్రాన్స్‌లోని కేన్స్ నగరంలో జరిగిన జి-20 దేశాల సదస్సు సంక్షోభంలో చితికిపోయిన ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదని, నిరుద్యోగం సహించలేని స్థితిలో ఉందని, ఐరోపాలో అనేక దేశాలు దివాళ తీసే ప్రమాదంలో పడడంతో ద్రవ్య మార్కెట్‌లో ఉద్రిక్తలు పెరిగాయంటూ, అనేక దేశాల ఇబ్బందులను ఏకరువు పెడుతూ, ఐరోపా సంక్షోభాన్ని ఐరోపా దేశాలే చూసుకోవాలంటూ సమావేశం ముగిసింది. ఐరోపా బాండ్లను తాము కొనుగోలు చేయమని బ్రెజిల్ తెగేసి చెప్పింది. ద్రవ్య సంస్థల తీరును అర్జెంటీనా అధ్యక్షురాలు క్రిస్టినా కిర్చనర్ తిట్టిపోసింది. పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు కావాలంటే వడ్డీరేట్లను పెంచాల్సిందేనని బాండ్లను కొనుగోలు చేసే సంస్థలు పట్టుబట్టాయి. గత్యంతరం లేక ఇటలీ వడ్డీరేటును 7.42 శాతానికి పెంచింది. భవిష్యత్తులో తాము తీసుకునే అప్పులకు ఇంత వడ్డీరేటు చెల్లించాలంటే ఎక్కడ తట్టుకోగలమనే భయం 'యూరోపియన్ యూనియన్'లోని ఇతరదేశాలకు పట్టింది. రుణభారాన్ని తగ్గించుకోవడం కోసం యూరప్ దేశాలు పలు చర్యలు చేపట్టినా గ్రీస్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఐర్లాండ్ దేశాలు మాత్రం దివాలా దిశగా ప్రయాణిస్తున్నాయి. వీటిలో గ్రీస్, ఇటలీదేశాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

1974లో గ్రీసులో ప్రజాస్వామ్యం ఏర్పడినప్పటి నుండి అక్కడి ప్రభుత్వ ఆర్థికలోటు పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, సామాజిక భద్రతా కార్యక్రమాలకు ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చిస్తుండడంతో ఈ లోటు పెరుగుతూ 1993 నాటికి జిడిపిలో ప్రభుత్వ రుణాలు వందశాతానికి చేరుకొన్నాయి. దాంతో కరెన్సీ విలువను తగ్గించి కొంతకాలం నెగ్గుకొచ్చింది. 2000 నుండి 2008 వరకు పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో అభివృద్ధి చెందిన దేశాలలో గ్రీస్ ఒకటిగా ఉంటూ వచ్చింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం వలన గ్రీస్‌లో అతి ఎక్కువ ఆదాయం వచ్చే పర్యాటక, షిప్పింగ్ రంగాలు దెబ్బతిని 2009 నుండి ఆదాయం భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు నెంబర్‌వన్‌గా ఉన్న గార్మెంట్ పరిశ్రమ దిగజారిపోయింది. గ్రీస్ స్థూల జాతీయోత్పత్తి 303 బిలియన్ డాలర్లు. అప్పు 497 బిలియన్ డాలర్లకు చేరింది. వార్షిక రాబడి కంటే అప్పు ఎక్కువైంది. జిడిపిలో 166 శాతానికి చేరింది. నిరుద్యోగుల శాతం 7.2 నుంచి 18.4కి పెరిగింది. ఇది మరింత పెరిగి 36 శాతానికి చేరే అవకాశమున్నట్లు ప్రపంచ బ్యాంకు అంచనా. పొదుపు చర్యల తర్వాత గ్రీస్ ప్రజల తలసరి ఆదాయం ప్రస్తుతమున్న 41,400 యూరోల నుండి 14 శాతం అంటే 5,600 యూరోలు తగ్గనుంది.

గ్రీస్ మాదిరిగానే రుణ సంక్షోభంలో కూరుకుపోయిన మరో దేశం ఇటలీ, యూరోజోన్ ఆర్థిక వ్యవస్థల్లో ఇటలీ మూడో అతిపెద్ద వ్యవస్థ. ఇటలీ జిడిపి 305 బిలియన్ డాలర్లు. అప్పులు 2.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకొన్నాయి. జిడిపిలో 121 శాతం అప్పులున్నాయి. గత ఆరేడు నెలలుగా దేశవృద్ధిరేటు వేగంగా తగ్గిపోతున్నది. వడ్డీరేట్లు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. నిరుద్యోగులు 28.3 శాతానికి చేరారు. అదే సమయంలో ఇయు నుంచి తీసుకున్న 431 బిలియన్ డాలర్ల రుణాన్ని తిరిగి రీఫైనాన్స్ చేసుకున్న మూడో దేశంగా ఇటలీ నిలిచింది. ఓవైపు ఆ దేశం ఆర్థిక అభివృద్ధి అంతంత మాత్రమే ఉండగా... మరోవైపు రుణ మొత్తం చాంతాడులా పెరిగిపోతోంది. దీంతో రుణ చెల్లింపుల కత్తి ఇటలీపై వేలాడుతోంది. దీని నుంచి బయటపడేందుకు 5.62 శాతం వార్షిక వడ్డీ హామీతో 3.3 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. అదే సమయంలో, ఏడేళ్ల వ్యవధి గల, తొమ్మిదేళ్ల వ్యవధిగల బాండ్లను 7.42, 6.7 వడ్డీ చెల్లింపు హామీతో అమ్మకాలకు పెట్టి 2.59 బిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. జనవరి 13న మరో 9 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను అమ్మకానికి పెట్టాలని నిర్ణయించింది. రానున్న మూడు సంవత్సరాలలో ఇటలీ 650 బిలియన్ యూరోలు చెల్లించవల్సి ఉంది.

స్పెయిన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. స్పెయిన్ రుణభారం జిడిపిలో 67శాతం ఉంది. అయినా ఇతర దేశాలకంటే ఇబ్బందుల్లో ఉంది. రుణాల చెల్లింపు సమస్యను అధిగమించేందుకు ఈనెల 12న 3 బిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ బాండ్లను అమ్మకానికి పెట్టాలని స్పెయిన్ నిర్ణయించింది. బాండ్ల అమ్మకాల ద్వారా మొత్తం 8 బిలియన్ డాలర్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. అదే దారిలో పోర్చుగల్, ఐర్లాండ్ కూడా కొనసాగుతున్నాయి. ఇక ఫ్రాన్స్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. జర్మని రుణభారం జిడిపిలో 83 శాతం, ఫ్రాన్స్ రుణభారం జిడిపిలో 87 శాతం, పోర్చుగల్ రుణభారం జిడిపిలో 106 శాతం, ఐర్లాండ్ రుణభారం జిడిపిలో 109 శాతంగా ఉంది. ఈ దేశాలు ఇప్పటికే పొదుపు చర్యలు ప్రారంభించాయి. అయితే... చెల్లింపుల సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలు మదుపర్లలో, పారిశ్రామికరంగంలో విశ్వాసం కల్పించాల్సిందిపోయి అనిశ్చితికి దారి తీస్తోంది. దీంతో ఆయాదేశాల క్రెడిట్ రేటింగ్ ఒక్కసారిగా పడిపోయింది. ఇది చివరకు యూరో జోన్ క్రెడిట్ రేటింగ్‌కు ముప్పుగా పరిణమించింది. దీంతో స్టాక్ మార్కెట్లు పతనం దిశగా పయనిస్తున్నాయి.

పోర్చుగీస్ ప్రభుత్వం గత నెలలో కార్మికుల వేతనాల్లో విధించిన కోతల వల్ల ప్రభుత్వరంగ ఉద్యోగుల, కార్మికుల నిజవేతనం 2010తో పోల్చుకున్నప్పుడు 27 శాతం తగ్గిందని 'జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ పోర్చుగీస్ వర్కర్స్' అధ్యక్షుడు మాన్యుయెల్ కార్వెల్హో దాసిల్వా ప్రకటించాడు. పోర్చుగీస్ ఆర్థికమంత్రి విటర్ గాస్పర్ 2012 బడ్జెట్‌ను నవంబర్ చివరలో కాంగ్రెస్ (పార్లమెంట్)లో ప్రవేశపెడుతూ పోర్చుగీస్ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది అత్యంత కఠినమైన చర్యలతో కూడుకొన్న బడ్జెట్ అన్నారు. మార్కెట్లు, అంతర్జాతీయ భాగస్వాముల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు ఈ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదన్నాడు.

2010లో జిడిపిలో 9.8 శాతం ఉన్న బడ్జెట్‌లోటును 2011లో 5.9 శాతానికి, 2012లో 4.3 శాతానికి, 2013లో యూరోపియన్ యూనియన్ నిర్దేశించిన పరిమితి అయిన 3 శాతానికి తీసుకరావడానికి ఈ కఠిన నిర్ణయాలు అవసరం అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ రుణదాతల త్రయం ఇయూ, ఐఎంఎఫ్., ఇసిబిలు రూపొందించిన 2012 బడ్జెట్‌ను పోర్చుగల్ కాంగ్రెస్ నవంబర్ చివరిలో ఆమోదం తెలిపింది. గత కొన్ని దశాబ్దాలలో ఎన్నడూ లేనంత దారుణమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పోర్చుగల్‌ను బయటపడవేసేందుకు యూరోపియన్ యూనియన్ బ్యాంకు అందిస్తున్న 78 మిలియన్ యూరోల (100 బిలియన్ డాలర్లు) బెయిల్ అవుట్‌కు ప్రతిగా యూరోపియన్ యూనియన్ బ్యాంకు విధించిన షరతులు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. వేతనాల్లో 10 శాతం కోత, 2013 సంవత్సరానికి బోనస్ రద్దు, సెలవు దినాల తగ్గింపు, ఓవర్‌టైం రేట్లలో 50 శాతం తగ్గింపు, కార్మికుల తొలగింపు, విశ్రాంతి సమయాలు రద్దు, నిరుద్యోగ భృతి తగ్గింపు మొదలైన కార్మిక వ్యతిరేక చర్యలు ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ మిత వ్యయ చర్యలు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని, ఈ సంవత్సరం చివరి నాటికి నిరుద్యోగం 13.6 శాతానికి చేరుకొంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అనుసరిస్తున్న 'సర్వ వినాశకర' విధానం నుండి, బడాపెట్టుబడిదారుల నియంతృత్వం నుండి, విదేశీ అప్పుల నుండి, సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి పోర్చుగల్ విముక్తికి దేశభక్తియుత ప్రజాపోరాటం తప్ప మరో మార్గాంతరం లేదని పోర్చుగల్ కమ్యూనిస్టు పార్టీ (పిసిపి), ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రకటించారు.

అమెరికాలో వృద్ధి పునరుద్ధరణకు సంబంధించి కనబడిన అస్పష్ట సూచనలు, దీర్ఘకాలిక సంక్షోభం కారణంగా యూరో సావరిన్ బాండ్ల మార్కెట్లు ప్రమాదంలో పడ్డాయి. తమ సొంత సమస్యలకు తామే పరిష్కారాలు కనుగొనాల్సి ఉంటుందని ప్రెసిడెంట్ ఒబామా యూరో నేతలకు పదే పదే చెబుతూ వస్తున్నారు. ఏ పరిష్కారమైనా యూరో ప్రాంతం కేంద్రంగా జరగాలని ఐఎంఎఫ్ అధినేత కూడా నొక్కిచెప్పారు. ఇదే అదనుగా యూరోపియన్ యూనియన్‌కు చెందిన జర్మన్ నాయకత్వం రుణ ఊబిలో చిక్కుకున్న దేశాలపై మితవ్యయ చర్యలను రుద్దుతుంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (యూసిబి) వాటిని బయటపడేసేందుకు, అదనపు నిధులిచ్చేందుకు బాధ్యత తీసుకోవడం లేదు. అయితే, రుణ భారంలో చిక్కుకున్న గ్రీస్, పోర్చుగల్, ఐర్లాండ్, ఇటలీ, స్పెయిన్ వంటి దేశాలను బయటపడవేసేందుకు సహాయ పడడంలో మరింత మెరుగైన పాత్ర పోషించేందుకు ఐఎంఎఫ్ జోక్యానికి యూరోపియన్ యూనియన్ కృషి చేస్తోంది. సభ్యదేశాల (యూరోప్‌లో) సహాయం కోసం ఐఎంఎఫ్ వనరులను పటిష్టపరచేందుకు యూరోపియన్ దేశాలు 200 బిలియన్ డాలర్లను ఐఎంఎఫ్‌కు అప్పు ఇచ్చేందుకు సుముఖంగా వున్నాయి. ఐరోపా దేశాలను ఆదుకోవడానికి ఐఎంఎఫ్ ఈ విధంగా ముందుకు రావడం ఐఎంఎఫ్‌లో ప్రధాన భాగస్వామి అయిన అమెరికాకు రుచించడం లేదు. ఐరోపాలో పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంటే ఐఎంఎఫ్ ఇబ్బందుల్లో పడాల్సి వస్తుందని అమెరికా పార్లమెంటు సభ్యులు కొందరు హెచ్చరించారు.

సెప్టెంబర్ 29న బ్రస్సెల్స్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ దేశాల సమావేశంలో 'యూరో' రక్షణ కోసం కసరత్తు జరిగింది. సంక్షోభం ఐరోపా అంతటా వ్యాపించి ఉన్నందున ఒక్క యూరో కరెన్సీగా కలిగిన దేశాలే కాకుండా మొత్తం ఐరోపా యూనియన్ సభ్య దేశాలన్నీ ఉమ్మడిగా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకునే అంగీకారానికి రావాలని జర్మనీ, ఫ్రాన్స్‌లు ఈ సమావేశంలో ప్రతిపాదించాయి. ఐరోపా యూనియన్‌లోని ప్రతి సభ్యదేశం తప్పనిసరిగా ద్రవ్యక్రమశిక్షణను అమలు చేయాలన్న నిబంధనను చేర్చాలని కూడా ఈ రెండు దేశాలు ప్రతిపాదించాయి. దీని ప్రకారం ఏ దేశం ద్రవ్య క్రమశిక్షణను అతిక్రమించినా ఆర్థిక ఆంక్షలు వాటంతటవే అమల్లోకి వచ్చే విధంగా ఉండాలని అవి కోరాయి. ఐరోపా యూనియన్‌లో చేరడం మూలంగా ఇప్పటికే ఈ దేశాలు కొంత స్వతంత్రాన్ని కోల్పోయాయి. యూరో కరెన్సీని అంగీకరించడం ద్వారా మరింత స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయాయి. ఇప్పుడు ప్రతిపాదించిన ఉమ్మడి ద్రవ్యపటిష్ఠ పథకం ఆ క్రమాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ఇప్పటికే యూరో కరెన్సీకి దూరంగా ఉన్న బ్రిటన్ ఈ ప్రతిపాదిత పథకాన్ని వీటో చేసింది. దానితో యూరో కరెన్సీని భాగస్వామ్య దేశాలకే వర్తించే విధంగా సవరించి జర్మనీ, ఫ్రాన్స్‌లు ఆమోదింపచేసుకున్నాయి.

విధానపరమైన ఏ నిర్ణయమైన ఐరోపా యూనియన్‌లోని 27 సభ్య దేశాలూ ఏకగ్రీవంగా అంగీకరిస్తేనే అమలులోకి వస్తాయి. ఏ ఒక్క దేశం వీటో చేసిన అది అమలు కాదు. అయితే ఈ నిబంధన ఆచరణలో ఇబ్బందులు కలిగించవచ్చనే ఆలోచనతో మూడోవంతు దేశాలు ఆమోదిస్తే అమలు జరపవచ్చని నిబంధనలకు ఒక సవరణ చేశారు. ద్రవ్య టర్నోవర్ పన్ను ద్వారా 2014 నుంచి ఏటా 57 బిలియన్ యూరోల ఆదాయాన్ని పొందవచ్చని ఐరోపా కమిషన్ అంచనా వేసింది. ద్రవ్య సంస్థల మధ్య జరిగే లావాదేవీలు, డెరివేటివ్ (భవిష్యత్‌లో వస్తు, స్టాక్, బాండ్ల ధరలపై ముందుగానే వ్యాపార ఒప్పందాలు కుదుర్చు కోవడం)లపై పన్ను విధించడం ద్వారా అవాంఛనీయ వాణిజ్యాన్ని కొంతమేరకమైనా నిరోధించవచ్చని ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ప్రస్తుతం బ్రిటన్‌లో పన్నులు తక్కువ ఉన్న కారణంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు లండన్ కేంద్రంగా లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్య టర్నోవర్ పన్ను విధానం లేకుండా ఒక్క ఐరోపాలో వేయడాన్ని అంగీకరించడం లేదంటూ బ్రిటన్ వీటో ఆయుధాన్ని ప్రయోగించింది. దాంతో మూడోవంతు దేశాల ఆమోద అస్త్రాన్ని బయటకు తీసేందుకు ఇతర దేశాలు పావులు కదుపుతున్నాయి. దీని తీరుతెన్నులను గమనించి మిగతా దేశాలు బ్రిటన్‌తో ప్రమేయం లేని విధంగా లేదా పాక్షికంగా ఉండే విధంగా ఐరోపా చట్టాలను తయారు చేసేందుకు పూనుకున్నాయి. దీంతో ధనిక దేశాల మధ్య మరో వైరుధ్యానికి పునాది పడుతోంది.

'యూరో'ను ఉమ్మడి కరెన్సీగా ఏర్పర్చడంతో 50 కోట్ల ప్రజలున్న యూరోపియన్ యూనియన్ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక కూటమిగా ఏర్పడింది. ఇది అమెరికా ఆర్థికశక్తితో దాదాపు సమానం. యూరోపియన్ యూనియన్ కలిసికట్టుగా కదలాలన్న జర్మనీ, ఫ్రాన్స్ దేశాల ప్రతిపాదనను బ్రిటన్ 'వీటో' చేసిన ఫలితంగా ఆ రెండు దేశాల నాయకత్వంలోని 17 యూరో ఉమ్మడి కరెన్సీ దేశాలు, యూరోపియన్ యూనియన్‌కు వెలుపల ఉన్న ప్రభుత్వాలు పరస్పరం సంప్రదించుకొని సంక్షోభ నివారణ కోసం ఒక ఒప్పందానికి రావడానికి మాత్రం అంగీకరించాయి. తొలి ప్రతిపాదనలో 50,000 కోట్ల యూరోల శాశ్వత బెయిలవుట్ నిధి ఏర్పాటు కూడా ఉంది. ఐరోపా యూనియన్ ద్రవ్య పటిష్ఠతా ఒప్పందం కింద 2012 మధ్య నాటికి ఈ నిధిని పనిచేయించే క్రమం ప్రారంభం కావలసి ఉంది. ద్రవ్యపటిష్ఠత గురించి ఇలాంటి

చర్యలను ఉమ్మడిగా చేపట్టడానికి బ్రస్సెల్స్ సమావేశంలో అంగీకారం కుదిరిన ఫలితంగా ఐఎంఎఫ్ కూడా 500 కోట్ల యూరోల రుణాల్ని సంక్షోభ పీడిత దేశాలకు అందించడానికి ముందుకొచ్చింది. ప్రస్తుతానికి 38,000 కోట్ల డాలర్ల రుణాన్ని ఇటలీ, స్పెయిన్‌లకు అందించడానికి సిద్ధపడుతున్నది. అయితే ఈ మొత్తం ఆ రెండు దేశాలకు సరిపోదు. నిజానికి రాబోయే సంవత్సరానికల్లా ఇటలీ 34,000 కోట్ల డాలర్ల రుణాల్ని సర్దుబాటు చేయాల్సి ఉంది. అలాగే స్పెయిన్ 12,000 కోట్ల డాలర్ల రుణాన్ని తీర్చాల్సి ఉంది.

అన్ని దేశాలు ద్రవ్యలోటు కుదింపు పేరిట ప్రభుత్వవ్యయాన్ని తగ్గించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవల్సిన అనివార్య పరిస్థితులను తాజా ద్రవ్య సర్దుబాటు తీసుకువస్తోంది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతోంది. ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు కుదించుకుపోతోన్నాయి. ఈ సర్దుబాటు అమెరికా నుండే ప్రారంభమైంది. ఇటలీ, స్పెయిన్, గ్రీసు దేశాలు తమను ఆదుకోమని అభ్యర్థిస్తే అక్కడ కూడా ద్రవ్యలోటు తగ్గించుకుంటే తప్ప సహకరించమని యూరోజోన్ బ్యాంక్ (ఇసిబి) నిర్మొహమాటంగా చెప్పింది. దాంతో ఇటలీ, స్పెయిన్, గ్రీస్ దేశాలు సైతం తమ సర్దుబాటు ప్రణాళికలు ప్రకటించక తప్పలేదు. ఇదిలా ఉండగా జనవరి 13న ఎస్ అండ్ పి యూరోజోన్‌లోని ఫ్రాన్స్‌తో సహా తొమ్మిది దేశాల పరపతి రేటును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా యూరప్ సంక్షోభం మరింత ముదిరే పరిస్థితి ఏర్పడింది. దీంతో యూరప్ దేశాలపైనే కాకుండా యూరో జోన్‌లో చలామణిలో ఉన్న కరెన్సీ యూరోపై కూడా నీలినీడలు కమ్మాయి. ఈ పూర్వరంగంలో ఐరోపా ఆర్థికసంక్షోభం నుంచి మాంద్యంలోకి వెళ్లే అవకాశాన్ని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా అప్పుడప్పుడు భారీ ప్రదర్శనలను చూస్తున్న మనం రానున్న రోజుల్లో మీడియా పతాక శీర్షికలకు ఎక్కే ప్రదర్శనలు చూడబోతున్నాం అని సిటీ బ్యాంకు ప్రధాన వ్యూహకర్త టొబాయిస్ లెకోవిచ్ హెచ్చరించారు. మరిన్ని పొదుపు చర్యలు చేపడితే జపాన్ మాదిరి ఒక దశాబ్ద కాలంపాటు ఆర్థిక రంగంలో అగ్రస్థానాన్ని ఐరోపా కోల్పోవాల్సి వస్తుందని జెనీవాలోని గ్రాడ్యుయేట్ సంస్థకు చెందిన ఎకనమిక్స్ ప్రొఫెసర్ చార్లెస్ వైపోల్స్ పేర్కొన్నారు.

ఈ పొదుపు చర్యల వల్ల పేదలతో పాటు మధ్య తరగతి ప్రజానీకం కూడా బలికానుంది. జనాన్ని బాదడానికి మేము సిద్ధమయ్యాం అని ఆయా ప్రభుత్వాలు ప్రకటించకుండా ఐఎంఎఫ్‌గాని, యూరో జోన్ బ్యాంకు (ఇసిబి)గాని రుణాలు మంజూరీ చేయమని తెగేసి చెప్పాయి. అందుకుగాను తక్షణం ఆ దేశాలు 15 బిలియన్ డాలర్ల పొదుపు చర్యలను అమలు చేయాలని యూరో జోన్ బ్యాంకు నిర్దేశించింది. పొదుపు చర్యలు అంటే సంక్షోభ భారాన్ని ఉద్యోగులు, కార్మికులు, మధ్య తరగతి, పేద ప్రజలందరిపై మోపి బహుళజాతి సంస్థలను, ద్రవ్య సంస్థలను కాపాడడమే తప్ప మరొకటి కాదు. అంతేకాకుండా గ్రీస్, ఇటలీలను సంక్షోభం నుంచి ఆదుకోవాలంటే రెండు దేశాల ప్రభుత్వాలను బలి ఇవ్వాలన్న బ్యాంకర్ల డిమాండును యూరోపియన్ యూనియన్ ఆమోదించక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే గత నవంబర్‌లో గ్రీస్, ఇటలీ ప్రభుత్వాధినేతలు పపాండ్రా, బెర్లుస్కోనీ ఇంటి దారిపట్టారు. రెండు చోట్ల రాజకీయ నాయకుల బదులు బ్యాంకింగ్, ద్రవ్యరంగాల్లో అనుభవం ఉన్న 'టెక్నోక్రాట్స్' అధికారంలోకి వచ్చారు. గత సంవత్సర కాలంలో ద్రవ్యసంస్థలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఐర్లండ్, పోర్చుగల్, స్లోకేవియా, స్పెయిన్ దేశాల పాలకులను మార్చగలిగాయి.

ద్రవ్యపెట్టుబడి అరాచకత్వం, డాలరు గుత్తాధిపత్యం ప్రపంచ మార్కెట్లను ఇప్పటికే అతలాకుతలం చేశాయి. మరింత చేయనున్నాయి. 2008 సంక్షోభం తర్వాత ప్రపంచ దేశాలు ఈ రెండింటికి అడ్డుకట్ట వేయకుండా, సర్దుబాటుకు ప్రయత్నించాయి. ఫలితంగా ప్రపంచ దేశాలు నేడు మరో సరికొత్త సంక్షోభాన్ని చవిచూస్తోన్నాయి. పర్యవసానంగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నానాటికి పరిష్కరించలేని సంక్షోభం ఉబిలో మునిగిపోతున్నది. తాను సృష్టించిన ఈ సంక్షోభాన్ని పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మిక, ఉద్యోగ, ప్రజారాసుల పైనా, వర్ధమాన దేశాలపైనా మోపి తమ దోపిడిని పరిరక్షించుకోవాలని పెట్టుబడిదారీ విధానం చూస్తున్నది. ప్రస్తుతం ఐరోపాలో కొనసాగుతున్న సంక్షోభం నుంచి బయటపడే విషయంలో ధనిక దేశాల మధ్య విభేదాలున్నప్పటికీ జనంపై సంక్షోభ భారాన్ని మోపడంలో మాత్రం ఒక్క మాట మీదే ఉన్నాయి. ఈ ఏడాది ఐరోపా ఆర్థిక సంక్షోభం మరింత ముదిరి మాంద్యంలోకి కూరుకుపోతుందని గత కొద్ది వారాలుగా ఆర్థికవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. దానిని నివారించడం కోసం పాలకులు 'పొదుపు చర్యల'ను పుంఖాను పుంఖాలుగా ప్రకటిస్తూనే ఉన్నారు.

ఏ ఆర్థిక సంక్షోభం వెనుకనైన ఆయా దేశాల ఆర్థిక, ద్రవ్యరంగాలు సక్రమంగా పనిచెయ్యకపోవడం అనేదొక్కటే ప్రధాన కారణమని ప్రముఖ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్య యూరోకైనా, మరో కరెన్సీకైనా ఒక్కటే. ఆయా దేశాల ఆర్థిక రంగాలు సవ్యంగా పనిచేస్తే ఏ కరెన్సీ అయినా మనగలుగుతుంది. యూరో సమస్య ఉమ్మడి కరెన్సీ వల్ల ఏర్పడింది కాదనేది ఆయన అభిప్రాయం. అయితే ప్రస్తుత యూరప్ సమస్య దానికే పరిమితం కావడం లేదు. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతను, ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలను కూడా ప్రభావితం చేస్తోంది. స్వేచ్ఛ మార్కెట్ వ్యవస్థ వల్ల ప్రపంచ దేశాలన్నీ ఒకదానితో ఒకటి వాణిజ్య సంబంధాలు కలిగి ఉండడం వలన వర్తమాన పరిస్థితుల్లో యూరోజోన్ ఆర్థిక పరిస్థితి మెరుగు పడకపోతే ప్రపంచ దేశాలు కూడా సంక్షోభంలో పడే ప్రమాదం పొంచి ఉందని స్టిగ్లిజ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ వ్యయం తగ్గించే పేరుతో ప్రజలకు ఇచ్చే రాయితీలు, సబ్సిడీలు, సంక్షేమ చర్యలను ఉపసంహరించుకోవడం, అభివృద్ధిని ప్రోత్సహించే పేరుతో ప్రైవేటు రంగానికి రాయితీలను ముమ్మరం చేయడంలాంటి చర్యలు ప్రజల కొనుగోలు శక్తిని మరింత తగ్గించి పరిస్థితిని మరింత క్షీణింప చేస్తాయన్న వాస్తవాన్ని విస్మరించడం శోచనీయం. యూరోజోన్‌లో పొదుపు చర్యలు ముమ్మరంగా చేపట్టిన ఫలితంగా సంక్షోభం మరింత తీవ్రంగా పరిణమించి మాంద్యంగా మారనుంది. ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'పొదుపు చర్యల' పట్ల ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన వ్యక్తమవుతోంది. ప్రజలు ఇక ఏమాత్రం ఈ భారాలు మౌనంగా మోయబోరన్నది స్పష్టం. ప్రజల హక్కులు, సౌకర్యాల కాలరాతకు వ్యతిరేకంగా స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్, బ్రిటన్, ఫ్రాన్స్, ఐర్లాండు కార్మికులు, ప్రజలు సాగిస్తున్న ఆందోళనలు రోజు రోజుకు తీవ్రమవుతున్నాయి. ఇదంతా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఇంకెంతమాత్రం ప్రపంచానికి ఉపయుక్తం కాదనీ, అది ప్రపంచ మానవాళి పురోగమనానికి గుదిబండగా మారిందనీ తెలియజేస్తుంది. ప్రపంచ సామ్రాజ్యవాదం సృష్టించిన రుగ్మతలకు సోషలిజమే ఏకైక శాస్త్రీయ పరిష్కారమన్న భావన ఉద్యమకారుల్లో బలపడుతోంది.

*(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు)* ❖

*సుదీర్ఘమైన చరిత్ర కలిగి, మత సామరస్యానికి, సహజీవనానికి చిహ్నంగా భాసిల్లిన విశాఖపట్నం నేడు పోర్టు కాలుష్యంతో ప్రమాదపుటంచున నిల్చుందని అంటున్నారు* **పి.వి. రమణ**

# ప్రజల ఆరోగ్యాన్ని బలిగొంటున్న పోర్టు కాలుష్యం

అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తున్న కార్పొరేట్ కంపెనీల బాటలో ప్రభుత్వరంగ సంస్థలు కూడా విశాఖ ప్రజల జీవితాల్ని సర్వ నాశనం చేస్తున్నాయి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన విశాఖపట్నం నగరాన్ని పోర్టు కాలుష్యం ఆవహించింది. లక్షలాది మంది ప్రజల ఆరోగ్యాన్ని బలి తీసుకుంటోంది. పోర్టు కాలుష్యం కోట వీధి చుట్టు పక్కలే కాకుండా ఊరు ఊరంతా వ్యాపిస్తోంది. జ్ఞానాపురం నుండి ఎం.వి.పి. కాలనీ వరకూ, దొండపర్తి నుండి నరసింహనగర్ బాలయ్య శాస్త్రి లే అవుట్ వరకూ, చివరకు దూరంగా ఉన్న వెంకోజీపాలెం వరకూ వ్యాపించింది. ఇది చాలదన్నట్లు, పోర్టు విస్తరణ కోసం పాతసిటీ ప్రాంత ప్రజల్ని అక్కడి నుండి తరలించడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

విశాఖపట్నం అంటేనే పాత సిటీ. అక్కడ నుండే పెరిగి పెద్ద నగరమయింది. దానికి ఎంతో పురాతన చరిత్ర ఉంది. ఆ ప్రాంతంలో గొప్ప చారిత్రక కట్టడాలు ఉన్నాయి. ఆ ప్రాంతం వివిధ మతాలకు చెందిన ప్రజల సామరస్యానికి నిదర్శనం. ఆ ప్రాంత చారిత్రక ప్రాముఖ్యత గురించి తెలుసుకొంటేనే అక్కడ జరుగుతున్న, జరగబోతున్న విధ్వంసానికి అడ్డుకట్ట వేయగలం.

### విశాఖ పాత నగర చరిత్ర

పురాతన కాలంలో సముద్రాలు దాటి వెళ్లే వ్యాపారులకు దొంగల వల్ల, తుపానుల వల్ల అపారమైన నష్టాలు కలిగేవి. విశాఖపట్నంకు చెందిన ఒక నౌకా వాణిజ్యవేత్త తన ఓడలు క్షేమంగా తిరిగి వచ్చినందుకు ద్రాక్షారామ భీమేశ్వరుడికి 1068లో మొక్కు చెల్లించినట్లు ఒక రాతి ఫలకం మీద అక్షరాల వలన తెలుస్తుంది. దీన్ని బట్టి 11వ శతాబ్దం నాటికే విశాఖపట్నం ఉన్నట్లు ఆధారాలు తెలుపుతున్నాయి.

ఈస్ట్ ఇండియా కంపెనీ వారు తమ ఫ్యాక్టరీల కోసం, వాణిజ్య అవసరాల కోసం స్థలం కావాలని మొఘల్ చక్రవర్తిని కోరారు. వారికి దక్కన్ ప్రాంత మొఘల్ జనరల్ జుల్ఫికర్ ఆలీఖాన్ 28 డిసెంబర్ 1690న సముద్ర తీరంలో స్థలాన్ని కౌలుకిస్తూ ఆదేశాలిచ్చారు. అక్కడ కంపెనీవారు వాణిజ్య కేంద్రం పేరుతో ఒక కోటను నిర్మించుకున్నారు. ఆ కోట ఉన్న ప్రాంతమే నేడు కోట వీధి అయింది. 1858లో మున్సిపాలిటీ ఏర్పడినపుడు అది వార్డు నెం.1 అయింది. 2005 వరకూ కోట వీధి వార్డు నెంబర్ ఒకటే. తర్వాత దాన్ని 25వ వార్డుగా మార్చి ఆ చరిత్రను తుడిచేసారు. ఆ విధంగా నేటి విశాఖ నగరం పుట్టింది ఒక కోట వీధిలోనే.

12వ శతాబ్దంలో 'ఇషాక్ మదిని' అనే సూఫీ మతగురువు ఇక్కడ ఉన్న కొండపై నివసించేవారు. ఆయన బోధనలు అన్ని మతాల ప్రజలనూ ఆకర్షించేవి. ఆయన చనిపోయిన తర్వాత చేపట్టిన దర్గా నిర్మాణంలో ఆ ప్రాంత మత్స్యకారులు పాల్గొన్నట్లు ఆధారాలు ఉన్నాయి. తదనంతరం అది మదీనా దర్గా కొండగా పేరుగాంచింది. మొఘల్ చక్రవర్తి జహంగీర్ కాలంలో మదీనా కొండపై మసీదు నిర్మించినట్లు అక్కడ శాసనాలు తెలుపుతున్నాయి. బ్రిటిష్, ఫ్రెంచ్, స్కాండినేవియాల నౌకలు ఈ ప్రాంతం గుండా ప్రయాణిస్తున్నప్పుడు కొండ మీద మదీనా దర్గా వద్దకు రాగానే తమ ఓడల ధ్వజస్థంభాన్ని కిందికి దించి, సూఫీ గురువు పట్ల తమ గౌరవాన్ని ప్రకటించే వారంటే, ఆయన పేరు ప్రఖ్యాతలు ఏ స్థాయిలో ఉండేవో అర్థం అవుతుంది.

దర్గా కొండ కింద 800 సంవత్సరాల క్రితం నాటి ముస్లింల సమాధులు నేటికీ నిలిచి ఉన్నాయి. అక్కడ పర్షియన్ భాషలో పలు శాసనాలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం మదీనా కొండపై పీర్ల పండుగ గొప్పగా జరుపుకొంటారు.

1847లో విశాఖ సబ్ జడ్జిగా పనిచేసిన రాస్ అనే బ్రిటిష్ అధికారి ఇక్కడ కొండపై విశాలమైన బంగ్లా నిర్మించుకొన్నాడు. అందుకే దాన్ని 'రాస్ హిల్' అని పిలుస్తారు. 1867లో రోమన్ కాథలిక్ మిషన్ వారు దీన్ని కొనుగోలు చేసి చర్చి నిర్మాణం సాగించారు. 1877లో చర్చి ప్రారంభమైంది. ప్రతి ఏటా డిసెంబర్ 8న, కొండ గుడి పండగ పేరుతో అక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది. మేరీ మాతను భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ఈ పండగకు రాష్ట్రంలో పలు జిల్లాల నుండి వేలాది మంది పేద ప్రజలు వస్తారు.

శృంగమణి పర్వతంపై వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని 17వ శతాబ్దంలో నిర్మించినట్లు అక్కడ శాసనాలు తెలుపుతున్నాయి. దాన్ని ఆనాటి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడు గడియారం రంగస్వామి పాత్రుడు నిర్మించినట్లు తెలుస్తోంది. కాలక్రమేణా ఆ గుడి శిథిలమైపోయింది. 1939-45ల మధ్యకాలంలో కొండ దిగువన పోర్టు ఆఫీసులు నిర్మించారు. ఆ సందర్భంలో ఆనాటి పోర్టు అధికారి నంజుండయ్య, మరికొందరు అధికార్లు కలిసి కొండమీద ప్రాచీన దేవాలయం ఉన్న చోటనే కొత్తగా వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించారు.

## పోర్టు కాలుష్యం

విశాఖ నగరంలో మొట్టమొదటి ప్రభుత్వరంగ సంస్థ పోర్టు నిర్మాణం 1927లో ప్రారంభమై 1933లో పూర్తయింది. 7 అక్టోబర్ 1933న ఎస్.ఎస్. జలదుర్గ అనే ఓడ ప్రవేశంతో పోర్టు ప్రారంభమైంది. సముద్ర తీరాన నిర్మించినందున ఈ సంస్థలో అధిక శాతం ఉద్యోగులు ఆ ప్రాంతానికే చెందిన మత్స్యకారులు, తర్వాత ముస్లింలు, క్రిస్టియన్లు ఉండేవారు. విశాఖపట్నంలో దాదాపు సగం స్థలం పోర్టుకు చెందినదే. 1990 వచ్చే వరకు పోర్టు అంటే ప్రజలకు చాలా గౌరవం ఉండేది. ఆ ప్రాంత ప్రజలకి ఉద్యోగాలు కల్పించిన సంస్థగా దాని గురించి గొప్పగా చెప్పుకొనేవారు. నగరంలో క్రీడాకారులందరికీ పోర్టు ఆట స్థలమే ప్రధాన ఆధారంగా ఉండేది. పెద్ద ఎత్తున రాజకీయ సమావేశాలు, సభలు అక్కడే జరిగేవి. పోర్టులో ఉన్న సాంబమూర్తి కళామందిర్‌లో ప్రముఖ కళాకారుల నాటకాలు, ప్రదర్శనలు జరిగేవి. కళాకారులకు, క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్న సంస్థగా పోర్టు గురించి గొప్పగా చెప్పుకున్న కాలం ఉంది.

కాని నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన 1990ల తర్వాత నాటి నుంచీ తీవ్రమైన మార్పులు వచ్చాయి. ఇతర పోర్టులు నిరాకరించిన కోకింగ్ కోల్, సల్ఫర్ లాంటి ప్రమాదకరమైన కార్గోలను రవాణా చేయడం ప్రారంభించారు. కోట వీధి పక్కనే జనరల్ కార్గో బెర్త్‌ను నిర్మించారు. దానిలో నిబంధనలకు విరుద్ధంగా జనరల్ కార్గోకు బదులుగా ప్రమాదకరమైన కాలుష్య కార్గోలను డంప్ చేయడం ప్రారంభించారు. పోర్టులో రోజుకు 4690 లారీ ట్రిప్పులు తిరుగుతాయి. కోకింగ్ కోల్ అనే బొగ్గుపొడి చాలా తేలికగా ఉండి, ఏమాత్రం గాలి వీచినా ఎగిరిపోతుంది. ఇరవై అడుగుల ఎత్తువరకు వేసిన కుప్పల నుండి ఎగిరిన వాటి ధూళి విశాఖనగరమంతా వ్యాపిస్తుంది. లోడ్ చేసిన లారీలకు ఎటువంటి కవర్ లేకుండా తిరగడం వల్ల కూడా ధూళి ఎగిరి వ్యాపిస్తుంది. చుట్టుపక్కల ఉన్న పాతసిటీ నివాస ప్రాంతాలైన కోట వీధి, కదిరి దానయ్య వీధి, అంబు సరంగు వీధి, థామ్సన్‌స్ట్రీట్, సోల్జర్స్‌పేట, చిన్నమ్మవారి వీధి, చిలకలపేట, పద్మానగర్, కురుపాం మార్కెట్ ప్రాంతాలన్నీ బొగ్గు ధూళితో నల్లగా మారిపోయాయి. నిరంతరం శరీరంలోకి ధూళికణాలు ప్రవేశించడం వలన ప్రజల ఆరోగ్యాలన్నీ దెబ్బతింటున్నాయి. పాతనగరం చుట్టుపక్కలే కాకుండా దూర ప్రాంతాల వరకూ ఈ ధూళి ఎగరడం వలన, ఈ కాలుష్యం వలన ప్రజలు జబ్బుల పాలవుతున్నారు.

ఈ కాలుష్య ప్రభావం వలన ఆ ప్రాంతంలో ఉన్న స్కూళ్లలో చదివేవారు తగ్గిపోతున్నారు. సెయింట్ ఆలోసిస్ హైస్కూల్‌లో గతంలో నాలుగు వేల మంది విద్యార్థులుండగా నేడు కేవలం 1200 మంది మాత్రమే చదువుతున్నారు. ఈ స్కూల్ ఫాదర్ కురియన్ శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నారు. పోర్టు కాలుష్యంతో ప్రజల్ని చంపుతున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. సెయింట్ జాన్స్ పారిష్ స్కూల్‌లో గతంలో 1900 మంది విద్యార్థులుండగా నేడు 1250 మంది ఉన్నారు. స్కూల్, చర్చి బిల్డింగులన్నీ నల్లగా మారిపోవడం వలన కొన్ని సంవత్సరాల నుండి గోడలకు రంగులు వేయడం మానివేసామనీ, విద్యార్థులలో చాలా మంది అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారని ప్రిన్సిపాల్ మిసెస్ మినిశ్రీధరన్ తెలిపారు. ఫోర్ట్ కాన్వెంట్ బాలికల స్కూల్‌లో గతంలో రెండు వేల వరకూ విద్యార్థులు ఉంటే నేడు 1100 మంది ఉన్నారు. జ్ఞానాపురంలో 7 పెద్ద విద్యాసంస్థలున్నాయి. వీటిలో పేద విద్యార్థులకు ఉచిత వసతి, విద్య కల్పిస్తున్నారు. వాటిల్లో వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలుష్యం వల్ల అధిక సంఖ్యలో విద్యార్థులు ఆస్తమాతో బాధపడుతున్నారని ఆ సంస్థల ముఖ్యులు చెప్పారు.

## కాలుష్య ప్రభావంపై డాక్టర్లు, పర్యావరణ శాస్త్రజ్ఞుల అభిప్రాయం

ఆ ప్రాంత ప్రజలకు ముప్పై సంవత్సరాల నుంచి వైద్యం చేస్తున్న డాక్టర్ జె. సుశీల మాట్లాడుతూ, 'ఈ ప్రాంత ప్రజలందరికీ శరీర ముఖ్య భాగాలన్నీ ప్రధానంగా గొంతు, ఊపిరితిత్తులు, చర్మం, కాలుష్యానికి గురై రకరకాల జబ్బులు వస్తున్నాయి. ఆస్తమాకు అధిక శాతం గురవుతున్నారు. నీటి కాలుష్యం కారణంగా మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు లాంటివి వస్తున్నాయి. వీటి వలన రోగ నిరోధక శక్తి తగ్గిపోయి ప్రాణాంతకమైన వ్యాధులు పెరిగిపోతున్నా'యన్నారు.

'కాలుష్యంతో ముందు గొంతు నొప్పి, జ్వరం లాంటి స్వల్ప సమస్యలు వస్తాయి. మందులు వాడగానే తగ్గిపోయి క్రమేపీ కాలుష్యాన్ని ఎదుర్కొనే శక్తిని కోల్పోతారు. తర్వాత ఊపిరితిత్తులు పాడై కాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు చుట్టుముడతాయి. అవి ఎలాంటి మందులకూ లొంగవు' అని అన్నారు టి.బి. ఆస్పత్రి ఛెస్ట్ ఫిజిషియన్ డా. విజయకుమార్.

పోర్టు కాలుష్యంపై 2010లో డా. కె. నాగేశ్వరరావు, డా.జీషాన్ ముజాహిద్‌లు చేసిన అధ్యయనం ప్రకారం 'సరైన కవర్ లేకుండా, సల్ఫర్, బొగ్గు పొడులను పెద్ద పెద్ద గుట్టలుగా వేయడం, కన్వేయర్ బెల్టులకు సరైన కవరింగ్ లేకుండా నడపడం, లోడ్ చేసిన లారీలకు కూడా సరైన కవర్ లేకపోవడం వలన, ఆ కార్గోల ధూళి గాలికి ఎగిరి నగరమంతా వ్యాపిస్తోంది. ధూళి కణాల్లో బరువైన అణువులు మెల్లగా కిందికి దిగి భూమిలోకి, ప్రజల శరీరంలోకి చేరుకొంటాయి. పోర్టులో పనిచేసే వారు కనీస భద్రతా సౌకర్యాలతో ఎనిమిది గంటల పని చేస్తారు. అందువలన కాలుష్యం కారణంగా వచ్చే జబ్బులు తక్కువ స్థాయిలో వచ్చే అవకాశం ఉంది. అదే పోర్టు చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలు జీవితాంతం ఎటువంటి రక్షణలు లేకుండా ఈ కాలుష్యాన్ని నిరంతరం పీల్చడం వలన తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. బొగ్గు ధూళిలో కార్బన్, హైడ్రోజన్, సల్ఫర్, ఫాస్పరస్‌లతో పాటు ఇతర ఖనిజాల ఫ్రీ సిలికా ఉంటాయి. ఇవి చాలా ప్రమాదకరమైనవి. వీటివలన ఆస్తమా, ఊపిరితిత్తుల కాన్సర్, గుండె జబ్బులు, చివరగా అకాల మరణాలు సంభవిస్తాయి. కాలుష్యాన్ని నిర్ధారించే కొలమానాల ప్రకారం, కోట వీధి ప్రాంతంలో ఆర్.ఎస్.పి.ఎం. 60 పాయింట్లు ఉండాల్సి ఉండగా 195.6 పాయింట్ల వరకూ ఉంది. అలాగే టి.ఎస్.పి.ఎం. 100 పాయింట్లు ఉండాల్సి ఉండగా 440.9 పాయింట్ల వరకూ ఉందని' వివరించారు.

1997లో ఆంధ్రా యూనివర్సిటీ వారు జరిపిన ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఇ.ఐ.ఎ.) ప్రకారం 'కాలుష్య ధూళిలో హెవీమెటల్స్, కాపర్ లీడ్, ఐరన్, మాంగనీస్, కాడ్మియం, నికిల్, కోబాల్ట్, జింక్, పోహ్యా రోమాటిక్ హైడ్రో కార్బన్లు అధిక శాతం ఉన్నాయి. ఇవి

హెచ్చుగా విషపూరితమైనవి. వీటి వలన తక్కువ స్థాయిలోనైనా, ఎక్కువ కాలం ప్రభావితమైతే చాలా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంద'ని నిర్ధారిస్తూ, 'పోర్టు నిర్ణీత కాలంలో బొగ్గులాంటి మలిన పదార్థాలను, లోహ ఖనిజ బల్క్ కార్గోలను, సల్ఫర్ పౌడర్, అమ్మోనియా నైట్రేట్ లాంటి వాటిని నిషేధించాలని' సిఫారసు చేసింది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సి.పి.సి.బి.) లెక్కల ప్రకారం 70 పాయింట్ల స్కోర్ దాటిన ప్రాంతాలను తీవ్రమైన కాలుష్య ప్రాంతాలుగా గుర్తించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని హెచ్చరించింది. కాని కాంప్రహెన్సివ్ ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ ఇండెక్స్ (సి.ఇ.పి.ఐ.) ప్రకారం విశాఖపట్నం 70.82 పాయింట్ల స్కోరుతో రాష్ట్రంలోనే అత్యధిక కాలుష్యంతో నిండిన నగరంగా రికార్డు సాధించింది.

'ఇప్పుడు పోర్టు ఇన్నర్ హార్బర్ ఉన్న చోట లోవతోట అనే ప్రాంతముండేది. అక్కడ ప్రపంచంలోనే అరుదైన పక్షి జాతులుండేవి. వివిధ రకాల జీవజాలముండేది. పోర్టు రాకతో అవన్నీ కనుమరుగై పోయాయి' అని అన్నారు ఆంధ్రా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యులు కామేశ్వరరావు.

పోర్టుకు ఎంతో దూరంలో ఉన్న సీతమ్మధార నివాసితులు ఎ.వి.ఎన్. కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరావు 'ఈ ప్రాంతంలో చాలా మందికి పోర్టు కాలుష్యం వలన శ్వాస కోస సంబంధమైన వ్యాధులు వస్తున్నాయ'న్నారు.

## హైకోర్టులో కేసులు

1997లో సిటిజన్ వెల్ఫేర్ సంస్థవారు విశాఖపట్నం పోర్టు కాలుష్యంపై హైకోర్టులో కేసు వేశారు. దానిపై హైకోర్టు స్పందించి కాలుష్య నియంత్రణ మండలి (ఎ.పి.పి.సి.బి.)ని వెంటనే నివారణా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. 2000లో కాలుష్య నియంత్రణ మండలి వారు, కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కొన్ని స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాల్సిందిగా పోర్టుకు ఆదేశాలిచ్చారు. పన్నెండు సంవత్సరాలు గడిచినా అవి అమలు కాలేదు. ఇంకా జన జాగరణ సమితి కోట వీధి నివాసితుల సంఘం అధ్యక్షుడు అడ్వకేట్ ఎం.ఎ. రసూల్, హోమియో డాక్టర్ రియాజ్ అహ్మద్ తదితరులు పోర్టు కాలుష్యంపై వేసిన కేసుల్లో కొన్ని ఇంకా నడుస్తూనే ఉన్నాయి. కొన్నింటిలో ఆదేశాలిచ్చినా అమలు జరగలేదు.

## పోర్టు చైర్మన్ ప్రతిస్పందన

కాలుష్యం కారణంగా ప్రజలు ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతున్నారని, నగర ప్రజల ఆరోగ్యాన్ని హరించే హక్కు పోర్టుకు లేదని జూన్ 2010లో అడ్వకేట్ ఎ.ఎం. అహ్మద్ పంపిన లీగల్ నోటీసుకు జవాబునిస్తూ, 'పోర్టు వల్లనే కాలుష్యం వస్తుందని తద్వారా ప్రజలకు అనారోగ్యాలు వస్తున్నాయని చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం. ఏ మాత్రం ఆధారాలు లేకుండా, సరైన అధ్యయనం జరపకుండా, ఆరోపణలు చేస్తున్నారు. మాకూ మానవ హక్కులంటే చాలా గౌరవం ఉంది. కాలుష్య నియంత్రణ కోసం పోర్టు పరిసర ప్రాంతాల్లో నాలుగు లక్షల ముప్పై వేల చెట్లు నాటాం. మరో 14 వేలు 2011లోగా నాటిస్తాం. ధూళిపై నీళ్లు చల్లిస్తున్నాం. ధూళి ఎగరకుండా 240 మీటర్ల పొడవునా 30 అడుగుల ఎత్తున పెద్ద గోడని నిర్మించాం. ఇంకా ఎత్తైన గోడలు నిర్మిస్తాం' అని పోర్టు చైర్మన్ జవాబునివ్వడం కాలుష్య బాధిత ప్రజలను, సామాజిక దృక్పథంతో సేవ చేస్తున్న డాక్టర్లను, పర్యావరణ శాస్త్రవేత్తలను, పర్యావరణ సంస్థలను అవమానించడమే. కాలుష్యానికి పోర్టు కారణం కాదంటున్న చైర్మన్ ఏప్రిల్ 2010లో 'కాలుష్యాన్ని నియంత్రించడానికి ఖర్చుకు వెనకాడకుండా ఇటలీ నుండి ఫోమ్ స్ప్రేయర్స్‌ను తెప్పించి ఒక సంవత్సరంలో కాలుష్యాన్ని పూర్తిగా తగ్గిస్తానని' ఎలా అన్నారో జవాబు ఇవ్వాలి. పైగా ఆయన చెప్పి 20 నెలలు గడుస్తున్నా కాలుష్యం తగ్గలేదు సరికదా ఎన్నో రెట్లు పెరిగిపోయింది.

ఒకవైపు ప్రజలను కాలుష్యానికి గురిచేస్తూ, మరోవైపు 1500 కోట్ల రూపాయలతో పోర్టును విస్తరించి, అధునాతనమైన యంత్రాలతో కాలుష్యాన్ని తగ్గిస్తామని ఈ మధ్యనే చైర్మన్ ప్రకటించారు. పోర్టు విస్తరణకు అవసరమైన స్థలంలో ప్రస్తుతం పాతసిటీ ఉందని కాలుష్యం కారణంగానే ఆ ప్రాంతాన్ని పూర్తిగా తరలించాలనే ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని' అన్నారు. పాత సిటీ ప్రాంతాలలో దాదాపు 25 వేల నుండి 40 వేల వరకు ప్రజలు నివసిస్తున్నారు. వారిలో 80 శాతం మంది పేద ప్రజలే. ఇది ఆ ప్రాంత ప్రజల జీవనాధారంపై పెద్ద దెబ్బ కొడుతుంది. ఎందుకంటే వారిలో అత్యధిక శాతం మత్స్యకారులు, చేపల వేట మీద బతికేవారు. తీరప్రాంతం నుండి దూర ప్రాంతాలకు వెళ్లగొడితే, నీటిలో చేపను బయట పడవేసి చంపినట్లే అవుతుంది. ఒకవైపు విస్తరణకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకోవడం, మరోవైపు తాను బలవంతంగా ఎవ్వరినీ తొలగించనని చెప్పడం మాయ మాటలుగా ప్రజలు భావిస్తున్నారు. ఎందుకంటే వారున్న స్థలం ఖరీదు చదరపు గజం పది వేల రూపాయలు ఉంటే పోర్టు 40 వేల వరకూ ఇస్తుందని చెప్పడం, వారిలో కొంత మందికి డబ్బు ఆశ చూపించి లొంగదీసుకోవడానికి, తద్వారా ఒప్పుకున్న వారికి ఒప్పుకోని వారికి మధ్య తగదాలు సృష్టించాలని ఎత్తుగడ ఉందని ప్రజలు భయపడుతున్నారు.

## ప్రజల ఉద్యమం

విశాఖ పాత సిటీ ప్రజలు పోర్టు కాలుష్యాన్ని నియంత్రించాలని 1996 నుండీ నిరసన ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎం.పి., ఎం.ఎల్.ఎ.లకు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పది వేల పోస్టు కార్డులతో విజ్ఞప్తి చేశారు. ఒకవైపు కాలుష్య నివారణ కోసం పోరాటం చేస్తున్న సమయంలోనే పోర్టు విస్తరణ పేరుతో పాత సిటీని తొలగిస్తామని ప్రకటించడంతో పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. ప్రాణం పోయినా ఖాళీ చేయం అంటూ జాయింట్ ఎక్షన్ కమిటీగా ఏర్పడి, మహమ్మద్ ఆలీఖాన్, కదిరి అప్పారావు, ఎం.డి. అఫ్సర్ ఖాన్, ఎం.ఎ. రసూల్, ఎస్. అజీజ్ అహ్మద్, కదిరి చిన అప్పారావు, ఎం.డి. గఫార్, జె.డి.

నాయుడు, మైలపల్లి శ్రీను, ఎం.డి. హనీఫ్, సి.ఎచ్. వీరబాబు తదితరుల నాయకత్వంలో అనేక నిరసన ఊరేగింపులు జరిపారు. 2001 ఆగస్టులో జి.వి.ఎం.సి. వారు, పోర్టు నియమించిన ప్రైవేట్ కంపెనీలు ఆ ప్రాంత స్థలాలకు సర్వేకు వస్తే వారిని ప్రజలు అడ్డుకొని తరిమేశారు. నవంబర్ 13న పాత పోస్ట్ ఆఫీసు వద్ద ఐరన్ పోల్స్‌ను రోడ్డుకడ్డంగా పాతి పోర్టు లారీలు తిరగకుండా అడ్డుకొన్నారు. నవంబర్ 18న కోట వీధి ప్రాంతంలో నిరసన ప్రదర్శన జరిపి చైర్మన్ దిష్టిబొమ్మను కాల్చారు. నవంబర్ 21న ఐదు వేల మందితో కోట వీధి నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపారు. జగదాంబ జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి 'పోర్టు కాలుష్య భూతం' దిష్టిబొమ్మను కాల్చారు. ఈ ఊరేగింపులో అన్ని మతస్తుల వారు, అధిక సంఖ్యలో స్త్రీలు పాల్గొన్నారు. 'ప్రాణాలైనా ఇస్తాం గానీ ఇళ్లు ఖాళీ చేయం' అంటూ వేలాది మంది ఒకే గొంతుతో నినాదం ఇచ్చారు. డిసెంబర్ 28న కోట వీధిలో ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యాన ధర్నా జరిపారు. దీనిలో వివిధ ప్రజా, విప్లవ సంఘాలు పాల్గొన్నాయి.

రాజకీయ నాయకుల్ని నమ్మితే నష్టపోతామని ప్రజలు గ్రహిస్తున్నారు. గతంలో ఎం.ఎల్.ఎ. ఎన్నికల్లో పాత సిటీ ప్రాంతంలో పోటీ చేసిన ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పోర్టు కాలుష్యమే ప్రధాన అంశంగా ప్రచారం చేసి అధికారంలోకి వస్తే కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రిస్తామని, పోర్టు యజమాన్యంపై చర్యలు తీసుకుంటామని వాగ్దానాలు చేశారు. చివరకు కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణం రాజు శ్రీనివాస్ గెలిచారు. కాని ఇంతవరకూ వాగ్దానాలు అమలు జరగలేదు. ఈ మధ్యనే కాలుష్యం సమస్యపై రాజ్యసభ ఎం.పి. సుబ్బిరామిరెడ్డి నాయకత్వాన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పోర్టును సందర్శించింది. పోర్టు చర్యలను ఏ మాత్రం తప్పుపట్టకుండా, కాలుష్యం ఉందని అంగీకరిస్తునే మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించవచ్చని ప్రకటించింది. అంతవరకు స్థానికులు అక్కడ ఉంటే వారి ఆరోగ్యాలు పాడైపోతాయని, తరలిపోతే మంచిదని ఉచిత సలహా కూడా ఇచ్చారు.

ఈ మధ్య మునిసిపల్ కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'అనుమతి లేని ప్రాంతాల్లో కూడా పోర్టు భారీ ఎత్తున బొగ్గు నిల్వలు చేస్తున్నదని' ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారే స్వయంగా వెల్లడించినట్లు తెలిసింది. పేరుకే కాలుష్య నియంత్రణ మండలి గానీ ఆ సంస్థ పోర్టు కాలుష్యాన్ని నియంత్రించడంలో పూర్తిగా విఫలమైంది. ఏవో కొన్ని ఆదేశాలివ్వడం, అవి అమలు జరిగాయా లేదా అని చూసి చర్యలు తీసుకోవడంలో ఎటువంటి చొరవ చూపించడం లేదు. లక్షలాది ప్రజల ఆరోగ్యాన్ని బలిగొంటున్న సంస్థలపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత తీసుకోవడం లేదు. అందుకే ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి పోర్టు యాజమాన్యంతో కుమ్మక్కైయిందని ఆరోపిస్తున్నారు.

నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్.ఇ.ఇ.ఆర్.ఐ.), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఎ.పి.పి.సి.బి.) సంయుక్తంగా విశాఖపట్నం 'బౌల్ ఏరియా'లో (ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్క నివాస ప్రాంతాలు) కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడం గానీ, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలను విస్తృతపరచడానికి గానీ ఎలాంటి అనుమతులివ్వవద్దని సిఫారసు చేసింది. అయినా పోర్టు విస్తరణ నిరాటంకంగా కొనసాగుతోంది. ఈ విషయంపై రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి ఇ.ఎ.ఎస్. శర్మ పోర్టు విస్తరణ కార్యక్రమానికి అనుమతులివ్వవద్దని కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఉత్తరం రాశారు.

ఈ సందర్భంలో చెన్నై పోర్టు గురించి చెప్పుకోవాలి. గతంలో కాలుష్య కార్గోలను రవాణా చేస్తున్న పోర్టుల్లో చెన్నై పోర్టు ప్రథమ స్థానంలో ఉండేది. అక్కడ ప్రజలు ఉద్యమించగా హైకోర్టు 'బొగ్గు లాంటి కాలుష్య కారక కార్గోలను చెన్నై పోర్టులో దిగుమతి చేసుకోరాదని, వాటిని దూరంగా ఉన్న ఎన్నార్ పోర్టుకు మార్చాలని' ఆదేశించింది. ఆ విధంగా కాలుష్య కార్గోలను తరలించి నేడు చెన్నై పోర్టు సురక్షిత పోర్టుగా మారింది.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా విశాఖ పాతనగరంలో మూడు మతాల ప్రార్థనాలయాలు ఒకే కొండ మీద ఉండడం గొప్ప విషయం. పోర్టు అవసరాల కోసం గతంలో ఆ కొండను తొలిచి మార్గాలు వేయడం వలన మూడు కొండలుగా మారి మూడు ప్రార్థనాలయాలు వేరయ్యాయి. అయినా నేటికీ దేశంలోనే మత సామరస్యానికి ఒక గొప్ప ప్రతీకలుగా నిలబడ్డ విశాఖ పాతనగరం నేడు పోర్టు విస్తరణ కారణంగా మాయమైపోయే ప్రమాదం ఏర్పడింది. దానివల్ల శతాబ్దాల నుండి కాపాడుకొస్తున్న మత సామరస్య వాతావరణం ఛిన్నాభిన్నమైపోతుంది. పైగా కాలుష్య భూతం విశాఖపట్నం ప్రజల్ని అనారోగ్య బాధితుల్ని చేస్తుంది. ఇక్కడ అభివృద్ధి పేరుతో తీవ్రమైన విధ్వంసం జరుగుతోంది. ప్రజల్ని బలి ఇచ్చి అయినా ముందుకు పోవాలని చూస్తున్నారు.

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాల వల్ల లాభపడిన వర్గాలు ఈ పట్టణానికి 'సిటీ ఆఫ్ డెస్టినీ' అని ముద్దు పేరు పెట్టి పిలుస్తున్నారు. కాని అది 'సిటీ ఆఫ్ స్లోడెత్'గా మారిపోబోతోంది.

ఈ సందర్భంలో 'ఈ దుమ్మూ ధూళీతో మేం బతకలేం. ఇప్పటికైనా ప్రభుత్వం, పోర్టు యజమాన్యం దిగివచ్చి మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి. కుట్రపూరితంగా, దుర్మార్గ ఆలోచనలతో మమ్మల్మి ఇక్కడి నుండి తరలించాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుంది' అని హెచ్చరిస్తున్న కోట వీధి పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రజాస్వామ్యవాదులందరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

*(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు)* వీ

వీక్షణంకు చందాలు, వీక్షణం పబ్లికేషన్ పుస్తకాల కోసం మీరు ఆన్‌లైన్ ద్వారా 'వీక్షణం' పేర డబ్బులు కట్టడానికి వీలుగా – వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175,**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

*విద్యుత్ లోటు సమస్యలకు కారణాలు వివరిస్తూ, విద్యుత్ కొరతను అధిగమించడానికి వివిధ ప్రత్యామ్నాయాల కోసం అన్వేషించాలనీ లేకుంటే పారిశ్రామిక ప్రగతి కుంటు పడుతుందనీ అంటున్నారు* **వి. హనుమంతరావు**

# విద్యుచ్ఛక్తి - వెలుతురు నుంచి చీకట్లోకి

పవర్ కట్లు, బ్లాకవుట్లు ఎందుకేర్పడుతున్నాయో తెలుసా? పవర్ అంతా రాజకీయ నాయకుల చేతుల్లో ఉంది కనుక. నేనేమీ హాస్యానికి అనడం లేదు. రాజకీయ నాయకులు 24 గంటలూ రాజకీయాల్లో మునిగి తేలుతూండడంతో, ఆ రంధిలో పడి కరెంట్ సంగతే మరిచి పోయారు. కాదు, కాదు, అలాంటి సమస్య ఒకటి ఉందనే స్పృహే లేదు. పొరపాటున ఎపుడైనా గుర్తుకొస్తే సమావేశం ఏర్పాటు చెయ్యండంటారు. స్వయానా ప్రధానమంత్రి ఆధ్వర్యాన గత సంవత్సరంలో ఆరుసార్లు పిలిచి, ఆఖరు నిమిషంలో వాయిదాలు పడుతూ వచ్చాయి. ఈ లెక్కన దేశం ఈ సమస్య నుంచి ఎపుడైనా బయటపడేనా?

ఇదేదో ఇవాళా నిన్నా తలెత్తిన సమస్య కాదు. ప్రణాళికా సంఘం ప్రతి అయిదేళ్లకొకసారి లక్ష్యాలను నిర్ణయించడం, ఆ లక్ష్యాన్ని చేరుకోలేక పోవడం గత నాలుగైదు ప్రణాళికల కాలం నుంచి దేశాన్ని వెంటాడుతూనే ఉంది. దేశంలో, రాష్ట్రంలో విద్యుదుత్పత్తి చేసే యంత్రాలు ఉత్పత్తి చేసేది విద్యుచ్ఛక్తి కాదు, విద్యుత్ కొరత. ప్రణాళికల్లో లక్ష్యాలు బారెడు, సాధిస్తున్నది మూరెడు.

8వ ప్రణాళిక రచించే నాటికి దేశంలో 48,000 మెగావాట్ల విద్యుచ్ఛక్తి కావాల్సి ఉంటుందని ప్రభుత్వమే అంచనా వేయగా, ఆర్థిక వనరులు లేవని 38,000 మెగావాట్ల లక్ష్యానికి కుదించారు. ఆ తర్వాత అది సాధ్యం కాదని 28,000 మెగావాట్లకు కుదించి, తిరిగి సవరించి 18,000 మెగావాట్లు అన్నారు. అప్పటి 13వ విద్యుత్ సర్వే ప్రకారం రాష్ట్రంలో అవసరాలతో పోలిస్తే, విద్యుత్ సరఫరా నూటికి 23.2 వంతులు తక్కువ కాగా అది 1991-92 నాటికి ఈ తరుగుదల 27.2 వంతులకు, 1994-95 నాటికి 31.7 వంతులకు పెరుగుతుందని అధికారిక అంచనా లక్ష్యాన్ని సాధించాలనే ఆదుర్దాతో ఆంధ్రప్రదేశ్‌లో అప్పు చేశాం. అది తీరాలంటే ఉత్పత్తికి తోడ్పడే వ్యాపకాల్లో పెట్టుబడి పెడితే వచ్చే ఆదాయంతో తిరిగి చెల్లించవచ్చు. కాని అప్పు తెచ్చి రోజువారి ఖర్చులకు ఖర్చు పెట్టేస్తున్నాం. ఉదాహరణకు 1993-94లో విద్యుచ్ఛక్తి కోసం రు. 900 కోట్లకు పైగా వెచ్చిస్తున్నా ఇందులో సగం అప్పు. 1994-95లో 820 మెగావాట్ల అదనపు స్థాపిత శక్తి లక్ష్యంగా పెట్టుకొన్నాం. కాని ఒక్క మెగావాట్ కూడా సాధించలేదు. (ఫిబ్రవరి 1994) ఆ తర్వాత 20 మెగావాట్లు సాధించారని వార్త. ఇదంతా ఆంధ్రప్రదేశ్ చరిత్ర. గత చరిత్రంతా తిరగతోడుతున్నానంటే విద్యుత్ రంగంలో వైఫల్యం ఈనాటిది కాదు. గత శతాబ్దం నుంచి వస్తున్న ఆనవాయితియే. ప్రస్తుతానికి వస్తే 2010లో లక్ష్యం 21,441 మెగావాట్లు. సాధించింది 12,100 మెగావాట్లు మాత్రమే. ఈ లెక్కన 2012 సంవత్సరానికి నిర్ణయించుకొన్న లక్ష్యం 2017 నాటికి కూడా సాధించే అవకాశం లేదు. 2011 మార్చ్ నాటికి లక్ష మెగావాట్లు లక్ష్యం కాగా సవరించిన అంచనా 75,000 మెగావాట్లు. ఈ లక్ష్యాన్ని 62,000 మెగావాట్లకు తగ్గించొచ్చు. చరిత్ర పేజీలు తిరగేస్తే సవరించిన అంచనాలు సాధించిన దాఖలాలు లేవు. మామూలుగా వేసవికాలంలో విద్యుత్ కోతలుంటాయి. కాని మన ఘనత వహించిన ప్రభుత్వ హయాంలో శీతాకాలంలో కోతలు రావడం చూస్తే మన ప్రభుత్వం ఎంత అధ్వాన్న ప్రభుత్వమో తెలిసిపోతుంది. ఇంకా దారుణమైన విషయ మేమంటే ప్రభుత్వ విద్యుత్‌సంస్థ నేషనల్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిపిసి) వద్ద విద్యుత్ ఉంది కానీ కొనేవారు లేరు. విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటుకు నిధుల కొరత ఎదుర్కొంటోంది. బ్యాంకులు రుణాలివ్వడానికి సిద్ధంగా ఉన్నాయి కాని, బొగ్గు నిల్వలు చూపించండంటున్నాయి.

బొగ్గు లభ్యత భయంకరంగా ఉంది. దేశంలో నిల్వల కొరత ఏర్పడింది. అదొక సమస్య అయితే, బొగ్గులో నుసి ఎక్కువగా ఉండడం వల్ల (మన సింగరేణి ఆ రకం బొగ్గే) చేయాల్సినంత వేడిని ఉత్పత్తి చేయడం లేదు. ఈ నుసిని తగ్గించే యంత్రాలున్నాయి కాని వాటిని ఉపయోగిస్తే ఉత్పత్తి చేసే విద్యుత్ ఖరీదవుతుంది. ఈ కారణంగా బొగ్గును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మన పరిస్థితిని గమనించిన దేశాలు బొగ్గు ధరను పెంచేశాయి. పోనీ, మన నిల్వలైనా సరిపడా ఉన్నాయా అంటే 12వ ప్రణాళిక విద్యుదుత్పత్తి లక్ష్యం చేరడానికి 688 మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరం కాగా, మన నిల్వల అంచనా 550 మిలియన్ యూనిట్లు మాత్రమే అయినా 'అందరికీ విద్యుచ్ఛక్తి' అనే నినాదంతో ప్రభుత్వం ప్రజల నెత్తిన కుచ్చు టోపీ పెడుతోంది.

కృష్ణా-గోదావరి బేసిన్‌లో చమురు సరఫరా చేస్తామని రిలయన్స్ సంస్థతో వై.ఎస్. పాలనలోనే ఒప్పందం కుదిరింది. కాని తర్వాత చేతులెత్తేసింది. ఇతర ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థలు చైనాలో యంత్రాలు చవగ్గా వస్తున్నాయని ఆ దేశంతో ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. కానీ బొగ్గు కొరత, చమురు కొరత, ఖరీదు పెరుగుదలల కారణంగా కేంద్రాల స్థాపన నత్త నడకన సాగిస్తుండగా, తాజాగా విద్యుత్ కేంద్రాల స్థాపకు

చొరవ చూపించిన ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడంలో తాత్సారం చేస్తున్నాయి. ప్రపంచబ్యాంక్ ఒత్తిడితో రెండు దశాబ్దాల క్రితమే విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేట్ రంగానికి కేంద్రం విద్యుత్ బోర్డులను పునర్ వ్యవస్థీకరించింది. గేట్లు ఎత్తివేసింది.

'1995లోనే "వెలుతురు నుంచి చీకట్లోకి" అనే పుస్తకాన్ని నేను రాసినప్పుడే (తెలుగులో విద్యుచ్ఛక్తి గురించిన మొదటి పుస్తకం) ప్రపంచ బ్యాంక్ ప్రమేయం గురించి రాయడం జరిగింది'. 1950-90ల మధ్య కాలంలో విద్యుదుత్పత్తి శక్తి 38 రెట్లు, వినియోగం 50 రెట్లు, విద్యుత్ సరఫరా అయ్యే గృహాల సంఖ్య 40 శాతం, 90 లక్షల పంపు సెట్లు, 80 శాతం గ్రామాల విద్యుదీకరణ, తలసరి వినియోగం 16 రెట్లు పెరిగింది. వెనుకనున్న అభివృద్ధి చెందిన దేశాలకు, ప్రపంచ బ్యాంక్‌కు ఈ అభివృద్ధి గంగ వెర్రులెత్తిస్తోంది. దేశం ఇలా అభివృద్ధి అయిపోతుంటే తాము తయారు చేసే విద్యుత్ యంత్రాలను ఎక్కడ అమ్ముకోవాలి? ఇటు విదేశాల్లో అమ్ముకోలేక, తమ తమ దేశాల్లో అవసరమూ లేక, వాళ్లు తమ కర్మాగారాలను మూసివేసుకోవాల్సిందేనా? ముఖ్యంగా బి.ఎచ్.ఇ.ఎల్. శక్తి సామర్థ్యాలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యుత్ కేంద్రాన్ని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ సరఫరా చేసిన యంత్రాలతో నిర్మించడం వల్ల ప్రతి కిలోవాట్ విద్యుచ్ఛక్తి సగటు పెట్టుబడి రు.4471 కాగా, అదే ఆరవ ప్రణాళికలో విదేశీ యంత్రాలు అమర్చిన రామగుండం కేంద్రంలో రు.9568లు అయింది. ఏడవ ప్రణాళికలో యు.పి.లో రు.16,600 అయింది. బి.ఎచ్.ఇ.ఎల్.ను ఇలాగే ఎదగనిస్తే భారత దేశం మాట అటుంచి ప్రపంచ మార్కెట్‌లోనే తమకు పోటీగా తయారవుతుంది. అందుచేత ఎలాగైనా దాని నెత్తిన మేకు కొట్టాలని నిర్ణయించుకొని రంగంలోకి దిగింది. విద్యుచ్ఛక్తి రంగంలో ఎక్కువగా రుణాల మీద ఆధారపడే మార్గంలోకి దేశాన్ని మళ్లించింది. ఇటీవల సంవత్సరాల్లో మరింత చొరవ చూపిస్తోంది. అవును మరి, ఏదైతే కొరత ఉందో దానిలో పెట్టుబడులు పెంచి, ధరలు పెంచి, లాభాలు దండుకోవడం పెట్టుబడిదారీ వ్యవస్థకు వెన్నుతో పెట్టిన విద్య. కాని ప్రస్తుత రాజకీయార్థిక సంక్షోభం, ముడిసరుకుల కొరత చూసి ఉన్న చోటే లెఫ్ట్‌రైట్ కొడుతున్నాయి. ప్రైవేట్‌రంగం ఎపుడూ లాభాలు పెంచుకోడానికి ప్రయత్నిస్తుంది కాబట్టి యూనిట్ ధర పెంచి ప్రజలపై భారాలు పెంచుతుంది. ప్రైవేట్ రంగమేమిటి, ప్రభుత్వమే యూనిట్ ధర పెంచడానికి పావులు కదుపుతోంది. రెండు రంగాలూ ఇలా పెంచుకుంటూ పోతే, సామాన్యుల నడ్డి విరగొట్టడమే అవుతుంది.

విద్యుచ్ఛక్తి సమస్యలు అయిపోలేదు. బొగ్గు గనుల నుంచి దగ్గరలో ఉన్న రైల్వే స్టేషన్‌కు బొగ్గు చేరవేయడం ఒకటైతే, వాగన్ల సమస్య మరొకటి. నార్ల తాతారావు విద్యుత్ రంగం బాధ్యత నిర్వర్తించిన రోజుల్లో వాగన్లలో సరఫరా అయ్యే బొగ్గులో సగం మాత్రమే బొగ్గు, మిగతా సగం రాళ్లేనని బహిరంగంగానే ఫిర్యాదు చేస్తూండేవారు. అలాగే విద్యుదుత్పాదన కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన భూసేకరణ మరో సమస్య. నీటి సమస్య ఇంకో సమస్య. బొగ్గు నుసి మేటలు వేయడం, దానినెలా వదిలించుకోవాలి అనే సమస్య పరిష్కారంలో ఆ నుసిని ఇటుకలుగా మార్చాలన్న ప్రతిపాదన ఇదివరకే వచ్చింది. ఆ ప్రతిపాదన ఏమైందో తెలియదు. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఒక్క నెల్లూరు జిల్లాలోనే 15 కిలోమీటర్ల పరిధిలో 32,000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి 29 థర్మల్ కేంద్రాలు, అటు విశాఖ, శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటుకు వేల ఎకరాలను స్వాధీనం చేసుకోవడానికి అక్కడ నివసించే ప్రజల నుంచి తీవ్రమైన అభ్యంతరం ఎదురై పోలీసు కాల్పుల వరకూ పోయింది. భూమి సేకరణ ఒక సమస్య అయితే, ఆ కేంద్రాల ఏర్పాటుకు అయిదు లక్షల టన్నుల బొగ్గు అవసరం కాగా దాని నుంచి 1.25 లక్షల టన్నుల బూడిద, కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ లాంటి విషవాయువులు ఏర్పడితే, అక్కడి ప్రజలు చావాలా? బతకాలా?

ప్రైవేటీకరణే దేశానికి మోక్షం అంటారు. 1991లోనే సరళీకృత ఆర్థిక విధానం ప్రవేశపెట్టినపుడు ఆ ప్రైవేటీకరణను ఆకాశానికెత్తేశారు. రెండు దశాబ్దాల తర్వాత చూస్తే ప్రభుత్వరంగం ఏ దుస్థితి నెదుర్కొంటున్నదో, ప్రైవేట్ రంగం కూడా అదే పరిస్థితిలో ఉండడమే కాక ప్రభుత్వాన్ని కస్టమ్ డ్యూటీ తగ్గించండి, చవగ్గా లభించే చైనా యంత్రాల దిగుమతుల మీద డ్యూటీ పెంచండి, బొగ్గు దిగుమతికి సౌకర్యాలు కల్పించండి అంటూ దేవులాడుతోంది. ఈ అభ్యర్థనల వెనుక ఉన్న రహస్యం ఏమంటే విద్యుచ్ఛక్తి డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి లాభాలు చేసుకోవచ్చు. కాని సామాన్యుడి ఆవేదన ఏమంటే ఈ సౌకర్యాలన్నీ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొని రాబట్టుకొని, యూనిట్ ధర పెంచి మరిన్ని లాభాలు దండుకోవడమే. విద్యుత్ కేంద్రాలు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు, బట్టల మిల్లులు, కాగితం, ఎరువులు, సిమెంట్, అల్యూమినియం - ఇలా ఎన్నో రకాల పరిశ్రమలు బొగ్గు లభిస్తేనే గాని నడవవు. ఇవి మూలపడితే జి.డి.పి. తగ్గుతుంది, మొత్తం ఆర్థిక పరిస్థితే తలకిందులవుతుంది. విద్యుత్ కేంద్రాలకి బొగ్గు ఉత్పత్తిలో 70 శాతం అవసరమవుతుంది. పారిశ్రామికవేత్తల సంస్థ ముఖ్యమంత్రికి అందజేసిన వినతిపత్రం ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ కోతవల్ల రోజుకు రు. 800 కోట్ల విలువగల ఉత్పత్తి నష్టపోతోంది. ప్రభుత్వం పన్ను ఆదాయం తగ్గిపోతోంది. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నిధులు, బొగ్గు కొరత వల్ల లక్ష కోట్ల రూపాయల పనులు నిలిచిపోవడమో, నత్తనడకన సాగడమో జరుగుతోంది. 25 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రపంచ బ్యాంక్ వేలుపెట్టి దేశాన్ని ఈ దుర్గతికి తీసుకొని వచ్చింది. ఇపుడు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఇద్దరూ అన్నదమ్ములే) 1100 బిలియన్ డాలర్ల రుణం ఇవ్వడానికి, (ట్రాన్స్‌మిషన్ లైన్లు) వేయడానికి మొగ్గు చూపుతుందట. ఇలాంటి సంస్థలు ధన రూపంలో సహాయం ఇవ్వవు. అవసరమైన వస్తువులన్నీ ఫలానా దేశంలో ఫలానా కంపెనీల నుంచి మాత్రమే కొనాలని షరతు విధిస్తాయి.

కొసమెరుపు: ఉన్న పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేయలేని ప్రభుత్వం ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడితో రాబోయే పరిశ్రమలకు విద్యుత్ ఎక్కడ నుంచి తెస్తుందో?

బొగ్గు కొరతను అధిగమించడానికి అణు విద్యుత్, పవన విద్యుత్ లాంటి ప్రత్యామ్నాయాలున్నాయి. వాటి గురించి లోతుగా పరిశీలన స్థలాభావం వల్ల ప్రస్తావించబోవడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమైన కొద్దీ వాటి ఖర్చు పెరుగుతుంది. మనం చెల్లించాల్సిన యూనిట్ ఖరీదు పెరుగుతూంటుంది. మనం మళ్లీ ఆముదం దీపాలకు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

*(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు)* వీ

***స్త్రీల మీద అత్యాచారాలకు కారణం స్త్రీలు ధరించే దుస్తులే అని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యకు స్పందనగా వర్ష గండికోట రాసిన బహిరంగ లేఖ***

# బాధితులపైనే నింద మోపుతున్న డి.జి.పి.

(కెనడాలో 2011 జనవరి 24న ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన భద్రతా సదస్సులో మాట్లాడుతూ ఒక పోలీసు అధికారి మైకేల్ సాంగ్వినెట్టి చేసిన వ్యాఖ్య ప్రపంచవ్యాప్తంగా స్త్రీల నిరసన ప్రదర్శనలకు, ప్రతివ్యాఖ్యలకు, రచనలకు కారణమవుతున్నది. రేప్‌కు కారణం స్త్రీ వేసుకునే దుస్తులే అనే సాధారణ పురుషాధిపత్య దురభిప్రాయాన్నే ఆ పోలీసు అధికారి వెలిబుచ్చాడు. 'స్త్రీలు అత్యాచారాలకు గురి కాకుండా ఉండాలంటే, తిరుగుబోతు (స్లట్) లాగ దుస్తులు వేసుకోకుండా ఉండాలి' అన్నాడు. ఆ వ్యాఖ్యలోని తిరుగుబోతు అన్నమాటనే తీసుకుని, తిరుగుబోతుల ప్రదర్శన (స్లట్‌వాక్) అనే నిరసన రూపాన్ని తయారుచేసిన కెనడాలోని టొరంటో నగర మహిళలు తమ మొదటి ఊరేగింపును (స్లట్ వాక్ ను) ఏప్రిల్ 3 న పోలీసు ప్రధాన కార్యాలయం దగ్గరికి నడిపారు. ఆ తర్వాత గడిచిన ఎనిమిది నెలల్లో ఈ తరహా ప్రదర్శనలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో, అనేక నగరాల్లో జరిగాయి.

ఈ నేపథ్యంలోనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వి. దినేష్ రెడ్డి సరిగ్గా అదే మాట అన్నారు. ఆ వ్యాఖ్యకు స్పందనగా పద్దెనిమిది సంవత్సరాల కాలేజి విద్యార్థిని వర్ష గండికోట దక్కన్ క్రానికల్ దినపత్రికలో డిజిపికి బహిరంగలేఖ రాశారు.)

## డిజిపి గారూ, ఐతే నేను మినీ స్కర్ట్ వేసుకుంటే మీరు నన్ను కాపాడబోరన్నమాట?

రేప్‌లు, స్త్రీల మీద ఇతర అత్యాచారాలు పెచ్చరిల్లిపోవడాన్ని ప్రస్తావిస్తూ మన గౌరవనీయ డిజిపి దినేష్‌రెడ్డి ఇవాళ ఒక ప్రకటన చేశారు. 'అది పోలీసు బలగాల వైఫల్యం కాదు. ఈ రోజుల్లో అమ్మాయిలు వేసుకుంటున్న దుస్తులే అందుకు కారణం' అని ఆయన అన్నారు.

డిజిపి గారూ, క్షమించండి, కాని ఒకరికి న్యాయం ఇవ్వాలా లేదా నిర్ణయించడానికి వారు వేసుకున్న దుస్తులే ప్రమాణం కావడం ఎప్పటినుంచి మొదలయింది?

విశాఖ పట్నంలో ఒక నలభై ఏళ్ల పురుషుడు ఆరు సంవత్సరాల బాలిక మీద అత్యాచారయత్నం చేశాడు. ఆ ఆరు సంవత్సరాల పసిపాప రెచ్చగొట్టే దుస్తులే వేసుకుని ఉంటుంది గదూ!

పార్క్‌ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ తన పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను చాల మందిపై అత్యాచారం చేశాడు. వారందరూ ఆ స్కూల్ యూనిఫామ్ వేసుకునే ఉంటారు. అవి చాల అసభ్యకరమైన దుస్తులు కదూ...

నమోదవుతున్న అత్యాచారాల సంఘటనలలో సగానికి పైగా పట్టణ ప్రాంతాలలోవి కావు.

అంటే గ్రామీణ స్త్రీలు కూడ మినీ స్కర్ట్ లు వేసుకుంటున్నారని మీరు చెప్పదలిచారా? ఓహో, బహుశా మీరు ఆదివాసి స్త్రీల గురించి మాట్లాడుతున్నారేమో. విశాఖపట్నంలో ఒక పన్నెండేళ్ల దళిత బాలిక మీద పొరుగింటి యువకులే రెండుసార్లు అత్యాచారం చేశారు. కాని మీ పోలీసులు ఆ నేరస్తులమీద చర్య తీసుకునే బదులు, పోలీస్ స్టేషన్ లో ఆమెను బలవంతం చేసి రాజీ పత్రం మీద సంతకం పెట్టించారు. ఆమె వేసుకున్న దుస్తులు అసభ్యంగా ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకున్నారా సార్?

మీ పోలీసు బలగాలను రక్షించుకునే ఆదుర్దా ప్రయత్నంలో, సమాజంలో ఇటువంటి అత్యాచారాలను అరికట్టలేని మీ బలగాల అసమర్థతను దాచిపెట్టే ప్రయత్నంలో మీరు మాకు ఈ హితబోధ చేస్తున్నారు. మేం అత్యాచారానికి గురయితే తప్పు మాదే అంటున్నారు.

ఔను, నైట్ క్లబ్బులలో, పార్టీలలో అమ్మాయిలు 'అసభ్యంగా' దుస్తులు వేసుకుంటున్నారు. కాని ఆ నైట్ క్లబ్బులకు అనుమతులు ఇస్తున్నదెవరో తెలుసుకోవాలని ఉంది.

ప్రతి సినిమాలోనూ తన వంటి మీద మిగిలిన ఆఖరి గుడ్డముక్కను వదిలేయాలని ముమైత్ ఖాన్ నిర్ణయించుకుంటుంది. ఆ సినిమాలను సెన్సార్ చేసేది ఎవరో తెలుసుకోవాలని ఉంది.

ఎంతమాత్రం సంబంధం లేని సరుకుల వ్యాపార ప్రకటనలలో స్త్రీలను రెచ్చగొట్టే హావభావాలతో చూపించే హోర్డింగ్ లు ఎన్నో ట్రాఫిక్ చౌరస్తాలలో కనబడతాయి. ఆ హోర్డింగ్ లను నియంత్రించేది ఎవరో తెలుసుకోవాలని ఉంది.

ఒక యువకుడు ఆ హోర్డింగ్ వైపు చూసి పక్కనే ఉన్న బస్ స్టాప్ లో నిలబడిన కాలేజి అమ్మాయిని అవమానించదలచుకుంటే, అది ఆ అమ్మాయి తప్పే అంటారు గదూ మీరు?

నిజం చెప్పాలంటే, డిజిపి ప్రకటన పురుషులకు కూడ అవమానకరమే. 'మగవాళ్లు రెచ్చిపోతారు' అనే మాటనే ఆయన పదే పదే అన్నారు. క్షమించండి, డిజిపి గారూ, మగవాళ్లు రెచ్చిపోవడం అనేది ఎప్పుడో

*పని, విద్యా పత్రం కుల వ్యవస్థను పునరుద్ధరించడానికీ, బాల కార్మికులలు మరింత పెరగడానికీ దోహద పలేడా ఉందని అంటున్నారు* **కె. లక్ష్మినారాయణ**

# పని, విద్యా ప్రణాళిక పత్రం లోపభూయిష్టం

**జా**తీయ విద్యా ప్రణాళికా పరిధి పత్రం – 2005, విద్యా హక్కు చట్టం – 2009, జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రం – 2010లను ఆధారంగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ (ఎ.పి.ఎస్.సి.ఇ.ఆర్.టి.) రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం – 2011ను రూపొందించింది. ఈ పత్రం ఆధారంగా వివిధ విషయాలకు చెందిన మరో 18 ఆధార పత్రాలను తయారు చేశారు. ఈ పత్రాలను, విద్యా విషయక ఆధారపత్రాలూ, రాష్ట్ర సంబంధిత ముఖ్యమైన అంశాలు, వ్యవస్థాపర సంస్కరణలు అని మూడు విభాలుగా విభజించారు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీటిని చదివి సలహాలు, సూచనలు ఇవ్వాలని పత్రికా ప్రకటన ఇచ్చారు. మొత్తం రాష్ట్ర పాఠశాల విద్యారంగాన్ని ప్రభావితం చేసే ఈ పత్రాలను చదవడానికి రాష్ట్ర ప్రజలకిచ్చిన సమయం తక్కువ. పైగా ఈ పత్రాలను కనీసం మాతృభాషలోకి అనువాదం చేయకుండా, తెలుగు సమాజం ముందు చర్చకు పెడితే మెజారిటీ ప్రజలు ఈ పత్రాలను ఎలా చదివి, సలహాలు, సూచనలిస్తారో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ నిర్వాహకులకే తెలియాలి.

రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రాలను రూపొందించడంలో 'ప్రజల భాగస్వామ్యాన్ని' పక్కన పెడితే పైన పేర్కొన్న 18 ఆధార పత్రాలలో పని, విద్య అనేది ముఖ్యమైన పత్రం. ఈ పత్రంలో జాతీయ విద్యా ప్రణాళికలోని పని, విద్య పత్రాన్ని ఉటంకిస్తూ, పనికి, జ్ఞానానికి మధ్య దూరాన్ని పూర్తిగా తగ్గించి అటు బ్రాహ్మణవాదానికి, ఇటు ప్రపంచీకరణ శక్తులకు వ్యతిరేకంగా విద్యా ప్రణాళికను తయారు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ పత్రంలో పనికూడ జ్ఞానానికి సంబంధించిన ఒక వనరు అని గుర్తించడం తప్ప, బ్రాహ్మణవాదానికి, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకమైన విషయాలేమీ లేవు. అనుకూలమైన భావజాలమే కనిపిస్తుంది.

పని, విద్య ఆధారపత్రం మొదటి పేజీలోనే గ్రామీణ కుటుంబాలలో పిల్లలు ఇంటి పనులలో అనగా వ్యవసాయ పనులు, కుమ్మరి, కమ్మరి, మేదరి పనులలో తల్లిదండ్రులకు ఎలా సహాయ పడుతున్నారో చెప్పుకొచ్చారు. ఇంకా ఒక తండ్రి తన పిల్లలు చదువుకున్న తర్వాత పొలం పనులు చేయడం లేదని వాపోతున్నాడని, ఇంకొందరు తల్లిదండ్రులు చదువుకున్న తర్వాత తమ పిల్లలు తమ కులవృత్తులలో సహాయపడాలని కూడా ఆశించడంలేదని చెప్పుకొచ్చారు. ఇలా జరగడం అనేది బ్రాహ్మణీయ సిద్ధాంతాలలో భాగమేనని వ్యాసకర్తల భావన. అంటే చదువుకున్న తర్వాత వీరికి ఉద్యోగాలు ఎందుకు రావడం లేదని ఈ పత్రం ప్రశ్నించలేదు. సంఘటితరంగంలో, ప్రభుత్వరంగంలో ఈ

---

యుగాల కిందటి మాట. స్త్రీని చూసీ చూడగానే పురుషుడు రెచ్చిపోవడ మనేది ఎప్పుడో గతకాలంలో జరిగేది. ఇప్పుడు మనం నాగరికుల మయ్యామనుకుంటాను. చాల మర్యాదస్తుల మయ్యామనుకుంటాను. కాని దురదృష్టవశాత్తూ, డిజిపి గారూ, మీరు ఇంకా ఆ పాతకాలంలోనే పాతుకుపోయినట్టున్నారు. మగవాడంటే మనస్థిమితం లేని వికృతజీవి అనే అర్థం చెప్పకండి, పాపం.

సరే, ఇంతకీ సరైన దుస్తులు అంటే ఏమిటి?

పద్నాలుగు నిండాయో లేదో, గౌను వేసుకోవడం అసభ్యమై పోతుందా? మన మహాఅంగళ్లలో, మాల్స్‌లో అమ్మే, వంటికి పట్టినట్టుండే జీన్స్ పాంట్ల అమ్మకాలను నిషేధించాలేమో మరి! సల్వార్ కమీజ్ వేసుకునే అమ్మాయిల మీద ఎప్పుడూ ఏ అత్యాచారమూ జరగలేదు గదూ...

నేనొక ఇరవై ఒకటో శతాబ్దపు యువతిని. నేను ఏ దుస్తులు వేసుకోవాలో నిర్ణయించుకునేది నేనే. ఔను, నేను ఆకర్షణీయంగా ఉండే దుస్తులు వేసుకుంటాను. నేను చూడముచ్చటగా ఉన్నానని ఎవడయినా అనుకుంటే అది వాడికి వాడి ఇష్టారాజ్యంగా ప్రవర్తించే హక్కు ఇస్తుందా?

కాలేజీలకు కూడ ఈ రోజుల్లో డ్రెస్ కోడ్ ఉంది గదా అని మీరు మీ ప్రకటనను సమర్థించుకోజూశారు. రాష్ట్రంలోని ప్రతి స్త్రీ మీదా మీరు మీ డ్రెస్ కోడ్ రుద్దదలిచారా? మగపిల్లలయితే తమ ఛాతీలు విప్పుకుని తిరగవచ్చు. ఏమీ సమస్య లేదు. కదూ? లుంగీ ధరించి తిరగడం పూర్తిగా సభ్యమైన దుస్తులు ధరించడమే కదూ. డిజిపి గారూ, మీ మాట కాదంటున్నందుకు క్షమించండి.

ఈ మొత్తం వ్యవహారం అసలు సంగతేమంటే, ఈ సమాజంలో స్త్రీలు బాధితులు అయ్యే స్థితిలో ఉన్నారు. ఉంటున్నారు. స్త్రీలను ఆ స్థితి నుంచి పైకి ఎత్తడానికి మీరూ, మీ అధికారులూ కాస్త ప్రయత్నించ గలిగితే బాగుంటుంది. తప్పు చేసిన ప్రతివాడి మీద తక్షణ చర్యలు తీసుకోండి. మేం ఆసిడ్ దాడుల గురించీ, బ్లేడ్ల గురించీ భయపడకుండా ఉండే స్థితి కల్పించండి. ఆ పని చేసే బదులు, మీరు నా బట్టల బీరువా ఎలా ఉండాలో నిర్ణయించే అధికారం తీసుకుంటే, డిజిపి గారూ, కాస్త ఆగండి. మీ ఇంటి ముందర కూడ స్లట్ వాక్ జరుగుతుంది. మిమ్మల్ని మేల్కొలుపుతుంది. వీ

మధ్యకాలంలో ఉద్యోగాలు ఎందుకు తగ్గిపోతున్నాయనే ప్రశ్న వేయలేదు. అంటే ఇలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా, ఆ ప్రశ్నలకు జవాబులు కనుక్కోకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకున్న తర్వాత పొలం పనులు చేయాలని అనుకోవాలనీ, తమ కులవృత్తులలో సహాయపడాలని అనుకోవాలనీ, అపుడే బ్రాహ్మణీయ సిద్ధాంతాలు బలహీన పడతాయని వ్యాసకర్తల వాదన. ఈ వాదనను బలపరచుకోవడానికి గాంధీ మౌలిక విద్య (బేసిక్ ఎడ్యుకేషన్) సిద్ధాంతాన్ని వాడుకున్నారు. 1937లో వార్ధాలో జరిగిన జాతీయ విద్యా సదస్సులో గాంధీ చేసిన ప్రతిపాదనలలో పనిద్వారా విద్యను, జ్ఞానాన్ని నేర్చుకోవచ్చనేది ప్రధానమైనది. నేత పనిని ఉదాహరణగా తీసుకొని దాని ద్వారా విద్యనందించవచ్చని చెప్పారు. పని ద్వారా విద్యను నేర్పవచ్చు అనే గాంధీ సిద్ధాంతంతో పేచీ లేదు. అయితే కుల వృత్తులలో భాగంగా వస్తున్న నేత పనిలో రెండు అంశాలున్నాయని గుర్తించవలసిన అవసరమున్నది. ఒకటి నేత పని అనేది ఒక పని. రెండవది నేత పని అనేది తరతరాలుగా ఈ దేశపాలకులు తమ దోపిడీని, అణచివేతను కొనసాగించడానికి, స్థాపించి, కాపాడుతున్న కుల వ్యవస్థలో భాగంగా వస్తున్న కులవృత్తి. వర్ణధర్మాల్ని అనుసరించాలని నమ్మి, ప్రచారం చేసిన గాంధీ రెండవ అంశాన్ని గుర్తించలేకపోయాడు. (అయితే వర్ణ ధర్మాన్ని ప్రవచించిన గాంధీ ఆయనే వర్ణ ధర్మాన్ని మాత్రం పాటించలేదంటాడు అంబేద్కర్.) అలాంటపుడు గాంధీ మౌలిక విద్యలో ఇటు రాష్ట్రంలోనూ, అటు దేశంలోనూ పని, విద్య మీద పత్రాలు రాసిన వాళ్లకు బ్రాహ్మణ వ్యతిరేకవాదం కనిపించడం కొంచెం విడ్డూరంగా ఉంది.

భారతదేశంలో కులం ఏనాడూ ఒక ఉపరితల అంశం మాత్రమే కాదు. అది పునాదికి సంబంధించిన అంశమని గుర్తించవలసిన అవసరం ఉన్నది. కుల వృత్తులు కాపాడడమనేది కులానికి గల సామాజిక పాత్రలో అతి కీలకమైన అంశం. ఒక కులంలో పుట్టినవారికి ఆ కుల వృత్తికి సంబంధించిన నైపుణ్యం, పనిముట్లు, ఉత్పత్తి సాధనాలు ఉండాలనేది కుల వ్యవస్థ. వేరే కులానికి సంబంధించిన నైపుణ్యం గానీ, పనిముట్లు గానీ, ఉత్పత్తి సాధనాలు గానీ ఉండకూడదనేది కూడా ఈ కుల వ్యవస్థలో అంతర్భాగమే. తద్వారా అగ్రవర్ణాలూ, పాలక వర్గాలు తమకు కావలసిన విభిన్న ఉత్పత్తులను తయారు చేసి అందించే శ్రామిక జనాన్ని తయారు చేసుకున్నారు. అందుకే ఇప్పటికీ మాల, మాదిగ, చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, బేస్త, మేదరి తదితర కులాల్లో పుట్టిన వారికి వేరే వృత్తులను చేసే నైపుణ్యంగానీ, పనిముట్లుగానీ అందుబాటులో లేవు. బానిస వ్యవస్థలో లాగ ప్రత్యక్ష బల ప్రయోగాన్ని ఉపయోగించకుండా, సామాజిక నిర్మాణం ద్వారా, బలమైన భావజాలం ద్వారా కావలసిన ఫలితాన్ని సాధించాయి పాలకవర్గాలు. అందుకే ఈ కుల వ్యవస్థను జాగ్రత్తగా కాపాడిన వాడే 'ధర్మ ప్రభువ'ని కీర్తించిందే బ్రాహ్మణ వ్యవస్థ.

భారతదేశ చరిత్రను అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించిన డి.డి. కొశాంబీ ఈ కుల వ్యవస్థను 'కింది నుండి భూస్వామ్య వ్యవస్థ' అంటాడు. కులం మనుషులను వేర్వేరు సమూహాలుగా విభజించడం, తిరిగి ఆ సమూహాల మధ్య అంతరాలు సృష్టించడం వలన ఫ్యూడలిజం బలంగా వేళ్లూనుకుంది. అదే సమయంలో రాజ్యం ఈ వ్యవహారంలో పెద్దగా జోక్యం చేసుకోకుండా పై నుండి వర్గాలను సృష్టించింది. జమీందార్లూ, జాగీర్దార్లూ, పెట్టుబడిదార్లు ఈ రకంగా వచ్చిన వాళ్లే. దీనినే 'పై నుండి భూస్వామ్యమని' అన్నారు డి.డి. కొశాంబి. ఇలా కులమూ, వర్గమూ ఒకటికొకటి చేదోడు, వాదోడుగా ఉంటూ ఇటు సాంప్రదాయ మార్క్సిస్టులలో అటు సాంప్రదాయ అంబేద్కరైట్‌లలో ఇప్పటికీ గందర గోళాన్ని సృష్టిస్తోంది.

ఇలా ఫ్యూడలిజంలో అతి కీలకమైన పాత్రను పోషించిన కుల వ్యవస్థ, ఆంగ్లేయుల పాలన, ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల కారణంగా చాలా ఒత్తిడులకు గురి అయింది. అయినా కుల వృత్తులు అనేవి ఇప్పటికీ 93 శాతానికి పైగా ఉన్న అసంఘటిత రంగంలో ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి. మాల, మాదిగ కులాలలోని దాదాపు 90 శాతానికి పైగా చెప్పులు కుట్టడమూ, పాకీ పని, వ్యవసాయకూలీ పనులలోనే ఉన్నారు. చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, తెనుగు, బెస్త, మేదరి, గొల్ల, కుర్మ తదితర కులాలు ఇప్పటికీ వారి వారి కుల వృత్తులకు సంబంధించిన నైపుణ్యం మాత్రమే ఉంది. ఒకటి, రెండు ప్రాంతాలలో తప్ప కాపు కులస్తులలో అత్యధిక భాగం చిన్న, సన్నకారు రైతులుగానే కొనసాగుతున్నారు.

ఇటువంటి పరిస్థితులలో ఈ కులాల నుండి వచ్చిన పిల్లలు తమ తల్లిదండ్రులు చేసే కులవృత్తులలో పాల్గొంటున్నారని, సహాయ పడుతున్నారని చెప్పి వాటిని వ్యవస్థీకరిస్తే, కార్పొరేట్ పాఠశాలలూ, ప్రభుత్వ పాఠశాలలుగా విడిపోయిన నేటి విద్యారంగంలో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. దళితులు, వెనుక ఉంచబడిన వర్గాల పిల్లలు మెజారిటీగా ఉన్న పాఠశాలలలో ఈ విధానం కులాన్ని, కుల వృత్తులను ప్రోత్సహిస్తుంది. పైగా అగ్రకులాల, ధనికుల పిల్లలతో నిండి, పట్టణ, నగర ప్రాంతాలలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఏ రకమైన పని విద్య నేర్పాలో ఈ పత్రం స్పష్టం చేయలేదు. ఈ అస్పష్టతను, ప్రభుత్వ బలహీనతను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు మేధో శ్రమలకు సంబంధించి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ రంగంలో వస్తున్న ఉన్నత ఉద్యోగాలను పొందగలిగే విద్యా ప్రణాళికను అమలు చేస్తారు. అంటే ప్రభుత్వ పాఠశాలల ద్వారా దళితులూ, ఆదివాసులూ, వెనక ఉంచబడిన కులాల పిల్లలకు శారీరక, మలినమైన శ్రమలూ, తమ కుల వృత్తులనూ అంటగట్టి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ద్వారా అగ్రవర్ణాల, ధనికుల పిల్లలకు తెల్లకాలర్ ఉన్నత ఉద్యోగాలను కట్ట పెట్టేందుకు ఎపిఎస్‌సిఇఆర్‌టి రాసిన పని, విద్య పత్రం తోడ్పడుతుంది.

### ప్రపంచీకరణ శక్తులకు ప్రోత్సాహం

పని, విద్య అనే ఆధార పత్రం ప్రపంచీకరణ శక్తులు విశిష్ట పరుస్తున్న తెల్లకాలర్, నగర మధ్యతరగతి, ఉన్నత తరగతులకు వ్యతిరేకంగా మాట్లాడినట్లు భ్రమలు కలిపించింది. ప్రపంచీకరణ శక్తులు, కులవృత్తులను, వ్యవసాయ కూలీ లాంటి పనులను కించపరుస్తున్న మాట నిజమే. అటువంటి పనులను కించపరచకూడదని, అందులో కూడా నైపుణ్యం, జ్ఞానం ఉందని చెప్పినంత వరకు సమస్య లేదు. అయితే కులవృత్తులను, చేతి వృత్తులను, వ్యవసాయపు పనులను కించపరచి ధ్వంసం చేసి, 'అభివృద్ధి' పేరిట విధ్వంసాన్ని సృష్టిస్తోన్న

ప్రపంచీకరణ శక్తులను వ్యతిరేకించక పోవడం వ్యాసకర్తల భావ దాస్యాన్ని తెలియ జేస్తుంది.

1991లో ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ విధానాలు సంఘటిత రంగాన్ని అసంఘటితరంగంగా మార్చుతున్నాయి. లక్షలాది మందిని ఉద్యోగాల నుండి గెంటివేశారు. అత్యాధునిక యంత్రాలను, కంప్యూటర్ లను ప్రవేశపెట్టి ప్రభుత్వరంగ సంస్థల నుండి, ప్రభుత్వ కార్యాలయాలలో లక్షలాది ఉద్యోగులను, కార్మికులను తొలగించారు. 1991-2001 కాలంలోనే ప్రభుత్వ రంగంలో నాలుగు లక్షలకు పైగా ఉన్న ఉద్యోగాలు రెండు లక్షలకు తగ్గిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగాలలోని 'ఎ' గ్రూపులో ఇప్పటికీ దళితుల శాతం తగినంతగా లేదు. అదీ ఈ మధ్యకాలంలో తగ్గిపోతోంది. ఫలితంగా అసంఘటిత రంగం గణనీయంగా పెరిగింది. గ్రామాలలో ప్రపంచీకరణ వినాశకర విధానాల వలన వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడి రెండున్నర లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కులవృత్తులు, చేతి వృత్తులు పెద్ద పెద్ద పరిశ్రమలతో, కార్పొరేట్ రంగంతో పోటీ పడలేక అల్లాడుతున్నాయి. నేతపని వాళ్లు, ఇతర చేతి వృత్తుల వాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బతికున్న వాళ్లు పొట్ట చేత పట్టుకొని పట్టణాలలో రిక్షా కార్మికులుగా, భవన నిర్మాణ కార్మికులుగా, అడ్డకూలీలుగా కొందరు మారితే, మరికొందరు చివరికి బిచ్చగాళ్లుగా మారుతున్నారు. ఈ కారణంగా 93 శాతానికి పైగా ప్రజలు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. (ఆధార పత్రంలో ఇచ్చిన పనుల జాబితాను చూస్తే అసంఘటిత రంగంలో ఎన్ని రకాల పనులున్నాయో తెలుస్తుంది.) ఈ అసంఘటిత రంగంలో ఇప్పటికీ కులవృత్తులు అనేవి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. మాదిగ, మాల, చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, బెస్త, మేదరి, గొల్ల, కుర్మ తదితర కులాలలో పుట్టిన వారికి వేరే మేధో శ్రమలకు సంబంధించిన నైపుణ్యం గానీ, పనిముట్లు గానీ లేదా ఉద్యోగాలను గానీ ఈ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ విధానాలు కల్పించలేక పోయాయి. ఈ వర్గాల వారికి దీనికి అవసరమైన విద్యను కూడా పాలకులు దూరం చేశారు. చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పని, విద్య పేరు మీద ఇంటి పనులను, కుల వృత్తులను, చేతి పనులను చేసుకోండని చెప్పడమంటే, కులాన్ని, కులతత్వాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ప్రపంచీకరణ మార్కెటు శక్తుల వలన ధ్వంసమవుతున్న ఈ వృత్తులను, పనులు చేస్తూ ఎల్లకాలం కటిక దారిద్ర్యంలో ఉండమని చెప్పడమే అవుతుంది. కటిక దారిద్ర్యం వలన రాబోయే కాలంలో విపరీతంగా పెరిగిపోయే డ్రాప్ అవుట్ రేట్లను, బాల కార్మికతను సమర్థించే ప్రయత్నం కూడా ఈ పని, విద్య ఆధార పత్రం చేసింది. దీనికోసం ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన ఒక పరిశోధనని ఉటంకించారు. టెకీ (1999) అనే సామాజిక శాస్త్రవేత్త ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గ్రామాన్ని అధ్యయనం చేశాడు. టెకీ ప్రకారం, తల్లిదండ్రులకు సహకరించడంలో భాగంగా పిల్లలు నీళ్ల తేవడం, పశువులను కాయడం, వ్యవసాయం చేయడం లాంటి పనులు చేస్తున్నారు కనుక వారిని బాల కార్మికులు అని పిలువకూడదట. ఇంకా ఈయన బాల కార్మికులను 'క్షుణ్ణంగా' పరిశీలించినపుడు వాళ్లందరూ ఇంటి పనులు చేస్తూ, పాఠశాలకు పోయి బయటికి నెట్టబడడమో లేదా వాళ్లంతట వాళ్లే కావాలని బయటికి వెళ్లిపోతున్నారనేది (వాక్ అవుట్స్) కనుగొన్నాడట. అంటే కుటుంబ పేదరికం వలన ఇంటి పనులు చేస్తూ, కుటుంబాన్ని పోషించడంలో తల్లిదండ్రులకు సహకరించడం వలన బడి మానివేస్తే అది డ్రాప్ అవుట్ కాదనీ, వాక్ అవుట్ అనీ ఈయన పరిశోధన. ప్రపంచీకరణ విధానాల వలన పెరుగుతున్న నిరుద్యోగాన్ని, పేదరికాన్ని సమర్థించడానికి, అలాగే విద్యా హక్కు పేరు మీద అక్షరాస్యతను సాధించడానికి కాల పరిమితిని కూడా విధించని పాలకులకు ఇటువంటి అధ్యయనాలు పనికొస్తాయని స్పష్టంగానే తెలుస్తుంది.

సారాంశంలో ఈ పని, విద్య అనే ఆధార పత్రం మన సమాజంలో కులాన్ని, కుల వృత్తులను పెంచి పోషించడానికి అవసరమయ్యే భావజాలాన్ని తయారు చేస్తుంది. దళితులకూ, ఆదివాసులకూ, వెనుక ఉంచబడిన వర్గాలకూ, స్త్రీలకూ తరతరాలుగా తమ తల్లిదండ్రుల నుండి వస్తున్న శారీరక శ్రమలు, మలినమైన శ్రమలను గౌరవప్రదమైనవని చూపిస్తూ, ఉన్నత వర్గాలు, పీడక కులాలు, మేధోశ్రమలకు సంబంధించిన ఉన్నత ఉద్యోగాలను కైవసం చేసుకోవడంలో తప్పేమి లేదనే భావనను పెంచుతుంది. అలాగే ప్రపంచీకరణ విధానాల వలన పెరుగుతున్న పేదరికాన్ని, ఆ పేద కుటుంబాలను పోషించడానికి పిల్లలు పని చేయాలనీ, దీనికోసం వాళ్లు బడి మానివేసినా అది డ్రాప్ అవుట్ కాదనీ, వాళ్లు బాల కార్మికులు కారనే వాదనకి దిగి, బాల కార్మికతను మంచిదని చూపించే స్థాయికి కూడా ఈ పని, విద్య పత్రం దిగజారింది.

*(రచయిత ఎ.పి. విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి)*

*With best compliments from*

***Mohd. Fasiyuddin***

*Purana Haveli, Hyderabad*

ఖనిజ తవ్వకం వద్దని ప్రజలు ప్రతిఘటిస్తున్నా, ప్రజల మధ్య చీలికలు తెచ్చి మరీ ప్రభుత్వం బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేరుస్తోందని అంటున్నారు **చిట్టిపాటి వెంకటేశ్వర్లు**

# ఖనిజ తవ్వకాలపై మర్లబడిన మర్లపాడు

ఇనుప ఖనిజం తవ్వకంపై ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ,కాలుష్య నియంత్రణా మండలి 2011 డిశంబరు 17న ప్రజాభిప్రాయసేకరణను చేపట్టింది. అప్పటికే ప్రభుత్వం రెండుసార్లు ప్రజాభిప్రాయాన్ని కోరి ఉంది. ఇనుప ఖనిజం తవ్వకాలు చేపట్టవద్దని ఖండితంగా చెబుతూ వచ్చారు. అయినా ప్రభుత్వం తన కుటిల నీతిని మరోమారు ప్రదర్శించింది. పాలేటితిప్పలో 9 పర్యాయాలు ప్రజాభిప్రాయసేకరణ చేసి అక్కడ గ్రామంలో చీలికలు తేగలిగింది. ప్రారంభంలో గ్రామస్తులు ఐక్యంగా ఉన్నాగాని తర్వాత తాము అనేక ప్రలోభాలకు గురి చేయవచ్చని కంపెనీకి ప్రభుత్వానికి అనుభవం వచ్చింది. అందుకే ఆ గ్రామాల్లో చీలికలు తీసుకురావడానికి తన ఏజంట్ల ద్వారా అనేక ప్రయత్నాలు చేసింది. ప్రస్తుతానికి వారి పాచికలు పారలేదు.

మా నీరు, మా నేల మాకే కావాలి, మా పంట పొలాలు నాశనం చేయ్యొద్దు అంటూ 2011 ఫిబ్రవరి 4 తేదిన,మార్చి 26 తేదిన కూడా జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో గట్టిగానే చెప్పారు. అయినా ప్రభుత్వం కోట్ల విలువచేసే ఖనిజ తవ్వకాలను వదిలి పెట్టదలుచుకోలేదు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని పునరాలోచన చేయకుండా డిసెంబరు 17న మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థ, జింపెక్స్ కంపెనీ ఎలాగైనా సరే ప్రజాభిప్రాయ సేకరణ తంతు ముగించి ఆమోద ముద్ర వేయించుకోవాలని రకరకాల ఎత్తుగడలు వేశాయి. వీటన్నింటిని ఐరన్ ఓర్ వ్యతిరేక పోరాట సమితి నాయకత్వాన ప్రజలు తిరస్కరించారు.

కంపెనీవారు కొంతమంది బయట గ్రామాల వారికి డబ్బులిచ్చి కిరాయికి కారుల్లో,ఆటోల్లో మర్లపాడుకి తరలించారు. వారిని స్థానిక ప్రజలు పట్టుకొని నిలవేయడంతో ఇనుప ఖనిజం తవ్వకాలకు అనుకూలంగా అభిప్రాయాలు చెప్పమని కంపెనీ వారు డబ్బులిచ్చినందున వచ్చామని బహిరంగంగానే ఒప్పుకున్నారు. నిజంగా కష్టనష్టాల్ని భరించే స్థానిక ప్రజలు అభిప్రాయాల్ని గౌరవించకుండా కంపెనీలు డబ్బు బలంతో ఇటువంటి కుట్రలకు పాల్పడవలసిన అవసరం ఏమిటి అని తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బూటకపు ప్రజాభిప్రాయసేకరణను నిలిపివేయాలని కోరారు. కంపెనీ మనుషుల్ని గ్రామం నుండి పంపిస్తేనే మేము సభ దగ్గరికి వస్తామని కలెక్టరు గారి దృష్టికి తెచ్చే లోపే పోలీసులు లాఠీలకు పని కల్పించారు. ప్రజల్ని పోలీసులు ఒక్క తోపు తోయడంతో ఒకరిపై ఒకరు పడ్డారు. తొక్కిసలాట జరిగింది. కలెక్టరు గారిని జనం మధ్య నుండి సభా ప్రాంగణంలోకి తీసుకెళ్లారు. అధికారులు సభను ఖాళీ కుర్చీలతో గంటన్నర సేపు నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభను బహిష్కరిస్తున్నట్లు ప్రజలు ప్రకటించారు.

కాలుష్య కోరలనుండి మా గ్రామాలను రక్షించండని, పంట పొలాలను కాపాడమని, న్యాయం చేయమని సభానంతరం కలెక్టరు గారిని ప్రజలు నిలవేశారు. "మీరు సభకు హాజరై మీ అభిప్రాయం చెప్పకుండా బహిష్కరించడం సరైనది కాదని ఇక్కడ జరిగిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకళతానని" చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మరొక పర్యాయం పోలీసులు లాఠీలతో చేతులతో బలవంతంగా నెట్టడంతో మహిళలు ఒకరిపై ఒకరు పడ్డారు. తొక్కిసలాట జరిగింది. సర్వేరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల నాగేంద్రం అనే మహిళ స్పృహ కోల్పోయింది. ఆమె చనిపోయిందని ప్రచారం రావడంతో ప్రజలు పోలీసు అధికారులను ప్రతిఘటించారు. పోలీసులు లాఠీచార్జి చేశారు.కలెక్టరు ఇతర అధికారులు ప్రజల ప్రతిఘటనతో పరుగులు తీశారు. ఈ సంఘటనలను సాకుగా చూపి ఉద్యమంలో పాల్గొన్న పోరాట సమితి నాయకులపై, ప్రజలపై అక్రమ కేసులు బనాయించారు. పోలీసులు తీసిన వీడియోల ద్వారా ఆ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను గుర్తించి కేసులు బనాయించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

## మర్లపాడు ప్రజలు ఎందుకు ఆందోళన చేస్తున్నారు?

కొణిజేడు, మర్లపాడు గ్రామాల్లో ఉన్న కొండప్రాంతంలో 529.04 హెక్టార్ల (1322 ఎకరాలు) విస్తీర్ణంలో ఉన్న ఇనుప ఖనిజాన్ని త్రవ్వి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. 2005లో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ 51 శాతం, జింపెక్స్ కంపెనీ 49 శాతం వాటాలతో సంయుక్తంగా మైనింగు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లాభాల దాహంతో ఉన్న జింపెక్స్ కంపెనీ 2009లోనే ఒంగోలు ఐరన్ఓర్,ఎస్.వి.పి. మైనింగు కంపెనీలకు సబ్‌లీజుకిచ్చింది.

ఈ వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా జింపెక్స్ కంపెనీ కప్పి పుచ్చుతోంది. ఇనుప ఖనిజాన్ని వెలికి తీసేందుకు ఏపిఎండిసి, పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖను అనుమతి కోరుతూ దరఖాస్తు చేసింది. అందులో భాగంగా ప్రజాభిప్రాయసేకరణ తంతు చేయాల్సి

వచ్చింది. ప్రాజక్టు ద్వారా ఈ ప్రాంతం కాలుష్యకోరల్లో చిక్కుకుంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు, మేకలకు, గొర్రెలకు జీవనాధారం పోతుందని ఆవేదన చెందుతున్నారు. అందుకే తమకు అండగా ఉండే కొండను రక్షించుకుంటామని పోరాడుతున్నారు.

### ఎపిఎండిసి, జింపెక్స్ కంపెనీలు ఏం చెబుతున్నాయి?

ఒంగోలుకి 10 కి.మీ దూరంలో ఉన్నా కొణిజేడు, మర్లపాడు కొండల్లో 85 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్ నిక్షేపాలున్నాయి. కొణిజేడులో 7.615 మి.టన్నులు, మర్లపాడులో 76.833 మి.టన్నులు ఇనుప ఖనిజం ఉంది. ప్రతి సంవత్సరం 50 లక్షల టన్నుల ఐరన్‌ఓర్ వెలికి తీయడం ద్వారా ప్రజలకు, పశువులకు,పంటలకు ఎటువంటి నష్టం సంభవించకుండా అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చెబుతోంది. రు. 515 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ప్రాజక్టు వలను 155 ఉద్యోగాలు ప్రత్యక్షంగాను, 300 ఉద్యోగాలు పరోక్షంగాను లభిస్తాయని ఎపిఎండిసి నమ్మబలుకుతుంది. వ్యవసాయంతో పాటు పారిశ్రామికాభివృద్ధి ఉరుకులు పరుకులెత్తు తోందని చెప్పారు. ఇందులో ఎంత వాస్తవం ఉందో ప్రభుత్వాధికారులకే అనుమానం కలిగింది. ఎపిఎండిసిని అనేక ప్రశ్నలతో ముంచెత్తారు.

పర్యావరణ అనుమతుల కోసం ఎపిఎండిసి అనేక వాస్తవాలను మరుగు పరిచి తప్పుడు నివేదికలను పర్యావరణ శాఖకు నివేదించింది. ఈ ప్రాంతంలో సాగుభూమి తక్కువగాను, సాగుచేయని భూమి ఎక్కువ గాను నివేదికలో చూపెట్టింది. మైనింగు ప్రాంతంలో చిన్న చిన్న పొదలు తప్ప వ్యవసాయ భూమి ఏమీ లేదని చెప్పింది. ఆ ప్రాంతంలో షెడ్యూల్ -1 జాతికి చెందిన జంతువులు లేవని తెలిపింది. జనావాసాల్ని జనాభాని తక్కువగా చూపెట్టింది. కొండ పరిసరాలలో వర్షాకాలంలో సాధారణ నీటి పారుదల తప్ప ఎటువంటి పంట కాలువలు గాని, నీటి నిలువలు గాని లేవని తప్పుడు నివేదికలను రూపొందించింది. నిజానికి కొండను ఆనుకొని సారవంతమైన పంట పొలాలున్నాయి. బోర్ల ద్వారా,నాగార్జున సాగర్ కాలువల ద్వారా రైతులు పంటలు పండిస్తున్నారు. నిమ్మచెట్లు, అరటితోటలు, మిర్చి, పొగాకు, శెనగ మినుము తదితర పంటలను ఇతర ఆహార పంటలను పండిస్తున్నారు. కొండ ప్రాంతం మినహా మిగిలిన భూములన్ని రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఖాళీగా సెంటు భూమి కూడా కనిపించ లేదు. వర్షాల తర్వాత కొండ ప్రాంతాల నుండి అనేక చెరువులకు నీరు చేరుతోంది. అనేక కుంటల్లో నీరుంది. దీనిని వ్యవసాయానికి వినియోగించుకుంటున్నారు. కొండ ప్రాంతం పశువుల మేతకు గొర్రెలు,మేకలు పశు గ్రాసానికి కొరత లేకుండా ఉంది. గతంలో కనపర్తి,కాకరాపల్లి,సోంపేటలలో కూడా థర్మల్ ప్లాంట్లు అనుమతి కోసం పంట పొలాలను మెట్టప్రాంతాలుగా,బీడు భూములుగా,చవుడు భూములుగా పై అధికారులకు తప్పుడు రిపోర్టులు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా గమనంలో ఉంచుకోవాలి.

మైనింగు కోసం ప్రతి రోజూ 3 టన్నుల పేలుడు పదార్థాన్ని వినియోగించి కొండను పేలుస్తారు. ఈ పేలుళ్లతో ఖనిజంతో పాటు మట్టి కూడా పైకి లేస్తుంది. లేచిన దుమ్ము ధూళి పరిసర గ్రామాలు,పంట పొలాలపై పేరుకు పోతుంది. ఖనిజంతో పాటు వేస్టు, మైనింగ్ హాండ్లింగ్, ఆపరేషన్స్, ఖనిజాన్ని స్క్రీనింగు చేయడంతో కాలుష్యం పెరుగుతుంది. మైనింగు యంత్రాలు, లోడిగు యంత్రాలు, వాహనాల వలన సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ తదితర వాయువులు వెలువడుతాయి. వీటి వలన కూడా కాలుష్యం పెరుగుతోంది. మొత్తం మీద మైనింగు వలన ధూళితో పంట పొలాలు దెబ్బతినడమే కాకుండా దిగుబడులు తగ్గుతాయి. ప్రజలకు, పశువులకు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఊపిరి తిత్తుల జబ్బులు పెరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వీటిని నివారించడం కోసం ఎపిఎండిసి అనేక బూటకపు హామీలను వాగ్దానం చేస్తోంది. దుమ్ముధూళి లేవకుండా టాంకర్లతో నీళ్లు చల్లుతామని, ఐరన్‌ఓర్ తీసుకెళ్లే లారీలకు టార్పాలిన్ కప్పుతామని, ధ్వని కాలుష్యాన్ని నివారించడానికి మైనింగు ప్రాంతంలో చెట్లు పెంచుతామని చెబుతుంటే ప్రజలే కాదు, ప్రభుత్వాధికారులే నమ్మడం లేదు. ఇక్కడ భూగర్భ జలాలు వినియోగించుకో బోమని మర్లపాడుకి 32 కి.మీ దూరంలో ఉన్న గుండ్లకమ్మ నుండి 0.5156 టి.ఎం.సిల నీటిని వినయోగించుకుంటామని చెబుతున్నారు. పోలవరంలో గాని ఇతర ప్రాంతాల్లోగాని వ్యవసాయం కోసం నీటి ప్రాజక్టులనే భ్రమలు తొలిగి పోయాయి. కోస్టల్ కారిడార్‌ల కోసం, థర్మల్ పవర్ ప్రాజక్టుల కోసం ఇతర దేశాల పెట్టుబడులతో జలయజ్ఞం చేశారని రోజురోజుకి బహిరంగమైంది. చీమకుర్తి ప్రాంతంలో ఎపిఎండిసి నిబంధనల్ని గ్రానైట్ యజమానులు తుంగలో తొక్కినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అక్కడ ప్రమాదాల్లో జనం ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నా తగిన రక్షణ చర్యలు తీసుకున్న నాథుడే లేడు. అక్కడి నీరు, గాలి కాలుష్యంతో శ్వాస కోశ సంబంధ వ్యాధులూ, మలేరియా, డెంగ్యూ తదితర జబ్బులు వచ్చినా పట్టించుకున్న వారే లేరు.

దేశంలో ఎక్కడ ప్రాజక్టులు నిర్మిస్తున్నా, గనులు ఖనిజాలు తవ్వుతున్నా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ 'అభివృద్ధి' నమూనా సాక్ష్యంగా ఆదివాసీలు, దళితులూ, పేదలు నిర్వాసితులు అవుతున్నారు. ప్రాజక్టులను అడ్డుకుంటే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి అనేది మనిషి కేంద్రంగా జరగాలి. అభివృద్ధి ప్రజల కోసం జరగాలి. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధి అనేది ప్రజల జీవన విధ్వంసాన్ని, వినాశానికి దారి తీయకూడదు. ప్రజల జీవితాలు బుగ్గిపాలు చేయకూడదు. కాని మన పాలకులు ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం పరుగులు తీస్తున్నారు.

ప్రకృతి సహజ వనరులను మనిషి ఉత్పత్తి చేయలేదు. ప్రకృతి వనరుల్ని, సంపదని, ఖనిజాల్ని ప్రజల ప్రయోజనాల కోసం జాగ్రత్తగా వినియోగించుకోవాలి. ఈ వనరులపై మనకే కాదు, భవిష్యత్ తరాలకు కూడా హక్కు ఉందని గుర్తించాలి. లక్షలాది ఎకరాల ప్రకృతి సంపదని, వనరుల్ని భావితరాలకు మిగల్చకుండా ధ్వంసం చేయడం, విచ్చలవిడిగా తవ్వి లాభాలే ధ్యేయంగా ఎగుమతులు చేయడం సహేతుకం కాదు. మన దేశ ప్రజల అభివృద్ధికి ప్రధానంగా ఉపయోగ పడాలి. అంతే తప్ప కొద్ది మంది సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలు నెరవేర్చడం కోసం తయారైన ప్రజా వ్యతిరేక అభివృద్ధి నమూనాని ప్రజలు ప్రతిఘటించి తీరుతారు.

సామ్రాజ్యవాద దేశాల అవసరాల కోసం, బహుళజాతి సంస్థల

*1973 సెప్టెంబర్ లో తెలంగాణ, ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం ఉద్యమాలను చల్లబర్చడానికి ఇందిరా గాంధీ ప్రకటించిన ఆరు సూత్రాల పథకాన్ని విశ్లేషిస్తూ అప్పుడు వెలువడుతుండిన పక్షపత్రిక 'పిలుపు' 1-11-1973 సంచికలో డి. ప్రసాదరావు పేరుతో* ***కొండపల్లి సీతారామయ్య*** *రాసిన వ్యాసాన్ని దాని చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా తిరిగి ప్రచురిస్తున్నాం. ఇది అప్పుడే 'పిలుపు'లో మాత్రమే కాక సోషలిస్ట్ యూత్ లీగ్, వరంగల్ ప్రచురణగా 'రాష్ట్ర విభజనోద్యమం - మార్క్సిజం' పేరుతో కొండపల్లి సీతారామయ్య రాసిన మరొక వ్యాసంతో కలిపి పుస్తకంగా కూడా అచ్చయింది.*

# ఆరు సూత్రాల ప్రణాళికను పాతి పెట్టాలి

రాష్ట్ర విభజనోద్యమ సందర్భంగా ఆరు సూత్రాల ప్రణాళిక ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు తన తొంటి చెయ్యి బయట పెట్టింది. పాత సారానే కొత్త సీసాల్లో నింపి ఆంధ్ర ప్రజల సమిష్టి సౌభాగ్యానికి రూపొందించబడిన ఏకైక కొత్త చిట్కాగా ఇందిరమ్మ ప్రభుత్వమూ, దాని వంతదార్లూ అదే పనిగా దాన్ని గూర్చి డబ్బా కొడుతున్నారు. వాస్తవానికది ఆంధ్ర ప్రజల్లో శాశ్వతంగా వైరుధ్యాన్ని పెంచి తన నిరంకుశాధికారాన్ని ఇరు ప్రాంతాలపైన నిరాటంకంగా కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కుట్రలో భాగమే తప్ప మరొకటి కాదు. ప్రాంతీయ విభేదాలు తీవ్రతరమైన రాష్ట్ర విభజనోద్యమ స్థాయినందుకున్న ప్రతి చోటా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతి అదే. ఈ ప్రణాళిక ద్వారా ఆంధ్ర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగించదలచుకొన్న పథకమూ అదే. ఇరు ప్రాంతాల ప్రజలలోనూ ఒకరిపట్ల మరొకరికి ద్వేషాగ్నిని రగుల్కొల్పి ఇరువురి జుట్టునూ తమ చేతనుంచుకొని శాశ్వతంగా తన నిరంకుశాధికారాన్ని బలవంతంగా రుద్దుతుండడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. జంట నగరాలను స్వేచ్ఛా మండలాలుగా చేయడం, అచ్చట మరో కేంద్ర విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం మినహా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో చెప్పుకోదగ్గ నూతన అంశాలేమీ లేవు. పై అంశాల మూలంగా ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల మధ్య సమైక్యత పెంపొందటం మాట అలా ఉంచి ఒకరి పట్ల మరొకరిలో ద్వేషాగ్ని మరింతగా రగుల్కొనడం మాత్రం ఖాయం. కేంద్ర ప్రభుత్వానికి కావలసింది కూడా అదే.

అయినా అటు ఆంధ్రలోనూ, ఇటు తెలంగాణలోనూ రాష్ట్ర విభజన కొరకు ఆందోళన ప్రారంభించి ప్రత్యేక రాష్ట్ర విభజనకై తుదివరకు పోరాడి తీరుతామని భీషణ ప్రతిజ్ఞలు చేసిన కాంగ్రెస్ నాయకాగ్రేసరులందరూ కాంగ్రెస్‌లోనూ, ప్రభుత్వంలోనూ తమ తమ పదవుల్ని నిలబెట్టుకోడానికి ఇందిరమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేసి కిక్కురు మనకుండా ఆరు సూత్రాల ప్రణాళికను ఆమోదించడమే కాక అదొక్కటే దేశానికి శరణ్యమంటూ చచ్చుకూతలు కూయడంలో ఒకరినిమించి మరొకరు పోటీ పడుతున్నారు. వందలాది వీర యువకులు తమ రక్తాన్ని అర్పించడం ద్వారా కొనసాగించిన మహోద్యమం ఫలితాన్ని తమ స్వప్రయోజనాల కొరకు అప్పనంగా ఉపయోగించుకోడానికి సిద్ధమై సిగ్గులేకుండా ఈ కాంగ్రెస్ నాయకులందరూ ఆంధ్ర ప్రజల పట్ల తీరని విద్రోహానికి తలపడ్డారు. తెలంగాణలో చెన్నారెడ్డి ప్రణాళికను మాటల్లో ఖండించుతున్నా మరోవైపు ఇందిరమ్మ సహృదయమూ, కాంగ్రెస్ అగ్రనాయకుల చిత్తశుద్ధినీ ప్రశంసిస్తూ, ఆవిడతోనూ, కాంగ్రెస్‌తోనూ

---

ప్రయోజనాల కోసం మన ప్రభుత్వాలు ఇప్పటికే తన విధానాలను అనేకం మార్చుకుంటూ వస్తోంది. గతంలో ఖనిజాన్ని ప్రభుత్వ సంస్థలే వెలికి తీసి ప్రాసెస్ చేసి ఎగుమతి చేసేవి. పరిశ్రమలు స్థాపించే కంపెనీలకు మైనింగు లైసెన్స్‌లు ఇచ్చేది. 1991 తర్వాత ప్రపంచీకరణలో భాగంగా బహుళజాతి సంస్థలకు అనుకూలంగా నూతన ఆర్థిక విధానాలను ప్రభుత్వాలు రూపకల్పన చేశాయి. పెట్టుబడులను ఆకర్షించే పేరిట గనుల రంగంలోకి స్వదేశీ విదేశీ పెట్టుబడులను ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతిచ్చింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రిజర్వు ఫారెస్టులో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి గనుల లీజుగానీ, ఫ్యాక్టరీలు గానీ అనుమతివ్వడానికి వీలులేదని అటవీ సంరక్షణా చట్టాలు చెబుతున్నా ప్రభుత్వాలు పదే పదే ఆ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయి. అనుమతులు లేకపోయినా అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నాయి. ప్రజలు నిర్వాసితులవుతున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ,పారిశ్రామిక విధానాలు సామ్రాజ్యవాద దేశాలకు బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నాయి. సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుంది. ప్రజల జీవనోపాధిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయి. వారి జీవితాలు చిందరవందరవుతున్నాయి. పంట పొలాల రక్షణ కోసం, ఆరోగ్య రక్షణ కోసం, గ్రామాల రక్షణ కోసం ఉద్యమిస్తుంటే పోలీసులచేత అణచివేత చర్యలకు పూనుకుంటుంది. తమ చట్టాలను సైతం తామే ఉల్లంఘిస్తున్నారు. అందుకే ప్రజలు సోంపేట, కాకరాపల్లి, కృష్ణపట్నం, గంగవరం, నందిగ్రాం, సింగూరు, కళింగనగర్ తదితర ప్రాంతాలలో మనుగడ కోసం ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకోక పోతే మర్లపాడు ప్రజలు కూడా అదే మార్గాన్నే పయనించాల్సి వస్తుంది.

*(రచయిత సిపిఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ ప్రకాశం జిల్లా కార్యదర్శి)* వీ

గల చుట్టరికాన్ని చెడకుండా నాటకం ఆడుతున్నాడు. రాష్ట్రపతి పరిపాలన ముగిసిన వెంటనే నిర్మించబడే విచ్ఛిన్నకర ప్రభుత్వంలో తన వాటాను పదిలపర్చుకోడానికి ఇందిరమ్మ దయాదాక్షిణ్యాల కొరకు పాకులాడడమే చెన్నారెడ్డి రెండు నాల్కల ధోరణిలోని అంతరార్థం.

**ప్రజావాంఛకు విరుద్ధంగా రాజీపడే అధికారం కాంగ్రెస్ నాయకులకు లేదు**

ప్రజల కోర్కెలను ప్రతిబింబించడానికి, వాటి సాధనకు ముందు నిలబడి పోరాడడానికి అందరితోపాటు ఈ కాంగ్రెస్ నాయకులకు కూడా అధికారం ఉంది. అయితే ప్రభుత్వ యంత్రాంగంలో పదవుల్నీ, కాంగ్రెస్ సంస్థల్లో హోదాల్నీ, ఇందిరమ్మ వందిమాగధ బలగంలో తమ స్థానాన్నీ నిలబెట్టుకోడానికి నాల్గు కోట్ల ఆంధ్ర ప్రజల ఏకైక వాంఛను బలి ఇవ్వడానికి మాత్రం ఈ కాంగ్రెస్ నాయకులకెలాంటి అధికారమూ లేదు. ఆంధ్ర దేశమంతా పోలీసు క్యాంపుగా మార్చి, వందలాది ఆంధ్ర వీరుల రక్తాన్ని బలిగొన్న కాంగ్రెస్ ప్రభుత్వపు రాక్షసకృత్యాల్ని ప్రతిఘటించడంలో, ఆ ఉద్యమానికంతటికీ ప్రాణంగా నిలబడ్డ ఆంధ్ర విద్యార్థి యువకులకూ, తదితర మధ్యతరగతి ఉద్యోగులకూ, మేధావులకూ నాయకత్వం వహించి నడపడానికి అందరితోపాటు కాంగ్రెస్ నాయకులుకు కూడా స్వేచ్ఛ ఉంది. కాని కేవలం పదవుల పంపాటకంలో ఇందిరమ్మ విదిలించే ఎంగిలి మెతుకుల్లో లభించే వాటితో తృప్తిపడి, అమూల్యమైన రక్తాన్ని చిందించి కొనసాగించిన మహోద్యమాన్ని ప్రజాభిప్రాయాన్ని సరకు చేయకుండా నట్టేట ముంచి నమ్మక ద్రోహానికి తలపడే అధికారం మాత్రం ఈ కాంగ్రెస్ నాయకులకు సుతారమూ లేదు. వేలాది ప్రభుత్వోద్యోగులు కడుపు గట్టుకొని, కుటుంబాలు ఆకలి మంటలతో మాడి చస్తున్నా లెక్క చేయక మాసాల తరబడి అపూర్వమైన పోరాటాన్ని కొనసాగించింది కేవలం మంత్రివర్గంలో విభిన్న గ్రూపుల వాటాలు ఎవరికివారు తమ కనుకూలంగా పదిలపర్చుకోవడానికి ఎంత మాత్రమూ కాదు. వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తునూ చదువు సంధ్యల్నీ ఖాతరు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వపు సైనిక మూకలతో ప్రాణాలొడ్డి పోరాడింది కాంగ్రెస్‌లో యే ముఠా గద్దెదిగి యే ముఠా గద్దె నెక్కాలనే విషయాన్ని తేల్చుకోడానికెంత మాత్రమూ కాదని కాంగ్రెస్ నాయకులు గుర్తించేలా చేయడం ఆంధ్ర ప్రజల, యువతీ యువకుల కర్తవ్యం. అధికారపు పంపాటకంలో ఇందిరమ్మతో లాలూచీపడి కోట్లాది తెలుగు ప్రజల సమైక్యవాంఛకు తీరని విద్రోహం తలపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన కాంగ్రెస్ నాయకుల్ని తెలుగు ప్రజలెన్నటికీ క్షమించరు. ఏనాటికైనా తగు విధంగా అలాంటివారిపై కసి తీర్చుకొని తీరుతారు.

**ప్రజాస్వామిక ముసుగులోనున్న పచ్చి నియంతృత్వాన్ని ప్రతిఘటించాలి**

ఒకవైపు ప్రజాద్రోహకర చర్యలకు పాల్పడుతూనే ప్రజాస్వామికాన్ని ఈ భూతలంపై నిలబెట్టే భారమంతా తమ భుజస్కంధాలపైననే ఉన్నట్లు ఇందిరమ్మ ప్రభుత్వమూ కాంగ్రెస్ సంస్థా ఇప్పటికీ నటించగలగడమే విచిత్రం. పాతికేళ్ల అనుభవం చాటి చెబుతున్నా ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాస్వామిక ప్రభుత్వంగా నగిషీలు చెక్కి కీర్తించగల మేధావులు కొంతమందైనా దేశంలో మిగిలి ఉండడం కూడా ఆశ్చర్యమే! పట్టపగటి హత్యలు కొనసాగించడమే వృత్తిగాగల హంతకులు అహింసా సూత్రాన్ని వల్లించడం ఎంతటి మోసపూరితమో, దొంగతనమే వృత్తిగాగల గజదొంగలు ప్రజల సొమ్ము అపహరించరాదనే నీతిసూత్రాన్ని ప్రబోధించడం ఎంతటి పచ్చిదగానో, ప్రజల జీవితంతో చెలగాట మాడుతూ మిలిటరీ బందోబస్తుతోనూ, తుపాకి కాల్పులతోనూ వారిని అణచిపెట్టి, కేవలం రాక్షస హత్యాకాండ కొనసాగించడం ద్వారానే తన నిరంకుశాధికారాన్ని నిలబెట్టుకోగల్గుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తానొక 'పరిశుద్ధ ప్రజాస్వామిక ప్రభుత్వంగా' డబ్బా కొట్టుకోవడం కూడా అలాంటి నీచాతినీచమైన దగాయే. ఆంధ్రదేశం నలుచెరగులా ప్రజలు తుపానులా లేచి, ప్రభుత్వ సైనిక మూకల్ని సైతం ప్రతిఘటించి, రాష్ట్ర విభజన జరిగితీరాలని ముక్తకంఠంతో నినదించి, పోరాటం కొనసాగిస్తే కనీసం ఆ సమస్యపై ప్రజాభిప్రాయ సేకరణకైనా సిద్ధం కాని ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామికం పేరు ఉచ్చరించడానికి కూడా అర్హత లేదు. నిజంగా ఆరుసూత్రాల ప్రణాళిక ఆంధ్రప్రజలకు అభ్యుదయాన్ని చేకూర్చ గలదనే విశ్వాసమే ప్రభుత్వానికిగాని, దాని తాబేదార్లయిన రివిజనిస్టు పార్టీలకు గాని ఉంటే కనీసం ప్రజాభిప్రాయ సేకరణకెందుకు వారు సిద్ధంకారు? ఇంతకంటె ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతకూ, పిరికితనానికీ మరొక నిదర్శనం ఏం కావాలి? ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని కూలదోసి దాని స్థానంలో రైతుకూలీ సామరస్యతపై ఆధారపడ్డ ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించుకోవడం ఒక్కటే ఆంధ్ర తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా కలిసి ఉండడం ద్వారా గానీ, లేక వేరు వేరు ప్రభుత్వాల నేర్పర్చుకోవడం ద్వారా గాని తమ ఉజ్జ్వల భవిష్యత్తును తామే నిర్మించుకో గల స్వేచ్ఛను పొందడానికి గల ఏకైక మార్గం. ఆంధ్ర ప్రజలు కొనసాగించిన సాహసోపేతమైన రాష్ట్ర విభజనోద్యమం నుండి, ఆ ఉద్యమానికి కాంగ్రెస్ నాయకులు తలపెట్టిన తీరని విద్రోహం నుండి లభిస్తున్న గుణపాఠం కూడా అదే. ఆంధ్ర తెలంగాణ ప్రజలు అందుకు పూనుకోవడం ద్వారానే తమ లక్ష్యాన్ని సాధించుకోగలరు. పీడిత ప్రజల నణచి ఉంచడమే బలమైన కేంద్ర ప్రభుత్వముండాలనే నినాదంలో అంతర్థాం.

కాంగ్రెస్ ప్రభుత్వం క్రూర నిర్బంధ విధానాలకు, కాంగ్రెస్ నాయకుల విద్రోహపూరిత చర్యలకూ గురి అయింది కేవలం ఒక్క ఆంధ్ర ప్రజలే కాదు, వాస్తవానికి భారతదేశమంతా ఈనాడొక అగ్నిపర్వతంలా ఉంది. అది ఏనాడు ఏ రూపంలో బద్దలు కానున్నదో చెప్పలేం. తిండి గింజల కొరత, చుక్కలకంటిన ధరలు, దినదినం పెరిగి పోతున్న నిరుద్యోగం, దేశం నలువైపులా ఆకలి మంటల హాహాకారాలు మిన్నునంటుతున్నాయి. ఎక్కడ చూసినా సమ్మెలు, ధర్నాలు, బందులు – వాటినదుపులో పెట్టుతున్నామనే పేరుతో సైనిక విన్యాసాలు, కర్ఫ్యూలు, నిరాయుధులైన జనంపై అమానుషంగా తుపాకీ కాల్పులు ఈ రోజున మన దేశంలో నిత్యకృత్యమైనాయి. ఏ రాష్ట్రానికో ఈ దుస్థితి పరిమితమై లేదు. ఆసేతు హిమాచల పర్వతం ఇదే స్థితి వ్యాపించి ఉంది. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదాలకు మన ఆర్థిక జీవితాన్ని తాకట్టు పెట్టిన ఈ ప్రభుత్వం పై సమస్యలలో ఏ ఒక్కదాన్ని ప్రజలకనుకూలంగా పరిష్కరించ గల స్థితిలో లేదు. ఆ సంగతి అందరికంటే ప్రభుత్వానికే మరింతగా తెలుసు. అందుకే దినదినం ప్రజ్వరిల్లుతున్న ప్రజా విజృంభణను చూసి ప్రభుత్వం తల్లడిల్లిపోతోంది. ప్రజలపై విచ్చలవిడి నిర్బంధాలకు సిద్ధమవుతోంది. అది ప్రభుత్వం దౌర్బల్యానికి, బలహీనతకీ చిహ్నమే కాని బలానికెంతమాత్రమూ చిహ్నం కాదు. ప్రజలపై కొనసాగింప

బడుతున్న పైశాచిక నిర్బంధ విధానంలో భాగమే కేంద్రంలో బలమైన ప్రభుత్వముండాలనే ఇందిరమ్మ ప్రభుత్వం విచ్ఛిన్నకర నినాదం. 'పాకిస్తాన్ ప్రమాదాన్ని', 'చైనా బూచినీ' చూపి ప్రజల్ని మోసం చేసి రాష్ట్ర ప్రభుత్వాలను నామమాత్రాల వషిష్టం గానూ, కేవలం కేంద్ర ప్రభుత్వపు నిర్ణయాలను అమలుజరిపే యంత్రాలుగానూ చేయడం ద్వారా ఆచరణలో కేంద్ర ప్రభుత్వపు నిరంకుశాధికారాన్ని నిర్బంధంగా ప్రజలపై రుద్దడమే నినాదం సారాంశం. బహుజాతులకు నిలయంగానున్న మన దేశంలో అలాంటి నిర్బంధం కొనసాగే కొద్దీ ఆయా జాతులకు ప్రాతినిధ్యంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వానికీ మధ్యనూ, ఇటీవలి వరకు వేరు వేరు ప్రభుత్వాల కింద నివసిస్తూ కాంగ్రెస్ రాజ్యం ఏర్పడ్డాకనే ఒక ప్రభుత్వాల కింద సమీకరించబడ్డ జాతులలోని వెనుకబడ్డ ప్రాంతాలకూ, కాస్తో కూస్తో అభివృద్ధి చెందిన ప్రాంతాలకూ మధ్యనూ ఆరని వైరుధ్యాలు చెలరేగుతున్నాయి. ఇక ముందు అవి మరింత పెచ్చరిల్లక తప్పదు. అందుకు బలమైన ప్రభుత్వముండాలనే పేరుతో వివిధ జాతుల స్వేచ్ఛాభివృద్ధికీ ఆటంకంగా తయారైన ఇందిరమ్మ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలే కారణం. ఇప్పటికే నాగాలాండ్ ప్రజలు తమకు విడిపోయే హక్కుతో సహా ప్రత్యేక ప్రభుత్వం కావాలంటూ సాయుధులై పోరాడుతున్నారు. మిజో జాతి తిరుగుబాటు చేస్తూనే ఉంది. అస్సాం, నాగాలాండ్ ప్రజల మధ్య వైరుధ్యం రాజుకుంటూనే ఉంది. తమిళనాడు అటానమీ కావాలని ప్రకటించింది. ఆ అటానమీ ఎలాంటిదో నిర్వచించడానికి నీళ్లు నములుతున్న కారణంగా ఆ మేరకు తమిళ ప్రజలకు డి.ఎం.కె. దూరమవుతోంది కూడా. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వపు నిరంకుశ పెత్తనం తమపై కొనసాగరాదనే అభిప్రాయంతో బలంగా ప్రభావితులైన తమిళ ప్రజల వాంఛ విడిపోయే హక్కుతో సహా గల్గిన సర్వస్వతంత్ర తమిళ జాతియే ప్రభుత్వం ఏర్పడినప్పుడే నెరవేరుతుంది. అందుకు తమిళ ప్రజలు సంసిద్ధం గాక తప్పదు.

అలానే మహారాష్ట్రకూ, మైసూరుకూ మధ్య సరిహద్దు తగూ, ఆంధ్ర తెలంగాణ మాదిరిగనే పాత మైసూరుకూ, కొత్తగా చేర్చబడ్డ జిల్లాలకూ మధ్య తగువు కొనసాగుతూనే ఉంది. ఎంతో కాలంగా ఆరకుండా రాజుకుంటున్న ప్రత్యేక విదర్భ ఉద్యమం ఇక ముందు మరింత ప్రజ్వరిల్లక తప్పదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇందిరమ్మ ప్రభుత్వం కేవలం దారిద్ర్యానికీ, పీడనకూ, నిలయంగా మాత్రమే గాక దేశంలోని విభిన్న జాతుల పాలిటా, ఇంకా సంపూర్ణంగా రూపొందని జాతులలోని విభిన్న ప్రాంతాల పాలిటా అదొక నిర్బంధ పూర్వకమైన బందిఖానాగా కూడా తయారయ్యిందనేది వాస్తవం. దాని పర్యవసానమే ఆంధ్ర ప్రజలపై నిర్బంధంగానూ, నిరంకుశంగానూ రుద్దబడుతున్న ఆరు సూత్రాల ప్రణాళిక. ఒకవేళ కాంగ్రెస్ నాయకుల విద్రోహం మూలంగా ఆంధ్ర ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం తన విచ్ఛిన్నకర ప్రణాళికను తాత్కాలికంగా, రుద్దగలిగినా ఆంధ్ర ప్రజల హృదయాలలో అది ఆరని చిచ్చును రగుల్కొల్పుతుందనే విషయాన్ని కూడా మరువరాదు. ఆ చిచ్చే ఒకనాడు ప్రజ్వరిల్లి భారతదేశమంతటా కేంద్ర ప్రభుత్వ నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ఇలాగనే రగుల్కొంటున్న విభిన్న జాతుల పోరాటాల కీలాగ్ని జ్వాలలోనూ దేశవ్యాపితంగా ఈ దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరంభమై కొనసాగుతున్న రైతాంగ విప్లవ దావానలంలోను సమ్మిళితం కాక తప్పదు. ఆ దావానలంలో దారిద్ర్యానికీ, నిర్బంధానికీ నిలయంగాను వివిధ జాతుల పాలిటి బందిఖానాగానూ, రూపొంది ఉన్న ఈ నిరంకుశ కేంద్ర ప్రభుత్వం భస్మీపటలం కాక తప్పదు. అలాంటి సుదినం ఎంతో దూరం కూడా లేదు.

**ఆంధ్ర తెలంగాణ ప్రజలు రైతాంగ విప్లవంలో సమైక్యం కావాలి**

ఆంధ్ర తెలంగాణ ప్రజల మధ్య ద్వేషాగ్ని రగుల్కొల్పి ఆత్మహత్యా కరమైన అలాంటి కలహాల చాటున తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే కేంద్ర ప్రభుత్వపు కుట్రను కొనసాగనీయరాదు. రాష్ట్ర విభజన కొరకు సాహసోపేతంగా పోరాడిన విద్యార్థులూ, యువకులూ, తదితర మధ్యతరగతి మేధావులూ తామాశించిన నిరుద్యోగ నిర్మూలనగానీ ఇరు ప్రాంతాల ఉద్యోగుల అభివృద్ధికీ గ్యారంటీ గానీ, అశేష రైతాంగపు దారిద్ర్యానికి మూల కారణమైన భూస్వామ్య విధానపు నిర్మూలన గానీ, ప్రకృతి వనరులన్నింటినీ దిగ్విజయంగా ఉపయోగించుకోవడం ద్వారా ప్రజల జీవన స్థాయిని పెంచగలగడం గానీ, అంతు లేకుండా పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్నరికట్టి సమగ్ర ఆర్థిక విధానాన్ని రూపొందించడంగానీ, పారిశ్రామికంగా అభివృద్ధి చేసి తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధి సాధించగలగడం గానీ, ఈ ఫ్యూడల్, దళారీ పెట్టుబడిదారుల ప్రభుత్వాన్ని సమూలంగా నిర్మూలించి దాని స్థానే రైతు కూలీ సామరస్యంపై ఆధారపడ్డ జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించుకున్నప్పుడే సాధ్యమవుతుంది. సర్వస్వతంత్రమైన విభిన్న జాతుల స్వచ్ఛంద సమాఖ్యగా (వలంటరీ ఫెడరేషన్) రూపొందిన అలాంటి నూతన ప్రజాతంత్ర భారతదేశంలోనే తెలంగాణ, ఆంధ్ర ప్రజలు ఒకే ప్రభుత్వంగా ఏర్పడడానికిగానీ, విడివిడిగా వేరు వేరు ప్రభుత్వాలేర్పరచు కోడానికి గానీ అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. భారత దేశమంతటా ప్రారంభమై కొనసాగుతున్న రైతాంగ విప్లవం ఆశయం కూడా అదే. దేశంలోని విభిన్న జాతులన్నిటికీ అలాంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాలనేదే రైతాంగ విప్లవ లక్ష్యం కూడ. రైతాంగ విప్లవ విజయమే ఆంధ్ర, తెలంగాణ ప్రజలు తమ భవిష్యత్తును తమే నిర్ణయించుకోగల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడానికి గ్యారంటీ. అందువలన రాష్ట్ర విభజనోద్యమం కొరకు సాహసోపేతమైన పోరాటం కొనసాగించిన విద్యార్థులూ, యువకులూ తదితర మధ్యతరగతి ప్రజానీకమూ దేశమంతటా కొనసాగుతున్న రైతాంగ విప్లవంతో సమైక్యం కావాలి. వ్యావసాయక విప్లవంతో జాతుల అభ్యున్నతికి జరిగే పోరాటం సంలీనం కావాలి. తద్వారా ఇందిరమ్మ నాయకత్వాన కొనసాగుతున్న ఫ్యూడల్, దళారీ పెట్టుబడిదారుల నిరంకుశ ప్రభుత్వ సమూల నిర్మూలనకూ, దాని స్థానే జనతా ప్రజాతంత్ర ప్రభుత్వ సంస్థాపనకూ నడుములు బిగించి పోరాటానికి ఉపక్రమించాలి. అప్పుడే రాష్ట్ర విభజ నోద్యమంలో అసులర్పించిన అమరయోధుల ఆశయం నెరవేరుతుంది.

- ఆరు సూత్రాల ప్రణాళికను పాతిపెట్టాలి!
- పోరాటానికి వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ నాయకులకు తగినశాస్తి చేయాలి!
- రైతాంగ విప్లవంతో విద్యార్థులూ, యువకులూ సమైక్యం కావాలి!
- ఫ్యూడల్, దళారీ పెట్టుబడిదారుల ప్రభుత్వాన్ని నిర్మూలించాలి!
- జనతా ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించాలి.

*ఈనాటికీ మంచినీరు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం, వైద్యం వంటి కనీస మౌలిక అవసరాలు అందక అవస్థలు పడుతున్న ఆదివాసుల పరిస్థితిని వివరిస్తున్నారు* **ఎం. నాగమణి**

# ఎవరికీ పట్టని మన్యం దైన్యం

**వ్యా**ధులతో విశాఖ మన్యం విలవిల్లాడుతోంది. అంటు వ్యాధులతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. మారుమూల గ్రామాలలో వ్యాధులు విలయతాండవం చేస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ స్థాయిలోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. మలేరియాను సకాలంలోనే గుర్తించి వైద్య సాయం అందించాలి. లేకుంటే పరిస్థితి విషమమే.

మలేరియాను గుర్తించేందుకు ప్రభుత్వం ర్యాపిడ్ డయాగ్నిసిస్ (ఆర్.డి.) కిట్లను సరఫరా చేసేది. వీటి సాయంతో ఐదు నిమిషాలలో వ్యాధిని తెలుసుకునేవారు. కానీ గత కొంతకాలంగా వీటి సరఫరా నిలిచిపోయింది. మళ్లీ పాత పద్ధతిలోనే సైడ్‌ల ద్వారా మలేరియాను నిర్ధారించే దుస్థితి. రెండేళ్ల నుంచీ మలేరియా నిర్ధారణపై, నియంత్రణపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. మలేరియా బారిన పడుతున్న ఆదివాసులు కోలుకోలేక పోతున్నారు. సకాలంలో వైద్య సేవలు అందితే సరి. లేకుంటే ప్రాణాలు కోల్పోవలసిందే. మన్యంలోని వివిధ ప్రాంతాల్లో మలేరియా మరణాలు వంద దాటాయని వివిధ సర్వేలు పేర్కొన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ మాత్రం మూడు మలేరియా మరణాలనే నిర్ధారించింది. ఏజెన్సీ 33 పి.ఎచ్.సి.ల పరిధిలో ఆగస్ట్ 31 నాటికి 3497 పాజిటివ్ మలేరియా కేసులు నమోదయ్యాయి. పాడేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జనవరి నుంచి ఆగస్ట్ వరకు 389 మలేరియా పాజిటివ్ కేసులను నిర్ధారించారు. చింతపల్లి పి.ఎచ్.సి.లో జూలై నుండి సెప్టెంబర్ వరకు 323 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జూలై, ఆగస్ట్ నెలల్లో మలేరియా జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని గణాంకాలు ఒకవైపు చెబుతుంటే, ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా మలేరియా జ్వరాలు అదుపులోనే ఉన్నాయనీ, ఎటువంటి మరణాలు సంభవించలేదనీ గొబెల్స్ ప్రచారానికి పూనుకుంది.

జబ్బుల్లో 80 శాతం తాగునీటి వల్లే వస్తున్నాయి. ఆదివాసులకు రక్షిత మంచినీరు లభ్యం కావడం లేదు. మారుమూల గ్రామాలలో అక్కడక్కడా బోర్లు వేశారు. అవన్నీ మూలకు చేరాయి. తాగునీటి చుక్కలు రాల్చడం లేదు. చాలా గ్రామాల్లో ప్రజలు వాగులు, కొన్నిచోట్ల కాలువలు కొండ గడ్డల నీటిని తెచ్చుకొని తాగుతుంటారు. అవి పూర్తిగా కలుషితమైనవే. కలరా వ్యాధికి కారణమైన ఈ–కోలి అనే బ్యాక్టీరియా ఇందులో ఉంటుంది. ఇది ఒకసారి మనిషి శరీరంలోకి వస్తే పదేళ్ల వరకూ ప్రమాదం ఉంటుందని, ఎప్పుడైనా అది ప్రభావం చూపవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. తాగునీటిలో కలుషితాలను గుర్తించడానికి క్లోరోస్కోప్‌లను పంపిణీ చేయాలి. ఈ పరికరాలు కొన్నిచోట్ల కింది స్థాయి సిబ్బందికి చేరలేదు. చేరినా, ఆ పని తమదికాదనీ, ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖదనీ వైద్య ఆరోగ్య సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

మన్యంలోని గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు, దోమ తెరల పంపిణీ రెండేళ్ల నుంచీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గత ఏడాది దోమ తెరల పంపిణీ అమలు కాలేదు. ఈ ఏడాది కూడా మూడున్నర లక్షల దోమ తెరల పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఏజెన్సీలో ఆదివాసులకు 12 లక్షల దోమ తెరలు అవసరం. నెలలు గడుస్తున్నా, వానలు కురుస్తున్నా వాటిని ప్రభుత్వం అందించలేకపోయింది. కనీసం దోమల నివారణకు చర్యలు తీసుకుందా అంటే అదీ లేదు. దోమల మందు పిచికారీ ప్రహసనంగా సాగుతోంది. మరొక పక్క ఆదివాసీ తండాల్లో పారిశుధ్యం అధ్వాన్నం. ఇళ్ల పరిసరాల్లోనే పెంటకుప్పలు, పశువుల శాలలు ఉంటున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. డయేరియా విజృంభించి కబళిస్తున్నది. గ్రామీణ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగునకు జాతీయ ఆరోగ్య కార్యక్రమం కింద పంచాయతీలకు ఇస్తున్న రు. 10 వేలు ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయకపోవడంతో మారుమూల తండాల్లో పరిశుభ్రత పూర్తిగా కొరవడింది.

ఆదివాసులకు రోగాలతో పాటు తిండి కూడా ప్రధాన సమస్య. విశాఖ మన్యంలో ఇది ఎక్కువ. ఒకవేళ బాధితులకు ఏదోలా మందులు అందినా, రోజుల తరబడి ఆహారం లేనివారు, ఒక్కోసారి రియాక్షన్‌కు గురవుతున్నారు. వ్యవసాయంలో ఎంతోకొంత ప్రమేయం ఉన్న తెగల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. పూర్తిగా ఆహార సేకరణపై ఆధారపడే కువి, గదబ, కోయ, పోర్జ, పొరంగి పోర్జ, పెంగి పోర్జ, నూకదొర జాతుల పరిస్థితి దయనీయం. వీరు అనారోగ్యానికి గురాతే కోలుకోవడం కష్టమైపోతోంది. పౌష్టికాహార లోపంతో వీరిని రక్తహీనత పీడిస్తోంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఇది ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తేలింది. హిమోగ్లోబిన్ సాధారణంగా 12.5 గ్రాముల నుంచి 14 గ్రాముల వరకు ఉండాలి. కానీ వీరిలో 7 నుంచి 5 గ్రాములు మాత్రమే ఉండడం గమనార్హం.

ఆదివాసులు నాగరిక సమాజానికి దూరంగా దట్టమైన అడవులలో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏమైనా జరిగితే బాహ్య ప్రపంచానికి అంత తొందరగా తెలియదు. రహదారులు ఉన్న రవాణా సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఆస్పత్రులకు రావాలంటే మైళ్ల దూరం

ప్రయాణించాలి. రోగులను మోసుకొనో, డోలి కట్టుకునో తీసుకురావాలి. ఈలోపే జరగరానిది జరిగిపోతోంది. వర్షాల కారణంగా పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కొండలు, గుట్టల్లోని వారికి వైద్యం అందడం లేదు. పొంగుతున్న వాగులు, వంకలు, కొండగెడ్డలు దాటుకుని రావడం వీరికి కష్టమవుతోంది. పి.ఎచ్.సి.ల్లో అంబులెన్స్‌లు కొన్నిచోట్ల మూలకు చేరాయి. మరికొన్నింటికి అసలు లేవు. 108 వాహనాల గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడవి పూర్తిగా కదలడం మానుకున్నాయి.

మన్యంలో పి.ఎచ్.సి.లు, ఏరియా ఆస్పత్రులలో వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీకి ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఎక్కువ మొత్తంలో వేతనం, పి.జి. కోర్సుల్లో ప్రవేశానికి ప్రాధాన్యం కల్పించే విషయాల్లో ప్రభుత్వం నిర్లక్ష వైఖరి అవలంబిస్తోంది. ఫలితంగా కొండ కోనల్లో ఉండడానికి వైద్యులు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే పనిచేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో మైదాన ప్రాంత వైద్యులని డిప్యుటేషన్‌పై నియమిస్తున్నారు. వీరిలో కొందరు అసలు పి.ఎచ్.సి.లకు వెళ్లడం లేదు. ఒత్తిడి తెచ్చినా మొండికేస్తున్నారు. ఈ కారణంగా తరచు కొత్త వైద్యులను నియమించాల్సి వస్తోంది. పూర్తిస్థాయి సిబ్బంది లేరు. ఉన్నవారు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిపోయినవారే తప్ప కొత్తగా వచ్చేవారు దాదాపు లేరనే చెప్పాలి. నిత్యం శ్రమించే వారి జీవితాల్లోకి వైజ్ఞానిక దృష్టికోణాన్ని సోకకుండా చేసి వారి ఆరోగ్యాలతో ప్రభుత్వం ఆడుకుంటోంది.

మన్య ప్రాంతంలో ఆరోగ్య కేంద్రాల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. వైద్యులు ఉండడం లేదు. అత్యవసర మందులు లభించడం లేదు. కనీస మౌలిక సదుపాయాలు కూడా చాలా కేంద్రాల్లో లేవు. దానివల్ల కొన్నిసార్లు రోగుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోంది.

ప్రజారోగ్యానికి సంబంధించిన విధానాలు బాగులేవు. వాటిని అమలు చేస్తున్న తీరు కూడా బాగులేదు. అంతకన్నా ముందు అసలు ప్రజారోగ్యం అంటే ఏమిటనే విషయంలోనే చాలా మంది వైద్య ఆరోగ్య శాఖ అధికార్లలో సందిగ్ధత ఉంది. ప్రజారోగ్యం అంటే ఎక్కువ మంది జనాభాకు వచ్చే వ్యాధులకు వైద్యసేవలు అందిస్తే చాలదు. రోగాలు రాకుండా నివారించాలి. ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రోగ నివారణ, ఆరోగ్యాంశాలపైన ప్రచారం, పారిశుధ్యం, పేదరికం, మందులు అందుబాటు మొదలైన అనేక అంశాలపై ప్రజారోగ్యం ఆధారపడి ఉంటుంది. డబ్ల్యు.ఎచ్.ఒ. చేసిన ఒక అధ్యయనంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 60 శాతం మంది ప్రజలకు వచ్చే రోగాలు పేదరికంతో ముడిపడి ఉన్నవేనని తేలింది. అంటే మన వ్యవస్థలో కొన్ని మౌలిక మార్పులు వస్తే తప్ప – ప్రజారోగ్య విధానాలు విజయవంతం చేయలేరు.

అన్ని ప్రభుత్వాలు తమ విధానాలు పేదలనుద్దేశించినవే అని చెబుతున్నాయి. వాస్తవానికీ, చేసే ప్రచారానికీ మధ్య చాలా తేడా ఉంది. ప్రజారోగ్యానికి సంబంధించిన విషయాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలకమైన పాత్ర పోషిస్తాయి. వీటిని పరిపుష్టం చేయకుండా అమలు చేసే ఏ విధానం కూడా విజయం సాధించదు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రైవేట్ రంగం వారికి మేలు చేసే విధంగా ఉన్నాయి. దీని వలన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాల రూపకల్పన జరగడం లేదు. ఆరోగ్య కేంద్రాలు బలంగా లేవనే సాకుతో ప్రభుత్వాలు ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నాయి. ఈ కారణాలన్నిటి వలన మొత్తం విధానాలే లోపభూయిష్టంగా తయారయ్యాయి. ఉదాహరణకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను తీసుకుందాం. గ్రామీణ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోతే ఈ మిషన్ ఎలా విజయవంతమవుతుంది. అందువల్ల ప్రతినిధులకు పేదల ఆరోగ్యం పట్టదు. వాటి దృష్టి పేదల ఆరోగ్యంపై లేదు. ఆరోగ్య రంగం ఎంత లాభాలు తెచ్చిపెడుతుందనే విషయంపైనే ఉంది.

ఆరోగ్య రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయనే వాదనలో పసలేదు. బ్రిటన్‌లో ఆరోగ్య రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేశారు. దీనివల్ల ఎటువంటి మేలు జరగకపోగా కీడు జరుగుతోందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఒకసారి విధానపరమైన నిర్ణయం తీసుకుని దానిని అమలు చేసిన తరువాత మళ్లీ వెనక్కి వెళ్లడం అంత సులభం కాదు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల లక్ష్యం – ఆరోగ్య రంగాన్ని ఎక్కువ డబ్బులు వచ్చే వ్యాపారంగా తయారు చేయడం. కానీ ప్రజారోగ్య రంగం అసలు లక్ష్యం అదికాదు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం. మౌలిక లక్ష్యాలలోనే తేడాలున్నపుడు పేదలకు ఎటువంటి ప్రయోజనం ఉండదు.

ప్రజలకు అత్యవసర మందులు సరఫరా చేయడం ప్రభుత్వం బాధ్యత. అయితే గత కొద్దికాలంగా ప్రభుత్వం ఈ విషయంలో ఒక చిత్రమైన ధోరణి అవలంబిస్తోంది. అత్యవసర మందుల జాబితాలో ఉన్న మందుల సంఖ్యను తగ్గిస్తూ వస్తోంది. దీని వలన మందులు అవసరమైన వెంటనే అందుబాటులోకి రావు. మనకన్నా చిన్న దేశమైన బంగ్లాదేశ్ కూడా అత్యవసర మందుల జాబితా విషయంలో చాలా కచ్చితంగా ఉంటున్నది. ఇలా మందులను జాబితా నుండి తగ్గించడం వలన వాటి ఖరీదు కూడా పెరుగుతోంది. ఇక్కడ మరో కోణం కూడా ఉంది. తక్కువ ఖరీదులో మందులు తయారు చేసే కంపెనీలు మన దేశంలో అనేకం ఉన్నాయి. వాటిని ప్రోత్సహిస్తే తక్కువ ఖరీదుకే మందులు అందుబాటులోకి వస్తాయి. కానీ ప్రభుత్వ విధానాలు ఆర్థికాభివృద్ధి రేటుకు ఇస్తున్న ప్రాధాన్యం ప్రజా సంక్షేమానికి ఇవ్వడం లేదు. మెడికల్ టూరిజం, రిప్రొడక్టివ్ టూరిజానికి ఇస్తున్న ప్రాధాన్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇవ్వడం లేదు. ఇది ప్రాధాన్యాల సమస్య. ముందు దీనిని పరిష్కరిస్తే ఆరోగ్య రంగంలో అనేక సమస్యలు పరిష్కారమవుతాయి.

*(రచయిత ఆదివాసి ఉద్యమ కార్యకర్త)*

***సత్యాన్వేషణ మానవ ప్రయత్నాలన్నిటిలోకీ అత్యుత్తమమైనది. ఆ సత్యాన్ని ప్రచురించడం ఒక బాధ్యత.***

**– ఆనీ లూయీ జెర్మేన్ డి స్టాల్** *(1766–1817), ఫ్రెంచ్ విప్లవ కాలపు రచయిత్రి*

*రేపు తెలంగాణ వచ్చినా పోలవరం ఆగుతుందా అనీ, నిర్లక్ష్యానికి గురైన ఆదివాసులకు న్యాయం జరుగుతుందా అనీ ప్రశ్నిస్తున్నారు* **మైపతి అరుణ్‌కుమార్**

# స్వయం ప్రతిపత్తి మండలి - ఆదివాసుల అభివృద్ధి

గత ఏడాదిన్నర కాలంగా రాష్ట్రంలో తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు పెల్లుబికి అంతిమ దశ పరిష్కారం కోసం నువ్వానేనా అనే పరిసిత్థిలో ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం న్యాయమైన ఉద్యమం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయండి. కానీ, ఆదివాసీ ప్రాంతాలకు రాజ్యాంగ బద్ధంగా కల్పించబడిన స్వయంప్రతిపత్తి అధికారం కల్పించండి అని డిమాండ్ పెట్టినా, ఈ డిమాండ్ గురించి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర రాజకీయపార్టీలు గానీ , కేంద్ర ప్రభుత్వం గానీ కేంద్రంలోని రాజకీయ పార్టీలు గాని  ఎటువంటి చర్చ కొనసాగించ లేదు. పైగా తెలంగాణ కోసం ఆదివాసీ ప్రాంత ఎం.ఎల్.ఏ.లను కూడా రాజీనామాలు చేయాలని ఇండ్లపై కూడా దాడులు చేయడం జరిగింది. ప్రాంతీయ అసమానతలు, వెనకబాటుతనం, ఆత్మగౌరవం కోసమని ఆరు దశాబ్దాలుగా సాగుతున్నది తెలంగాణ ఉద్యమం. తెలుగువారు అంతా కలిసి ఉండాలనేది సమైక్యాంధ్ర ఉద్యమం. ఇటువంటి పరిస్థితిలో 200 సంవత్సరాల నుండి స్వయం ప్రతిపత్తి కోసం పోరాడుతున్న ఆదివాసీలు అత్యంత దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. మనుగడ ప్రశ్నార్థకంగా మారిన ఆదివాసీలు 6వ షెడ్యూల్ ప్రకారం తమ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తితో కూడిన రాష్ట్రాన్ని గాని కౌన్సిల్‌ను గాని ఏర్పాటు చేయండి అని ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఆజాద్‌లను ఆదివాసీ ఎం.ఎల్.ఎ.లు కలిసి విన్నవించడం జరిగింది. ఈ ఉద్యమం సీమాంధ్ర పెట్టుబడిదారుల ఉద్యమం అని, తెలంగాణను అడ్డుకునేందుకు అని లంబాడిలు, రాజకీయ పార్టీలు నాయకులు విమర్శించడం దారుణం. వాస్తవంగా ఆదివాసీ ప్రాంతాలు విభజించడం ద్వారా తెలంగాణకు జరిగే నష్టం ఏమిలేదు. అందుకే ఈ డిమాండ్ న్యాయమైనదా? రాజ్యాంగ బద్ధమైనదా? అనేది చారిత్రకంగా వివరించదల్చుకున్నాను.

ఆదివాసీల స్వయంప్రతిపత్తి, ఆత్మగౌరవం కోసం పరాయి పరిపాలనను వ్యవతిరేకించడం ఇప్పుడు సృష్టించినది కాదు, చారిత్రక కాలం నాటిదే (1260-1300). మేడారం కేంద్రంగా సమ్మక్క సారలమ్మ పోరాటం, 1778 బీహార్ కొండలలో పహడీయాల తిరుబాటు, 1803 రంప పితూరి పోరాటం, 1855లో సంతాల్ తిరుగుబాటు, 1836-46 కాలంలో ఆసిఫాబాద్ కేంద్రంగా రాంజీ గోండ్ తిరుగుబాటు, 1928-40 జల్, జంగిల్, జమీన్ కోసం జోడేఘాట్ కేంద్రంగా కొమురం భీం పోరాటం లాంటివి చరిత్ర పొడుగునా ఉన్నాయి. దానిలో భాగంగానే భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం ఆదివాసీలు ప్రత్యేక భారతం కావాలని నివేదించారు. భారతదేశానికి బ్రిటిష్ పాలన నుండి విముక్తి అనంతరం ఆదివాసీల గురించి జరిగిన చర్చ విధానాన్ని గురించి వివరించ దల్చుకున్నాను. దేశ విభజన సందర్భంగా చీలిపోయిన అఖండ భారతంలో ఆదివాసీలు తమకో ప్రపంచం కావాలని కోరుకున్నారు. దీనిలో భాగంగానే 1947 నవంబర్ 9న చోటానాగపూర్‌లో ఆదివాసీ తెగలకు భారత ప్రభుత్వానికి మధ్య చర్చలు విఫలమయ్యాయి. అప్పటికి హైదరాబాద్, జమ్ముకాశ్మీర్ ఉద్రిక్తతలతో సతమతమవుతున్నవి. భారత సైన్యానికి ఆదివాసీల సమస్య కొత్త తలనొప్పిగా పరిణమించింది. కాని సర్దార్ పటేల్ మాత్రం నిబ్బరంగా వ్యవహరించారు. ఇదే సమయంలో గిరిజనులపై యుద్ధం ప్రకటిస్తామా? అన్న ప్రశ్నకు పటేల్ సమాధానంగా 'మనం గిరిజనులతో యుద్ధం చేయం. వారు 1857 ముందు నుంచి ఎన్నో సంవత్సరాలుగా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు, వారు అసలైన జాతీయవాదులు' అని పేర్కొన్నాడు. గిరిజనులు జాతీయ రాజ్యం లేకుండా జాతిని కోరుకుంటున్నారన్నది పటేల్ ఉద్దేశం. వారు గాంధీని జాతిపితగా ప్రేమిస్తారు, ఆరాధిస్తారు. కాని వారికి జాతీయ రాజ్యం నచ్చదు.

చీలికల్లో మొదటగా భారతీయ రాజ్య నిర్మాణంలో ముస్లీం లీగ్ పాలుపంచుకోకపోవడం ఒకటైతె, రెండో చీలికగా గిరిజనుల పట్టుదల. గిరిజనుల మొండితనం నెహ్రూ, పటెల్, ఆజాద్‌లను ఆశ్చర్య పరిచింది. గిరిజనులు స్వయం ప్రతిపత్తిగల జాతులు, భూమి పుత్రుల మనే కాదు, బ్రిటిష్ వారిలాగె పరాయి వారైన భారతీయులు కూడా తమ భూభాగం నుంచి వెళ్లిపోవాలని కోరుకున్నారు. ఇటువంటి సందర్భంలో గిరిజనులు చేసిన వాఖ్యలు బయటి ప్రపంచానికి వ్యతిరేకంగా ఉన్నా, నెహ్రూ పటెల్‌లకు మాత్రం ఈ విషయంలో స్పష్టమైన అవగాహన ఉంది. గిరిజనులు రజాకార్లు కాదు. వారి సంస్కృతి భిన్నమైనది. వారు కోరుకునేది వేరే. వారి ప్రపంచం, వారి వాదనలు అర్థం చేసుకోవడానికి భిన్న దృక్పథం కావాలి కనుక గిరిజనులతో మలిదఫా చర్చలు అవసరమని భావించారు. ఒకపక్క చర్చలకు ప్రయత్నాలు జరుగు తుండగానే మరోవైపు కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. డీనోటిపై ట్రైబ్స్‌ను బహిరంగంగా కొట్టిచంపారు. ఇద్దరు చిన్నపిల్లలను చంపారు. అయినప్పటికి గిరిజన నాయకులు సహనం కోల్పోలేదు. నెహ్రూ, జైపాల్‌సింగ్‌లు, రాజ్‌దయాళ్ ముండ, రాపెలోహార్‌లతో పాటు ఐదుగురు గిరిజన నాయకుల్ని ఢిల్లీ పిలిపించారు.

రెండవసారి చర్చ ఢిల్లీలోని నెహ్రూ నివాసమైన తీన్‌మూర్తి భవన్‌లో జరిగింది, అందులో నెహ్రూ, అబ్దుల్ కలామ్ ఆజాద్, కాక సాహెబ్ కలేల్కర్, పటేల్‌లు పాల్గొన్నారు. సుదీర్ఘంగా ఇరువర్గాల మధ్య జరిగిన చర్చ అనంతరం నెహ్రూ 'మరో వేర్పాటు వాదం సాధ్యం కాదని, దేశ విభజన వేర్పాటుకాదు, మీది మాత్రమే వేర్పాటు' అని అన్నారు. దీనితో అందరు ఏకీభవించారు. దానిలో భాగంగానే గిరిజనులకు ప్రత్యేక భారతం ఇవ్వకుండా ప్రత్యామ్నయంగా పాలించుకోవడానికి రాజ్యాంగం లో 5, 6 షెడ్యుల్‌లను కల్పించారు. ఈ నిర్ణయం ప్రకారం 5వ షెడ్యూల్‌లో భాగమైన ఆంధ్రప్రదేశ్ ఆదివాసీలకు స్వయం పాలన 64 ఏళ్ల భారతావనిలో అమలు చేసిందా లేదా అనేది పరిశీలిస్తె అమలు చేసిన ధాఖలాలు లేవు. భవిష్యత్ తెలంగాణలో కూడా పాలకులు అమలు చేస్తారని గ్యారంటీ లేదు.

రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలలో 31,486 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 30 తెగలుగా జీవిస్తున్నారు. విస్తారమైన అటవి సంపద, ఖనిజ నిక్షేపాలు ఉన్న ఈ ప్రాంతమంతటా ఆదివాసీలు కడు దారిద్ర్యంతో జీవిస్తున్నారు. 1994-2005 జాతీయ శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం జనాభాలోని తలసరి పేదరిక నిష్పత్తి ఇతర సామాజిక వర్గాలలో తగ్గుతూ వస్తుంటే గిరిజనులలో 26 నుంచి 28.3 శాతానికి పెరిగిందని తేల్చింది. మానవ అభివృద్ధి సూచిక 2004 ప్రకారం దారిద్ర్యపు రేఖకు దిగువన ఉన్నవారు 23 శాతం, 2007 మానవ అభివృద్ధి నివేదిక ప్రకారం మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు 90 శాతం గ్రామాలలో పంపుల ద్వారా మంచినీటి సరఫరా లేదు. 67 శాతం గూడేలకు రోడ్డు సౌకర్యం లేదు. 73 శాతం గూడేలకు రహదారులు లేవు. 78.24 శాతం గ్రామాలకు కరెంట్ సౌకర్యం లేదు. 50 శాతం గ్రామలకు వైద్య సదుపాయం లేదు. ప్రతి 1000 మంది జనాభా గల మైదానంలో శిశు మరణాలు 80 ఉంటే, గిరిజనులలో అది 126గా ఉంది. 90 శాతం మంది గిరిజనులు నేటికీ రక్తహీనతతో భాదపడుతున్నారు. ప్రతి 1000మందికి 80మంది ఆదివాసీ మహిళలు ప్రసవ సమయంలో బిడ్డతో సహ మృత్యువాత పడుతున్నారు.

విద్యారంగంలో చూస్తే మైదాన ప్రాంతంలో 60 శాతం అక్షరాస్యత ఉండగా అందులో తెలంగాణ ప్రాంతంలో 58 శాతం, కోస్తాంధ్రలో 63 శాతం, రాయలసీమలో 60 శాతంగా ఉంది. కాని షెడ్యుల్డ్ ఏరియాలో అక్షరాస్యత శాతం పురుషులలో 17 శాతం, మహిళలలో 8.6 శాతంగా ఉంది.

భూముల పరంగా చూస్తే ఆదివాసీల భూమి రక్షణకై బ్రిటిష్ ప్రభుత్వం చేసిన 1917 భూబదలాయింపు చట్టం, 1959 భూ బదలాయింపు చట్టం, 1967లో శ్రీకాకుళ మహత్తర ఉద్యమం ఫలితంగా 1970లో వచ్చిన 1/70 చట్టాలు ఉన్నా అవి గిరిజనేతరులకు చుట్టంగా మారింది. గిరిజనులు తమ భూములలోనే కాందశీకులుగా మారె దౌర్భగ్యపు స్థితి దాపురించింది. గిర్‌గ్లాని కమిషన్ నివేదిక షెడ్యూల్ ఏరియాలో రు. 6వేల కోట్ల విలువ చేసే భూములు 7.5 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని తేల్చారు. 48 శాతం భూములు గిరిజనేతరుల కబంధ హస్తాలలో ఉన్నాయి అని పేర్కొన్నారు. గిరిజనుల వ్యవసాయ కూలీల సంఖ్య 37 శాతం నుండి 47.7 శాతం కు పెరగగా, భూయాజమాన్యం 45 శాతం నుండి 35 శాతానికి పడిపోయింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం ప్రాజెక్టు వలన 300 గ్రామాలు, 3లక్షల మంది ఆదివాసీలు, 400 చారిత్రక కట్టడాలు విలువైన వనమూలికలు జల సమాధి కాబోతున్నా, పట్టించుకునే పరిస్థితి లేదు. 5వ షెడ్యూల్ (6)(1) క్లాజు ప్రకారం షెడ్యూల్ గ్రామహోదాను తొలిగించే అధికారం రాష్ట్రపతికి సంక్రమించబడింది. కాని ఇక్కడ ప్రభుత్వం ముంపు ప్రకటించిన 274 గ్రామలు షెడ్యూల్ హోద కల్గి ఉన్నవి. దీంతో ఆదివాసీలపై పాలకుల దాష్టికాన్ని అంచన వేయవచ్చు. ఆదివాసీ ప్రాంతాలు ముంపుకు గురవుతున్నా, రాజ్యాంగ విలువలను పరిగణనలోకి తీసుకోకుండా వివిధ రాజకీయ పార్టీలు నిస్సిగ్గుగా పోలవరం కట్టాలని రాజకీయ యాత్రలు చేస్తున్నాయి.. జాతీయ ముసాయిద ప్రకారం ఏదైనా ఒక ప్రాజెక్టు వలన 50వేల కంటె ఎక్కువ జనాభా నిర్వాసితులు అయితే ఆ ప్రాజెక్టు కట్టవద్దని అంటే సుప్రీంకోర్టు ఈ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని పోలవరాన్ని ఆపాల్సిందే అని చెప్పలేదు. కాని కమిటీలను నియమించి సర్వే చేయించింది. ఈప్రాజెక్టు వలన కేవలం తెలంగాణ ప్రాంతంలోనే 9 ఆదివాసీ మండలాలు ఆంధ్రప్రాంత పెత్తందారి విధానానికి బలి అవబోతున్నాయి. కాని తెలంగాణ ప్రాంత రాజకీయ పార్టీలు దానిపై కేంద్రస్థాయిలో ఎందుకు పోరాటం చేయలేక పోతున్నాయి. తెలంగాణలో 610జి.ఓ., 14ఎఫ్ లాంటి జీ.ఓ. సమస్య లపై బందులు పాటిస్తారు. తెలంగాణకు వ్యతిరేకులు ఎవరైన వస్తే దాడులు చేస్తారు. కాని 2 లక్షలమంది తెలంగాణ భూభాగంలో మమేకమై జీవిస్తున ఆదివాసీలు జలసమాధి కాబోతున్నా ఇప్పటి వరకు పోలవరం ఆపండి అని ఒక బంద్‌గాని, ఒక రాస్తారోకోగాని, కేంద్రంపై ఒత్తిడి గాని ఎందుకు చేయలేకపోయారు? దీని అర్థం ఏమిటి. ఆదివాసీల రాష్ట్ర ప్రతిపత్తి డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్న తెలంగాణ నాయకులు వివరించాలి. ఒకవేళ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పోలవరం ఆగుతుందా? ఆత్మరక్షణార్థమే మాప్రాంతానికి పాలించే హక్కు కావాలని కోరుతున్నాం అంతే తప్ప తెలంగాణ పోరాటాన్ని అడ్డుకోవాలని కాదు.

మైనింగ్ మాఫియా రాజకీయ వారసత్వాన్ని చేజిక్కించుకొని ఆదివాసీల బతుకులను ఛిద్రం చేస్తోంది. విశాఖ మన్యంలో 8వేల హెక్టార్లలో 700 మిలియన్ టన్నుల బాక్సైట్ తవ్వకాల వలన 274 గూడెలు 40వేల మంది ఆదివాసీ తెగలు కకావికలం అయే పరిస్థితి ఉంది. ఇదే జిల్లాలో దుంబ్రిగూడ మండలంలో చైనాక్లే తవ్వకాల వలన 10వేలమంది నిర్వాసితులు అవుతున్నారు. తెలంగాణ ప్రాంతంలోని 68 శాతం గోదావరి పరివాహక ప్రాంతంలో 7501 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను తవ్వడానికి 72 ఓపెన్‌కాస్ట్‌లను ప్రారంభించి ఆదివాసీలను బొందలోకి నెట్టె ప్రయత్నం ఇప్పటికే మొదలయింది. ఇప్పటి వరకు బొగ్గు తవ్వకాల వలన 65 మండలాలలో అనేక మంది ఆదివాసీలు నిర్వాసితులు అయినారు. కనీసం వీరికి నష్టపరిహారం కూడా అందని పరిస్థితి. శ్రీకాకుళం జిల్లాలో పులిపుట్ట గ్రామంలోని కన్నెదార కొండలోని గ్రానైట్‌ను తవ్వి అక్కడున్న 55 కుటుంబాలను నిర్వాసితులను చేయాలని చూస్తున్నారు. తూర్పుగోదావరి ఏజెన్సీలోని

వంతాడులోని లెటరైట్ ఖనిజాన్ని తవ్వి నిర్వాసితులను చేస్తున్నారు. నల్లమలలో వజ్రాల తవ్వకాలకోసం 236, 237 జి.ఓ.లను విడుదల చేసి రాజీవ్‌గాంధీ పులుల అభయారణ్యం పేరుతో అక్కడున్న చెంచులను అడవుల నుంచి వెళ్లగొడుతున్నారు. ఆదిలాబాద్‌లోని ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కుంటాల జలపాతాన్ని నాశనం చేయడానికి అక్కడ ఆదివాసీల దైవం సోమేశ్వర దేవాలయాన్ని, చారిత్రక ఆధారాలను, ఆదివాసీల సంస్కృతిని విచ్ఛిన్నం చేయడానికి మినిహైడల్ ప్రాజెక్టును రు. 30 కోట్లతో కడుతున్నారు.

వాకపల్లి, భల్లుగూడ ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరిగి 5సంవత్సరాలవుతున్నా నిందితులు ఎవరో తేల్చలేని ప్రజాస్వామిక వ్యవస్థ ఇది. ఆదివాసీ మహిళలపై గిరిజనేతరులు అత్యాచారాలు చేసినా గిరిజనేతరుల రాజకీయ ప్రోద్బలంతో త్రుంగలో తొక్కబడుతున్నాయి. ఎస్.సి./ఎస్.టి. అత్యాచార నిరోధ 1989చట్టం కూడా అమలయ్యే పరిస్థితి లేదు. పైగా అమెరికా వంటి బహుళజాతి కంపెనీలు తయారు చేసిన గార్డాసిల్ టీకాలు, ఔషధ మందులు కూడా ఆదివాసీలపైననే ప్రయోగాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మరణించిన వారికి నష్ట పరిహారం ఇప్పటికీ అందిన దాఖలాలు కూడా లేవు.

ఒకపక్క ఆదివాసీలు అంతరించి పోతూంటే కులాలను తెగలతో కలిపి జనాభాను పెంచుతున్న పాలకులు 1976లో లంబాడి, యానాది, ఎరుకుల కులాలను ఓటుబ్యాంక్ కోసం ఎస్.టి.లలో కలిపారు. ఈ కలపబడినటువంటి లంబాడీలు ఆదివాసీలను ఆగం చేస్తున్నారు. ఒకపక్క 1976లో 1,32,000 ఉన్న లంబాడీలు ఈరోజు మహారాష్ట్రలో బి.సి., రాజస్థాన్‌లో ఒ.సి., కర్ణాటకలో ఎస్.సి.లుగా చలామణీ అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్.టి. జాబితాలో చేర్చేవరకు తెలంగాణ ప్రాంతానికి వలసలుగా వచ్చి విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో ఆదివాసీలను దోచుకతింటున్నారు. భవిష్యత్ తెలంగాణలో కూడా తెలంగాణ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పెద్దపీట వేసి ఆదివాసీలను అణగదొక్కదని గ్యారంటీ లేదు. ఆంధ్ర ప్రాంత వాసులు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాలలో తెలంగాణ ప్రాంతం వారిని ఏవిధంగా దోచుకు తింటున్నారో, ఏవిధంగా వలసలు వచ్చి ఆధిపత్యం చలాయిస్తున్నారో అంతకంటే మూడు రెట్లు ఎక్కువగా తెలంగాణకు లంబాడీలు వలస వచ్చి ఆదివాసీలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. పైగా డీనోటిఫై ట్రైబ్స్‌గా కొనసాగుతున్న లంబాడీలు గిరిజనులుగా వ్యవహరిస్తున్నారు. లంబాడీలు మొదటగా ఆదివాసీల రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తున్నారు. 610జీ.ఓ. ప్రకారం ఆంధ్రప్రాంత వలసలను వ్యతిరేకించిన తెలంగాణవాదులు ఆదివాసీ ప్రాంతాలకు లంబాడీలు వలసలు వస్తుంటె ఎందుకు వ్యతిరేకించలేదు. ఆంధ్రప్రాంతానికి వర్తించే 610 జి.ఓ. వలస లంబాడీలకు వర్తించదా? ఈ వలసలపై ఎందుకు నోరు మెదపడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే గిరిజనులే ముఖ్యమంత్రి అవుతారని అటు కె.సి.ఆర్.. ఇటు లంబాడీలు వాదిస్తున్నారు. లంబాడీల ఆధిపత్యాన్ని అధిగమించి ఆదివాసీలు ముఖ్యమంత్రి కావడం నిజంగా నవ్వుకోదగ్గ విషయం. కలపబడినటు వంటి లంబాడీలకు ఆదివాసీ రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని గుర్తెరగాలి. 2005లో నక్కల, పిట్టల వారిని కలిపి, 2009న వాల్మికి, రజక, బోయలను కలపాలని కుట్రలు పన్నుతున్నారు. ప్రస్తుతం ఔషధ మొక్కలను అమ్ముకునేవారిని ఎస్.టి. జాబితాలో చేర్చాలని కుట్రలు పన్నుతున్నారు. ఆదివాసీ తెగలయిన హిల్‌రెడ్డి, కలాం, చెంచు, కులియ, బిల్ తెగలు అంతరిస్తుంటే పట్టించుకోని పాలకులు రాజ్యాంగ నిబంధనలు పాటించకుండా కులాలను తెగలలో కలిపి ఓటుబ్యాంకు రాజకీయం చేస్తున్నారు.

ఈ పరిస్థితులన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదివాసీలకు శాపంగా మారిందని చెప్పవచ్చు. తెలంగాణలో కూడా ఇటువంటి విధానాలు అమలు కావనడానికి గ్యారంటీ లేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు (1956) వలన దేశంలోని ఆదిమజాతి తెగల ప్రాంతాల వారిగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలలో విచ్ఛిన్నం కావడం వలన ఆదివాసీల హక్కులు , సంస్కృతి, సాంప్రదాయాలు, భాషలను ఆయాప్రభుత్వాలు పరిశీలనలోకి తీసుకోలేదు. దానితో ఆదివాసీలు బాహ్య ప్రపంచానికి దూరమైనారు. 6వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలు ఉమ్మడిగా స్వయం ప్రతిపత్తితో సహజీవనం చేస్తుంటె, 5వ షెడ్యూల్ ప్రాంతాలు పరాయి పాలనలో మగ్గుతూ మనుగడ కోల్పోతున్నాయి.

ప్రస్తుత రాష్ట్రంలో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల కంటే ఆదివాసీ ప్రాంతాలు ఎక్కువగా అభివృద్ధికి దూరంగా ఉన్నవి అనేది స్పష్టమవుతోంది. దోపిడికి గురవుతామని తెలుస్తున్నది. కొందరు లంబాడీలు ఆదివాసీ ప్రాంతాలకు శాస్త్రీయత లేదని వాదిస్తున్నారు. కొమురం భీం తెలంగాణ కోసం పోరాటం చేసినారు, కాని స్వయం ప్రతిపత్తి కోసం కాదని వాదిస్తున్నారు. కొంతమంది రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ మాత్రమే ఉంది 6వ షెడ్యూల్ లేదని అజ్ఞానంగా వ్యవహరిస్తున్నారు. వారు ముందుగా భారత రాజ్యాంగాన్ని అభ్యసించి మాట్లాడవలసిన అవసరం ఉన్నది. భౌగోళికంగా రాష్ట్రంలో ఏప్రాంతంతో ఆదివాసీలకు సంబంధం లేదు. ఆదివాసీ ప్రాంతాల రాష్ట్ర ప్రతిపత్తిగాని, కౌన్సిల్‌లను ఏర్పాటు చేయడం వలన ఏ ఉద్యమాలకు గాని ఏ ప్రాంతాలకు గాని ఆటంకం ఏర్పడే అవకాశం లేదు. దీనిని తెలంగాణ వాదులు సామాజిక కోణంలో ఆలోచించాలి. బ్రిటిష్ ప్రభుత్వం కూడా 1875లో ఆదివాసీ పోరాటల ఆధారంగా వారి అభివృద్ధి కోసం ఆదివాసీ ప్రాంతాలకు షెడ్యూల్ చట్టం చేయడం జరిగింది. మాకంటూ రాజ్యాంగ నిర్మాతలు ఆనాడే సరిహద్దు గుర్తించడం జరిగింది. అభివృద్ధి సూచిక ఆధారంగా రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ 244(1)(2) క్లాజుల ప్రకారం రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతి తమ విశిష్ట అధికారాలతో కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి గుర్ఖాలాండ్ తరహాలో 'గిరిజన కౌన్సిల్'ను ఏర్పాటు చేయాలి. ఎస్.టి. రిజర్వేషన్లతో గెలిచిన ఎం.ఎల్.ఎ.లు తమ పార్టీ విధానాలను పక్కన పెట్టాలి. గిరిజన ఎం.ఎల్.ఏ.లతో కూడిన ట్రైబల్ అడ్వయిజరి కమిటీ గిరిజన కౌన్సిల్ ఏర్పాటుకు ఒత్తిడి తీసుకరావాలి. లేదంటే 5వ షెడ్యూల్‌లో కనుక ఆదివాసీలకు న్యాయం జరగకుంటే 5వ షెడ్యూలు ప్రాంతాలను 6వ షెడ్యూల్‌లో విలీనం చేయండి అని పేర్కొన్న అంబేద్కర్ నిబంధన ఆధారంగా 6వ షెడ్యూల్‌లో విలీనం చేసి ఆదివాసీలకు స్వయం ప్రతిపత్తితో కూడిన రాష్ట్రం ఏర్పాటు చేయాలి.

*(రచయిత ఆదివాసీ విద్యార్థి సంఘం (తుడుం దెబ్బ)*
*రాష్ట్ర కమిటి (ఆ.ప్ర.) ఉపాధ్యాక్షులు)* వీ

*ఓపెన్ కాస్ట్‌ల వలన లాభపడుతున్నదెవరో, జీవితాలు కోల్పోతున్నదెవరో వివరిస్తూ ఈ 'అభివృద్ధి'ని తిరస్కరించాలని అంటున్నారు* **మాడావి భాస్కర్ రావు**

# ఈ వినాశన అభివృద్ధి ఎవరి కోసం?

అమెరికా దాని అనుకూల పశ్చిమ రాజ్యాల ప్రయోజనాలే ప్రధానంగా అభివృద్ధి నమూనాగా ప్రచారం చేయబడుతున్నాయి. దానికి అనుగుణంగా అణచివేత రాజ్యమేలుతున్నది. దానితో రెక్కాడితే గాని డొక్కాడని సగటు మనిషి జీవితం పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టు అయింది. భూమి లాంటి ప్రాకృతిక వనరులపై ఆధారపడి బతికే ప్రజలు తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారు. ప్రకృతి పైన ఆధారపడి జీవించే ఆదివాసులు, వారి సంస్కృతి, ఆచారాలు, సాంప్రదాయాలు కోల్పోతున్నారు. సామాజిక అంతరాలు పెరుగుతున్నాయి. వారి జీవనాధారాలపై విషమ ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఇక్కడ నెలకొల్పబడిన ఓపెన్ కాస్ట్‌లు, వాటివల్ల కాలుష్యం, పర్యావరణ విధ్వంసం వల్ల కూడా ఆదివాసులు నిర్వాసితులవుతున్నారు. ఈ విధ్వంసాలు ప్రజల జీవించే హక్కును కూడా హరించి వేస్తున్నాయి. ఇక్కడ అభివృద్ధి పేరుతో పాలకులు ఆదివాసులను ఏ విధంగా మోసం చేస్తున్నారో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ పెట్టుబడిదారులు చేపట్టిన వినాశన అభివృద్ధి నమూనా ఎలా ఉందో, పాఠకులు అర్థం చేసుకోవడానికి ఈ చిన్న వ్యాసం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

డోర్లి-1, డోర్లి-2, ఖైరిగూడ ఓపెన్ కాస్టులతో ఆదివాసులు అభివృద్ధి అవుతారనీ, నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందనీ, ఇండ్లు, భూములు ఇస్తామనీ, నిర్వాసితులకు లక్షల రూపాయలు నష్టపరిహారం ఇస్తామనీ, ఊర్లు, దేవాలయాలూ, స్కూళ్లు నిర్మించి ఇస్తామనీ కాంగ్రెస్, టిడిపి పాలకులు, పెట్టుబడిదారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆదివాసులకు మోసపు మాటలు చెప్పి వారి బతుకులను ఆగం చేశారు. ఓపెన్ కాస్ట్ బొగ్గుబావుల పేరు మీద ఆదివాసీ ప్రజల జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయి. డోర్లి-1, డోర్లి-2లో ఓపెన్‌కాస్ట్ శివారు సుమారు పద్దెనిమిది వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ శివారు చూసినట్లైతే 13 గ్రామాల ప్రజల సాగు భూమి పదహారు వేల ఎకరాలు ఉంటే రెండు వేల ఎకరాలు (బంజరు) పడిత్ భూములు. ఈ భూములలో సాగుబడి, పశుపోషణ, అటవీ సంపదలపై ఆధారపడి ఆదివాసుల జీవన విధానం కొనసాగేది. తమకు కావాల్సిన అటవీ వనరులు, ఇప్ప చెట్లు, చింత చెట్లు, బంకా (తమసీ బంకా), తిరుమని బంకా, కారెంగా బంకా, వెదురు, ఉసిరికాయలు, మొర్రిగింజలు, తునికి పండ్లు, అడవి ఆమ్‌దాలు, పావురాకులు ఇస్తారి కుట్టి అమ్మేవారు. కొలాం ఆదివాసులు తేనె పట్టులు కోసి, ఔషధాలు, వనమూలికలు, కలప, ఇంకా అనేక వనరులు సేకరించి ఐ.టి.డి.ఎ., డి.ఆర్.డి.ఎఫ్.లకు, షావుకార్లకు అమ్మి ఆదివాసులు సంపాదికుంచుకునే వారు.

బీం దేవాలయాలు, మైసమ్మ, పోషమ్మ గద్దెలు ఉండేవి. అక్కడ జాతరలు నడిచేవి. డోర్లి దంతన్‌పల్లి వద్ద బీం దేవుని జాతరలు నడిచేవి. ఈ జాతరకు జిల్లా నలుమూలల ఉన్న కొలాం గిరిజనులు తమ ఆరాధ్య దైవాన్ని కొలవడానికి ఇక్కడికి వచ్చి మతాన్ని దర్శించుకునేవారు. మఠం వద్దకు వచ్చిన గిరిజనులు అలైబలై తీసుకొని, ఆప్యాయతలు, అనురాగాలు పంచుకొని, యువతీ యువకులు తమకు నచ్చిన వారిని కొత్త జంటలుగా చూసుకొని పోయేవారు. తల్లిదండ్రుల సగం బరువు దించేవారు. కొలాం ఆదివాసీ సంప్రదాయక నృత్యాలు, కొలాహలాంగా సాగేవి. డొల్లు డప్పులు (ఊసుదులు), బాజలు, నెమలి పించాల టోపీలతో రకరకాల వేషధారణలతో సంస్కృతీ, సంప్రదాయాలనూ, డైనోసర్స్ లాంటి ప్రొక్రెన్, బుల్డోజర్, మిషనరీలతో మింగేయబడ్డాయి. తరతరాల నుండి సంప్రదాయాలను నెలకొల్పుతూ, బీం దేవరను మైసమ్మ, పోషమ్మలను పునాదుల నుండి తవ్వేసి, ఆదివాసీ ప్రజల సంప్రదాయా లను, సంస్కృతులను తొలగించారు.

పద్దెనిమిది వేల ఎకరాల భూమిలోకి ఓపెన్ కాస్ట్ వేయడానికి సింగరేణి యాజమాన్యం మొదట సర్వేకు వస్తే ఓపెన్ కాస్టులు వద్దు మాకు అడవి కావాలి, అడవి సంపద కావాలి, మా భూములు మాకే కావాలి, మా నీరు మాకే కావాలి అని దంతన్‌పల్లి కొలాం ఆదివాసులు మొత్తుకున్నారు. దంతన్‌పల్లి ఓపెన్‌కాస్ట్‌ను ఈ మాటలతో గ్రామ ప్రజలు ఆపినందుకు అప్పటి టి.డి.పి., ఇప్పటి కాంగ్రెస్ కలిసి 15 ఆగస్ట్ 2004లో ఓపెన్‌కాస్ట్‌లు వెయ్యం అని హామీలు ఇచ్చాయి. 2005లో సంవత్సరం తిరగక ముందే ఓపెన్‌కాస్ట్ పడుతుంది, నిర్వాసిత ప్రజలకు వచ్చిన సొమ్ము నుండి సగం తినేసి మొసలి కన్నీరు ప్రదర్శనలు, ఆందోళనలు చేశారు. నిర్వాసిత ప్రజలు వద్దు వద్దు అని పాలకవర్గాల మోసపు మాటలకు మోసపోయి, పైసలతో ఇంత నష్టం వాటిల్లుతదని వారికి తెలియదు. అమాయక ప్రజలు పైసలతో ప్రమాదంలో చిక్కుకున్నారు. దీనికి కారణం పాలకులు, ప్రభుత్వాలు. నమ్ముకున్న భూములను గుంజుకొని, గృహాలు లేకుండాచేసి, చదివేపిల్లలను సన్నాసులు చేసి, నిరుద్యోగాన్ని పెంచి గ్రామాలకు గ్రామాలను వల్లకాడు చేశారు.

డోర్లి, దంతన్‌పల్లి ఓపెన్‌కాస్ట్‌లు పదమూడు గ్రామాల విస్తీర్ణంలో ఉన్న పద్దెనిమిది వేల ఎకరాల భూమిని 300, 500 మీటర్ల లోతుల్లో కంటే ఎక్కువ కయ్యలు కయ్యలుగా తవ్వి ఎత్తైన మట్టి దిబ్బలు, లోతైన బొందల గడ్డలు చేశారు. ఆదివాసీ ప్రజలను ఈ ప్రాంతాల నుండి తరిమేసి ఆ భూముల్లో ఉన్న నల్ల బంగారాన్ని దోసుకెళ్తున్నారు. ఈ బొగ్గు నిల్వలు తీసుకెళ్లడానికి డోర్లి, దంతన్‌పల్లి పదమూడు గ్రామాల

ప్రజలను మోసపుచ్చి, తియ్య తియ్య మాటలతో కడుపులో కత్తి, నోట్లో బెల్లంలా తేనెపూసిన కత్తిలా వ్యవహరించి దగా చేసిన టి.డి.పి., కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధి (వినాశన వికాసం) చేస్తామని ప్రగల్భాలు పలికి ఓపెన్‌కాస్ట్‌లతో ఆదివాసులకు ఎండమావులే మిగిల్చారు.

రోజూ బ్లాస్టింగ్‌లతో గ్రామాలు దద్దరిల్లి భూకంపం వచ్చినట్లు ఊగిపోతున్నాయి. ఈ శబ్దాలకు దగ్గరి గ్రామాలు, గూడేలు, ఇండ్లు బీటలు బారాయి. ఇండ్లలో బోల్లు కిందపడి పసిపిల్లల అన్నం మట్టిపాలు అవుతున్నది. పేలుళ్ల రణగోణధ్వనులకు, పశు, పక్షాదులు, కీటకాలు, తేనెటీగలు, తుమ్మెదాలు వాటి చప్పుళ్లు లేకుండా పోయాయి. (జాగిలి) కావలి పోయిన రైతన్నలు పంట చేనులలోకి వెళ్లి జంతువులు, పక్షులతో నిత్యం ఘర్షణ పడుతూ, అడవి తల్లి ఒడిలో నిద్రించే వారు. ఆదివాసులు ప్రకృతి, పక్షులు, పశువులు కలిసి జీవించే, సహజీవనం చేసే, ఇలాంటి స్థితి ఇప్పుడు ఓపెన్‌కాస్ట్‌ల వల్ల లేదు.

పశువుల కాపరులు ఆ పరిసరాలకు వెళ్లి పశువులను తిప్పితే ఓపెన్‌కాస్ట్ శబ్దాలకు అవి పారిపోతున్నాయి. పేలుళ్ల ధ్వనులతో గుట్టలు, భూమి నెర్రలు పడి భూమి లూజ్‌గా అయ్యి గుట్టలపైన, భూమిలో ఉన్న నీరు కిందికి దిగిపోతోంది. దీంతో అడవి బిడ్డలైన ఆదివాసులు నీరు అంతరించిపోవడంతో గుట్టలపై ఉన్న ప్రజలు ఆరు మాసాలు గుట్ట కింద, ఆరు మాసాలు గుట్టపైన ఉంటున్నారు. ఓపెన్‌కాస్ట్ గ్రామాల్లో ఉన్న ప్రజలు పశు పోషణకు కావాల్సిన నీరు లేక పశుగ్రాసం లేక అడవికి వెళ్లిన గొడ్లు, మేకలు నడవలేక గుట్టలు ఎక్కలేక కిందపడి చనిపోతున్నాయి. ఈ గొడ్లు మరణించిన లోయలు వొర్రె వంపులలో పశువులు మురిగి కరాబు అయిన కళేబరాలు వర్షాలు పడితే తడిసి జంతు కళేబరాలు వొర్రె వంపులు వాగులలో కొట్టుకు వస్తే ఆ నీరు వాగులలో కలిసి, కలుషితమైతున్నాయి. ఈ కలుషితమైన నీరు తాగిన మనుషులు, గొడ్లు, మేకలు, పక్షులు మృత్యువాత పడుతున్నారు.

ఉదాహరణకు 2009లో ఒక్క ఊరిలో ఒక రైతుకు యాభై గొడ్లు, ఇరవై ఐదు మేకలు చనిపోయాయి. ఆసిఫాబాద్ తిర్యాణి మండలం ??? పరిధిలో మూడు వేల గొడ్లు, రెండు వేల మేకలు, ఈ ప్రాంతంలో 2009లో 270 మంది మరణించారు. 2010లో ఐదు వందల మంది, 2011లో నాలుగు వందల యాభై ఐదు మంది మరణించారు. జిల్లా అంతా ఇతర కారణాలతో వేలాది మంది చనిపోయారు. ఇంకా అనారోగ్యంతో ఉన్నవారు ఎందరో ఉన్నారు. ఈ మండలాల్లో ఓపెన్‌కాస్ట్ పేలుళ్లలతో దుమ్ము ధూళితో దగ్గు, దమ్ము, నీరు, పౌష్టికాహారం లేక నిమోనియా, చెవిటి, దంత వ్యాధులు, అంధత్వం వంటి అనారోగ్యాలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో వాహనాల ఆక్సిడెంట్‌లతో కాళ్లు, చేతులు, నడుములు, ఇతర అవయవాలు పోగొట్టుకొని అవిటి వారిగా మారినవారు ఎందరో ఉన్నారు. మరణించిన వారు కూడా చాలా మందే ఉన్నారు. భూమి, నీరు, కూడు, గుడ్డ, అడవి సంపదలేక ఆగమైపోయిన ఆదివాసీ బతుకులు ఆగమ్యగోచరంగా మారాయి. ఆదివాసీ ప్రజల బతుకులు నీటిలో నుంచి బయట వేసిన చేపల్లా అయినాయి.

పునరావాసం పేరుతో పేకటరాయుళ్ల పాలకులు నిర్వాసిత ప్రజలతో ఆటలాడుకుంటూ వారి బతుకులు మంట్లె కలిపారు. ఆత్రం మొగ్గ చెప్పాడు, బీమ్ మాటల్లో పునరావాసం పరిహారం అంటూ ఆ పరిహారం, చేతికి రాకముందే చెక్ వద్ద ఒకడు, టోకెన్ వద్ద ఒకడు, బడ్జెట్ వద్ద ఒకడు, ల్యాండ్ చట్టం, న్యాయం అనే నరభక్షకుడు, లాయర్ ఒకడు. భూమి పాలు వాడు, ఫారెస్టు వాడు, ఆదాయ పన్ను వాడు, గిర్దవారి, పట్వారీ, ఎం.ఆర్.ఒ., ఎం.డి.ఒ., జె.ఇ., మైనింగ్ మాఫియా బడా పెట్టుబడిదారులు, పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం, ఆదివాసి పీడిత ప్రజలను వారి భూములలో నుండి బేదఖల్ చేసి, నిల్వ నీడలేక చేసి వారి మానప్రాణాలకు ముప్పుచేశారు. ఈ స్థితిని సహించని డోర్లి-1, డోర్లి-2 నిర్వాసితులు మాకు పరిహారం వద్దు మా భూమి మాకు కావాలి, మా అటవి సంపద మాకు కావాలి, మా వనరులు తీసుకోవద్దు అని పునరావాసం నోచుకోని నిర్వాసిత ప్రజలు, మాకు మా సావు నెత్తురు కూడు వద్దు.. మా జల్, జంగల్, జమీన్ మాకు కావాలి. మా సంప్రదాయాలు మాకు కావాలి. మా గ్రామ రాజ్యం మాకు కావాలని ఆందోళన చేసినందుకు గాను మీరు మావోయిస్టుల మద్దతుతో ఉద్యమం చేస్తున్నారని నోరు మూయించినారు. ఆదివాసీ నాయకులను అరెస్టు చేసి అడిగే హక్కు లేకుండా చేస్తున్నారు. తుడుం దెబ్బ అంటే మావోయిస్టు దెబ్బలంటూ చిత్రిస్తూ ఆదివాసీ పీడిత ప్రజలపై సైన్యం దించి, చత్తీస్‌గఢ్‌లో గ్రీన్‌హంట్ పేరుతో అణచివేస్తున్నట్లు ఆదివాసీ, తెలంగాణ ఉద్యమకారుల మీద వేలాది మంది పారా మిలిటరీ స్పెషల్ పార్టీలను దించి, పట్టణాలు, నగరాలు, పల్లెలు, అటవి ప్రాంతాలు, తెలంగాణలోని అంతట ప్రత్యేక నల్ల చట్టాలతో అణచి వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణచివేతలో భాగంగా ఆదివాసీ ప్రజలు అడిగే హక్కులేక, తినటానికి తిండిలేక, ఉండడానికి ఇల్లు లేక, చేయడానికి చేనులేక, ఉన్న ఊరు వదిలి, పట్టణాలకు వలసపోతే, పట్టణాలలో దొరబాబులు ఆదివాసీ పిల్లలు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తే అక్కడ వారి శ్రమను, అందాన్ని చూసి కూలీకాడ పని యజమాని పాడుచేసి, మాన ప్రాణాలు దోచి మానవత్వం మంట్లె కలుపుతున్నారు. మానం పోయిన ఆడబిడ్డలు పొట్టకోసం ఒళ్లమ్ముకొని బతకాల్సిన స్థితి వస్తోంది.

ఈ ఆదివాసీ ప్రజలను పట్టించుకునే ఏ ప్రజాసంఘాలు లేవా? పౌరసమాజం కోరే పౌరహక్కులు లేవా? ఏ మానవ హక్కులు లేవా? ఎందుకింత ఘోరం. ఈ ఘోరాన్ని సృష్టిస్తున్నది ఎవరు అన్నది తెలియదా? తెలిస్తే ఎందుకు మాట్లాడుతలేరు? బతికున్న వారిని గోతిలోకేసి పాతరేసే విధాన పాలన ఈ నల్లదొరలదేనా? భూస్వామి, పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దౌర్జన్యపు దురాగతి పాలనలో ఇంకా ఎంత మందిని పాతరేసి, ఇంకా ఎంతమందిని సంహరిస్తారు? ఇంకా ఎన్ని గ్రామాలు తగుల బెడతారు? ఇంకా ఎన్ని పంచాయతీలు ఎత్తివేస్తారు? ఇంకా ఎన్ని ఏజెన్సీ మండలాలు బేదఖల్ చేస్తారు? కాంగ్రెస్ మైనింగ్ మాఫియా, ఉమ్మడి యాజమాన్య చట్టాల పాలన ఎన్నాళ్లు? ఆదివాసులను అణచి వేయడానికా? ఆదివాసులపై యుద్ధం చేపడుతూ ఆదివాసీ అటవీ సంపదను భూగర్భ వనరులను దోచుకోవడానికేనా డోర్లి దంతన్‌పల్లి పీడిత ప్రజలను తరిమేసింది? ఇంటి దొంగను ఈశ్వరుడెరగడు అన్నట్లు, గూటికాడి నక్కలా ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు ప్రజల మీద పడి పీక్కుతింటున్న రాబందులాంటి పాలకులు, ఈ స్థితిలో ఆదివాసీ ప్రజలు ఓపెన్‌కాస్ట్ తాకిడికి గురవుతున్న ప్రజలు ఒక్కటై లేవాల్సిన పరిస్థితి ఆసన్నమైనది.

ఒక పక్క తెలంగాణ సకల జనుల పోరాట చరిత్ర పురోగమనం, మరో పక్క అభివృద్ధి పేరు మీద ఆగమవుతున్న బతుకులు ఓపెన్‌కాస్ట్ వినాశన అభివృద్ధి. డోర్లి, దంతన్‌పల్లిలలో ఆదివాసీల జీవితాలు బుగ్గిపాలు అయినాయి. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలకు పైబడి అయినప్పటికీ ఈ దేశ మూలవాసులు పౌరసమాజంలో అంతర్భాగం కాలేకపోయారు. ఇప్పుడు మాత్రం వారి జీవనానికి మూల ఆధారమైన

*చిన్న వయసులో పెళ్లిళ్లు కావడం, కష్టం చేసినా బతుకు గడవక పోవడం, దురలవాట్లకు లోనైన భర్తలను కోల్పోవడంగా ఉన్న ఆదివాసీ మహిళల పరిస్థితి వివరిస్తున్నారు* **గుగులోతు జాంబు, సాదు రాజేష్**

# ఆదివాసీ మహిళల సాధికారత

అభివృద్ధి నేడు మూడవ ప్రపంచ దేశాలలో అత్యవసరమైన అంశంగా ప్రపంచీకరణ దశలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. అభివృద్ధిని వేగవంతం చేయడానికి విభిన్న దృక్పథాలను ప్రభుత్వాలు అనుసరిస్తుంటాయి. సరళీకృత ఆర్థిక విధానాలను దేశంలో అమలు చేస్తున్నప్పటి నుండి ఈ అభివృద్ధి ప్రక్రియలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. సమాజంలోని ఆయా సామాజిక వర్గాలను అభివృద్ధిలో భాగం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. ఉత్పత్తి ప్రక్రియలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అనేక రకాలుగా హింసకు, నిరాదరణకు గురవుతున్నారు. సగటు స్త్రీ పరిస్థితి, నాగరికతకు దగ్గరగా ఉన్న సమాజాలలో వైవిధ్యంగా ఉంటే, నాగరికతకు దూరంగా, అటవీ సంస్కృతులకు అనుగుణంగా తమ జీవితాలను కొనసాగిస్తున్న ఆదివాసీ స్త్రీల పరిస్థితులు మరింత నిరాశాజనకంగా ఉన్నాయి. ఆదివాసీ స్త్రీల సాంప్రదాయ జీవన విధానం, ఆచారాలు, అలవాట్లు భిన్నంగా ఉన్నప్పటికీ, అభివృద్ధి ప్రక్రియల అమలు ఈ ఆదివాసీ స్త్రీల జీవితాలకు ఏమాత్రం మేలు చేసే విధంగా ఉండడం లేదు. మహిళలకు అభివృద్ధి ఫలితాలను అందివ్వాలని, విభిన్న పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ఆదివాసీ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిపోవడానికి ప్రపంచీకరణ ప్రభావం ప్రధాన కారణమవుతోంది. ఆదివాసీ సామాజిక జీవితాలపై ప్రపంచీకరణ ప్రభావం సాధికారతను సాధించే క్రమాన్ని వేగిరం చేస్తుందా? లేక వాళ్లు నిరోధించగలరా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## ఎంపిక చేసుకున్న గ్రామం

వరంగల్ జిల్లా కేంద్రానికి 85 కిలోమీటర్ల దూరంలో గోవిందరావుపేట మండలంలోని రంగాపూర్ అనే గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అధ్యయనం చేశాం. రంగాపూర్ గ్రామం గోవిందరావుపేట గ్రామ పంచాయితీ పరిధిలోనిది. మండల కేంద్రం నుండి గ్రామానికి వెళ్లాలంటే మట్టిరోడ్డు మీద నుండి వాగు దాటి వెళ్లాల్సిందే. వర్షాకాలంలో ఈ వాగు పారుతుండడం మూలంగా ప్రజలకు రవాణా సౌకర్యం ఉండదు. కాలినడకన మిగతా సంవత్సర కాలంలో గ్రామానికి వెళ్లాల్సిందే.

అటవీ సంపదను శాశ్వతంగా అన్యాక్రాంతం చేసే ప్రక్రియ సాగుతోంది. ఎంతటి దుర్భర స్థితిగతుల్లో జీవిస్తున్నప్పటికీ ఆదివాసులు ఈ దేశ సహజ వనరులను, అటవీ సంపదను, పర్యావరణాన్ని ప్రాణపదంగా కాపాడుతూ వస్తున్నారు. ఆదివాసులను ప్రకృతి నుండి విడదీసి, అడవులను నాశనం చేసి సరుకులుగా మార్చే కుతంత్రానికి ప్రపంచీకరణ తోడయింది. చత్తీస్‌గఢ్‌లో ఇప్పుడు జరుగుతున్న గ్రీన్‌హంట్ వెనుక మావోయిస్టుల అణచివేత లక్ష్యంగా కంటే, ఆదివాసుల సాంప్రదాయిక హక్కులు హరించి ప్రపంచ ప్రభువులకు అప్పగించే ఆర్థిక లక్ష్యమే ప్రధానమైనది.

రాచరికపు మహాసామ్రాజ్యాలు కూడా ఆదివాసుల విషయంలో చెయ్యనంత విధ్వంసాన్ని ఓపెన్‌కాస్ట్‌ల పేర ఈ అత్యాధునిక రాజ్యం చేస్తున్నది. ఆనకట్టలు నిర్మిస్తే నిలువ నీడలు కోల్పోతున్నది. బాక్సైట్ నిల్వల మీద బహుళజాతి పరిశ్రమల డేగలు వాలితే నష్టపోతున్నది. పల్లెమాడ, రావుగాట్, బోడ్‌గాట్ మీద ప్రపంచ బ్యాంక్ కన్నేస్తే మాడిపోతున్నది. మాలి, దేవుమాలి, కాశీపూర్, గోవిందాపూర్‌లో పోస్కో, వేదాంత మైనింగ్ దెబ్బలేస్తే దెబ్బతింటున్నది ఆదివాసులే. సింగూర్, నందిగ్రామ్, లాల్‌గడ్‌లలో బతుకులు కోల్పోతున్నది ఆదివాసులే. ఈ దేశం నలుమూలల ఆదివాసీ బతుకులు బుగ్గిపాలు చేస్తున్నది సర్కారేనన్న సత్యం తెలియనిది కాదు.

పర్యావరణం చెడిపోయి కలుషిత వాతావరణం ఏర్పడి నష్టపోతున్నది ఆదివాసులే. దోమకాటు, అతిసారా, మలేరియా, కలరా, అత్యాచారాలకు బలవుతున్నది ఆదివాసులే. వారి భాషకు గుర్తింపు లేదు. వారి ప్రాణాలకు విలువ లేదు. వారి చరిత్రకు గౌరవం లేదు. వారి ఆరోగ్యంపై శ్రద్ధలేదు. వారి పక్క నిలబడిన వారికి హక్కులు లేవు. ఇది ఘనత వహించిన భారత ప్రజాస్వామ్యం గొప్పగా చెప్పుకునే గత, వర్తమాన వైభవం.

మనం సాధించిన అంతరిక్ష పరిజ్ఞానం, పెరుగుతున్న డాలర్ నిల్వలు, ప్రపంచ కుబేరుల సరసన స్థానం పరుగులు తీస్తున్నాయి. భారత్ పెద్దన్న వృద్ధిరేటు ఇవన్నీ ఈ దేశ ఆదివాసులపై చూపిస్తున్న క్రౌర్యం గుర్తుకు వచ్చినప్పుడు దూది పింజంలాగా తెలిపోయే గొప్పలు డోర్లి ఓపెన్‌కాస్ట్ ధ్వంసపు దృశ్యాలు ఈ దేశ మైనింగ్ మాఫియా దోపిడీ వీరంగంలో ఆదివాసీ ఒక అనాథ అయితే, ఓపెన్‌కాస్ట్‌లు స్మశాన వాటికలు. ఆ స్మశాన వాటికలలో ఆదివాసులను తగులబెడుతున్న సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా, దళారీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా బుద్ధిజీవులందరూ ఆదివాసులకు అండగా నిల్చి వారిని చైతన్యవంతం చేస్తూ, ఆదివాసుల ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడాల్సిన కాలం ఇది.

*(రచయిత సామాజిక ఉద్యమ కార్యకర్త)*

ఈ గ్రామం యాభై సంవత్సరాల పూర్వం ఏర్పడింది. గ్రామ జనాభా మొత్తం 369. ఇందులో ఆదివాసీ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. మిగతావి ఎస్.సి., ఉన్నత కులాల కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో పూర్వం నుండి కూడా ఆదివాసీ కుటుంబాలే ఉన్నాయి. మేం ఎంపిక చేసుకున్న కుటుంబాలు అరవై ఆదివాసీ కుటుంబాలు. ఆదివాసీ ప్రజలు అనాదిగా పోడు వ్యవసాయా ధారితంగానే జీవనం గడుపుతున్నారు. కొండల మీద నుండి జాలువారే వాన నీటితోనే సంవత్సరంలో ఒకే మారు వ్యవసాయ పంటను పండిస్తారు. సంవత్సరం మొత్తం దీనిమీదనే ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి ఉంది. ప్రధాన ఆదాయ వనరుగా ఆదివాసీ మహిళలు వేసవి కాలంలో తునికాకు సేకరణ చేస్తారు. అంతే కాకుండా వ్యవసాయ సంబంధిత పనుల్లో కూడా వారి భాగస్వామ్యముంటుంది.

ఆదివాసీ మహిళలు కుటుంబ భారాన్ని తమ స్థాయికంటే ఎక్కువగా భరిస్తారు. విద్యను నేర్చుకోలేని కారణంగా తమ పిల్లలను కూడా చదివించలేని పరిస్థితి గ్రామంలో ఉంది. గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఉన్నత చదవులకు గ్రామానికి దూరంగా ఇప్పుడిప్పుడే 30-40 కిలోమీటర్ల దూరంలో గల ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌కు పోయి చదువుకుంటున్నారు. వైద్య సౌకర్యంలేని మూలంగా ఆదివాసీ స్త్రీలు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే వాగుదాటనిదే పెద్ద ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామానికి ఆర్.ఎం.పి.లు ఇద్దరు వస్తుంటారు. వీరు వేరే ప్రాంతాల నుండి తమకు అనుకూలమైన సమయంలో మాత్రమే వచ్చి వెళ్తుంటారు. ప్రతి నెలలో మొదటి మంగళవారం మండల కేంద్రం నుండి ఆరోగ్య కార్యకర్తలు ఉపయోగపడని మందులు ప్రజలకు ఇచ్చి వెళ్తుంటారు.

గ్రామంలో వర్షాకాలంలో అనేక రకాల జబ్బుల బారిన పడుతుంటారు. మూడు పూటల భోజనమే లేని పరిస్థితిలో, మెరుగైన వైద్య సౌకర్యాలను అందుకోలేని ఆర్థిక పరిస్థితి, చేయూతనివ్వడానికి, కుటుంబ భారం మోయడానికి భర్తలేని స్థితిలో ఈ ఆదివాసీ మహిళల జీవితం దిక్కు తోచని పరిస్థితిలో ఉంది. అంతేగాకుండా అక్కడ స్త్రీకి దొరికే ఆహారం, పోషకాహారం విలువలతో కూడినది కాదు. అనారోగ్యం తోనే రాజీపడి జీవితాన్ని గడిపేస్తుంది ఆదివాసీ స్త్రీ. పంటలు సరిగ్గ పండక, అప్పులు ఎక్కువయ్యి, పనులు దొరకక భర్త చనిపోయిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివాసీ కుటుంబా లలో నెలకొంటున్న ఈ దుస్థితిని ఇంకా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది.

## గ్రామ వివాహ వ్యవస్థ

రంగాపూర్ గ్రామంలో వివాహ వ్యవస్థ ఇతర గ్రామాలకంటే వైవిధ్యంగా ఉంది. ఈ ఆదివాసీ కుటుంబాలలో బాలికలకు 13-14 సంవత్సరాలు, బాలురకు 14-15 సంవత్సరాలు రావడంతోనే బాలికలు తమ ఇష్టం వచ్చిన వ్యక్తితో జీవితం గడుపుతారు. పెళ్లి లాంటి తంతుతో నిమిత్తం లేకుండా ఇష్టం పేరుతోనే తమకు పిల్లలు కలిగి ఆర్థికంగా కొంత స్థిరత్వం కలిగిన తరువాత గుడికి వెళ్లి లేదా తాళి కట్టడం లాంటి కార్యక్రమాలు చేస్తుంటారు. బాల్యం దాటక ముందే బాలికలు పురుషుడితో వెళ్లిపోవడం మూలంగా ఆమె జీవితం ఎలా కొనసాగించాలనే అయమోయ స్థితి, అవగాహనరాహిత్యం ఉపాధి పనులు దొరకక, మద్యానికి బానిసై ఆమె భర్త చనిపోతే యుక్త వయస్సులోనే వితంతువులుగా మారుతున్నారు. ఈ విధంగా మేం ఎంపిక చేసిన కుటుంబాలలో ప్రస్తుతం పది మంది వితంతువులున్నారు. ఇందులో భూమిలేని కుటుంబాలు నాలుగు ఉన్నాయి. వీరి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. స్త్రీయే ఆ కుటుంబ భారాన్ని మోయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల మన రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత వివాహాల మహోత్సవానికి ఈ గ్రామం నుండి పద్నాలుగు జంటలు వెళ్లగా పన్నెండు జంటలకు వివాహం జరిగింది. వీరిలో 5-10 సంవత్సరాల నుండి కలిసి జీవిస్తున్న జంటలు కూడా ఉన్నాయి.

ఈ వివాహ సంబంధాలకు సంబంధించి కొంతకాలం నుండి ఈ కోయ కుటుంబాలలో ఉన్న ఆచారం కావచ్చు, టి.వి., సినిమాలలో చూపిస్తున్న సంస్కృతి భావజాలం కావచ్చు, వారిపై చెడు ప్రభావం వేస్తున్నాయి. ఈ వివాహ వ్యవస్థ ఈ విధంగానే కొనసాగితే ఈ గ్రామంలో వితంతువుల సంఖ్య విపరీతంగా పెరిగి, స్త్రీల సమస్యలు ఎక్కువవుతాయి.

ఈ సమస్య పట్ల స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులు అనేక మార్లు అమ్మాయిల తల్లిదండ్రులకు సూచనలిస్తున్నా, కౌన్సిలింగ్ చేస్తున్నా మళ్లీ మళ్లీ ఈ సంఘటనలే గ్రామంలో పునరావృతం అవుతున్నాయని చెబుతున్నారు. ఈ సమస్యను స్థానిక గ్రామ అధికారులకు అనేక మార్లు చెప్పినప్పటికీ విఫలయత్నమే అవుతోంది. ఈ వివాహ వ్యవస్థ మూలంగా స్త్రీలే బాధితులవుతున్నారు.

అంతేగాకుండా పనులు ఎక్కువగా లేకపోవడం, మట్టిపని, వ్యవసాయ కూలి, వేసవిలో (తునికాకు) ఇటువంటి పనులలో స్త్రీ భాగస్వామ్యం ఉంటున్నప్పటికీ ఎక్కువ మొత్తంలో ఆదాయం సంపాదించలేని పరిస్థితి ఉంటోంది. ఆర్థికంగా, సామాజికంగా అనేక రకాల ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామంలో స్త్రీల పరిస్థితులను పట్టికలోని వివరాలలో చూద్దాం.

**గ్రామంలోని వివిధ కుటుంబాల వివరాలు**

| | కులం | కుటుంబాలు |
|---|---|---|
| 1 | కోయ | 83 |
| 2 | లంబాడ | 4 |
| 3 | ఎస్.సి. | 9 |
| 4 | ఎఫ్.సి. | 1 |
| | మొత్తం | **97** |

ఈ గ్రామంలో కోయ జాతికి చెందిన కుటుంబాలు 83 ఉన్నాయి. గ్రామ అభివృద్ధి నిర్ణయాలలో వీరిదే భాగస్వామ్యం ఉండాలి. కాని మిగతా కులాలదే ఆధిపత్యం ఉంటోంది. ఈ ఆధిపత్య కుటుంబాలు గ్రామానికి వలస వచ్చిన కుటుంబాలే.

గ్రామం మొత్తం జనాభాను పరిశీలిస్తే పురుషులు 106 మంది, స్త్రీలు 101 మంది, బాలురు 85, బాలికలు 77 మంది ఉన్నారు. గ్రామంలో మొత్తం జనాభా 369 మంది. ప్రధానంగా ఈ నిష్పత్తిని పరిశీలిస్తే స్త్రీలకు ప్రసవ సమయంలో సరియైన వైద్యం అందకపోవడం మూలంగా అనారోగ్యంతో పిల్లలు పుట్టడం, ఎక్కువ కాలం జీవించలేని పరిస్థతి నెలకొంది.

ఎంపిక చేసుకొన్న కోయ కుటుంబాలను పరిశీలిస్తే ఈ కుటుంబాలలో పురుషులు 56 మంది, స్త్రీలు 66 మంది, బాలురు 63, బాలికలు 54 మంది ఉన్నారు. ఈ కుటుంబాలలో స్త్రీల సంఖ్య ఎక్కువ కనపడుతుంది. ఎందువలన అంటే చిన్నతనంలోనే వివాహం కావడం వలన భర్తలు అనారోగ్యంతో చనిపోవడం వలన తల్లిదండ్రుల

**ఎంపిక చేసుకొన్న ఆదివాసీ కుటుంబాలలో చదువు వివరాలు**

| వివరాలు | పురుషులు | స్త్రీలు | బాలురు | బాలికలు |
|---|---|---|---|---|
| నిరక్షరాస్యులు | 45 (80.35) | 56 (84.84) | 14 (22.22) | 15 (27.77) |
| ప్రాథమిక చదువు | 6 (10.71) | 2 (3.04) | 23 (36.50) | 19 (35.18) |
| మాధ్యమిక చదువు | 4 (7.14) | 8 (12.72) | 20 (31.74) | 17 (31.48) |
| ఇంటర్మీడియట్ | 1 (1.78) | - - | 3 (4.76) | 3 (5.55) |
| డిగ్రీ | - - | - - | 3 (4.76) | - - |
| **మొత్తం** | **56 (100)** | **66 (100)** | **63 (100)** | **54 (100)** |

వద్దనే ఉంటూ జీవనం గడుపుతున్నారు. బాలికల సంఖ్యను పరిశీలిస్తే తక్కువగా ఉన్నారు. మొత్తం కోయ కుటుంబాలలో జనాభా 239 మంది.

ఎంపిక చేసుకొన్న కోయ కుటుంబాల స్త్రీల అక్షరాస్యతను పరిశీలిస్తే చదువులేని స్త్రీలు 56 మంది (84.84) ఉన్నారు. అదే విధంగా బాలికలు 15 మంది (27.77) ఉన్నారు. స్త్రీలలో ఇంటర్, డిగ్రీ చదివిన వారు లేరు. కానీ తమ పిల్లల వరకు వచ్చేసరికి ఇంటర్ చేసినవారు ఉన్నారు. డిగ్రీ చదివిన వారిలో బాలికలు లేరు. బాలురు మాత్రమే ఉన్నారు. మొత్తం స్త్రీలను పరిశీలిస్తే ప్రాథమిక విద్యను హైస్కూల్ విద్యను పూర్తిచేసిన వారిలో తక్కువ మంది మాత్రమే ఉన్నారు. తల్లిదండ్రులు చదువుకున్నట్లయితే వారి పిల్లలను కూడా చదివిస్తున్నారు. గ్రామం నుండి ఉన్నత విద్యకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మూలంగా స్త్రీలు మధ్యలోనే చదువును ఆపివేసే పరిస్థితి నెలకొంది.

గ్రామంలో మహిళ లను వారి వృత్తులను వేతనాలను పరిశీలించి నట్లయితే వ్యవసాయ సంబంధిత పనులకు గాను రోజువారి కూలీ 60-80 రూపాయల వరకు ఉంటుంది. మట్టి పనికి, ట్రాక్టర్ మీద వెళ్లితే కూడా ఇదే వేతనం లభిస్తోంది. వేసవి కాలంలో తునికాకు సేకరణ ఆదివాసీ స్త్రీలకు అత్యంత ఆదాయ వనరు. ఈ సీజన్‌లో కుటుంబంలో స్త్రీలకు ఎక్కువగా పని దొరుకుతుంది. వీరు పనిచేస్తే వచ్చిన వేతనం అవసరా లకు సరిపోవడం లేదు. భర్త మద్యానికే సగం వేతనం ఖర్చు అయ్యే పరిస్థితి ఉంది. చాలీచాలని వేతనాలతో సంవత్సర మంతా ఉపాధి పనులు లేక ఆదివాసీ మహిళలు ఇబ్బందుల పాలవు తున్నారు.

**ఎంపిక చేసుకున్న ఆదివాసీ కుటుంబాల వృత్తి, జీతభత్యాల వివరాలు**

| | పంటలు-పనులు | రోజువారి వేతనం (రు.లలో) |
|---|---|---|
| 1 | వరి | 60-80 |
| 2 | మొక్కజొన్న | 50-70 |
| 3 | తునికాకు | 50-60 |
| 4 | ట్రాక్టర్, మట్టి పని | 60-80 |

వీరికి ఉపాధి కల్పించడానికి వంద రోజుల పనికి ఆహార పథకాన్ని ఇప్పుడిప్పుడే ప్రారంభించి పనులు చేయిస్తున్నారు. ఇటువంటి పథకాలను సమగ్రంగా అమలు చేసినట్లయితే మహిళలకు ఎక్కువ ఉపాధి లభిస్తుంది.

అంతేగాకుండా తమ పోడు భూములకు నీటిసౌకర్యం లేక ఉన్న భూమిలోనే సాగవుతుంది. ఈ భూములకు ఇంకా పట్టాలు అందరికీ అందివ్వలేదని ప్రజలు అంటున్నారు. దీని వలన వ్యవసాయ భూమి మీద అభద్రతా భావం పోయి ఆర్థికంగా అభివృద్ధి కావడానికి అవకాశం ఉంటుంది.

నేడు ఆదివాసీ ప్రాంతాలలో మహిళల అభివృద్ధి కోసం, సాధికారతను సాధించడం కోసం ప్రభుత్వం అనేక రకాల విధానాలను అవలంబిస్తున్నప్పటికీ, ఆర్థికంగా, సామాజికంగా ఆదివాసీ మహిళలు వెనుకబడి ఉంటున్నారు. మన రాజ్యాంగం కల్పించిన చట్టాలు, అవకాశాలు ఈ ప్రాంతాలలో అమలు కావడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి, స్వయం పోషక, ఉపాధి పథకాల గురించి ఇక్కడి ప్రజలకు ఏ మాత్రం తెలియదు. నిరక్షరాస్యులుగా, ఉపాధి లేమితో, ఏ పనులు చేయాలనే దిక్కుతోచని స్థితిలో ఈ ప్రాంతం ఆదివాసులు జీవిస్తున్నారు. ఆర్థికంగానూ, సామాజికంగానూ అభివృద్ధిని సాధించలేకపోతున్నారు. ఇక రాజకీయ భాగస్వామ్యం మాత్రం శూన్యమే. ఎంపిక చేసుకున్న ఈ గ్రామంలో మహిళలకు సంబంధించిన డ్వాక్రా, పొదుపు సంఘాల గురించి ఇప్పుడే తెలుకుంటున్నారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) కార్యక్రమాల గురించి తెలియదు.

సాంఘిక జీవనం అభద్రతా భావంతో కూడి ఉంది. అత్యల్పమైన ఆదాయ స్థాయిలను పొందుతున్న ఈ ఆదివాసీ గిరిజన మహిళలు కుటుంబాల బాధ్యతను చూడడం ప్రధానంగా భావిస్తున్నారు. విద్యను పై స్థాయిలోకి కొనసాగించలేని పరిస్థితి అనేక కుటుంబాల్లో కనబడుతోంది. ఎంపిక చేసుకున్న ఈ అరవై కుటుంబాల్లో అదే పరిస్థితి నెలకొంది. భూమిని (పోడు) అభివృద్ధి చేయడానికి తగినంత ఆదాయ వనరులు వీరి దగ్గర లేకపోవడం మూలంగా జీవితాలు ఆర్థికంగా చతికిలబడిపోతున్నాయి.

భర్తల నుండి మహిళలు తరచూ హింసకు గురవుతున్నారు. వరకట్నాలు తీసుకునే ఆచారం లేనప్పటికీ పనిచేయలేని (లేకపోవడం) నిస్సహాయ స్థితి నుండి భార్యను హింసించడం అనేది అన్ని సమాజాలలో ఉంటూనే ఉంది. ఈ స్థితి నుండి ఆదివాసీ సమాజాన్ని బయటకు తీసుకురావాల్సిన బాధ్యత నాగరిక సమాజంపై ఉంది.

ఆదివాసీ ప్రాంతాలలో మహిళలకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి ఉపాధి పనులు, స్వయం ఉపాధిని పెంచే వాటిని ఏర్పాటు చేయాలి. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలు, ఏ విధంగా ఉపయోగపడుతుందనే అంశాలకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక అధికారులు ఇవ్వాల్సిందే. మహిళలకు రాత్రి పూట విద్యా బోధన చేపట్టాలి. నూతన వ్యవసాయ సంబంధిత ఉత్పత్తి పంటలను పరిచయం చేయాలి. ఈ పల్లెలపై పాశ్చాత్య విషసంస్కృతి భావజాలాన్ని వ్యాపింప చేసే టి.వి., మీడియాను క్రమబద్ధం చేయాలి.

అటవీ ఉత్పత్తులకు సంబంధించిన మార్కెట్‌ను, ప్రభుత్వాలు క్రమపద్ధతిలో నిర్వహించాలి. మెరుగైన వైద్య సదుపాయాలను మహిళలకు, ముఖ్యంగా ప్రసవం సమయంలో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు అందకపోగా ఆదివాసీ మహిళల పైననే అధికమైన భారం ఉంటోంది.

*(రచయితలు రిసర్చ్ స్కాలర్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, కాకతీయ విశ్వవిద్యాలయం)* వీ

*నిజాం రాజుల కాలం నాటి సంక్షేమ దృష్టి కూడా నేటి ప్రజాస్వామ్య పాలనలోని పాలకులకు లేకపోవడం వల్లే ఒక పక్క రైతులూ మరో పక్క విద్యార్థులూ ఆత్మహత్యల పాలవుతున్నారని అంటున్నారు* **జి. లచ్చయ్య**

# తెలంగాణ - ఓ మరణక్షేత్రం!

నవంబర్ 20, 2011న తెలంగాణలో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఖమ్మం, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వరుసగా మరికంటి ఉప్పలయ్య (30), వాంకుడోతు వీరన్న (35), హనుమాండ్ల మహేశ్ (23), బోయ అబ్బర్ల లక్ష్మన్న (27)లు గతంలో అందరు రైతులు పురుగుల మందు తాగినట్లే వీరు తాగి మరణించారు. కొత్త కథనం ఏమీ లేదు. సంఘటనలు మారలేదు. అవే పంట భూములు. అవే పత్తి, మొక్కజొన్న పంటలు. ఎండిపోవడాలు, ఎత్తిపోవడాలు (బోర్లు), అప్పులు, అవమానాలు, ఆత్మహత్యలు. అదేరోజు మహబూబ్‌నగర్ అంతిరెడ్డిగూడకు చెందిన శర్వటి జంగయ్య (50). 7 నవంబర్ 2011న కూడా ఇదే సమస్యతో ఇదే పద్ధతుల్లో ఓ ముగ్గురు రైతులు ప్రాణాలు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ కోడెల పర్వతాలు (26), మెదక్‌లో నర్సయ్య (30), ఆదిలాబాద్‌లో టటోబ పటేల్ (52) పంటలకు వాడాల్సిన పురుగు మందును తమ సమస్యలకు పరిష్కారంగా ఎంచుకున్నారు.

గత నెల రోజుల్లో తెలంగాణ వ్యాపితంగా తొంబైమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక్క సిద్దిపేట డివిజన్‌లోనే పదిహేడు మంది, కరీంనగర్ జిల్లాలో పది మంది గత అక్టోబర్ నెలలో ఆత్మహత్యలు చేసుకున్నారు. వారి సమస్య చూసినట్లైతే రేపటి భవిష్యత్తును అనుభవించి, కుటుంబ బాధ్యతలు నెరవేర్చాల్సిన వారే! కుటుంబ పోషణ భారం, పంట కోసం చేసిన అప్పులు, ఆత్మహత్యలవైపు పురికొల్పుతున్నాయనేది నిర్వివాదాంశం. ప్రపంచంలో ఏ దేశం పంపనంతమందిని రైతు నేపథ్య రాజకీయ నాయకుల్ని భారతదేశ ప్రజలు తమ తమ చట్టసభలకు పంపుతున్నారు. ముఖ్యమంత్రులైతే పారతో మట్టిని తవ్వి గేట్లు పెట్టినవారే ఎక్కువ (?). కోట్లాది రూపాయల బ్యాంక్ రుణాల్ని మాఫీ చేసిన వారే! పావలా వడ్డీని, వడ్డీలేని రుణాల్ని అప్పుగా ఇస్తున్న వారే! రైతుల కడగండ్లు తీర్చడానికి కాలినడకన గడప గడపకు వెళ్తున్న వారే! వెన్నముకలేని రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న నాయకులు అత్యధికులే! అయినా పిచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ అసెంబ్లీ సాక్షిగా ఆ నాయకుల్ని అవమాన పరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే నజరానాలకు ఆశపడి రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని నాటి హైటెక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులే ఎజెండాగా మారారు. జాతీయ స్థాయిలో వివిధ పార్టీలతో రైతుల సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు కూడా చేసి మాట్లాడుతున్నాడు. పాలకపక్షాన్ని తిట్టడానికి పనికి వచ్చిన ఆ సమావేశం, తాను తిరిగి ముఖ్యమంత్రి అయితే రైతు ఆత్మహత్యలు ఉండవని ఒక మాటను చెప్పలేని స్థితి. రైతు బాంధవుడని, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసాడని వై.ఎస్.ఆర్.ను పొగుడుతున్న నాయకమన్యులకు ఆయన కాలంలోనే రైతులు ఆత్మహత్యలకు ఎందుకు దూరంగా ఉండలేదో ఆలోచించే ఓపికలేదు.

ఒకరు స్వామినాథన్ సిఫారసులంటారు. మరొకరు గిట్టుబాటు ధర అంటారు. ఇంకొకరు ఫలాన పంటలు కాదు, ఫలానా పంటలు మాత్రమే వేయాలంటారు. దేనికీ స్పష్టత లేదు. మనకు విశ్వవిద్యాలయం ఉంది. దాని అనుబంధంగా పనిచేసే అనేక పరిశోధనా క్షేత్రాలున్నాయి. అయినా అవి రైతులకు ఎలాంటి సేవలందిస్తున్నాయో ఎవరికీ తెలియదు. ఆ విశ్వవిద్యాలయంలో చదువుతున్న వారికి ఓ తెల్లకాలరు ఉద్యోగం సంపాదించడానికి, వ్యవసాయ సహాయ అధికారిని ఓ పేరును తగిలించుకోవడానికి మాత్రం పని చేస్తుంది. వారెప్పుడూ పొలం గట్ల వెంబడి పోయిన దాఖలాలుండవు. సాంప్రదాయ విత్తనాలు సచ్చుబడి పోయాయి. సాంప్రదాయ వ్యవసాయం, నాగటి వ్యవసాయం ఆధునికతకు బలి అయింది. మిశ్రమ పంట విధానాలు విభిన్న రకాల పంట విత్తనాలు బోల్‌గార్డ్, మైకో, బిటి విత్తనాల కంపెనీల ఘాటుకు గురైనాయి. ఏతం వేసుకొని కుటుంబ అవసరాలకు నాలుగు రకాల పంట దినుసుల్ని, కూరగాయల్ని పండించుకొని హాయిగా బతికిన రైతును ఆధునికత అంతమొందిస్తున్నది. వెయ్యి అడుగుల బోర్ బావిలో రైతును పూడ్చివేస్తున్నది. కరెంటు రాదు. వైర్లుండవు. మోటర్ తిరగదు. బోరు బావిలోంచి మోటర్‌ను తీయడం, దించడం, మెకానిక్ దగ్గరికి తీసుకెళ్లడం రైతుకు నిత్యకృత్యం. వేసిన బోరు వట్టిపోవడం, మరో బోర్ వేయడం, బోర్ పక్కన బోరు – చేనంతా బోర్లే. ఏ బోరూ నీరునివ్వదు. అన్నింటిని అధిగమించి పంట పండిస్తే దళారీ మార్కెట్ వ్యవస్థ. పేరుకే వ్యవసాయ మార్కెట్లు. సాధారణ రైతుకు గోదాములే దొరకవు. దొరికినా వెంటాడే అప్పులతో రైతులు గోదాముల్లో పంటల్ని పెట్టలేడు. సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు. అంతా మాటల గారడీ!

తెలంగాణ రైతుల ఆత్మహత్యల పరంపర ఈనాటిది కాదు. స్వశక్తి నుంచి పరాధీనతకు గురవుతున్న కాలం నుంచే ఇవి మొదలయ్యాయి. జాతీయ నేర బ్యూరో రికార్డుల ప్రకారమే 2010లో 2,525 మంది రైతులు ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 80 శాతంకు పైగా రైతులు తెలంగాణ వారే. విదర్భ తర్వాత అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ప్రాంతం తెలంగాణ. నైజాం కాలంలో కట్టలేని శిస్తులకు బండరాళ్లను మోపినా గాని ఏ రైతూ ఆనాడు ఆత్మహత్య

చేసుకోలేదు. పైగా నైజాంను, జాగీరుదార్లను, దొరలను ఎదిరించి పోరాడారు. దున్నేవాడిదే భూమి అని నినదించారు. ఖరీఫ్‌లో నీటి పారుదల సౌకర్యాలున్న ప్రాంతంలో వరి, చెరకు పంటల్ని పండించగా మెట్ట ప్రాంతాల్లో మొక్కజొన్న, జొన్న, మిర్చి, పత్తి, పొగాకుతో పాటుగా, కంది, పెసర, మినుము, బొబ్బర, చిక్కుడు, అనుము, జనపనార (పుంటి), పసుపు, ఉల్లి, వెల్లుల్లి లాంటి తదితర పప్పుధాన్యాలను, వాణిజ్య పంటల్ని అంతర పంటగా, మిశ్రమ పంటగా వేసుకునేవారు. రబీలో నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతంలో వరిని వేయగా, మెట్ట ప్రాంతంలో శనగ, రాగులు, కొర్రలు, సజ్జలు, ఉలవలు, ఆముదం, నువ్వుల పంటల్ని వేసేవారు. ఈ విధానంతో రైతుకు ఏదో ఒకపంట నష్టపోయినా, మిగతా పంటలు సహకరించి ఆర్థికంగా నిలబెట్టేవి. అప్పులపాలు చేసేవి కావు.

తెలంగాణ దక్కన్ పీఠభూమిపై ఉండడం, చక్కని వర్షపాతంతో (సంవత్సరానికి సరాసరి 600 - 1000 మిల్లిమీటర్లు) కుంటలు, చెరువులు, మత్తళ్లతో వాగుల్ని అనుసంధానం చేసే ఉపరితల నీటి వ్యవస్థ (నీటిని పారిస్తూ నిలువ చేసే విధానం - దేశంలో ఎక్కడా ఈ వ్యవస్థ కనపడదు), ఎత్తైన దిబ్బలు, గుట్టల చుట్టూ ఊరే నీటిని (జాల) ఉపయోగించి వ్యవసాయం ఒక్క పక్కనైతే, మోట బావుల్ని తవ్వి (10-30 అడుగుల లోతు) నీటిని తోడి (రెక్కలతో - పశువులతో నడిచే యాంత్రిక శక్తితో), ఆత్మవిశ్వాసంతో, భద్రతతో వ్యవసాయం చేసుకుంటూ, ఉన్నదానితో పండిన దానితో తృప్తి చెంది పెళ్లాం పిల్లల్ని తెలంగాణ రైతు పోషించుకున్నాడు. కాలం మారింది. యాంత్రికత గూడనూ, ఏతాన్ని వెనక మోటరు, రహత (రాటు)ను దిగమింగాయి. ఆయిల్ ఇంజన్ కరెంట్ మోటరుతో, కరెంట్ మోటర్ సబ్‌మర్సిబుల్ పంపులతో పోటీ పడలేక తెరమరుగైనాయి. భూమిలో నీటి లభ్యత ఎంతనో తెలియదు. భూగర్భ జలశాఖ రైతుల్ని చైతన్యం చేయకపోవడంతో జామ పుల్లలతో, రాగి వైర్లతో భూగర్భ జలాల్ని గుర్తించి (మూఢనమ్మకాలతో) బోర్లు వేయడం తెలంగాణలో సర్వసాధారణం. ఇవి వికటించడం, మరో బోరు వేయడం, అదీ వెక్కిరించడం - తిరిగి మరో బోరు. ఇలా ఒకే సర్వే నెంబర్‌లో పదుల కొద్ది బోర్లు వేసి నిలువు దోపిడీకి గురికావడం, బోరు యజమానులు బలిసిపోవడం, ఈ యంత్రాలపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడం తెలంగాణలో ఓ సాధారణ అంశం.

ఉపరితల, అతి తక్కువ లోతుగల భూగర్భ నీటి పారుదల సౌకర్యాలను పెద్ద తరహా జలాశయాలు మింగేసాయి. బోరుబావులు నీటిబావుల్ని పాతాళంలోకి తీసుకెళ్లాయి. మొదట్లో ఈ విధానాలు రైతుకు అరచేతిలో వైకుంఠాన్ని చూపాయి. రాను రాను చిన్న నీటి, ఉపరితల పారుదల సౌకర్యాలు అంతరించిపోవడంతో చిన్న చిన్న కమతాలు కనుమరుగు అయ్యాయి. పెద్ద వ్యవసాయ క్షేత్రాలు మొదలయ్యాయి. ఇది వాణిజ్య పంటలకు ప్రాధాన్యతనిచ్చాయి. దీంతో అవసరమైన పంటలు పండించక, మద్దతు ధర ఉండే పంటలవైపు రైతులు మొగ్గు చూపడం, ఒకే వాణిజ్య పంటను అత్యధికంగా పండించడం, దానికి కనీస మద్దతు ధర లభించకపోవడం తెలంగాణలో సర్వ సాధారణ మైంది. దీంతో పండించిన చేతులతోనే పంట చేనుల్లోనే పంటల్ని తగల బెడుతున్నారు. పంటల్ని పండించడం నేరమని భావించి పంటల సెలవును (క్రాప్ హాలిడే) రైతులే స్వయంగా ప్రకటించుకుంటున్నారు. పంటలకోసం తెచ్చిన పురుగుమందుల్ని స్వయంగా సేవిస్తున్నారు. దీనికి తోడు నీటిపారుదల బడ్జెట్‌లో 90 శాతం భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు మళ్లించడం, మిగతా చిన్న నీటిపారుదల ప్రాజెక్టులకు ఖర్చు చేయడంతో కుంటలు, చెరువులు, మత్తళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పైగా తెలుగుదేశం హయాంలోనైతే, నీటిని కాపాడే మరమ్మత్తులు చేయడం పక్కనపెట్టి, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి కాంటూరు కందకాలని, వాటర్‌షెడ్లని, నీటి గుంటలని, అడ్డుకట్టలని పథకాలని రూపొందించి వాటి మానాన వాటిని వదిలేసారు. వీటితో కాంట్రాక్టర్లు బాగుపడ్డారు తప్ప, రైతులకు ఒరిగిందేమీ లేదు. మరోపక్క భూగర్భ జలాలు అడుగంటడం, రైతులు బోర్ల పక్కన బోర్లు వేయించడం, దివాలా తీయడం సాధారణమైంది. 100-150 అడుగుల లోతులో లభించే నీరు వెయ్యి అడుగుల లోతుకు దిగజారిపోయింది. నల్లగొండ జిల్లాలోనైతే ఓ రైతు 64 బోర్లను తవ్వించి బోర్ల రామిరెడ్డిగా మారిపోయాడు. ఒక్క బోరూ ఆయనకు సాథ్ (సహకారం) ఇవ్వలేదు. నీటి వినియోగం, పంటల విధానం శాస్త్రీయంగా, న్యాయ బద్ధంగా లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలను ఎంచుకుంటున్నారని సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ శాస్త్రవేత్త జి.వి. రామాంజనేయులు అనడం గమనార్హం.

నేడు పాలకులకెవరికీ నిజాం చేపట్టిన రైతు విధానాలు, సేద్యపు పద్ధతులు పట్టడం లేదు. పైగా ఆయన విధానాలకే చంద్రబాబు కాలం నుంచి సమాధి కట్టడం మొదలైంది. వీరెవరైనా బోధన్ ప్రాంతంలో నిజాం అవలంబించిన వ్యవసాయ విధానాన్ని పరిశీలించినట్లైతే (ప్రస్తుతం ఇది శిథిలావస్థలో ఉంది. పంట చేనుల్లో నుంచే మీటర్‌గేజ్ ద్వారా చెరుకును చక్కెర కర్మాగారానికి తీసుకెళ్లడం - పంటల సాగుకు కావాల్సిన ఆర్థిక, ఇతర సహాయాన్ని ప్రభుత్వమే భరించడం, గిట్టుబాటు ధర మొదలైనవి) నిజాం వ్యవసాయ విధానం ఎంత శాస్త్రీయత పద్ధతుల్లో సాగిందో తెలుస్తుంది. పోతే చట్టాలను చేయడంలో ఈ పాలకుల్ని ఎవరూ తలదన్నలేరు. భూగర్భ జలాలు అడుగంటు తుండడంతో 2002లో ప్రభుత్వం వాల్టా (వాటర్, లాండ్ అండ్ ట్రీస్) చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా బోర్లు వేయడం గాని, బోరుకు 200 మీటర్ల పరిధిలో మరో బోరు వేయడం (వ్యవసాయ భూముల్లో) నిషేధం. కాని ఏదీ అమలు కాకపోగా, గ్రామాల్ని పెద్ద గ్రామపంచాయితీల్లోకి, మునిసిపల్ పరిధిలోకి మార్పించి, వ్యవసాయ భూముల్ని రియల్ ఎస్టేట్స్‌గా మార్చి, చూపించి, ఇష్టం వచ్చినట్లు (వెయ్యి అడుగుల లోతు) బోర్లు వేసి నీటిని అమ్ముకోవడం మొదలైంది. ఈ చట్టాన్ని అతిక్రమించితే లక్ష రూపాయల దాకా జరిమానా వేయాలనీ, బోరు మిషన్‌ను జప్తు చేయాలనీ ఉన్న సెక్షన్లు 10, 14, 27లు, 35లోని సబ్ సెక్షన్ (2)ను ఇంతవరకు ఎక్కడా వినియోగించలేదంటే నీటిదోపిడీ ఏ విధంగా సాగుతోందో అర్థమవుతుంది. దీంతో డబ్బున్న ఆసామి, చిన్న, సన్నకారు రైతులు వేసుకున్న బోర్లకు సమీపంలోనే లోతైన బోర్లను వేయడంతో రైతులు బోర్లు (గతంలో 4 అంగుళాల బోర్లుండేవి - తర్వాత 6 అంగుళాలవి వచ్చాయి.) వట్టిపోవడం, రైతులు భూముల్ని వదులుకోవడం, అమ్ముకోవడం, బీళ్లుగా మార్చుకోవడం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రేక్షకపాత్రనే పోషిస్తున్నది.

ఇదే సందర్భంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలనే డిమాండ్ రైతు సంఘాల నుంచి, పౌరహక్కుల సంఘాల నుంచి రావడంతో తలొగ్గిన తెలుగుదేశం ప్రభుత్వం 421 జి.ఒ. విడుదల చేసింది. దీని ప్రకారం ఆత్మహత్య చేసుకున్న రైతుకు లక్షన్నర చొప్పున ఆర్థిక సహకారాన్ని అందించాలి. కాని వరంగల్

జిల్లాలో 2000లో ఆత్మహత్య చేసుకున్న రైతులకు నేటికీ ఆర్థిక సహాయం అందలేదని ఆ జిల్లా రైతు సంఘం నాయకులు తమ్మెర విశ్వేశ్వర రావు ఆరోపించారు. పైగా ఈ డబ్బులకు ఆశపడే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అసలు వ్యవసాయమే వృథా అని, ఇజ్రాయిల్‌లాగా (అక్కడ ఎడారి, నీరు లభించదు) బిందు సేద్యం, తుంపర సేద్యం చేసి, పూలను పండించి, ఎగుమతి చేసి లాభాలు గడించాలని కూతలు కూసిన చంద్రబాబే నేడు రైతుపోరు యాత్రను ప్రారంభించాడు. వరంగల్ జిల్లా రైతుల కడగండ్లను తీర్చడానికని ప్రారంభించిన దేవాదుల పైపుల లీకేజితో గోదావరిలో నీటి లభ్యత (గ్రావిటీ వాటర్) లేక అచేతనంగానే ఉంది. ఇక జలయజ్ఞం పేరున, రైతు బాంధవుడిగా పాదయాత్ర చేసి ముఖ్యమంత్రి అయిన వై.ఎస్.ఆర్. తన అనుచరగణం కాంట్రాక్టుల కోసం పదుల సంఖ్యలో ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేసాడు. ప్రాణహిత, చేవెళ్ల పథకానికి 42,000 కోట్ల రూపాయలు కావాలి. దాదాపు 8 దఫాల ఎత్తిపోతలకై 3,375 మెగావాట్ల విద్యుత్తు కావాలి. అంటే ఈ నీటిని ఎత్తడానికి విద్యుత్తు కావాలి. విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి పెద్ద జలాశయాలు కావాలి. ఇదో చిక్కుముడి. నదీ పరీవాహక ప్రాంతాల్లో పడిన వర్షపునీటిని వినియోగించే ప్రణాళికలు రూపొందించకపోగా, ఒక నదీ పరీవాహక ప్రాంత నీటిని కొల్లగొట్టి మరో నదీ పరీవాహక ప్రాంతానికి (300-400 మీటర్ల ఎత్తుకు) నీటిని తరలించాలనడం ప్రజల కంట్లో కారం కొట్టడమే కాకుండా జల దోపిడే అవుతుంది.

ప్రాణహిత గోదావరి పరీవాహక ప్రాంతం. చేవెళ్ల రంగారెడ్డి జిల్లాలోని మూసి (కృష్ణానది పరీవాహక) పరివాహక ప్రాంతం. గోదావరి ప్రాంత గిరిజనుల నోళ్లుగొట్టి, హైదరాబాద్ చుట్టూ ఉన్న ఆంధ్రవారికి నీరందించడం ఎంత రాజ్యనీతో తెలుస్తున్నది. తెలంగాణ వారి వేలును తెలంగాణ వారి కంట్లో పెట్టడం అంటే ఇదే! అయినా ఇది అసాధ్యమనేది అందరికీ తెలుసు. కాని ఆశల్ని రేకెత్తించి, ఓట్లు దండుకుంటూ, కోట్లాది రూపాయల్ని జేబుల్లో నింపుకోవడానికి ఈ పథకాలు. ఇలాంటివే ఎల్లంపల్లి, కంతనపల్లి, దుమ్ముగూడెం (రాజీవ్‌సాగర్), రుద్రంకోట (ఇందిరాసాగర్). ఇవన్నీ తెలంగాణ ప్రజలకు బూచి చూపిస్తూ నోర్లు కొట్టే పథకాలే. పైగా ఇవన్నీ శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినా వీటిని ఆయన పూర్తి చేయలేదు. వేరే ముఖ్యమంత్రుల గురించి అడగాల్సిన అవసరం లేదు.

ఈ విధంగా జల దోపిడీ గత అరవై సంవత్సరాలుగా జరుగుతున్నది. నైజాం కాలంలో రూపుదిద్దుకున్న ఇచ్చంపల్లి కాగితాలకే పరిమితమైంది. దీన్ని కనుమరుగు చేసే పోలవరం రూపకల్పన జరిగింది. గోదావరి, కృష్ణ బేసిన్‌కు నీరందించడమే కాకుండా, పులిచింతల చింతలు తీర్చడానికే దీని రూపకల్పన జరిగింది. ఈ జలయజ్ఞం కాలంలోనే మహారాష్ట్ర బాబ్లీని నిర్మించింది. తెలంగాణలో ఉన్న ఏకైక భారీ ప్రాజెక్టు పోచంపాడ్ (చక్కని పేరు శ్రీరాంసాగర్) ను దెబ్బతీసింది. కాంగ్రెస్ దీన్ని పట్టించుకోకపోగా, చంద్రబాబుకు ఇది ఆయుధంగా మారింది. గోదావరిలో నీటి లభ్యతనే ప్రశ్నార్థకంగా మారితే, గుప్త, అలిసాగర్ ఎత్తిపోతలని ఊదరగొట్టి, వాటికి ఆదిలోనే అడ్డుకట్టలు వేసారు. ఇక నిజాం కాలంలో కట్టిన అనుసంధాన కుంటలు, చెరువులు కబ్జాలకు గురైనాయి. హైదరాబాద్‌లో, చుట్టూ ఇతర జిల్లా, తాలుకాల చుట్టూగల వందలాది చెరువులు మాయమయ్యాయి. ఫలితంగా తెలంగాణ రైతు గుండె పగులుతున్నది.

తెలంగాణలో రైతు క్షేత్రాలు మరణ క్షేత్రాలుగా మారుతుంటే, విద్యాలయాలూ దీనికతీతంగాలేవు. మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో తెలంగాణ రాజకీయ నాయకుల మాటల తూటాలకు 700 మందికి పైగా ప్రాణాలు తీసుకున్నారు. వీరి మరణానికి మౌనం పాటించడం కన్నా ఒక్క నిమిషం కారణాలకై ఆలోచించినా ఈ బలిదానాలు జరిగేవి కావేమో! మొదటి దశ తెలంగాణ ఉద్యమకాలంలో పాలకులు 370 మందిని కాల్చి చంపగా, ఈనాటి తెలంగాణ ఉద్యమంలో యువకులు తమకు తామె శిక్ష వేసుకుంటున్నారు. ఏ ఉద్యమానికి లేని అంటు వ్యాధి ఇది. అలాగే 1940 నుంచి 1948 దాకా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం రజాకార్లు, జాగీర్‌దార్ల ముష్కరులు రైతాంగాన్ని ఊచకోతకోస్తే, నెహ్రూ సైన్యాలు నాలుగు వేలకు పైగా తెలంగాణ ప్రజల్ని ప్రజాస్వామ్యం పేరున చంపారు. 1969 నుంచి 2005 దాకా జరిగిన ప్రజాపోరులో అసువులు బాసింది తెలంగాణ బిడ్డలే. ఈ విధంగా అప్పుడు, ఇప్పుడు సమిధలవుతుంది తెలంగాణ ప్రజలే. మరోవైపు కార్పొరేట్ సంస్కృతికి, విద్యాలయ కర్మాగారాల్లో అసువులు బాస్తున్నది అత్యధికంగా తెలంగాణ విద్యార్థులే. పాలకులకు ఇవేవి పట్టకపోగా, ఉద్యమకారులకు, విద్యావేత్తలకు, సామాజిక శాస్త్రజ్ఞులకు కూడా ఈ విషయాలేవి పట్టడం లేదు. ఎన్నికల్లో గెలిస్తే తెలంగాణవాదం ఉన్నట్లని ఒకరంటే, గెలిపిస్తే ఢిల్లీ నుంచి బంగారు పళ్ళెంలో తెలంగాణ తెస్తామని మరొకరంటారు. డాలర్ల వేటన పోటీ పేరున విద్యార్థుల ఉసురును కార్పొరేట్ కాలేజీలు తీసుకుంటే, తల్లిదండ్రులు ఉత్ప్రేరకాలుగా పనిచేస్తున్నారు. తమ సంతానం అమెరికాకు ఎగిరిపోతే ఆనందించాలని చూస్తున్నారు. మనుషుల మధ్యన మమకారం మంటగలిపి డాలరే ప్రధానమైన వ్యవస్థలో ఆత్మహత్యలే అంతిమంగా మిగిలాయి.

*(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు)* వీ

**రాబోయే సంచికలలో...**

- **గ్రామాల అధ్యయనాల చరిత్ర**
- **బకాయిల బాధలింకెంత కాలం? - సిలువేరు హరినాథ్**
- **వికలాంగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి - బిల్లా మహేందర్**
- **రాజకీయ వేదికలు కానున్న సర్కార్ బళ్లు - ఎ. పున్నయ్య**
- **సాయం దూరం - వ్యవసాయం రుణ భారం - ముద్దసాని శ్రీకాంత్ రెడ్డి**

# భాషా రాష్ట్రాలపై అంబేద్కర్

వీక్షణం నవంబర్ 2011 సంచికలో 'భాషా ప్రయుక్త రాష్ట్రాలపై అంబేద్కర్' శీర్షికతో ప్రచురించిన నా వ్యాసానికి స్పందనగా లోకే రాజ్‌పవన్ గారు చేసిన విమర్శకు (వీక్షణం జనవరి 2012 సంచికలో) ప్రతిస్పందన ఇది. మొదటగా విమర్శకులకు, ప్రచురించిన సంపాదకులకు కృతజ్ఞతలు. అయితే విమర్శ సబబుగా, సహేతుకంగా లేదని స్పష్టం చేస్తున్నాను. ఈ విషయ వివరణతో పాటు విషయ పరిశీలనలో, విమర్శ మెథడ్‌లో లోపాలను కూడా ఎత్తిచూపడం ప్రస్తుత లక్ష్యం. పాఠకులు శ్రద్ధతో వీటిని పరిశీలించాలని మనవి.

1. 'అంబేద్కర్ చిన్న రాష్ట్రాలకు అనుకూలం కాదంటూ.. రాయడం చాలా విస్మయానికి గురిచేసింది' అని రాశారు రాజ్‌పవన్. 'కొన్ని విషయాల ఆధారంగానే అంబేద్కర్ చిన్న రాష్ట్రాలకు సుముఖం కాదని తేల్చేశారు' అన్నారు! ఈ మౌలిక విషయం పూర్తిగా నిరాధారం. ఎందుకంటే నా మూల వ్యాసంలో అలాంటి భావం, అలాంటి వాక్యం ఎక్కడా లేదు. రాయని విషయాన్ని ఖండించి విస్మయానికి గురిచేశారు. నా వ్యాసం శీర్షికే భిన్నమైనది – 'భాషా ప్రయుక్త రాష్ట్రాలపై అంబేద్కర్'. అదే నా ముఖ్యాంశం. ఆ శీర్షికపై ఎడిటర్ చేసిన పరిచయ వాక్యంలో 'అంబేద్కర్ చిన్న రాష్ట్రాల విషయంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలను తప్పుగా అన్వయిస్తున్నారంటూ..' అని పేర్కొన్నారు. అందులో కూడా అంబేద్కర్ చిన్న రాష్ట్రాలకు సుముఖం కాదని ఎక్కడా లేదని గమనించవచ్చును.

2. 'అంబేద్కర్ చెప్పిన విషయాలను సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోకుండా, కొన్ని విషయాల ఆధారంగానే అలాంటి దురభిప్రాయానికి రావడం సమంజసం కాదు' అన్నారు. 1953లో రాసిన ఒక 'వ్యాసం విశ్లేషణ ఇది' అని, స్థలాభావం వల్ల కొన్ని అంశాలకే పరిమితమవడం అనివార్యం అని నా వ్యాస పరిధిని, పరిమితిని మొదట్లోనే నొక్కి చెప్పాను. అయినా ఎలాంటి దురభిప్రాయానికి రాలేదని పై పాయింట్‌తోనే స్పష్టం అవుతున్నది. నేను రాయని అంశాన్ని ఆపాదించి దురభిప్రాయానికి వచ్చింది విమర్శకులే.

3. అంబేద్కర్ 'పాత అభిప్రాయాన్ని కొంత మార్చుకొని కొత్త భావాలను ఏర్పర్చుకున్నప్పుడు, ఆ మార్పును స్పష్టంగా... చెప్పినప్పుడు పాత అభిప్రాయాన్ని మాత్రమే ఆధారం చేసుకొని' బేరీజు వేయడం తప్పన్నారు విమర్శకులు. ఇది కూడా నేను చేయని పని ఆధారంగా చేసిన నిరాధారమైన విమర్శే. అంబేద్కర్ చిన్న రాష్ట్రాలకు సుముఖం కాదు అని నేనెక్కడా అనలేదు అన్న విషయం చాలు – ఇది నిరాధారం అనడానికి. అయినా మరికొంత వివరిస్తాను. నా వ్యాస పరిమితి పరిధిని పేర్కొంటూనే 1955లో అంబేద్కర్ రచించిన చిన్న పుస్తకంలో 'కొన్ని (6) ముఖ్యాంశాలను' కూడా ప్రస్తావించాను. అవేవీ నా పాయింటుని కాదనేవి కాదు. 1955 వ్యాసంలో 'ఒక రాష్ట్రం – ఒక భాష అంటే .. ఒక భాష మాట్లాడే ప్రజలు ఒకే రాష్ట్రంలో ఉండాలని మాత్రం కాదు. ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలలో కూడా ఉండవచ్చు అని దాని అర్థం' అని రాశారు రాజ్‌పవన్. ఈ విశదీకరణను నేను మరుగుపరచలేదు. సరికదా 'ఒకే భాష మాట్లాడేవారు ఒకే రాష్ట్రంగా సంఘటితం కావాలా? ఈ ప్రశ్న కొత్తగా ఏర్పడే (ఆంధ్ర, మహారాష్ట్ర) రాష్ట్రాలకే కాక, ఇప్పటికే ఏర్పడి ఉన్న పెద్ద పెద్ద రాష్ట్రాలకూ (ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్) వర్తిస్తుంది. విశాల హిందీ ప్రాంతమంతా ఉత్తరప్రదేశ్ అన్న ఒకే రాష్ట్రంలో ఎందుకు ఉండాలి' అని స్పష్టంగా, సోదాహరణంగా అంబేద్కర్ అభిప్రాయాన్ని పేర్కొన్నాను. ఈ అంబేద్కర్ సూత్రాన్ని మరుగు పరచ లేదనేది స్పష్టం. దాని అన్వయం చర్చనీయాంశం.

4. 'ఒక భాషా ప్రాతిపదిక రాష్ట్రం నుంచి ఒక ప్రాంతం వేరు పడాలంటే అందుకు ఏ కారణాలు ప్రాతిపదికగా ఉండాలి' అన్న అంశాన్ని లేవనెత్తి, మహారాష్ట్ర విభజన ప్రతిపాదనల గురించి అంబేద్కర్ విశ్లేషణలు కొంత వివరంగా చర్చించి, అంబేద్కర్ జీవించి ఉంటే ఈనాడు ప్రత్యేక తెలంగాణను బలపరిచే వారే అని అన్నారు – లోకే రాజ్‌పవన్.

'ఆయన తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించారా? విశాలాంధ్రను సమర్థించారా?' అన్న ప్రశ్నలను లేవనెత్తి, 'అంబేద్కర్ రాష్ట్రాల ఏర్పాటుపై రాసిన ఏ వ్యాసంలోనూ ప్రత్యక్షంగా ఈ కారణాలను వివరించలేదు' అని రాజ్‌పవన్ గారే స్పష్టం చేశారు. ఆయన బతికి ఉన్నప్పుడు ఏం చెప్పారు, ఏం చేశారు అన్నవరకే నిర్ధారణగా చెప్పగలం. బతికి ఉంటే ఈనాడు ఏం చెప్పేవారు అన్నది ఊహకు సంబంధించిన విషయం మాత్రమే.

అంబేద్కర్ 1955 డిసెంబర్ చివరి వారంలో రాసిన చిన్న పుస్తకంలో ఏముంది? అని చూడగలం. అందులో ఆయన మహారాష్ట్ర గురించి మాత్రమే రాయలేదు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లు మరీ పెద్ద రాష్ట్రాలుగా ఉన్నాయని, ఎస్సార్సీ వాటిని అలాగే అట్టిపెట్టడం 'అమాయకమైన తప్పు కాదు. ఇది పూర్తిగా విషంతో నిండి ఉంది. ఈ విషాన్ని ఇప్పుడే తొలగించి తీరాలి' అని నొక్కిచెప్పడాన్ని నా వ్యాసంలో పేర్కొన్నాను. 1955 వ్యాసంలో ఈ విషయాన్ని ఇంకా వివరింగా చర్చించి, 'ఇలా ఉత్తర భారత్‌ను సంఘటితం చేయడం, దక్షిణాదిని ముక్కలు చేయడం (కన్సాలిడేషన్ ఆఫ్ నార్త్, బాల్కనైజేషన్ ఆఫ్ సౌత్) కుటిలమైనదని 'దుష్ట పర్యవసనాలకు' దారి తీస్తుందని అంబేద్కర్ రాశారు. రాష్ట్రాల పునర్విభజనలో భాగంగా ఉత్తర, దక్షిణాల సమతుల్యతను ఒక అంశంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. 'దక్షిణాదిని ముక్కలు ముక్కలు చేయడం' మంచిది కాదనడంలో ఇమిడి ఉన్న భావాన్ని పాఠకులే గ్రహించాలి. హైదరాబాద్ సంస్థానాన్ని విడగొట్టి భాషాపరంగా పునర్నిర్మించడం అనివార్యం అని, (ఈ విషయంలో) 'ప్రధాని (నెహ్రూ) దైవేచ్ఛకు వ్యతిరేకంగా నడవాలనుకుంటున్నాడు' అని అంబేద్కర్ రాశారన్న దానితో దీన్ని జోడించి చూడాలి.

5. అంబేద్కర్ అభిప్రాయంలో 'మార్పును దాచి పెట్టడం ద్వారా అతనిలోని నిజాయితీని, భావ ప్రకటనను అవమానించినట్లే అవుతుంది. అసలు విషయం చెప్పకపోవడం ద్వారా పాఠకులను తప్పుదారి పట్టించినట్లే అవుతుంది' అని విమర్శించారు లోకే రాజ్‌పవన్. 1955 డిసెంబర్ చివర్లో (23న) రాసిన వ్యాసంలో యుపి, బీహార్, మహారాష్ట్ర, పంజాబ్ మొదలైన చాలా రాష్ట్రాలను సోదాహరణంగా ప్రస్తావించారు. కాని 1953 ఏప్రిల్ వ్యాసంలోనే – అంటే ఆంధ్ర రాష్ట్రమైనా ఏర్పడ డానికి ఆరు నెలల ముందే 'సంపూర్ణ ఆంధ్ర రాష్ట్రాన్ని' బలపరిచిన అంబేద్కర్ 1955 వ్యాసంలో తెలంగాణ గురించి ఒక్క వాక్యంలో కూడా ప్రస్తావించలేదు. అంతే కాదు, 1955 వ్యాసంలోనే దక్షిణాదిని ముక్కలు ముక్కలు చేయడాన్ని వ్యతిరేకించారు.

1953 తర్వాత – 1955 డిసెంబర్‌కి ముందు అనేక పరిణామాలు జరిగాయి. విశాలాంధ్ర ఉద్యమం బలపడింది. ఆనాడు రెండు ప్రాంతాల్లోనూ బలమైన, చురుకైన, రాజకీయశక్తి అయిన కమ్యూనిస్టులు విశాలాంధ్ర నినాదంతో ఎన్నికల్లో పోటీ చేశారు. కాంగ్రెస్‌లో కూడా – కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అత్యధికంగానూ, తెలంగాణలో కూడా గణనీయంగానూ – విశాలాంధ్రవాదులే ఉండేవారు. అంతే గాక తెలంగాణలో సోషలిస్టులూ

బలపరిచారు. ఎస్.ఆర్.సి., దాని రిపోర్ట్ ప్రకటనా ఈ ఉద్యమ నేపథ్యంలోనే.. 1955 నవంబర్‌లో హైదరాబాద్ అసెంబ్లీలో వారం రోజుల చర్చలో మెజారిటీ సభ్యులు వెంటనే విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని కోరారు. పార్లమెంట్‌లో కూడా మెజారిటీ ఎంపిలది అదే అభిప్రాయం. ప్రజల్లో సరేసరి. ఈ రాజకీయ నేపథ్యం అంబేద్కర్‌కి తెలియనిదని అనుకుంటే పొరపాటే. ఇవన్నీ తెలిసిన అంబేద్కర్ వేరు తెలంగాణ గురించి ఒక్కమాటైనా రాయలేదు. రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా తెలుగు ప్రాంతాల్లో రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ మొదలైన కులాల ప్రాబల్యం గురించి చర్చించిన అంబేద్కర్ తెలంగాణ గురించి మాత్రం పేర్కొనక పోవడం గమనార్హం. 1955 వ్యాసం ముందుమాటలో – తన గత అభిప్రాయాలు కొద్దిగా మారి ఉండవచ్చునని, ఆ మార్పులు కొద్ది సంఖ్యలోనే ఉన్నాయని రాశారు. అయితే అలాంటి మార్పుల్లో తెలంగాణ లేదు. ఒక్క వాక్యమూ రాయలేదు. లేని మార్పులు దాచిపెట్టడం సాధ్యం కాదు కదా. అలాంటి దేమీ లేకుండానే 'అంబేద్కర్ నిజాయితీని, భావ ప్రకటనను అవమానించి నట్లే అవుతుంది' అనడం అసందర్భం, అనుచితం.

6. అంబేద్కర్ బతికి ఉంటే నేడు ప్రత్యేక తెలంగాణని బలపరిచే వారు అని రాశారు రాజ్‌పవన్. అది ఆయన ఊహ, అంచనా, స్పెక్యులేషన్. ఆయనకా హక్కు ఉంది. తన స్వంత రాష్ట్రామైన మహారాష్ట్రను నాలుగు భాగాలుగా, బొంబాయి నగరాన్ని విడి రాష్ట్రంగా ప్రతిపాదించిన అంబేద్కర్ సీమాంధ్రలతో పాటు తెలంగాణని కూడా విడగొట్టమని, హైదరాబాద్ నగరాన్ని విడి రాష్ట్రంగా చేయాలని సూచించేవాడు అని మరొకరి అంచనా కావచ్చును. రాజ్‌పవన్ పేర్కొన్నట్లు – మైనారిటీలపై పెత్తనం లేకుండా రక్షణ ఉండాలని వాదించిన అంబేద్కర్ ముస్లింలకు నగరం స్వంత రాష్ట్రంగా ఉండాలని వాదించే వాడని కూడా ఎవరైనా అనవచ్చును. లేదా మజ్లిస్ పార్టీ అభిప్రాయాల్ని మన్నించాలని చెప్పే వాడు అనవచ్చు. రెండు కోట్ల జనాభా మించకుండా ఉంటే బాగుంటుందని అంబేద్కర్ భావించారని రాజ్‌పవన్ పేర్కొన్నారు. ఆ లెక్కన చూసినా తెలంగాణను రెండు భాగాలు చేయాల్సి వస్తుందని మరొకరు అనవచ్చును. అంతేకాదు ఆ లెక్కన దేశాన్ని విభజించి దేశమంతటికీ అమలయ్యే విధానంలో భాగంగా తెలంగాణను విడగొడితే మాకు అభ్యంతరం లేదని అంటున్న వారు చాలా మందే ఉన్నారు. వారందరికీ అలా ఊహించే హక్కుంటుంది. నిజానికి వరంగల్‌ని 'సంపూర్ణ ఆంధ్ర రాష్ట్రానికి' రాజధానిగా చేయవచ్చునని, హైదరాబాద్ నగరాన్ని దేశానికి రెండో రాజధానిగా చేయాలని సూచించారు అంబేద్కర్. ఎవరి ఊహకు ఎలాంటి అవకాశాలున్నాయో పాఠకులే నిర్ణయించుకోవచ్చు. ఇలాంటి ఊహల ఆధారంగా 'పాఠకులను తప్పుదారి పట్టించడానికి' నేను ప్రయత్నించలేదు. విమర్శకులకే ఇదేమైనా వర్తిస్తుందా అన్నది పరిశీలించుకోవాలి.

7. ప్రత్యేక తెలంగాణ ఆందోళన సందర్భంగా వచ్చిన వందలాది వ్యాసాల్లో, ఉపన్యాసాల్లో అంబేద్కర్‌ని ప్రస్తావించారు. దాదాపు ఇతరులెవ్వరూ 1953 వ్యాసంలో ఆయన సంపూర్ణ ఆంధ్ర రాష్ట్రాన్ని బలపరిచారని, వరంగల్‌ని ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా సూచించారని చెప్పకపోవడం గమనార్హం. ప్రత్యేక వాదులే కాదు, సమైక్యవాదులు కూడా ఈ వ్యాసాన్ని ఉటంకించి చర్చించినట్లు కనపడదు.

నా వ్యాసాన్ని దినపత్రికల్లో ప్రచురింప చేయడానికి కొద్ది నెలలు ప్రయత్నించి చూశాను. ఎవ్వరూ ప్రచురించలేదు. కారణం అడగగా దాటవేత ధోరణియే నాకిచ్చిన సమాధానం అయింది. ఆ తర్వాత ఆగస్ట్‌లో వీక్షణంకి పంపాను. నవంబర్‌లో ప్రచురించారు. (సంపాదకులకు కృతజ్ఞతలు). నేను నా వ్యాసం రాయడానికి ముందు రాష్ట్రంలో పాక్షిక దృష్టితో చర్చ సాగుతున్న తీరుకి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అంబేద్కర్ భావాల్లో ఈ కోణాల్ని వెలుగులోకి తీసుకు వచ్చింది నేను, దీన్ని దాచిపెట్టింది ఇతరులు. నా పై ఈ విమర్శ నిరాధారం.

**చివరగో మరో ముఖ్య విషయం**

గాంధీ, నెహ్రూ, ఇందిర, అంబేద్కర్, సుందరయ్య – ఇలా ఎవ్వరు ఏది చెప్పినా అది వేదం కాదు. దాన్ని విశ్లేషించి వర్తమానంలో ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఏది మంచిది అని పరిశీలించుకోవాలి. అంబేద్కర్ గొప్ప రాజకీయ విజ్ఞుడు, పండితుడు, నాయకుడు, రాజ్యాంగవేత్త అన్నది నిస్సందేహం. అంతమాత్రాన అంబేద్కర్ రాసిందీ, చెప్పిందీ అంతా మంచిదే, అంతా ప్రజాస్వామికమే అని గుడ్డిగా నమ్మడానికి సిద్ధంగా లేను. ఈ సమస్యపై అంబేద్కర్ భావాల్ని పరిశీలించినప్పుడు ఈ అభిప్రాయం మరింత బలపడింది. ఎందుకో గమనించండి –

భాషా రాష్ట్రాల ఆవశ్యకతను, అనివార్యతను, ప్రజాస్వామిక లక్షణాన్ని వివరించిన అంబేద్కర్ 1955 వ్యాసంలో ఏమన్నారో గమనించండి – తన భాషనే అధికార భాషగా కలిగి ఉన్న భాషా రాష్ట్రం ఒక స్వతంత్ర జాతిగా తేలిగ్గా పరిణమించే అవకాశం ఉంది.. భాషా రాష్ట్రాల ఏర్పాటులో ఈ ప్రమాదం ఇమిడి ఉంది. భాషా రాష్ట్రాలు లేకపోతే కూడా ప్రమాదమే. ఇదింకా ఎక్కువ ప్రమాదం అని చెప్పి ఇలా అంటారు – 'ఈ ప్రమాదాన్ని నివారించ డానికి నా ఆలోచనలో ఉన్న ఏకైక మార్గం, ప్రాంతీయ భాష ఆ రాష్ట్ర అధికార భాషగా ఉండడానికి వీల్లేదు. ఆయా రాష్ట్రాల అధికార భాషగా హిందీ ఉండాలి. అది సాధ్యమయ్యేలోపు ఇంగిష్ ఉండాలి. భారతీయులు దీనికి అంగీకరిస్తారా? అంగీకరించకపోతే. భాషా రాష్ట్రాలు తేలిగ్గా ఒక పీడగా మారుతాయి'. 'ప్రాంతీయ భాషే ఆయా రాష్ట్రాల అధికార భాషగా ఉంటే అది సమైక్య భారత్‌కి చావు దెబ్బ అవుతుంది' (ఇది నిజం కాదని గత 55 ఏళ్ల అనుభవం రుజువు చేసింది).

భాషా రాష్ట్రాల్లో భావ ప్రకటన, ప్రచార – ప్రసార సాధనాలు, వాణిజ్యం మాతృభాషలో సాగడం ప్రజలకు ఎంతో అనువైనదని చెప్పాల్సిన అవసరం లేదు. దానితోపాటు ప్రజలకు తమ భాషలో పాలన సాగడం ఎంతో అవసరం, ప్రాణపదం. భాషా రాష్ట్రాల పరమార్థం ఇదే. కానీ ఆయా మాతృభాషలు కాకా హిందీయో, ఇంగ్లిషో అధికార భాషగా ఉండాలనడం మౌలికంగా తప్పు. ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. ప్రభుత్వ ఉత్తర్వులు, శిస్తు కాగితం, పోలీసు ఆజ్ఞ తమ మాతృభాషల్లో ఉండడం ప్రజలకు కనీస ఉపయోగం. నేటికీ నిరక్షరాస్యత గణనీయంగా ఉన్న మన దేశంలో ఇంకా ఆవశ్యం. కానీ అంబేద్కర్ హిందీనో, ఇంగ్లిష్‌నో ఆమోదించి తీరాలి అంటున్నారు. అక్కడితో ఆగకుండా, 'భాషా రాష్ట్రాల్లో భాగంగా ఈ ప్రతిపాదనను అంగీకరించని ఏ భారతీయుడికీ భారతీయుడిగా ఉండే హక్కు లేదు' అంటారు అంబేద్కర్. ప్రజాస్వామ్య విరుద్ధ భావాలకు పరాకాష్ట! ఈ అంశం 1955 వ్యాసం మూడవ అధ్యాయం రెండో భాగంలో ఉన్నది. (ఈ వ్యాసం నెట్‌లో లభ్యం.)

అయితే అంబేద్కర్ తన పాత అభిప్రాయాలను వదులుకోవడానికి సిద్ధమని, తన ఆలోచనల్లో 'ఫైనాలిటీ'కి స్థానం లేదని తన ముందు మాటలో (23 డిసెంబర్ 1955) స్పష్టం చేశారు. ఎవరి మాటలైనా వేదవాక్కు కాదు. అంబేద్కర్‌వీ కావు, కాకూడదు – ముఖ్యంగా ఈ విషయంలో. అందుకని మన నిర్ధారణలకు మనం రావాలి. ప్రస్తుత దోపిడీ, నిరంకుశ వ్యవస్థలో చిన్న రాష్ట్రమైనంత మాత్రాన ప్రజాస్వామికంగా ఉంటుందని, అభివృద్ధి బాగా జరుగుతుందని ఏమీ లేదు. లక్షలాదిగా కేంద్ర సైన్యం కింద నలుగుతున్న ఈశాన్య రాష్ట్రాల వెనుకబాటుతనం మనకి తెలిసిందే. చిన్న రాష్ట్రాలపై 'ఫోకస్' చేసిన వీక్షణం మార్చ్ 2010 సంచికలో సంపాదకులు వేణుగోపాల్ రాసిన ముగింపు వాక్యాలతో నేను ముగిస్తాను. 'కనుక ఒక రాష్ట్రం చిన్నదా, పెద్దదా అనేది గీటురాయి కాదు. కనీసం ప్రస్తుత భారత రాజకీయాలలో కాదు'. ప్రజలకు మౌలిక ప్రయోజనాలే గీటురాయి.

– ఎం. కృష్ణ ఆదిత్య, పాత్రికేయులు

చర్చా వ్యాసాలలో క్లుప్తత పాటించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. – సం.

*భూమికీ, మనిషికీ సంబంధాన్ని నిర్దేశించే రెవెన్యూ పాలన ప్రారంభం, పూర్వాపరాల చరిత్రను వివరిస్తున్నారు*

**ఎస్. సరళా వందనం**

# ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన - 11

*( తరువాయి... )*

బ్రిటిష్‌వారు పరిపాలించిన రాష్ట్ర భూభాగంలో రిసెటిల్‌మెంట్ రిజిష్టర్ తయారు చేయాల్సిన అవసరానికి పురికొల్పిన పరిస్థితులను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. బ్రిటిష్‌వారు ముందుగా రైతువారీ పద్ధతి, సెటిల్‌మెంట్, చివరగా రిసెటిల్‌మెంట్ చేశారు. వీటికి దారితీసిన భూమి శిస్తు నిర్ధారించే విధానం, వసూలు చేసే విధానం హిందూ రాజుల కాలం నుంచి బ్రిటిష్‌వారు అధికారంలోకి వచ్చే వరకూ ఇలా ఉంది.

విజయనగర రాజుల కాలంలోనూ, అంతకుముందున్న ప్రతాప రుద్రుని కాలంలోనూ రెవెన్యూ వసూలు 'విశపది' పద్ధతిలో ఉండేది. ప్రతి రాజు లేదా జమీందారు దగ్గర దివానులు ఉండేవారు. ఈ దివానులు గ్రామ పెద్దపేరు మీద (పెద్ద గ్రామం అయితే ఇద్దరు లేక ముగ్గురు గ్రామ పెద్దలు) రెండు నుండి ఐదు సంవత్సరాల వరకూ సాగుకు పనికి వచ్చే భూమిని పట్టాగా ఇచ్చి ఆ భూమికి నిర్ధారించిన శిస్తును కట్టే బాధ్యత వారికే అప్పగించేవారు. 1955 వరకు కూడా రాయలసీమ జిల్లాలలోని పూర్వపు గ్రామ పెద్దలుగా ఉన్న వారి కుటుంబాలలో తరతరాల నుంచి కూడా వారికున్న మొత్తం భూమి కుటుంబంలోని పెద్ద కొడుకు పేరు మీద పట్టాదారు పేరును గ్రామ లెక్కలలో నమోదు చేస్తుండేవారు. సాగుచేసే రైతుపేరు మీద పట్టా ఇచ్చేవారు కాదు. గ్రామంలోని రైతులంతా ఒక చోట చేరి తాము ఎంత సాగు చేయగలమో అంత భూమిని పంచుకొనేవారు. శిస్తును 'మౌ జొబాని' పద్ధతి (పంట కోసిన తరువాత పంట దిగుబడి నిష్పత్తిని బట్టి భూమి శిస్తు కట్టే విధానం) ద్వారా చెల్లించేవారు. ఎలాంటి రాతపూర్వక హామీ లేకపోయినా మాటకు కట్టుబడి తమ వంతుకు పంట దిగుబడిని బట్టి ఎంత శిస్తు కట్టాలో అంత గ్రామపెద్దకు చెల్లించేవారు. అప్పట్లో భూమి శిస్తుకు గాను రాజులకు చెల్లించాల్సిన వాటా పండిన పంటలో సగం, ఇదే పద్ధతిలో ఒక్కోసారి 3/4 వంతు కూడా ఉండేది.

### భూములపై హక్కు రెండు విధాలుగా ఉండేది

1) ఖండ్రిక భూములు : గ్రామంలో మొత్తం శిస్తు విధించబడిన విస్తీర్ణం. భూమిపై వీరిపేరు మీద పట్టా ఉంటుంది కానీ క్రయ విక్రయాలు చేసే అధికారం వీరికి ఉండదు. వారసత్వ హక్కుగా అనుభవించే అధికారం ఈ మాత్రం భూములు కలిగిన వ్యక్తులకు ఉంటుంది. వీరిని కదిమ్ రైతులు అంటారు. రెండవవారు పాయికారి రైతులు. వీరు కదిమ్ రైతుల కింద వ్యవసాయం చేస్తూ వారి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తమ భాగాన్ని తీసుకునే హక్కు కలిగి ఉంటారు. అంటే దున్నినందుకు గాని, సాగు చేసినందుకు గాని వారికి వచ్చేది ఈ ప్రతిఫలం – కదిమ్ రైతుకు ఉన్న భూమిలో పండిన పంటను 20 భాగాలుగా విభజిస్తే అందులో 6 నుండి 8 భాగాలు కదిమ్ రైతుకు, 9 నుండి 10 వంతులు పాయకారి రైతుకు చెందుతుంది. కదిమ్ రైతు మహమ్మదీయుల పాలనలోని మహమ్మదీయుడైతే అతనికి 50 శాతం పంట, పాయకారి రైతులకు మిగిలినది చెల్లించేవారు.

2) బంజరు భూములు : ఇందులో వ్యవసాయయోగ్యంగా ఉన్న / వదిలివేసిన భూములు, సాగు చేయకుండా లేదా సాగుకు పనికి రాని భూములు, అడవులు, కొండలు, గుట్టలు లాంటి భూములు ఉండేవి.

భూమి పై శిస్తు వసూలు చేయడం, ఏ రైతు ఆధీనంలో ఎంత పొలం ఉందో నమోదు చేయడం, ఒక్కొక్కసారి భూమి శిస్తు ఎంత కట్టాలో నిర్ణయించిన లెక్కలన్నీ ప్రతి గ్రామంలో 'కరణం' చేసేవాడు. జమీందారులు లేదా రాజులు లేదా పాలెగాండ్ల దగ్గర కొన్ని గ్రామాలు లేదా పరగణాలకు కలిపి ఒక 'స్థల కరణం' ఉండేవాడు. గ్రామ కరణాలు తమ లెక్కలను ఈ స్థల కరణానికి పంపేవారు. అందరి కరణాల దగ్గర వసూలు వివరాలను తీసుకొని జమీందారులకు, రాజులకు స్థలకరణం పంపేవాడు.

అప్పట్లో రాయలసీమ ప్రాంతం, నెల్లూరు, ఒంగోలు జిల్లాలు కర్ణాటక రాజుల పాలనలో ఉండేవి. మొట్టమొదటగా బ్రిటిష్‌వారు దేశతీర ప్రాంతంలో తమ స్థావరాన్ని ఏర్పరచుకోవడానికి 1609లో నెల్లూరు దగ్గర చంద్రగిరి వద్ద ప్రయత్నిస్తే అప్పటికే వెంకటపతి రాజా అనుమతితో స్థిరపడిన డచ్చి వారి నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వచ్చి ఆ ప్రయత్నాన్ని వారు విరమించుకున్నారు. తరువాత 1623లో మాసులిపట్నం (మచిలీపట్నం) దగ్గర డచ్చివారితో ఒప్పందం చేసుకొని ఫ్యాక్టరీని నిర్మించుకున్నా కూడా గోల్కొండ రాజుల ఫర్మానా లేకపోవడం వలన దానికి నిలకడ లేకుండాపోయింది. చివరకు వారు నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సుకు 40 మైళ్ల దూరంలో 'దుగ్గరాజపట్నం'కు ఉత్తరాన ఉన్న కోరమాండల్ తీరాన్ని తమకు ఓడరేవు స్థావరంగా బాగుంటుందని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం కావలసిన అనుమతి కోసం వారు అక్కడి స్థానిక కరణం ఆర్ముగ మొదలియార్‌ను వెంకటపతి రాజాతో అనుమతి ఇప్పించమని అభ్యర్థించారు. ఆర్ముగం మొదలియార్, రాజా దగ్గర తనకున్న పలుకుబడిని ఉపయోగించి బ్రిటిష్‌వారికి స్థావరం

ఏర్పరచుకోవడానికి కావలసిన అనుమతి ఇప్పించాడు. కరణం మీద కృతజ్ఞతతో బ్రిటిష్‌వారు అక్కడ కోట కట్టుకొని, ఆ ప్రదేశానికి 'ఆర్మగాన్' అని పేరు పెట్టుకొన్నారు. ఇలా భారతదేశంలోనే మొట్టమొదటిసారి బ్రిటిష్‌వారు ఒక గ్రామ రెవెన్యూ అధికారి సహాయంతో స్థిరమైన స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1639లో కాళహస్తికి చెందిన దామర్ల వెంకటాద్రి నాయుడు 'చెన్నకుప్పం' (మద్రాస్, ఇప్పటి చెన్నై)ను ఫ్రాన్సిస్ డేకు అప్పగించేంత వరకూ ఆర్మగాన్ బ్రిటిష్‌వారికి ప్రధాన కార్యకేంద్రం (హెడ్‌క్వార్టర్స్)గా ఉంది. తమ వ్యాపార లావాదేవీలు బ్రిటిష్‌వారు 1641 వరకూ ఇక్కడి నుండే నడిపారు. ఇప్పటికి కూడా నెల్లూరు జిల్లా 'మునిపాలెం' దగ్గర లైట్‌హౌస్, బ్రిటిష్‌వారి కోట భారతదేశంలో వారి మొట్టమొదటి స్థావరానికి గుర్తుగా ఉన్నాయి.

1641లో భూమి శిస్తును కాని, మిగిలిన వాటి విలువలను కాని క్రీ.శ. 1638-59 మధ్యకాలంలో మైసూరును పాలించిన 'కాంతిరవనరసరాజు'లు టంకశాలను ఏర్పాటు చేసి ముద్రించిన నాణాలను ప్రాతిపదికగా తీసుకొని అప్పటి రూపాయలను 'కాంతిరవ పగోడాలు'గా లెక్కించేవారు. పగోడాల విలువలతోనే రాష్ట్రమంతా లెక్కించేవారు. ఆ కాలంలో భూమి శిస్తు కూడా వేసిన పంటను బట్టి రకరకాలుగా ఉండేది. భూములకు నీరు పారితే ఆ భూములను 'మాగాణి' భూములని పిలిచేవారు. నీరు పారని వర్షాధారపు పంట పండే భూములను 'మెట్ట' లేదా 'ఎలి' పొలాలు అనేవారు. నీరు పారే భూములకు సంబంధించి ప్రభుత్వం వసూలు చేసే శిస్తును 'కోరు' అనేవారు. ప్రభుత్వ పన్ను పోగా రైతుకు దున్ని సాగుచేసినందుకు వచ్చే భాగాన్ని 'మేడిపాలు' అనే వారు. ఇందులోనే కొంత భాగం గ్రామ సేవకులకు ఇచ్చేవారు. దీనినే 'మేర' అనేవారు. అప్పట్లో 16 రకాల శిస్తు రేట్లు మెట్ట పొలాలకు, మాగాణి పొలాలకైతే 35 రకాల రేట్లు ఉండేవి.

మహమ్మదీయుల పాలనలోని నవాబులు పరిపాలించే కాలంలో భూమి శిస్తు నిర్ధారణలో పెద్ద మార్పులు లేకపోయినా, కొత్తగా భూమి శిస్తు వసూలు చేసుకొనే అధికారాన్ని ఉత్తర భారతదేశం నుంచి, మధ్య భారత దేశం నుంచి వలస వచ్చిన వ్యాపారులకు ముందుగా పేష్‌కష్ తీసుకొని భూమి శిస్తు వసూలు చేసుకొనే అధికారం అప్పగించేవారని, ఇలా ఒక కొత్త దళారీ వ్యవస్థ మొదలైందని ముందే తెలుసుకున్నాం. వీరు భూమి శిస్తును నవాబుల తరఫున ఫౌజుదారులకు వసూలు చేసి ఇవ్వాల్సొచ్చేది. అసఫ్‌జాహీల పాలనకు ముందు గంజాం నుంచి కృష్ణ వరకు ఔరంగజేబు పాలనలో ఉండేది. అతనికి బ్రిటిష్‌వారు అంటే ఇష్టం లేదు. అప్పటికి బ్రిటిష్‌వారు విజగపట్నం (విశాఖపట్నం) తీరంలో తమ సరుకులు నిలవ ఉంచడానికి గోదాములను నిర్మించుకున్నారు. 13 సెప్టెంబర్ 1689న ఔరంగజేబు సేనలు బ్రిటిష్‌వారి గోదాములపై, నివాసాలపై దాడిచేసి అందరినీ చంపారు. అలా వారికి ఔరంగజేబు తన పాలనలో స్థావరం లేకుండా చేశాడు. తరువాత ఔరంగజేబు డచ్చివారికి మసులిపట్నం దగ్గర భూమి శిస్తు తప్ప మిగిలిన లావాదేవీలు, వ్యాపారం చేసుకోవడానికి క్రీ.శ. 1689-1712 వరకూ ఫర్మానా జారీచేశాడు.

పన్ను విధింపులో అసఫ్‌జాహీల (నిజాం) పాలనలో కొంత క్రమబద్ధీకరణ జరిగినా శిస్తు వసూలుకు అధికారం రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలలో పాలెగాళ్లు, జమీందార్లు, పటేల్‌లు, దేశ్‌ముఖ్‌లు నియమితులుగా ఉండేవారు. ఎక్కువగా నవాబుల బంధువులు, వారి మనుషులు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నునే కాకుండా ఎక్కువ మొత్తం పన్ను వసూలు చేస్తూ శిస్తు వసూలు నిర్ధారణలో క్రమపద్ధతి లేకుండా ప్రజలను వేధించేవారు. ఈ నియమితులు గ్రామాలకు గ్రామాలనే అద్దెకు తీసుకునేవారు. ఫౌజుదారులు కఠినంగా శిస్తు వసూలు చేస్తుండడం వలన శిస్తు కట్టలేని సందర్భంలో నియమితులు, రైతులు కలిసి ఫౌజుదారులపై తిరుగుబాటు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. చాలాసార్లు పక్క జిల్లాకు పారిపోయేవారు. ఇదే కాకుండా కొన్నిసార్లు వీరు శిస్తు కట్టలేని రైతులతో తమ ఆధీనంలో ఉన్న పొలాలలో ఎలాంటి ప్రతిఫలం ఇవ్వకుండా వ్యవసాయం చేయించేవారు. ఈ కష్టం చేయలేక తమ జీవితాలు ఇక బాగుపడవని రైతులు వ్యవసాయం చెయ్యడమే మానుకొనేవారు. ఫౌజుదారులకు భూమి హక్కులు మార్చే అధికారం కూడా ఉండి వారు ప్రజల పట్ల చాలా కఠినంగా వ్యవహరించేవారు. కాని కొంతమంది ఫౌజుదారులు ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలించేవారు. అందుకు ఉదాహరణ 1765-1772 మధ్య నెల్లూరు జిల్లాకు ఫౌజుదారైన మాలిక్ అస్లాం ఖాన్ చెరువులకు, కాలువలకు నీటి ప్రవాహాలలో పేరుకుపోయిన పూడిక తీయించి నీటిపారుదల సౌకర్యాలను బాగా మెరుగుపరిచాడు.

నవాబులు లేదా చక్రవర్తి జమీందారులకు ఇచ్చే ఫర్మానాలను 'బాద్ షాయి గ్రాంట్స్' అనేవారు. ఈ జమీందార్లు బ్రాహ్మణులకు గ్రామాలకు గ్రామాలనే దానం చేస్తుండేవారు. ఈ గ్రామాలను 'శోత్రియం గ్రామాలు' అనేవారు. బ్రాహ్మణులకు వ్యక్తిగతంగా ఇచ్చే ఇనాములను 'భట్టవర్తి' ఇనాములని, మహమ్మదీయుల వ్యక్తిగత ఇనాములకు 'ఖైరాతి' ఇనాములని పిలిచేవారు.

## ఆంధ్ర బోర్డ్ ఆఫ్ రెవెన్యూ స్థాపన

క్రీ.శ. 1758లో రాబర్ట్ క్లైవ్ గజపతి రాజుల సహాయంతో బెంగాల్ వైపు నుంచి వచ్చి పోర్చుగీస్ వారిని ఓడించి గంజాం నుంచి కిస్త్న (కృష్ణా) జిల్లా వరకు భూమి శిస్తు వసూలు చేసుకొనే అధికారాన్ని ముందుగా నిజాం దగ్గర పొందాడు. తరువాత ఆనంద గజపతిరాజు సహాయంతో మొఘల్ చక్రవర్తి నుంచి ఫర్మానా పొందాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ రెవెన్యూ వసూలు చేయడానికి అధికారం పొందేనాటికి భూమి ఎక్కువగా జమీందారీలు, ఫౌజుదారులు, రాజులు, బ్రాహ్మణుల ఆధీనంలో ఉంది. ఇప్పటి ఏజెన్సీ ప్రాంతాలైన మల్కన్‌గిరి, రాయఘడ్, పర్లాకిమిడి, టెక్కలి, శ్రీకాకుళంలో కొంతభాగం, విజయనగరంలో కొంత భాగం, విశాఖపట్నం జిల్లాకు అనుబంధంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో కొంత భాగం భూమి గోండులు, కోయల ఆధీనంలో ఉండేది. వీటిని ఏజెన్సీ ప్రాంతంగా బ్రిటిష్‌వారు పిలిచేవారు. ఈస్ట్ ఇండియా కంపెనీ గంజాం నుంచి కిస్త్న వరకు ఉన్న ప్రాంతాన్ని మద్రాస్‌లో ఉండే గవర్నర్ జనరల్‌కు అప్పగించింది. కంపెనీవాళ్లు భూమి శిస్తును చాలా ఎక్కువగా వసూలు చేసే అవకాశాలను పరిశీలించడానికి, అందుకోసం భూమిపై హక్కుల స్వభావాన్ని సమగ్రంగా అధ్యయనం చెయ్యడానికి విజగపట్నం కేంద్రంగా చేసుకొని తమ ఆధీనంలోకొచ్చిన ప్రాంతమంతా పర్యటించి సమగ్ర నివేదికనందించడానికి 1784లో

ఒక 'సర్క్యూట్ కమిటీ'ని నియమించారు. ఈ కమిటీ సభ్యులుగా మెస్సర్స్ సాండర్స్, ఫౌడ్, మిస్టర్ విలియం ఆర్మెలను నియమించారు. ఈ కమిటీ అప్పటి భూముల గురించిన సమగ్ర సమాచారాన్ని మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీకి అందించింది. ఈ కమిటీ ఇచ్చిన వివరాల ప్రకారం భూములపై హక్కుల స్వభావం, భూమి శిస్తు, ఇతర పన్నులు వసూలు చేసే విధానాలు ఇలా ఉన్నాయి.

హవేలి భూములు : జమీందారులు కాని, ఫౌజుదారులు కాని సముద్ర తీరానికి సమీపంలో పెద్ద బంగళాను నిర్మించుకొని దాని చుట్టూ కొన్ని ఎకరాల భూమి ఉండేవాటిని హవేలి భూములు అంటారు. ముందుగా ఈ హవేలీలు జమీందారులు, రాజుల ఆధీనంలో ఉన్న తరువాత మహమ్మదీయులు చాలా వాటిని వారి ఆయుధాగారాల కోసం, వారి సైనికులతో ఉండే కోటలుగా వారి స్థావరాలుగా మార్చుకున్నారు.

జమీందారీ భూములు : జమీందారులకు బాద్‌షాయి గ్రాంట్‌లు, తరతరాలుగా వస్తున్న భూములు, వారు శిస్తు వసూలు కోసం పేష్‌కాష్ చెల్లించి తమ ఆధీనంలోకి తెచ్చుకున్న భూములు, వారు ఇతరులకు షరతులతో అప్పగించిన భూములు, వారి స్వంత తోటలు, వీటన్నింటి లోనూ పరిపాలనా పరమైన అన్ని కార్యక్రమాలు వీరి ఆధీనంలోనే ఉండేవి. జమీందారుల కింద ఉన్న భూములను ఎస్టేట్ భూములు అనేవారు.

విజయనగరం మహారాజుకు 24 పరగణాలలో 834 'జిరాయితీ' గ్రామాలు (శిస్తు విధించిన గ్రామాలు); 73 'మొఖాసా' గ్రామాలు, 250 అగ్రహారాలు ఉండేవి. కడప జిల్లాలోని 'గట్టు' పాలెగాళ్లకు నరసం నాయర్ అయితే క్రీ.శ. 1360లో అనుగొంద రాజుల ద్వారా పది గ్రామాలను జాగీరుగా పొందాడు. అప్పట్లో కమిల్ 18,743 పగోడాలుగా ఉండేది. క్రీ.శ. 1718లో వారి వారసులకు కడప నవాబు మూడు సంవత్సరాలకు గాను 10,000 పగోడాలకు తిప్ప సముద్రంను కూడా కలిపి కౌలుకు ఇచ్చాడు. నెల్లూరు జిల్లా ఉదయగిరి జాగీరు కింద 74 గ్రామాలు; సైదాపురం జమీందారు కింద 104 గ్రామాలు ఉండేవి. ఈ జమీందారు స్థానంలో చాలా చోట్ల మహమ్మదీయుల పాలనలో జాగీర్దార్లు, ఫౌజుదార్లు వచ్చారు.

ఇనాం భూములు : ఇనాందారులు రెండు రకాలుగా ఉండేవారు. ఏ రూపంలో భూమిని ఇచ్చినా సాధారణంగా వారసత్వంగా వచ్చే ఆనవాయితీ ఉన్నది. ఇనాందారులను 'మిసాల్‌దారులు' అనేవారు. ఇందులో పనిచేసే మిసల్‌దారులు (సాధారణంగా గ్రామస్తులకు ఏదో ఒకరూపంలో సేవలనందించే వారు. వీరికి మేర రూపంలో గ్రామస్తుల నుంచి కూడా భత్యం అందేది') గైర్ మిసాల్‌దారు' (పనిచేయక పోయినా వారసత్వంగా సంక్రమించిన భూములను అనుభవించేవారు) అని రెండు రకాలుగా ఉండేవారు. శ్రోత్రియం భూములు అంటే దేవాలయాల ఖర్చుకు, నిర్వహణకు, ధూప దీప నైవేద్యాలకు, బ్రాహ్మణులకు కావలసిన భత్యానికి గాను జమీందారులు, రాజులు గ్రామాలను దేవాలయాలకు దానంగా ఇచ్చేవారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 207 శ్రోత్రియం గ్రామాలున్నాయి. కేవలం బ్రాహ్మణులకు వారు వ్యక్తిగతంగా నివసించడానికి, దాని చుట్టుపక్కల భూములుతో కలిపి దానంగా ఇచ్చే భూమిని అగ్రహారాలుగా పిలిచేవారు. ఇవి కాకుండా గ్రామసేవకులైన కరణం, రెడ్డి లేదా మున్సిఫ్, గ్రామపెద్ద (విలేజ్ హెడ్‌మేన్) లేదా పెద్దకాపు, కావలిగాండ్రు లేదా వెట్టి లేదా తలారి, మోహతాద్, బందెలవాండ్లు, మాదిగవాండ్లు (వాచ్‌మన్, పాకీపని), నీరుగంటి, షరాఫ్ (నాణేల నాణ్యత, ధాన్యం నాణ్యతను (శిస్తు రూపేణా అందిన దానిని) పరిశీలించే వాడు), మంగలి, చాకలి, దేవదాసీలు వీరికి విధిగా భూములు ఇనాంగా ఇచ్చేవారు. ఈ సేవా ఇనాంలను 'పునూల్ మాన్యాలు' అనేవారు. ఇవి కాకుండా స్థల కరణాలకు 'రుసుం' రూపంలో మాన్యాలు ఉండేవి. నిజాం కాలంలో సైన్యంకు వారి పోషణ నిమిత్తం (జంగి కట్టుబడులకు) భూమిని ఇనాంగా ఇచ్చే ఆనవాయితీ కూడా అసఫ్‌జాహీల కాలం నుంచి మొదలైంది. ఇవి కాకుండా ప్రజల దగ్గర నుంచి పంట కోసే సమయంలో పంటలో కొంత భాగం, పండుగలు, శుభకార్యాలు, మరణాలు, కర్మలు ఇవి జరుగుతున్నప్పుడు కూడా గ్రామసేవకులకు ఏదో ఒకటి ఇచ్చే ఆనవాయితీ ఉండేది.

దసబంధం ఇనాం భూములు: ఏదైనా చెరువు లేదా కాల్వకు సంబంధించి వాటి మరమ్మతులు నిర్వహణకు గాను కొంత భూమిని ఇనాంగా ఇచ్చేవారు. ఇవి ఎక్కువగా మాగాణి భూములు. ఈ భూములు ఉన్నవారికి మామూలు పట్టా భూములు కూడా ఉండేవి. ఈ భూములు సహజంగా రెండు రకాలుగా ఉండేవి.

1) ఖండ భూములు – ఎక్కువ విస్తీర్ణంలో ఎకరాలకు ఎకరాలు బాగు చేసి వాటిని నీటి పారుదలకు అనుకూలంగా చేయడానికి గాని కేటాయించిన ఇనాం భూములు.

2) షమిలత్ భూములు – సాగుకు అనుకూలంగా భూమిని మార్చినందుకు కొంత భూమికి శిస్తును మినహాయిస్తూ కేటాయించిన భూములు.

## సర్క్యూట్ కమిటీ సిఫారసులు

1) కోస్తా తీరం పొడవునా ఉన్న ఓడరేవుల నుండి ఎగుమతి అయ్యే ధాన్యం, నెయ్యి, నూనెలు, మామూలు వస్త్రాలు, మస్లిన్ వస్త్రాలకు విధించే ఎగుమతి సుంకం చాలా తక్కువగా ఉందని, వీటి తయారీదారులు చాలా పేద స్థితిలో ఉండి పెట్టుబడి లేక తయారీలో వెనకబడి పోయారని ఈస్ట్ ఇండియా కంపెనీ తయారీదారులను ప్రోత్సహించాలని సిఫారసు చేసింది.

2) ఉప్పుకొఠారులు (ఉప్పు తయారు చేసే భూములు) ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలోనే కాకుండా జమీందారులు, రాజుల స్వంతవి కూడా ఉన్నాయి కాబట్టి ఈస్ట్ ఇండియా కంపెనీ తన గుత్తాధిపత్యం కింద అన్ని ఉప్పు కొఠారులను తీసుకు రావాలని సూచించింది.

3) భూమి శిస్తుకు సంబంధించి దాదాపుగా పంట పండే భూమి అంతా కూడా జమీందార్లు, రాజుల ఆధీనంలోనే ఉంది. నవాబుల వద్ద నుండి వీరు సనద్ పొందారు. (వీటికి తరువాత సుబేదారు ఆమోద ముద్ర వేసేవాడు).

*(ఇంకా ఉంది)*

*(రచయిత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారి)*
saralareddy007@gmail.com

*మన దేశంలోని అణు రియాక్టర్లు మూడంచెల భద్రత కలిగి ఉన్నాయనీ, ప్రమాదకరమైన అణు ధార్మికత బయటకు వెలువడే అవకాశాలు తక్కువనీ అంటున్నారు* **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

# అణు విద్యుత్తు

**నా**నాటికీ పెరుగుతున్న విద్యుత్తు అవసరాలదృష్ట్యా తక్కిన అనేక దేశాల్లాగే మనవాళ్లు కూడా అణు విద్యుత్తును ఎక్కువగా ఉత్పత్తి చెయ్యాలని అనుకుంటున్నారు. విద్యుత్తును ఎక్కువగా వినియోగించడం వల్ల సమాజానికి లాభం కలిగేమాట నిజమేకాని, తక్కిన అనేక ఇతర సందర్భాల లాగే ఇదికూడా అధికసంఖ్యాకులకు ఉపయోగపడినప్పుడే చెప్పుకోదగిన ప్రగతి అవుతుంది. ఈ రకమైన విద్యుత్తును తయారుచేసే అణు రియాక్టర్లు మనదేశంలో కొన్నిచోట్ల పనిచేస్తున్నాయి. త్వరలోనే మరికొన్నిటిని నెలకొల్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సామాన్య ప్రజలలో వీటి గురించిన కొన్ని భయాలూ, అపోహలూకూడా లేక పోలేదు. ఇవి పనిచేసే తీరు ఎలా ఉంటుందో స్థూలంగా తెలుసుకోవచ్చు.

అణురియాక్టర్లు ఎడతెగకుండా కొనసాగే అణువిచ్ఛిత్తి ప్రాతిపదికగా పనిచేస్తాయి. యురేనియం-235 కేంద్రకంలో జరిగే ఒక్కొక్క విచ్ఛిత్తిలోనూ ఒకటికన్నా ఎక్కువ సంఖ్యలోనే న్యూట్రాన్లు విడుదల అయినప్పటికీ వాటిలో కనీసం ఒకటైనా మరొక్క విచ్ఛిత్తికి కారణమయేట్టుగా చేసి గొలుసుప్రక్రియను సాధించడమనేది అంత సులువుకాదు. ఎందుకంటే లోహపు ఇంధనకడ్డీలతో తయారయే రియాక్టర్ నిర్మాణంలో తప్పనిసరిగా గొలుసుప్రక్రియకు అడ్డొచ్చే అనేక ఇతరపదార్థాలు ఉండితీరుతాయి. విచ్ఛిత్తి జరిగిన వెంటనే అతివేగంగా ప్రసరించే న్యూట్రాన్ల వేగాన్ని ఏదో విధంగా తగ్గిస్తే తప్ప అవి మరొక విచ్ఛిత్తికి దారితీసే అవకాశం ఉండదు. ఈ వేగనిరోధకాన్ని మోడరేటర్ అంటారు.

న్యూట్రాన్ల పరిమాణంలోనే ఉండి, వాటిని ఢీకొన్నప్పుడల్లా వేగాన్ని సగానికి తగ్గించగలిగినవి ప్రోటాన్లు. లేదా ప్రోటాన్లే కేంద్రకంగా కలిగిన హైడ్రొజన్ అణువులు. లేదా ప్రతి బృహదణువులోనూ రెండేసి హైడ్రొజన్ అణువులు కలిగిన నీరుకూడా మోడరేటర్‌గా పనికొస్తుంది. అయితే న్యూట్రాన్లు ప్రోటాన్ల ఆకర్షణకు గురవుతాయి కనక మామూలు నీటివల్ల న్యూట్రాన్ల సంఖ్య తగ్గుతుంది. ఆ పరిస్థితిలో అటువంటి సమస్యలు లేని భారజలం కాస్త మెరుగైనది. ఒక శాతంకన్నా తక్కువగా ఉండే సహజయురేనియంను ఇంధనంగా ఉపయోగించేటప్పుడు భారజలాన్నే మోడరేటర్‌గా వాడాలి.




తారాపూర్‌లోని రియాక్టర్‌లాగా యురేనియం-235 మోతాదును ఏ రెండున్నర శాతానికో కృత్రిమంగా పెంచితే మామూలు నీరు ఇందుకు పనికొస్తుంది. అణువిచ్ఛిత్తి కొనసాగుతూ, న్యూట్రాన్లు యథావిధిగా విడుదల అవుతున్నంతసేపూ రియాక్టర్ పనిచేస్తూనే ఉంటుంది. దాన్ని నియంత్రించాలన్నా, నిలుపుదల చెయ్యాలన్నా న్యూట్రాన్ల సంఖ్యను తగ్గించాలి. అందుకు న్యూట్రాన్లకు అడ్డుతగిలి, వాటిని సంగ్రహించే గుణం కలిగిన బోరాన్, లేదా కాడ్మియంవంటి పదార్థాలను కడ్డీలుగానో, మరొకరరూపంలోనో ప్రవేశపెట్టి అనుకున్నది సాధిస్తారు. వీటిని కంట్రోల్ కడ్డీలు అంటారు. ఇవి తప్ప న్యూట్రాన్లను తగ్గించే ఇతర పదార్థాలనూ, మాలిన్యాలనూ రియాక్టర్లలో ప్రవేశించనివ్వరు.

మనదేశంలో రాజస్థాన్ (కోటా), తమిళనాడు (కల్పాక్కం), ఉత్తర్‌ప్రదేశ్ (నరోడా), గుజరాత్ (కాక్రాపార్), కర్ణాటక (కైగా) మొదలైన చోట్ల అణువిద్యుత్కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో సహజ యురేనియం ఇంధనంగానూ, మోడరేటర్‌గానూ పనిచేస్తాయి.




1. ఇంధనం, 2. కంట్రోల్ కడ్డీలు, 3. ఉక్కు కవచం, 4. పంప్, 5. కాంక్రీట్ కట్టడం, 6. ఆవిరి సెపరేటర్, 7. టర్బైన్



1. కేలండ్రియా అనే రియాక్టర్ కలశం లేదా గుండిగ, 2. ఇంధన పుంజం, 3. ఇంధన కణిక



1. ఇంధనం, 2. మోడరేటర్, 3. కంట్రోల్ కడ్డీ

వీటికన్నా ముందుగా మహారాష్ట్రలో పని ప్రారంభించిన తారాపూర్‌లోని రియాక్టర్‌లో మటుకు ఇంధనం రెండున్నర శాతానికి పెంచిన యురేనియం-235, మామూలు నీరు మోడరేటర్. మొత్తంమీద మనవాళ్లు నిర్మించే అణురియాక్టర్లలో ఇంధనం మొదలైనవి కడ్డీలుగానూ, న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించే భారజలం ద్రవరూపంలోనూ, మండుతున్న ఇంధనం వేడిమిని తగ్గించడానికి వాటిచుట్టూ అమర్చిన గొట్టాలలో ప్రవహించే నీరు, ఆవిరి ద్రవ, వాయురూపాల్లోనూ ఉంటాయి. ఈ నిర్మితులన్నీ తీవ్రమైన ఒత్తిడికి తట్టుకోగల ఒక ఉక్కు కవచం లోపల అమరుస్తారు. రియాక్టర్ వివిధ భాగాలన్నీ ఒక పెద్ద కాంక్రీట్ కట్టడం లోపల ఉంటాయి. బైట కవచంలాగా ఉన్న కట్టడంకాక, మందమైన ఉక్కుతో తయారుచేసిన గొట్టాలలోపల ప్రవహించే నీరు, వేడెక్కిన ఇంధనమూ ఉంటాయి కనక ప్రమాదకరమైన రేడియోధార్మిక పదార్థాలు బైటకొచ్చే అవకాశాలు బాగా తక్కువే. ఉక్కు కవచం మధ్యనుంటుంది



రియాక్టర్‌ను చల్లబరిచి ఆవిరిని తయారుచేసే ప్రక్రియ
1. కంట్రోల్ కడ్డీలు, 2. రియాక్టర్ కవచం, 3. ఒత్తిడికి తట్టుకునే ఉక్కుగొట్టాలు, 4. ఇంధనం కడ్డీలు, 5. మోడరేటర్, 6. ఆవిరి, 7. హీట్ ఎక్స్ఛేంజర్, 8. నీరు, 9. పంప్, 10. మోడరేటర్ పంప్, 11. కాంక్రీట్ కట్టడం

కనక మన రియాక్టర్‌లు మొత్తం మూడు అంచెల భద్రత కలిగినవిగా చెపుతారు.

రియాక్టర్ పనిచేసే విధానం పటంలో చూడవచ్చు. ఒక ఇంధనపు కడ్డీనుంచి యురేనియం-235 అణువిచ్ఛిత్తిద్వారా విడుదలఅయిన న్యూట్రాన్ మధ్యలోని మోడరేటర్‌లో తన వేగాన్ని కోల్పోయి, చివరకు మరొక ఇంధనపు కడ్డీలో నిలిచిపోవచ్చు. అది కనక యురేనియం-238 అణుకేంద్రకంలో చిక్కుకుపోతే దాన్నుంచి ప్లూటోనియం-239 తయారవుతుంది. మరికొన్ని న్యూట్రాన్లు కంట్రోల్ కడ్డీలో దిగబడిపోవచ్చు. ఒక్కొక్క రియాక్టర్‌లోనూ 300కు పైబడిన ఇంధనపు కడ్డీల వ్యవస్థలుంటాయి. అంటే 16వేల కిలోలకు పైబడిన యురేనియం. చల్లబరిచేందుకు 70 టన్నులూ, మోడరేటర్‌గా 140 టన్నులూ భారజలం ఉపయోగిస్తారు. మోడరేటర్ ఒత్తిడి వాతావరణ పీడనానికి 100 రెట్లుంటుంది. మన రియాక్టర్లన్నీ పడుకోబెట్టిన (విద్యుత్కేంద్రాలవి), లేదా నిలుచోబెట్టిన (ప్రయోగాలకు వాడేవి) బ్రహ్మాండమైన గొట్టాలలాగా కనిపిస్తాయి.

ఈ తతంగమంతా నీటిని ఆవిరిగా మార్చి, విద్యుత్తును ఉత్పత్తి చేసే టర్బైన్లను తిప్పడానికే. అయితే ఈ శీతలీకరణం జరగకపోతే రియాక్టర్‌లోని ఇంధనపు కడ్డీలూ, ఇతర నిర్మితులూ విపరీతంగా వేడెక్కి కరిగిపోవడం, నిర్మాణ పటిష్టత కుప్పకూలడంవంటి పెనుప్రమాదాలు సంభవిస్తాయి కనక ఇది తప్పనిసరి. చల్లనినీరు ఒకవేపునుంచి రియాక్టర్ లోపలికి ప్రవేశించి, వేడెక్కాక నీటీఅవిరి రూపంలో మరొకవేపునుంచి బైటకు వస్తుంది (పటం). ఈ నీరు విపరీతమైన ఒత్తిడితో ఒక్కొక్క ఇంధనపు కడ్డీకీ చుట్టూ అమర్చిన గొట్టాలగుండా ప్రవహిస్తుంది. ఈ ఒత్తిడి వాతావరణపు ఒత్తిడికి 75 నుంచి 150 రెట్లు ఉండవచ్చు. (పోలికకు చెప్పాలంటే మన వంటకు ఉపయోగపడే చమురువాయువు సిలిండర్లలోని ఒత్తిడి 12 రెట్లు మాత్రమే ఉంటుంది.) వేడెక్కి బైటపడిన ఆవిరిని చల్లబరిచి, నీరుగా మార్చి, మళ్లీ మళ్లీ లోపలికి పంపుతూ ఉంటారు. ఈ నీటినిగాని, ఆవిరినిగాని ఎన్నడూ వాతావరణంలోకి ప్రవేశించనివ్వరు. కాలే ఇంధనానికి అతి సమీపంగా పారే ఈ నీటికి రేడియో ధార్మికత ఉంటుంది. రియాక్టర్ నిర్మాణాన్నిబట్టి కొన్ని సందర్భాల్లో శీతలీకరణానికి కూడా భారజలాన్నే ఉపయోగిస్తారు. మొత్తం మీద బైటికొచ్చిన వేడి ఆవిరిని హీట్ ఎక్స్ఛేంజర్‌లోని మరొక నీటి ప్రవాహం ద్వారా చల్లబరుస్తారు. ఈ రెండో వలయంలో రూపొందే ఆవిరినే సామాన్యంగా టర్బైన్లలో ప్రవేశపెడతారు. చివరికి ఇలా ఉపయోగించిన ఆవిరిని మరొకపాయలో ప్రవహించే నీటిద్వారా చల్ల బరుస్తారు. ఈ నీరు సామాన్యంగా సముద్రంలోనో, మరొక జలాశయం లోనో లభ్యమవుతుంది. అందుకనే అణువిద్యుత్కేంద్రాలన్నీ సముద్ర తీరానో, మరొక నీటి వనరులున్న ప్రాంతంలోనో ఏర్పాటవుతాయి.

ప్రకృతిలో 6400 హైడ్రొజన్ అణువుల్లో ఒక్కదాంట్లోని కేంద్రకంలో ప్రోటాన్‌తోబాటుగా ఒక న్యూట్రాన్‌కూడా ఉంటుంది (భారహైడ్రొజన్ అనబడే డ్యూటీరియం). దీని మోతాదును రసాయనికంగా పెంచే పద్ధతులు జటిలమైనవి. దీనితో భారజలం తయారుచేస్తారు. అణువిద్యుత్తు ఉత్పత్తికి సహజ యురేనియం ఇంధనంగా వాడుతున్నప్పుడు న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించి వాటిచేత గొలుసు ప్రక్రియలో అణువిచ్ఛిత్తి జరిపించడానికి భారజలం మోడరేటర్‌గా పనికొస్తుంది. దీని తయారీ మనదేశంలో ఎంతగా పెరిగిందంటే ఈ అదనపు ఉత్పత్తిని అమెరికా, కొరియావంటి దేశాలకు ఎగుమతికూడా చేస్తున్నారు. ఈ తయారీతోబాటుగా రియాక్టర్లలో న్యూట్రాన్ల సంఖ్యను తాత్కాలికంగా తగ్గించగలిగిన బోరాన్-10 ఐసోటోప్ ఉత్పత్తికూడా మనదేశంలో మొదలయింది. సహజంగా 19 శాతానికి మించని ఈ ఐసోటోప్ ఎక్కువ మోతాదు కలిగిన బోరాన్-11తో కలిసి ఉంటుంది. విదేశాలమీద ఆధారపడకుండా బోరాన్-10 పెంచే మోతాదును ప్రయత్నాలు విజయవంతంగా జరుగుతున్నాయి.

*(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త)* వీ

---

*(..4వ పేజీ తరువాయి..)*

వీక్షణం వ్యాసాలలో అందించారు. సామాజిక మార్పుకు వీక్షణం తనవంతుగా దోహద పడుతుందని భావిస్తున్నాం. ముంబైలో తెలంగాణ సంఘీభావంగా కార్మికుల పక్షాన ఎలా నిలబడ్డది వీక్షణంకు రాస్తాం. వీక్షణం టీమ్‌కు అభినందనలు.

**- టి.యు.ఎస్.వి. అక్కనపెల్లి దుర్గేష్**
**టి.యు.ఎస్.వి. రమేష్ గోండ్యాల**
*ముంబై*

వీక్షణం జనవరి 2012 సంచికలో వచ్చిన 'కళింగాంధ్ర ఎదటు పెను సవాళ్లు' అనే వ్యాసం చాలా ముఖ్యమైందిగా భావిస్తున్నాను. సామాజిక అసమానత లున్నప్పుడు అసమ అభివృద్ధి తప్పనిసరిగా ఉంటుంది. సమాజంలో అసమానతలు అంతరించినపుడు అంటే, దోపిడీ పీడనలతో కూడిన సమాజం రద్దయినపుడు మాత్రమే అసమ అభివృద్ధి ఉండదు. కళింగాంధ్రుల చరిత్రను బాగా తెలియజేశారు రచయిత. దోపిడీ వర్గాలు ఎవరైనా సరే ప్రజల్ని చీల్చి, విడదీసి అనైక్యతకు గురిచేసి, వారినొకటిగా సమైక్యంగానీకుండా ఎట్లా కుట్రలతో తమ రాజకీయాధిపత్యాన్ని నిలబెట్టుకొంటూ వస్తున్నారో ఈ వ్యాసం వల్ల బాగా అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలలో సమస్త సంపదలున్నప్పటికీ అవి అక్కడి స్థానిక ప్రజలకు దక్కకుండా దోపిడీ వర్గాలు ఎలా తన్నుకుపోతున్నాయో ఈ వ్యాసం చదివి బాగా అర్థం చేసుకోగలం. ప్రజల్ని విడదీసి పరిపాలించే దుర్మార్గపు కుట్రలు ఆర్యుల కాలం నుండి వస్తున్నవే గదా! తరువాత ఎందరు పాలకులు వచ్చినా ఈ కుటిల నీతిని వదిలిపెట్టకుండా దాన్ని ఇంకా ముందుకు తెస్తున్నారు అనేది నిజం. పాలకవర్గాలు ఈ చాణక్యనీతినర్థం చేసుకోకుండా ఎన్ని పోరాటాలు చేసినా ప్రయోజనం లేదు. పాలకవర్గాల తప్పుడు భావజాలానికి వ్యతిరేకంగా పోరాడకుండా ఎన్ని పోరాటాలు చేసినా జాతికి విముక్తి లేదు. ఇంకా ఇలాంటి వ్యాసాలను అందివ్వగలరని రచయిత దుప్పల రవికుమార్‌ను కోరుతున్నాను. అలాగే 'పెద్దదవుతున్న మీ జేబు చిల్లు' వ్యాసం కూడా నేడు ఎంతో అవసరమైనది. అర్థ శాస్త్రం చదివిన వారు ఈ వ్యాసాన్ని చదవనవసరం లేదని రచయిత వి. హనుమంతరావు తెలియజేస్తున్నారు. కానీ అర్థశాస్త్ర ఆచార్యులు కూడా బాగా చదవదగిన వ్యాసం అని, వారిని కూడా చదవమని కోరుతున్నాను. గందరగోళానికి గురయ్యేది వారే గనక. ఇటువంటి వ్యాసం రాసి ప్రజలకు విడమర్చి బాగా తెలియజెప్పిన హనుమంతరావు గారికి నా అభినందనలు. 'ప్రజా ఉద్యమాలు - పాలకుల స్పందన' వ్యాసం చాలా వివరంగా రాశారు. ప్రజా ఉద్యమాలు ఎందుకు వెనకబడి పోతున్నాయో, సంఘటిత ఉద్యమాలుగా ఎందుకు కాలేకపోతున్నాయో, సంఘటితం కావాల్సిన ఆవశ్యకత ఆశించి బాగా రాశారు. కుల కుమ్ములాటలలో మునిగిపోతున్న నేటి పరిస్థితుల్లో ఇలాంటి వ్యాసాలు సమాజానికెంతో ఉపయోగం కూడా. అయితే ప్రజా ఉద్యమాలు కలిసికట్టుగా రావడానికి ఉన్న ప్రధాన అడ్డంకి కుల సమస్యేనని, దీన్ని పరిష్కరించు కోకుండా ఉద్యమాలు ముందుకు పోలేవని తెలియజేసిన ఎడ్ల పోచయ్యకు నా ధన్యవాదాలు. వ్యాసాలన్నీ కూడా ప్రజలకు సరియైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. రచయితలందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

**- కడియాల సుబ్బనాచారి**
*దుత్తలూరు, నెల్లూరు*

# ఆలోచనల గూటికి పుల్లా పుడకా

సమాజంలోనూ, పుస్తకాలలోనూ, పత్రికలలోనూ, ఇతర ప్రచార సాధనాలలోనూ ఎన్నెన్నో తెలుసుకోవలసిన, ఆలోచించవలసిన విషయాలు ఉన్నప్పటికీ, వెలువడుతున్నప్పటికీ ప్రత్యేకంగా ఎత్తిచూపక పోవడం వల్ల వెలుగులోకి రాకుండా, ఆలోచనాపరుల దృష్టికి రాకుండా పోతున్నాయి. అటువంటి తెలుసుకోవలసిన విషయాలను మా దృష్టికి వచ్చినంతవరకు సేకరించి అందించడం ఈ శీర్షిక లక్ష్యం. ప్రజల అవగాహనల గూడును సుస్థిరంగా నిర్మించడానికే ఈ పుల్లా పుడకా.

❊ ❊ ❊ ❊ ❊

ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలను ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ విధానం మీద పెరుగుతున్న అసమ్మతి, మార్క్సిజం మీద పెరుగుతున్న ఆసక్తి అని చెప్పాలి. దాదాపు ప్రతి దేశంలోనూ పెట్టుబడిదారీ విధాన దుష్ఫలితాలను గుర్తించిన వేలాది, లక్షలాది ప్రజలు పెట్టుబడిదారీ పాలకవర్గాలకు, పాలనావిధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయం గురించి భిన్నాభిప్రాయా లున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానం మానవతకు హానికరమనే గుర్తింపు సర్వత్రా కనబడుతోంది. విస్తరిస్తోంది. చివరికి పెట్టుబడిదారీ సమర్థక సిద్ధాంతకర్తలు, ప్రచారసాధనాలు కూడ ఈ అభిప్రాయాలకు విలువ ఇవ్వక తప్పడం లేదు. ఇక మరొకవైపు, పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తున్న శక్తులలో, తటస్థంగా ఉన్న శక్తులలో కూడ, పెట్టుబడిదారీ విధానం మీద బలమైన, లోతైన విమర్శను ఎక్కుపెట్టిన మార్క్సిజాన్ని మళ్లీ అధ్యయనం చేయాలనే ఆసక్తి ఇతోధికంగా పెరుగుతోంది. ఈ రెండు పరిణామాలకూ రెండు ఇటీవలి ముఖ్యసూచికలు:

లండన్ కేంద్రంగా 1888లో ప్రారంభమై, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఇరవైరెండు కేంద్రాలనుంచి వెలువడుతూ, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే ప్రధానమైన వాణిజ్య దినపత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ 2012 జనవరి 12న 'సంక్షోభంలో పెట్టుబడిదారీ విధానం' అనే ప్రముఖుల అభిప్రాయాల శీర్షిక ప్రారంభించింది. తొలిరోజున శీర్షిక పరిచయ సంపాదకీయం 'కంపెనీలు తమ అత్యున్నత అధికారులకు ఇస్తున్న జీతాలలో ఏదో తప్పు ఉన్నదని అనుకోవడానికి వీథిలో శిబిరంలో కూచున్న నిరసనకారుడే కానక్కరలేదు. 1980లో బడాబాబుల జీతాలు సగటు ఉద్యోగి జీతానికి 14 రెట్లు ఎక్కువ ఉండేవి. గత 30 సంవత్సరాలలో అవి పెరిగి పెరిగి ఇప్పుడు 75 రెట్లు ఎక్కువ ఉన్నాయి... ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదు... ఈ స్థితిలో మన ఆర్థిక వ్యవస్థ సాధికారతే సమస్యగా మారింది' అని రాసింది. ఈ శీర్షిక కింద గత రెండు వారాలలో బిల్ క్లింటన్ వంటి సామ్రాజ్యవాద ప్రతినిధులు, జెఫ్రీ సాక్స్ వంటి పెట్టుబడిదారీ స్టాక్ మార్కెట్ గురువులు, మహతిర్ మహమ్మద్ వంటి దళారీ పాలకులు పెట్టుబడిదారీ విధానాన్ని ఇంకా కాపాడగలమనే భ్రమతో చిట్కాలు రాయగా, అరుంధతీ రాయ్ వంటి విమర్శకులు పెట్టుబడిదారీ విధానపు దుర్మార్గ పర్యవసానాలను, దాన్ని కూలదోయవలసిన అవసరాన్ని వివరించారు. ఎవరు ఏమి రాశారనే దానికన్న ముఖ్యంగా ఒక అగ్రశ్రేణి పెట్టుబడిదారీ పత్రిక తమ వ్యవస్థ సంక్షోభంలో ఉన్నదని గుర్తించడమే, ఆ వ్యవస్థ దుస్థితికి నిదర్శనం.

పెట్టుబడిదారీ విధాన పతనం గురించి అలా పెట్టుబడిదారీ పత్రికలే రాయవలసి వస్తుండగా, మార్క్స్ మౌలిక రచనల మీద ఆసక్తి రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నది. మార్క్స్ రచనల అమ్మకాలు, అధ్యయనం, చర్చలు కనీవినీ ఎరగనంతగా జరుగుతున్నాయి. ప్రపంచానికి ఏదో పెద్ద జబ్బు చేసిందనీ, అది మరింతగా ముదిరి ప్రస్తుతం బయటపడుతున్నదనీ, నిజమైన రోగ నిర్ధారణ చేసి, ఔషధం సూచించినది డాక్టర్ కార్ల్ మార్క్స్ మాత్రమేనని రోజురోజుకూ మరింత ఎక్కువమంది అర్థం చేసుకుంటున్నారు. ఈ ఆసక్తి శుష్కమైన ఆసక్తి కాదు. చాల లోతైన అధ్యయనం, చర్చ, వ్యాఖ్యానం, అన్వయం జరుగుతున్నాయి. అందుకు తాజా ఉదాహరణ చెప్పాలంటే: పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభాల కారణాల గురించి మార్క్స్ చేసిన సూత్రీకరణలలో ప్రధానమైనది లాభాల రేటుకు నానాటికీ పతనమయ్యే ధోరణి ఉందనేది. ఈ సూత్రానికి కాలం చెల్లిందని, ఆ తర్వాత ప్రపంచం నూట నలభై సంవత్సరాలు ముందుకు నడిచిందని, ఆయన చెప్పినట్టు లాభాల రేటు పడిపోవడం వల్ల సంక్షోభం తలెత్తుతుందనే మాట నిజం కాదని చాలమంది పెట్టుబడిదారీ అర్థశాస్త్ర పండితులు వేలాది పేజీలు రాశారు. పాల్ స్వీజీతో సహా కొందరు మార్క్సిస్టు అర్థ శాస్త్రవేత్తలు కూడ ఈ చర్చలో పాల్గొని, మార్క్స్ పొరపాటు పడ్డాడని అంగీకరించారు. లాభాల రేటు తగ్గుతుందనడం సరికాదని అన్నారు. కాని సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో కూరుకుపోయిన ప్రస్తుత తరుణంలో ఆ సంక్షోభ కారణాల గురించిన చర్చ మళ్లీ రేకెత్తుతున్నది. లాభాల రేటు పడిపోవడం గురించి మార్క్స్ చేసిన సూత్రీకరణ సరైనదేనని వాదిస్తూ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త ఆండ్రూ క్లిమన్ రాసిన 'ది ఫెయిల్యూర్ ఆఫ్ కాపిటలిస్ట్ ప్రొడక్షన్ – అండర్ లైయింగ్ కాజెస్ ఆఫ్ ది గ్రేట్ రిసెషన్' నవంబర్ 2011లో వెలువడింది. మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త మైకేల్ రాబర్ట్స్ తన బ్లాగ్ (http://thenextrecession.wordpress.com)లో డిసెంబర్ 8న ఆ పుస్తకంపై సమీక్ష రాశారు. నిండా ఆరు వారాలు పూర్తి కాకముందే ఆ వ్యాసం మీద రెండు వందల యాభై వ్యాఖ్యలు వచ్చాయి. కనీసం వంద వ్యాఖ్యలు మార్క్సిస్టు రాజకీయార్థిక సూత్రాల మీద లోతైన చర్చ చేశాయి. మార్క్సిజానికి, మార్క్సిస్టు దృక్పథానికి, ఆచరణకు కాలం చెల్లిందని వాదించే పండితమ్మన్యులు ఎక్కడ?

❊ ❊ ❊ ❊ ❊

పెట్టుబడిదారులు పేదప్రజల రక్తం తాగి బతుకుతారు అనేది కేవలం కవితా వాక్యం కాదు, అతిశయోక్తి కాదు. పెట్టుబడిదారులు, సంపన్నులు బతికేది పేద ప్రజల మీదనే. పేద ప్రజలతో శ్రమ చేయించుకుని ఆ శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా శ్రమను

కొల్లగొట్టడం ఒక ఎత్తయితే, ఆ పేదప్రజలకు నిత్యమూ అవసరమైన సరుకులను, అంత అవసరం కాకపోయినా అలవాటు చేసిన, మప్పిన సరుకులను వారికి అమ్మడం ద్వారా సంపాదించే లాభాలు మరొక ఎత్తు. ఈ సరుకుల అమ్మకాల మార్కెట్ ఎంత విశాలమైనదో, సాలీనా ఎన్ని కోట్ల రూపాయల సరుకులు అమ్మి, ఎంత లాభాలు గడించడానికి అవకాశం ఉన్నదో మార్కెట్ పరిశోధనా సంస్థలు ఎప్పటికప్పుడు లెక్కలు వేస్తుంటాయి. ఈ పరిశోధనా సంస్థల పరిభాషలో ఎఫ్ఎంసిజి (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ –త్వరితగతిన అమ్ముడయ్యే వినియోగ సరుకులు) మార్కెట్ అనేది సాధారణంగా మనం కొనే నిత్యజీవితావసర సరుకుల మార్కెట్. దేశంలో పట్టణ ప్రాంతాలలో మురికివాడలలో నివసించే ప్రజానీకం సాలీనా ఈ ఎఫ్ఎంసిజి మార్కెట్ లో ఎంత ఖర్చు పెడుతున్నారు అని ఇటీవల ఒక పరిశోధన జరిగింది. ఆ పరిశోధన ప్రకారం ఈ మార్కెట్ విలువ అక్షరాలా ముప్పై వేల కోట్ల రూపాయలు. అంటే కనీసపక్షం పదివేల కోట్ల రూపాయల లాభం అన్నమాట. ఆ వర్గీకరణలోని కుటుంబాల సగటు నెలసరి ఆదాయం రు. 12,000కు మించనప్పటికీ, మొత్తం దేశంలోని వినియోగ సరుకుల మార్కెట్ లో పది శాతాన్ని వాళ్లు ఆక్రమిస్తున్నారు. కనుక ఈ రంగంలో సరుకులు తయారు చేసే ఉత్పత్తి, వ్యాపార సంస్థలు ఈ మురికివాడల వాసుల కోసం తమ ఉత్పత్తులను ఎలా మార్చాలి, ఎలా ప్యాకేజి చేయాలి, వాటికి ఎటువంటి ఆకర్షణీయమైన వ్యాపార ప్రకటనలు తయారు చేయాలి అని పరిశోధనలు సాగుతున్నాయి. ఈ మార్కెట్ ను 'ఇండియా 2' అని పిలుస్తూ ఈ రంగంలోకి ప్రవేశిస్తున్న ఫ్యూచర్ గ్రూప్ అనే వ్యాపార సంస్థ మహానగరాలలో చౌకధరల దుకాణాలు తెరవదలచింది. మురికివాడల వాసులు కొనే 300 సరుకులను ప్రత్యేకంగా ఎంపికచేసి వాటిని 10 నుంచి 20 శాతం తక్కువధరలకు అమ్మనుంది. పిరామల్ హెల్త్ కేర్, డాబర్ ఇండియా, పెప్సికో ఇండియా, నెస్లె ఇండియా వంటి బహుళజాతి సంస్థలు మురికివాడల వినియోగదారుల కోసం తమ సరుకులను తక్కువ ధరల చిన్న ప్యాకెట్లలో విడుదల చేస్తున్నాయి. లాభాల వేటలో పెట్టుబడిదారులు ఎన్నెన్ని పనులు చేస్తారు!!

❋

దేశంలోని ప్రజలందరికీ రోజుకు రెండు పూటలా తిండి దొరుకుతోందా? ఆకలిచావుకు బలి కాని స్థితి ఉందా? దేశంలోని ప్రజలందరికీ వంటి మీద చాలినంత బట్ట, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించుకోవడానికీ, గౌరవప్రదంగా కనబడడానికీ తగినంత బట్ట దొరుకుతోందా? దేశంలోని ప్రజలందరికీ ఉండడానికి ఇళ్లున్నాయా, చలి నుంచీ, ఎండ నుంచీ, వాననుంచీ కాపాడుకోవడానికి ఆశ్రయ ముందా? దేశంలోని గ్రామాలన్నిట్లో ప్రజలకు ఆరోగ్యకరమైన మంచినీటి సౌకర్యం ఉందా? దేశంలో చదువుకోదగిన వయసులో ఉన్న బాల బాలికలందరికీ పాఠశాలలు అందుబాటులో ఉన్నాయా? దేశ ప్రజలందరికీ మానవులుగా దక్కవలసిన ఆత్మగౌరవం దక్కుతోందా? ఇటువంటి ప్రశ్నలు ఎన్నయినా వేసుకోవచ్చు, అన్ని ప్రశ్నలకూ లేదు అని జవాబు చెప్పుకోవచ్చు. కాని దేశప్రజలకు టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నాయా అని ప్రశ్న వేసుకుని చూడండి. ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి, అదంతా ప్రపంచీకరణ చలవే అని వ్యవస్థా నిర్వాహకుల దగ్గరినుంచి తమను తాము మేధావులుగా గుర్తించుకునే వాళ్లవరకూ అందరూ అంటున్నారు. దేశ జనాభాలో 68 శాతం మందికి, అంటే తొంబై కోట్లకు పైగా ప్రజలకు టెలిఫోన్ అందుబాటులో ఉంది. వీటిలో 88 కోట్ల ఫోన్లు వైర్‌లెస్ ఫోన్లు (సెల్‌ఫోన్లు) కాగా, 3 కోట్ల ఫోన్లు వైర్‌లైన్ ఫోన్లు. వీటిలో బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల వాటా 12 శాతం కాగా మిగిలిన ఫోన్లన్నీ ప్రైవేటురంగ సంస్థలవే. పట్టణ ప్రాంతాలలో ప్రతి 100 మందికి 151 ఫోన్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి 100 మందికి 32 ఫోన్లు ఉన్నాయి. కేంద్ర కమ్యూనికేషన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి లోక్‌సభలో ఇచ్చిన లిఖిత సమాధానంలో దేశవ్యాప్తంగా 6,80,465 మొబైల్ టవర్లు, బేస్ ట్రాన్స్ మిటింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటి ద్వారా కోట్లాది మంది మొబైల్ వినియోగదారుల అవసరాలు తీరుతున్నాయని అన్నారు. ఈ సంఖ్య దేశంలోని మొత్తం నగరాలు, పట్టణాలు, గ్రామాలు కలిపితే వచ్చే అంకెకు దాదాపు సమానం. అంటే సగటున ప్రతి గ్రామానికీ ఒక మొబైల్ టవర్ ఉన్నదన్న మాట. ఇవి ప్రజల మధ్య సంబంధాలు పెంపొందించ డమూ, ఎక్కువ సంభాషణకు అవకాశం కలిగించడమూ, రేడియేషన్ ప్రభావంతో పర్యావరణాన్నీ, మానవ ఆరోగ్యాన్నీ ధ్వంసం చేయడమూ అలా ఉంచి, అన్నిటికన్న ప్రధానమైనవి ఈ రంగంలో లాభాలు. ఈ రంగం మార్కెట్ ఆదాయం సాలీనా మూడు లక్షల నలభై వేల కోట్ల రూపాయలు. అందులో అత్యధిక భాగం ప్రైవేటు, బహుళజాతి సంస్థలదే. మరి సెల్‌ఫోన్లు మన అవసరం కోసం ఉన్నాయా, పెట్టుబడిదారుల లాభాల కోసం వచ్చి, మన అవసరాలు తీర్చినట్టు కనబడుతున్నాయా?

❋

మొబైల్ టవర్లు ఎక్కువగా ఉంటే, ప్రజలందరికీ మొబైల్ ఫోన్ సౌకర్యం దొరికితే ఎందుకు అభ్యంతరం, మనుషులు మాట్లాడుకుంటే మంచిదే గదా అని ప్రశ్న రావచ్చు. కాని ఈ మొబైల్ ఫోన్లు ప్రజల అవసరాలను ఎంతగా తీరుస్తున్నాయో అనుమానమే గాని, పెట్టుబడిదారీ సంస్థలకు మాత్రం వేల కోట్ల రూపాయల లాభాలు సమకూర్చి పెడుతున్నాయి. భారతదేశంలోని బడా కంపెనీలలో నుంచి ప్రతి సంవత్సరం ఆదాయం రీత్యా, లాభాల రీత్యా బడాబడా కంపెనీలు 200 ఎంపిక చేసి వాణిజ్య పత్రిక ది ఎకనమిక్ టైమ్స్ ఇటి 200 అని ఒక జాబితా తయారు చేస్తుంది. 2011 డిసెంబర్‌లో విడుదలయిన ఈ జాబితాలో టెలికమ్యూనికేషన్ సేవలు అందించే సంస్థలు ఐదు ఉన్నాయి. భారతీ ఎయిర్ టెల్ 12వ స్థానంలో, రిలయన్స్ కమ్యూనికేషన్స్ 34వ స్థానంలో, ఐడియా సెల్యులర్ 50వ స్థానంలో, టాటా కమ్యూనికేషన్స్ 63వ స్థానంలో, ఎంటిఎన్ఎల్ 189వ స్థానంలో ఉన్నాయి. వీటిలో భారతీ ఎయిర్ టెల్ మొత్తం ఆదాయం రు. 59,602 కోట్లు, పన్ను చెల్లించిన తర్వాత మిగిలిన లాభం రు. 6,047 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్ ఆదాయం రు. 23,108 కోట్లు, లాభం రు. 1,346 కోట్లు. ఐడియా సెల్యులర్ ఆదాయం రు.15,503 కోట్లు, లాభం రు. 899 కోట్లు. టాటా కమ్యూనికేషన్స్ ఆదాయం రు. 12,133 కోట్లు. లాభం రాలేదని, రు. 854 కోట్లు నష్టం వచ్చిందని నమోదు చేశారు. ఇక ప్రభుత్వ రంగ ఎంటిఎన్ఎల్ ఆదాయం రు. 3,992 కోట్లు, లాభం రాలేదని, రు. 2,802 కోట్లు నష్టం వచ్చిందని నమోదు చేశారు. ఇవి ఎంత దొంగలెక్కలో, ఎలా ఆదాయాన్ని, లాభాలను తక్కువ చేసి చూపించడం జరిగిందో వేరే కథ. ఉన్నవి ఉన్నట్టుగా నమ్మినా మొదటి మూడు స్థానాలలో ఉన్న ప్రైవేట్ టెలికాం సంస్థలు ఒక్క సంవత్సరంలోనే రు. 8,292 కోట్ల లాభం సంపాదించాయి. దేశ సంపద దుర్వినియోగం అవుతున్నట్టా, సద్వినియోగం అవుతున్నట్టా? ◻

## అజాద్ ఎన్‌కౌంటర్ పై సాగుతున్న దర్యాప్తు

మావోయిస్టు నాయకుడు అజాద్, జర్నలిస్ట్ హేమచంద్ర పాండేల ఎన్‌కౌంటర్‌పై సిబిఐ మధ్యంతర నివేదికను జనవరి 19 సుప్రీంకోర్టుకు అందజేసింది. ఎన్‌కౌంటర్‌పై ఫోరెన్సిక్ నివేదికలతో పాటు, పలువురు పోలీసు అధికారుల వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. జనవరి 23న న్యాయమూర్తులు అఫ్తాబ్ అలం, రంజనప్రకాశ్ దేశాయ్‌ల ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా కేసు పురోగతి నివేదికను సిబిఐ సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో సమర్పించింది. దర్యాప్తులో కొనసాగుతున్న ఆలస్యంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. తదుపరి విచారణను మార్చి 12న వాయిదా వేస్తూ ఆలోగా దర్యాప్తు పూర్తిచేసి తుది నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

## ఇస్రో శాస్త్రవేత్తలపై ఆంక్షలు

ఇస్రో వాణిజ్య విభాగమైన యాంత్రిక్స్ ఎస్-బ్యాండ్ స్పెక్ట్రమ్‌లో 90 శాతం వాటాను దేవాస్ అనే కంపెనీకి లీజుకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారన్న ఆరోపనలపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ చైర్మన్ జి. మాదవన్ నాయర్ సహా నలుగురు శాస్త్రవేత్తలకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకూడదంటూ, కేంద్ర అంతరిక్ష శాఖ జనవరి 25న ఆదేశాలు జారీచేసింది. కేటాయింపుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి వేసిన మాజీ సివిసి ప్రత్యేష్ సిన్హా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ తన నివేదికను నవంబర్ 2011లో తన నివేదికను ప్రధాన మంత్రికి అందజేసింది.

## భారత్‌లో మృగ్యమౌతున్న మానవ హక్కులు

భారత దేశంలో మానవ హక్కుల పరిస్థితి 2011లో నిరాశజనకంగా ఉందని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యు) జనవరి 26 వెల్లడించింది. వివాదస్పధ సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం దుర్వినియోగం అవుతున్న రద్దుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మౌనంగా ఉందన్నారు. 2012 నివేదికలో హెచ్ఆర్‌డబ్ల్యు ఈ అంశాలను తెలిపింది. మానవ హక్కుల అభివృద్ధిపై 90 దేశాలకుపైగా నివేదికలను రూపొందించింది. భారతదేశం మానవ హక్కులు విషయంలో 2011లో లాకప్ డెత్‌లు, పోలీసుల వేధింపులు, దాడులు చేసే వర్గాల నుంచి రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని పేర్కొంది.

## వివాదస్పదమైన జైపూర్ సాహిత్య సదస్సు

జైపూర్ సాహిత్య సదస్సుకు రావాల్సిన రచయిత సల్మాన్ రష్దీ ముస్లీంల ఆందోళన రిత్యా, ప్రభుత్వ ఆమోదంలేని కారణంగా హాజరు కాలేదు. సల్మాన్ రష్దీ భారత్‌కు వస్తే చంపుతారంటూ మహారాష్ట్ర, రాజస్థాన్ నిఘా వర్గాలు హెచ్చరించిన కారణంగా రష్దీ జనవరి 23న జరిగిన సదస్సుకు హాజరు కాలేదు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించాలన్న నిర్ణయానికి వచ్చినా దానికి కూడా ప్రభుత్వం అనుమతిలేదని అంది. అందులోని అంశాలపై సాహిత్య సదస్సు నిర్వాహకులు తమను సంప్రదించలేదని రాజస్థాన్ హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికంతటికి కారణం సల్మాన్ రష్దీ రాసిన 'సెటానిక్ వర్సెస్' పుస్తకం. ఈ పుస్తకంలో ముస్లింలను కించపరిచే విదంగా రాసారన్నారు.

## జార్ఖండ్‌లో 13 మంది పోలీసుల మృతి

జార్ఖండ్‌లోని బరిగన్వా అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు పెరిగాయన్న సమాచారంతో బండారియా పోలీస్ స్టేషన్ నుంచి 15 మంది పోలీసులు జనవరి 21న గాలింపుకోసం బయలు దేరారు. బరిగన్వా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో 13 మంది పోలీసులు అక్కడె మృతిచెందారు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులపై కాల్పులు జరిపి వారివద్ద ఉన్న తుపాకులను మావోయిస్టులు తీసుకెల్లారని గార్వా ఎస్‌పి మైఖేల్ ఎస్. రాజ్ మీడియాకు తెలిపారు.

## 109 మందికి పద్మ అవార్డులు

కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలలో కృశి చేసిన వారికి ఇచ్చే అవార్డులైన దేశ అత్యున్నత పురస్కార అవార్డు 'భారత రత్న' ఈ సారి ఎవరికి రాలేదు. ఐదుగురికి పద్మ విభూషణ్, 27 మందికి పద్మ భూషణ్, 77 మందికి పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. ఒక్క మహారాష్ట్రకు చెందిన వారికే ఒక పద్మ విభూషణ్,9 పద్మ భూషణ్, 13 పద్మశ్రీ పురస్కారం లభించింది. మొత్తం అవార్డులు పొందిన వారిలో 19 మంది మహిళలున్నారు.

## పంజాబ్‌లో 11 వేల మంది అదృశ్యం

పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్-బి.జె.పి సంకీర్ణ సర్కారులో ముఖ్యమంత్రిగా భాధ్యతలు నిర్వహించిన ప్రకాష్‌సింగ్ హయాంలో 10,869 మంది అదృశ్యమైనట్లు 'సిటిజన్స్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ' (సిఎస్ఆర్) వెల్లడించింది. దీనిపై మానవహక్కుల సంఘాలు చేసిన పోరాటంతో సిఎస్ఆర్ సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారంలో ఈ నిజాలు వెలుగులోకి వచ్చాయి. 1997-2002 మధ్య బాదల్ పాలనలోనూ 2,403 మంది అదృశ్యమైనట్లు ఉంది. 2002-2007 మధ్య కెప్టెన్ అమరీందర్ సింగ్ (కాంగ్రెస్) పాలనలో 3,409 మంది అదృశ్యమయ్యారు. ఇద్దరు ముఖ్యమంత్రుల పాలనలో అదృశ్యమైన వారిలో 904 మంది ఆచూకీ పదేళ్ల తర్వాత కూడా లభించలేదని సిఎస్ఆర్ నిర్వాహకుల్లో సభ్యుడైన బల్‌దేవ్ సింగ్ జనవరి 17న వెల్లడించారు. గడిచిన రెండేళ్లలో కేవలం భటిండా, అమృతసర్, హోషియార్‌పూర్ జిల్లాల్లోనే 834 మంది అదృశ్యమైనట్లు అక్కడి స్థానిక ఎస్పీలు ఇచ్చిన సమాచారం వెల్లడిస్తుందన్నారు. వీ

**రచయితలకు సూచన :** తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 23వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. - సం.

## ఇంటర్‌నెట్‌పై ఆంక్షలు

ఇంటర్‌నెట్ సమాచార నియంత్రణ విషయంలో సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లకు, భారత సర్కారుకు వివాదం ఏర్పడింది. ఇంటర్‌నెట్‌లో అభ్యంతరకర, అశ్లీల సమాచారం ఉందని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లను నిర్వహిస్తున్న 21 సంస్థలపై నేర అభియోగాలను మోపి ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్రం అనుమతి మంజూరు చేసింది. ఇంటర్‌నెట్‌లో అభ్యంతరకర చిత్రాలు ఉంచుతున్నారంటూ ఢిల్లీకి చెందిన జర్నలిస్ట్ వినయ్‌రాయ్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేసి ఆయా కంపెనీలను వ్యక్తిగతంగా హాజరు కావాలని డిసెంబర్ 23న జస్టిస్ సుదీర్ కుమార్ సమన్లు జారీచేశారు. గూగుల్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో అభ్యంతరకర సమాచారం ఉంటే, దాన్ని వెంటనే తొలగించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ జనవరి 18న అన్నారు. ప్రజల పేదరికం, రైతుల ఆత్మహత్యలు లాంటి వాస్తవిక సమస్యలను వదిలి సినిమా తారల ప్రసవాలు, నటులు చనిపోవడం వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై ప్రెస్ అగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ మూలాలున్న పైరసీ వెబ్‌సైట్లను నిరోధించేందుకు స్టాప్ ఆన్‌లైన్ పైరసీ యాక్ట్, ప్రొటెక్ట్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ యాక్ట్ పేరిట యుఎస్ సెనెట్ 2011 అక్టోబర్ 26న రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ఈ బిల్లులకు నిరసిస్తూ వికీపిడియా తమ బ్లాగుల్లో వివిధ పద్ధతుల్లో నిరసనలు తెలిపాయి. ఇంటర్‌నెట్‌ల వల్ల సమాచారాన్ని ప్రపంచంలో ఏమూల నుండైనా పంచుకోవడం అనేది సులువయి పోయింది. లాభాపేక్షే ప్రధాన ధ్యేయంగా ఉన్న ఇంటర్‌నెట్ సంస్థలు వినియోగదారులను పెంచుకోవడం కోసం అభ్యంతరకరమైన సమాచారాన్ని, అశ్లీలమైన చిత్రాలను అప్‌లోడ్ చేయడానికి సాఫ్ట్‌వేర్ సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రభుత్వాలు చెబుతున్నట్లుగా అభ్యంతర కరమైన సమాచారంకన్నా ప్రభుత్వాలు చేసే పాలనా విధానాలు ఎక్కడ బహిర్గతమయి ప్రజలకు తెలిసి పాలకుల పట్ల వ్యతిరేకత పెరుగుతుందనే భయంతోనే ప్రభుత్వాలు ఇంటర్‌నెట్ సంస్థలపై ఆంక్షలు విధించాలను కుంటున్నాయి. ఇంటర్‌నెట్ ద్వారానే స్విస్ బ్యాంక్ ఖాతాలు, అమెరికాకు చెందిన అధికారిక రహస్య పత్రాలను వికీలీక్స్ బహిర్గతం చేసిన నేపథ్యం లోనే అమెరికా, భారత ప్రభుత్వాలు ఇంటర్‌నెట్‌ను నియంత్రించాలను కుంటున్నాయి.

## బూటకపు ఎన్‌కౌంటర్లు

గుజరాత్‌లో 2002-2006 మధ్య జరిగిన 21 ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఎదురు కాల్పులు బూటకమంటూ దాఖలైన పిటిషన్లను ఆధారంగా ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు జరపాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎం.బి. షా నేతృత్వంలో దర్యాప్తు కమిటీనిసర్వోన్నత న్యాయస్థానం నియమించింది. ఈ కమిటీ తన నివేదికను మూడు నెలల్లో ఇవ్వాలని ఆదేశించింది. 2002-2008 మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ బూటకమేనని మైనారిటీలను ఉగ్రవాదులుగా ముద్రవేసి చేసిన బూటకపు ఎన్‌కౌంటర్లని సీనియర్ జర్నలిస్ట్ వర్గీస్, హిందీ కవి జావేద్ అఖ్తర్, సామాజిక కార్యకర్త షబ్నం హష్మీ వేరు వేరు రిట్ పిటిషన్లను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. ఇవి సాగాయంటూ దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ అఫ్తాబ్ అలాం, సి.కె. ప్రసాద్‌లతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ జనవరి 25 విచారించింది. పిటిషన్లలో ప్రస్తావించిన అంశాలను పరిశీలించాలని, ఆయా ఘటనల్లో జరిగిన వాస్తవాలు బయటకు రావాలని సుప్రీం కోర్టు కమిటీకి సూచించింది. 2002లో గోద్రా ఘటన అనంతరం జరిగిన అల్లర్లలో 2000 మంది మైనారిటీలు చనిపోవడానికి ప్రధాన కారణం గుజరాత్ ప్రభుత్వమే. గుజరాత్‌లో జరిగిన మారణకాండ భారత ప్రభుత్వ వైఫల్యంగా జాతీయ, అంతర్జాతీయ హక్కుల సంస్థలు విమర్శిస్తున్నాయి. గుజరాత్ అల్లర్లపై 2005లో మోడి ప్రభుత్వం వేసిన నానావతి కమిషన్ నివేదిక ఇంతవరకు ఇవ్వకుండా నాన్చుతూనే ఉంది. నివేదిక వచ్చేనాటికి అల్లర్లలో చనిపోగా మిగిలిన బాధితులు సాక్ష్యమివ్వడానికి బతికి ఉంటారనే నమ్మకం కొరవడింది. ప్రభుత్వాలు ఇంత జరిగినా తమ విధానాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను కులాలపేరా, మతాలపేరా, రిజర్వేషన్లపేరా విభజిస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించిన వారిని ఉగ్రవాదులుగా, తీవ్రవాదులుగా ముద్రవేసి ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తూ, అవినీతికి పాల్పడుతున్నాయి. ప్రజల్ని నిత్యం అబద్రతకు గురిచేసి తమ విధానాలను కొనసాగిస్తున్నాయి. పాలకులు తమ విధానాలు చెల్లుబాటు కాని చోటల్లా వివిధ కారణాలు చూపెట్టి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూనే ఉన్నారు. జమ్మూకా శ్మీర్‌లో ఉగ్రవాదుల పేరుతోనూ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో మావోయిస్టుల పేరుతోను బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికలు

ఐదు రాష్ట్రాల్లో 690 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జనవరి 28న మొదలై ఫిబ్రవరి 3 వరకు ఏడు దశలలో జరుగనున్నాయి. గోవా, మణిపూర్‌లలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్, పంజాబ్‌లలో బిజెపి కూటమి అధికారంలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లో బి.ఎస్.పి అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్, గోవాలలో మాత్రమే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు ప్రధానంగా పోటీపడుతున్నాయి. అకాలిదళ్ పాలనలోని పంజాబ్‌లో ఎన్‌డిఎ-కాంగ్రెస్‌ల మధ్య పోటీ ఉంది. యుపి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి), సమాజ్‌వాది పార్టీల (ఎస్‌పి) మధ్యనే ప్రధాన పోటీ ఉంది. అధికారంకోసం ఒక్కో పార్టీ తమ ప్రత్యేకమైన విధానాలను ముందుకు తెస్తున్నాయి. బిఎస్‌పి యుపిని నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని శాసనసభలో తీర్మానం చేసింది. కాంగ్రెస్ పార్టీ సచార్ కమిటీ నివేదికను ముందుకు తెస్తూ మైనారిటీలకు ఉద్యోగాల్లో, ఉన్నత పదవుల్లో 4.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ముందుకు వచ్చింది. అవినీతికి వ్యతిరేకంగా అద్వాని రథయాత్ర కొనసాగించారు. యుపిలో ప్రతి పార్టీ విభజించు పాలించు అనే విధానం ద్వారా కుల, మత, ప్రాంతాల విభజన ఎత్తుగడలతో ముందుకు వస్తున్నాయి. లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలకు పాల్పడి, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అధికారం నుంచి తొలగించబడ్డ చరిత్ర ఒక వైపు కొనసాగుతూనే ఉంది. మరొకవైపు ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలూ సాధారణంగా అవినీతి నిర్మూలించాలనే నినాదాన్ని ఎత్తుకున్నాయి. ప్రజల నమ్మకాలను, అవసరాలను పాలకులు తమ అధికారంకోసం వాడుకోవాలని చూస్తున్నారు. పాలకులు ప్రజల జీవనాధారమైన భూమిని ప్రైవేట్ సంస్థలకు రియలెస్టేట్ కోసం కట్టబెడుతూ, ఆ క్రమంలో వచ్చే ప్రజల నిరసనను తుపాకులతో అణిచివేస్తున్నారు. మణిపూర్‌లో 1980 నుంచి అమల్లో ఉన్న సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలని దశాబ్దకాలంగా షర్మిలాబేన్ చేస్తున్న పోరాటాన్ని ఎవరు పట్టించుకోలేదు. ప్రజలు అడుగని కార్లు, టి.విలు, ల్యాప్‌ట్యాప్ కంప్యూటర్లు ఇస్తామని ఎన్నికల్లో ఆశచూపుతున్నారు. మార్కెట్‌ను నిలబెట్టడానికి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రజల జీవితాల్లో మౌలికమైన మార్పుకు దోహదం చేసే ఏ ఒక్క హామీని ఏపార్టీ ఇవ్వలేదు. పాలకుల పట్ల ప్రజలు తమ నిరసనను వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారు. ఓట్లకోసం వస్తున్న నాయకుల మీద అక్కడక్కడ ప్రజలు చెప్పులు విసురుతూనే ఉన్నారు.

**సంకలనం : వై. రామచంద్రం**

# అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

**(21 నవంబర్ 2011 నుండి 31 డిసెంబర్ 2011 వరకు 16 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య - 1923)**

| జిల్లా | ఆకలి | ఆత్మహత్యలు | | | | చికిత్స అందక, అనారోగ్యం | | | గుర్తు తెలియని | | హత్యలు | | ప్రమాదాలు | | | | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | | | | | | | | | పనిచేసే స్థలంలో | కరెంట్ | రహదారి | ఇతరాలు | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| | | | | స్త్రీ | పు. | స్త్రీ | పు. | పి. | స్త్రీ | పు. | స్త్రీ | పు. | | | | | | | | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) | (16) | (17) | (18) | (19) | (20) | (21) | (22) |
| ఆదిలాబాద్ | - | 3 | - | 22 | 21 | 8 | 6 | 5 | 2 | 2 | 4 | 6 | 3 | 6 | 18 | 32 | - | - | - | 4 | - |
| హైదరాబాద్ | - | - | - | 14 | 16 | - | 1 | - | 1 | 4 | 8 | 9 | - | - | 38 | 22 | - | - | - | 13 | - |
| కరీంనగర్ | వివరాలు అందలేదు | | | | | | | | | | | | | | | | | | | | |
| ఖమ్మం | - | 13 | - | 16 | 19 | 6 | 13 | 5 | - | 3 | 1 | 3 | 5 | 7 | 28 | 9 | - | - | - | - | 1 |
| మహబూబ్‌నగర్ | - | 27 | - | 30 | 21 | 9 | 9 | 7 | 9 | 9 | 12 | 5 | 15 | 16 | 66 | 32 | - | - | - | - | - |
| మెదక్ | - | 8 | 1 | 23 | 19 | 4 | 13 | 4 | - | 4 | 1 | 7 | 2 | 9 | 61 | 27 | - | - | - | - | - |
| నల్గొండ | - | 7 | - | 18 | 18 | 1 | 6 | 1 | 2 | 9 | 4 | 4 | 2 | 6 | 59 | 32 | - | - | - | 8 | - |
| నిజామాబాద్ | - | - | - | 10 | 24 | 2 | 3 | 1 | 1 | 1 | 2 | 9 | 10 | - | 25 | 14 | - | - | - | - | - |
| రంగారెడ్డి | 1 | 19 | - | 7 | 35 | 6 | 16 | 1 | 13 | 8 | 8 | 10 | 6 | 11 | 61 | 15 | - | - | - | 1 | 3 |
| వరంగల్ | - | 1 | - | 3 | 4 | 5 | 3 | 2 | - | 1 | - | - | 1 | 8 | 5 | 7 | - | - | - | - | 3 |
| అనంతపూర్ | - | 6 | 2 | 15 | 12 | 5 | 10 | - | 1 | 1 | 3 | 5 | 6 | 10 | 32 | 3 | - | - | - | - | - |
| చిత్తూరు | - | - | - | 7 | 13 | 8 | 11 | - | 3 | 3 | 2 | 4 | 4 | - | 42 | 1 | - | - | - | - | - |
| గుంటూరు | వివరాలు అందలేదు | | | | | | | | | | | | | | | | | | | | |
| నెల్లూరు | - | - | - | 4 | 7 | 2 | - | - | - | - | - | - | 1 | 2 | 29 | 10 | - | - | - | - | - |
| కర్నూలు | - | 9 | - | 11 | 13 | 6 | 7 | 9 | 5 | 7 | 4 | 10 | 4 | 8 | 32 | 26 | - | - | - | - | - |
| విజయనగరం | - | 2 | - | 8 | 6 | 6 | 4 | 8 | 5 | 8 | 2 | 3 | 2 | 1 | 45 | 18 | - | - | - | - | - |
| **మొత్తం** | **1** | **95** | **3** | **188** | **228** | **68** | **102** | **43** | **42** | **60** | **51** | **75** | **61** | **84** | **541** | **248** | **-** | **-** | **-** | **26** | **7** |

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ - సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ - డి. విజయభాస్కర్; కరీంనగర్ - ఎల్. సంతోష్; ఖమ్మం - సి.ఎచ్. గిరిజ; మెదక్ - ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ - మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ - గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ - ఎం. నర్సయ్య; రంగారెడ్డి - ఎస్. శంకరయ్య; వరంగల్ - ఎ.కుమార్; అనంతపూర్ - కె. నాగేశ్వరచారి; చిత్తూరు - పలమనేరు బాలాజి; కడప - దస్తగిరి; కర్నూలు - జి.వి. సుధాకర్ రెడ్డి; గుంటూరు - బి. అంజమ్మ ; నెల్లూరు - బాలగురువయ్య; శ్రీకాకుళం - జి. సుధీర్; ప్రకాశం - ఎల్. సాంబశివరావు, విజయనగరం - డి. సుధాకర్

# వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు



కొత్తచూపు
పేజీ 295, రు.120



అభివృద్ధిని ఇలా చూద్దాం
పేజీ 205, రు.80



మీరు-నేను- ఆర్థికం
పేజీ 215, రు.60



ఒక దళారీ పశ్చాత్తాపం
పేజీ 172, రు.50



కుట్రాజకీయం
పేజీ 114, రు.40



ఇన్ సెర్చ్ ఆఫ్ మెథడ్
పేజీ 367, రు.200



ఇండివిద్యుల్ సబ్-గ్రూప్స్
గ్రూప్స్ అండ్ ఫ్రీడం
పేజీ 59, రు.75



క్రైసిస్ అండ్ డెవెలప్‌మెంట్
ఇన్ మార్క్సియన్ ఫ్రేంవర్క్
పేజీ 105, రు.80



ఆన్ ఎద్యుకేషన్
పేజీ 142, రు.100



మెథడోలజీ ఆఫ్
సోషల్ ఎన్క్వైరీ
పేజీ 201, రు.150



ఫిఫ్టీ ఇయర్స్
ఆఫ్
ఆంధ్రప్రదేశ్
1956 – 2006
పేజీ 568, రు.300



రాబందు వాలిన నేల
పేజీ 408, రు.180



వ్యవసాయం – ప్రపంచీకరణ
పేజీ 224, రు.100



కల్లముందరి చరిత్ర
పేజీ 309, రు.80



పరిచయాలు
పేజీ 194, రు.50



గంగానమ్మ
పేజీ 61, రు.15



జాత్యహంకారి హిట్లర్
పేజీ 171, రు.80



రాబందు నీడ
పేజీ 111, రు.25



విశ్వాంతరాళం
పేజీ 189, రు.90



మానవ పరిణామం
పేజీ 211, రు.90



జీవకణాలూ – నాడీకణాలూ
పేజీ 184, రు.80



ప్రకృతి – పర్యావరణం
పేజీ 230, రు.90



లేచినిలిచిన తెలంగాణ
పేజీ 303, రు.120

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 127 - February 2012 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 29/01/2012 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13








ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం అయింది. ఈ స్వల్పకాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించింది. ప్రజల శ్రేయస్సు కోసం కొత్త ఆలోచనలతో, ఆచరణతో ముందుకు సాగిపోయింది. యువతరం ఆకాంక్షలు, అన్నదాతల అవసరాలు, బలహీన వర్గాలకి అభివృద్ధి, స్త్రీలకి ఆర్థిక సాధికారత వంటి పలు అంశాలలో పెద్ద ముందడుగు వేసింది.

రూపాయికి కిలో బియ్యం అయినా, ప్రభుత్వ ఉద్యోగాల కల్పన అయినా, రైతులకు సున్నా వడ్డీ రుణాలయినా, అన్ని రంగాలలోనూ పారదర్శకత, చిత్తశుద్ధి, అంకితభావం వున్న ముఖ్యమంత్రి సారథ్యంలోని యంత్రాంగం ప్రజలకి ఎంత మేలు చేయవచ్చో పభుత్వం చేసి చూపించింది. నిఖార్సయిన పరిపాలనకి నిదర్శనంగా నిలిచింది.

**ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన సంక్షేమ విజయాలు:**

- రాజీవ్ యువ కిరణాలు
- 1.16 లక్షల ప్రభుత్వ ఉద్యోగ జాతర
- రూపాయికే కిలో బియ్యం
- ఇందిర జలప్రభ
- మీ సేవ
- సంక్షేమ పథకాలకు నిధుల తక్షణ విడుదల కోసం గ్రీన్ ఛానెల్
- రైతులకు – వడ్డీలేని పంట రుణం
- స్త్రీ నిధి మహిళా బ్యాంక్
- రచ్చబండ – ఇళ్ళు, తెల్ల కార్డులు, పింఛన్లు
- రైతు – మహిళా సదస్సులు
- మైనారిటీలకి రిజర్వేషన్లు మరో పదేళ్ళ పొడిగింపు

నిరుపేదల కోసం, నిజాయితీతో నిరంతరం శ్రమించే
ప్రభుత్వం పనితీరుకి నిలువుటద్దం ఈ ఏడాది పాలన!




జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

R.O.No. 1321/Sou/Advt.I/2011-12 Dt. 13-01-2012


Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao